సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 256

శనివారం 7-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





● పోస్ట్-ఫార్వర్డ్



విజయలక్ష్మి



పిచ్చుకలకు కుచ్చులు

గతం ఎక్కడికో పోదు. వర్తమానమై పలకరిస్తుంది. భవిష్యత్ ఆశాకిరణమై మెరుస్తుంది. ఘనంగా చెప్పుకోవడానికి గతంలో ఎన్నో ఉన్నాయి. 'ఇది మా ఇల్లు మాత్రమే కాదు... పక్షులది కూడా' అనుకోవడం అందులో ఒకటి. పిచ్చుకలకు ఇంట్లో చోటివ్వడంతోపాటు వాటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసేవారు. ఇప్పుడు అంత సీన్ ఉందా?

పక్షుల ప్రపంచం, మన ప్రపంచం వేరైపోయాయి. ఇప్పుడు పక్షుల నుంచి చుట్టపు చూపు పలకరింపు కూడా లేదు. ఎప్పుడో ఒకసారి పిట్ట కనిపించినా వాటిని పలకరించే ఓపిక మనకు లేదు. ఇలాంటి నేపథ్యంలో విజయలక్ష్మిలాంటి పక్షిప్రేమికులు ఆశాదీపాలను వెలిగిస్తున్నారు. ఆ వెలుగును చూడగలిగితే మరెన్నో దీపాలు వరుస కడతాయి. పక్షులతో చెలిమి చేయడానికి స్వాగత తోరణాలు అవుతాయి.

తమ ఇంటి పిట్టగోడపై వాలిన ఆ పిట్టను చూడగానే నిర్మల్‌కు చెందిన విజయలక్ష్మికి తన చిన్ననాటి జ్ఞాపకాలు ఒక్కసారిగా గుర్తుకు వచ్చాయి. ''మా ఊళ్లో.. మా ఇంట్లో.. మా నాన్నగారు ఇలాంటి పిచ్చుకల కోసం ఏదో చేసేవారే..! దానికోసం గూడు కట్టడంతో పాటు తినడానికి ఏదో పెట్టేవారే..!' అని గుర్తుతెచ్చుకునే ప్రయత్నం చేసింది. బంధువులకు ఫోన్లు కలిపింది. నానమ్మ తరపువాళ్లు 'దాన్ని వరికుచ్చు అంటారే..' అని చెప్పడంతోనే 'హమ్మయ్యా.. తెలిసింది..' అని అనుకుని ఊరుకోలేదు.

'ఇక ఇప్పుడు కుచ్చులు కట్టడమెలా..!?' అంటూ ఆలోచనల్లో పడింది. యూట్యూబ్‌లో 'వరికుచ్చుల తయారీ' గురించి సెర్చ్ చేసింది. ఆ వీడియోలను చూస్తూ ప్రాక్టీస్ చేసి నేర్చేసుకుంది.

నిర్మల్ జిల్లాలో డీఆర్‌డీవో (జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖాధికారి)గా పనిచేస్తున్న విజయలక్ష్మి తన సిబ్బందికి కూడా వరి కుచ్చులు తయారు చేయడం ఎలాగో నేర్పించింది. వీరు చేసిన వరి కుచ్చులు ఇప్పుడు ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సామాన్యుల నుంచి మంత్రుల వరకు ఈ వరికుచ్చులపై ఆసక్తి చూపుతున్నారు. తమ ఇళ్లల్లో వేలాడదీస్తున్నారు. ఇప్పుడు ఆ ఇళ్లలో మనుషులు మాత్రమే కాదు... అందమైన పిచ్చుకలు కూడా కనిపిస్తున్నాయి.

– రాసం శ్రీధర్, సాక్షి, నిర్మల్

ఎన్నో ఎన్నెన్నో!

పచ్చదనమన్నా, పల్లెవాసులతో కలిసిపోవడమన్నా ఇష్టపడే విజయలక్ష్మి డీఆర్‌డీవోగా నిర్మల్ జిల్లాలో ఎన్నో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది...

● గ్రామీణ, ఆదివాసీ మహిళలు రుతుక్రమ సమయంలో ఇంటికి దూరంగా ఉండటాన్ని చూసి చలించిన విజయలక్ష్మి వారికి అవగాహన కలిగించేందుకు షార్ట్‌ఫిలిమ్ తీసింది. తక్కువ ధరలోనే శానిటరీ ప్యాడ్స్ ఇవ్వడానికి కుంటాల మండల మహిళ సమాఖ్య ద్వారా రేలా (రూరల్ వుమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ లైవ్లీహుడ్ ఆక్టివేషన్) పేరిట శానిటరీ ప్యాడ్స్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు ● నిర్మల్ కొయ్యబొమ్మల కోసం మూడుచోట్ల పొనికి చెట్లను పెంచుతున్నారు ● మండల మహిళల ద్వారా సమీకృత సాగు ప్రారంభించి అందులో వరితో పాటు కూరగాయలు, బీట్‌రూట్, క్యారట్, వట్టివేరు, కర్రపెండలం పండిస్తున్నారు. చేపలు, నాటుకోళ్లు పెంచుతున్నారు. క్యాన్సర్ పేషెంట్లకు ఉపయోగపడే 'ప్యాషన్' ఫ్రూట్‌నూ ఇక్కడ పండిస్తున్నారు ● ఉపాధిహామీ పథకంలో కూలీలు, పనుల సంఖ్యను పెంచి తెలంగాణ రాష్ట్రంలోనే నిర్మల్‌ను మూడేళ్లుగా ప్రథమ స్థానంలో నిలిపారు. స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాలు ఇవ్వడంలో, వసూలు చేయడంలోనూ నిర్మల్‌ను అగ్రస్థానంలో నిలిపారు. జిల్లా సంక్షేమాధికారి ఇన్‌చార్జి బాధ్యతల్లో ఉన్నప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకుకూరల సాగు చేపట్టారు. 'మన వంట-అంగన్‌వాడీ ఇంట' 'న్యూట్రిబౌల్' లాంటి కార్యక్రమాలతో ప్రశంసలు అందుకున్నారు.

ఆ మంత్రదండం మన దగ్గరే ఉంది!

భవిష్యత్ గురించి మాత్రమే మనం ఎక్కువగా ఆలోచిస్తుంటాం. గతంలోకి కూడా తొంగిచూస్తే... విలువైన జ్ఞాపకాలే కాదు విలువైన సంప్రదాయాలు కనిపిస్తాయి. వాటికి మళ్లీ ఊపిరి పోస్తే విలువైన గతాన్ని వర్తమానంలోకి ఆవిష్కరించినట్లే. ప్రతి ప్రాంతానికి తనదైన విలువైన గతం ఉంటుంది. విలువైన సంప్రదాయాలు, కళలకు ఊపిరిపోస్తే 'ఇప్పుడా రోజులెక్కడివి!' అని నిట్టూర్చే పరిస్థితి రాదు. గతాన్ని వర్తమానంలోకి తీసుకువచ్చే మంత్రదండం మన దగ్గరే ఉంది.

– విజయలక్ష్మి



వరికుచ్చులు తయారు చేస్తున్న మహిళలు

వరికుచ్చుల సరిగమలు

పాతకాలపు లోగిళ్లు మనుషులకే కాదు పశుపక్ష్యాదులకూ చోటిచ్చేవి. చిలుకచెక్కతో ఉండే ఇళ్ల స్లాబుల్లోనే పిచ్చుకల కోసమూ గూళ్లను కట్టించేవారు. వాటిలో కాపురం పెట్టే జంటల కోసం తమ పంటల్లో నుంచి భాగాన్ని పంచేవారు. ధాన్యం ఇంటికొచ్చే వేళ పిచ్చుకల కోసం ప్రత్యేకంగా వరికుచ్చులను తయారు చేసిపెట్టేవారు. అలా చేసిన కుచ్చులను పిచ్చుకల గూళ్లకు దగ్గరగా వేలాడదీసేవారు. పొద్దుపొద్దున్నే వాటిపై వాలే పిచ్చుకలు ఒక్కో వడ్లగింజను నోటితో ఒలుస్తూ ఆరగిస్తూ, కిచకిచమంటూ ఇంటిల్లిపాదిని మేలుకొల్పేవి.

● సోషల్ మీడియా

ఫస్ట్ ఏఐ మామ్

– పవర్డ్ బై రియల్ మామ్స్



ఒకరోజు...

హాయ్ ఫ్రెండ్స్... నేను మీ కావ్య మెహ్రాని మాట్లాడుతున్నాను. ప్రెగ్నెన్సీకి సంబంధించి నా గత జ్ఞాపకాలను ఈ రోజు మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

మరో రోజు...

మీ పిల్లవాడు బడికి వెళ్లనని మారాం చేస్తున్నాడా? హోంవర్క్ చేయడానికి భయపడుతున్నాడా? ఈ సమస్యలను ఒక తల్లిగా ఎలా పరిష్కారం కనుగొన్నానో ఈరోజు మీకు చెబుతాను.

ఇంతకీ ఎవరీ కావ్య మెహ్రా?

కాల్పనికత, వాస్తవికతకు మధ్య హద్దును చెరిపేస్తూ వర్చువల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు 'వావ్' అనిపిస్తున్నారు. ఈ కోవలో ఇప్పుడు తాజా సంచలనం... కావ్య మెహ్రా.

మన దేశంలో మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత మామ్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా కావ్య మెహ్రా సోషల్ మీడియాలో ట్రెండ్ సెట్టర్‌గా అవతరించింది. టెక్నాలజీ, మాతృత్వం కలగలిసిన ఈ మామ్ ఇన్‌ఫ్లూయెన్సర్‌ను 'కలెక్టివ్ ఆర్టిస్ట్స్ నెట్‌వర్క్' కంపెనీ రూపొందించింది.

కావ్య మెహ్రా ఏఐ పవర్డ్ మామ్ ఇన్‌ఫ్లూయెన్సర్ అయినప్పటికీ... ఎంతోమంది నిజజీవిత తల్లుల అనుభవాల నుంచి ఈ డిజిటల్ అవతార్‌ను సృష్టించారు.

మాతృత్వానికి సంబంధించిన అన్ని అంశాల్లో ప్రేక్షకులను ఎంగేజ్ చేసే ఏఐ డిజైన్ మోడల్‌గా కావ్య మెహ్రాను తీర్చిదిద్దారు. ఇన్‌స్టాగ్రామ్‌లో కావ్య మెహ్రా బయోలో 'భారతదేశపు మొట్టమొదటి ఏఐ మామ్. పవర్డ్ బై రియల్ మామ్స్' అనే పరిచయ వాక్యం ఉంటుంది.

మన దేశంలోని వివిధ రంగాలకు చెందిన తల్లులు ఎదుర్కొనే దైనందిన జీవిత అనుభవాలు, భావోద్వేగాలకు కావ్య మాటలు అద్దం పడతాయి. వంట, కుటుంబ జీవితం, వ్యక్తిగత శ్రేయస్సు. మాతృత్వానికి సంబంధించిన అనేక అంశాలు కావ్య కంటెంట్‌లో ఉంటాయి.

ఆధునిక కోణంలో మాతృత్వానికి సంబంధించిన తన ఆలోచనలను ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్‌లతో షేర్ చేసుకుంటుంది. స్కిన్‌కేర్ రొటీన్స్‌ను ఫాలో అయ్యే కావ్య కుకింగ్‌ను, పెయింటింగ్‌ను ఎంజాయ్ చేస్తుంది.

తన ఫేవరెట్ ఫుడ్ తయారు చేయడం నుంచి పండగ సంతోషం వరకు రకరకాల విషయాలను ఇన్‌స్టాలో పంచుకుంటుంది.

ప్రెగ్నెన్సీ, చైల్డ్ డెవలప్‌మెంట్... మొదలైన ఫ్లాష్‌బ్యాక్ ఇమేజ్‌లను కూడా షేర్ చేస్తుంది.

తాను ఎలాంటి తల్లి కావాలనుకుంటోందో ఒక పోస్ట్‌లో చర్చించింది కావ్య. ఎవరి ప్రేమ నీడలో అయితే పిల్లలు చల్లగా, భద్రంగా ఉండగలుగుతారో... అలాంటి తల్లి తాను కావాలని అనుకుంటుంది.

'కావ్య కేవలం ఒక సాంకేతిక ఆవిష్కరణ మాత్రమే కాదు. సమాజానికి సంబంధించి నిజ జీవిత అనుభవాల ప్రతిబింబం' అంటున్నాడు 'కలెక్టివ్ ఆర్టిస్ట్స్ నెట్‌వర్క్' వ్యవస్థాపకుడు విజయ్ సుబ్రమణ్యం.

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫస్ట్ ఏఐ మామ్ ఇన్‌ఫ్లూయెన్సర్ కావ్య మెహ్రాపై నెటిజనులు ప్రశంసలు కురిపించారు. కొందరు మాత్రం మాతృత్వం గురించి డిజిటల్ అవతార్ చెప్పడం ఏమిటో అని పెదవి విరిచారు.

---

* ఉమెన్ బిజినెస్

సవాల్ ఉంటేనే సక్సెస్!



'గృహిణిగా బోలెడన్ని బాధ్యతలు ఉంటాయి ఇంక వ్యాపారాలు ఏం చేస్తారు?' అనుకునేవారికి 'చేసి చూపుతాం..' అని నిరూపిస్తోంది నేటి మహిళ. 'ఒకప్పుడు మేం గృహిణులమే ఇప్పుడు వ్యాపారులం కూడా' అంటున్నారు. ఎవరిపైనా ఆధారపడకుండా, నచ్చిన పని చేస్తూ అందరూ మెచ్చేలా విజయావకాశాలను అందుకుంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలు కలిశారు. సవాళ్లను ఎదుర్కోవడమే తమ సక్సెస్ మంత్ర అని చెప్పారు. ఆ వివరాలు వారి మాటల్లో...

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



స్ట్రాంగ్‌గా ఉంటే.. వింటారు

సివిల్ ఇంజినీరింగ్ చేశాను. నాకు ఇంటీరియర్ డిజైనింగ్ అంటే చాలా ఇష్టం. దీంతో ఇంటీరియర్ అడ్వాన్స్ కోర్స్ 2018లో పూర్తి చేశాను. గేటెడ్ కమ్యూనిటీలు, సెలబ్రిటీ హౌజ్‌లు డిజైన్ చేశాను. కస్టమర్ బడ్జెట్, ఆలోచనలు తీసుకొని ప్రత్యేకంగా చేయడానికి ప్రయత్నిస్తుంటాను. ఇప్పటి వరకు 200లకు పైగా ప్రాజెక్ట్స్ పూర్తి చేశాను. ఇంటీరియర్ డిజైనింగ్‌లో మహిళలు రాణించలేరు అనుకుంటారు. కానీ, నేను డామినేటింగ్‌గా ఉంటాను. స్ట్రాంగ్‌గా ఉంటే ఎవ్వరైనా మన మాట వింటారు.

– అనూష,
లక్సస్ డిజైన్ స్టూడియో

నిరూపించుకోవాలనుకుంటే సాధించగలం

స్పెషల్‌గా బ్రైడల్ వేర్ మెన్ అండ్ ఉమెన్ ఇద్దరికీ డిజైన్ చేస్తాను. కార్పొరేట్ యూనిఫార్మ్స్, ఫస్ట్ బర్త్‌డే పార్టీలకు డ్రెస్ డిజైన్ చేస్తాను. 2013లో చెన్నైలో మొదటి బ్రాంచ్ స్టార్ట్ చేశాను. తర్వాత హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాం. సెలబ్రిటీలకు దాదాపు 50 తమిళ సినిమాలకు, 50 తెలుగు సినిమా స్టార్స్‌కి డిజైన్ చేశాను. ఫ్యాబ్రిక్ ఎంపికలో, ఉద్యోగుల విషయంలోనూ, డిజైనింగ్‌లోనూ.. ప్రతిదీ సవాల్‌గా ఉంటుంది. మనల్ని మనం నిరూపించుకోవాలనుకుంటే ఏమైనా సాధించగలం.



– అమూల్య,
అమూల్య అండ్ కృష్ణ కొచర్

పనిలో ప్రత్యేకత చూపాలి

కేక్ బేకింగ్ తయారు చేసేటప్పుడు నా చుట్టూ ఉన్నవారు 'ఇప్పటికే మార్కెట్లో చాలామంది హోమ్ మేకర్స్ ఉన్నారు, నీవేం సక్సెస్ అవుతావు' అన్నారు. కానీ, వారి మాటలు పట్టించుకోలేదు. నా హార్డ్ వర్క్‌నే నమ్ముకున్నాను. కస్టమైజ్డ్ కేక్స్ హాఫ్ కేజీవి కూడా తయారు చేస్తాను. ఎగ్‌లెస్ డిజర్ట్స్ కేక్స్ మా ప్రత్యేకత. మొదట మా కమ్యూనిటీలోని వారికే చేసేదాన్ని. వాటిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం, ఆ తర్వాత ఒక్కో ఆర్డర్ రావడం మొదలయ్యింది. టైమ్ ప్రకారం డెలివరీ చేసేదాన్ని. ఒకసారి ఒక జంటకు వారి బేబీ షవర్‌కి బహుమతులు ఆర్డర్‌పై అందించాను. ఇటీవల వారి రెండవ బేబీ షవర్ కోసం అతిథులకు ప్రత్యేకమైన కేక్ వర్క్ షాప్ నిర్వహించాను. దాదాపు 400 మంది కస్టమర్లు ఆర్డర్స్ ఇస్తుంటారు. ఫైనాన్స్ సబ్జెక్ట్‌లో మాస్టర్స్ చేశాను. నాదైన సొంత ఆలోచనతో స్టార్టప్ నడపాలని బేకింగ్ తయారీ మొదలుపెట్టాను. సక్సెస్ అవుతుందా అనే ఆలోచన లేకుండా, ఆందోళన పడకుండా రుచికరమైన కేక్స్ తయారుచేసివ్వడంలోనే దృష్టిపెట్టాను.



– రాధిక,
ఆర్బేక్ హౌజ్

మేకప్ ఒక ఆర్ట్



మేకప్ ఆర్ట్ నాకు చాలా ఇష్టమైన వర్క్. అందుకే, ప్రొఫెషనల్ కోర్స్ తీసుకొని, ముందు మా కమ్యూనిటీలోనే స్టార్ట్ చేశాను. ఇంటివద్దకే వచ్చి మేకప్ చేయించుకునేవారు. రెండేళ్ల క్రితం స్టూడియో ఏర్పాటు చేశాను. 7–8 రాష్ట్రాలలో మా స్టూడియో ద్వారా మేకప్ సర్వీస్ అందిస్తున్నాను. చాలా మంది మేకప్ అనగానే ఫౌండేషన్, కాజల్.. బ్యుటీషియన్ వర్క్ అనుకుంటారు. అలాగే మేకప్ అనేది చాలా మందికి పెళ్లి వంటి ప్రత్యేకమైన సందర్భం తప్పితే అంతగా అవసరం లేనిదిగా చూస్తారు. కానీ, పెళ్లి, వెస్టర్న్ పార్టీలు, బర్త్ డే పార్టీలు... ఇలా సందర్భానికి తగినట్టు మేకప్ స్టైల్స్ ఉన్నాయి. మేకప్ ఆర్టిస్టులకి మార్కెట్లో చాలా పెద్దపోటీ ఉంటుంది. కానీ, వారి నెట్‌వర్క్‌తో పాటు ప్రొఫెషనల్‌గా చేసే మేకప్‌కి కూడా అంతే ప్రాధాన్యత ఉంటుంది.

– శ్రీలేఖ, మేకప్ సెంట్రల్

చ్యవన్‌ప్రాశ్

మసాబా మెచ్చిన ఔషధం



మసాబా గుప్తా

ఫ్యాషన్ డిజైనర్ మసాబా గుప్తా ఓ సెలబ్రిటీ. ఆమె శీతాకాలంలో తన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చ్యవనప్రాశ తీసుకుంటోంది. చరక సంహిత, భావప్రకాశ, రస రత్న సముచ్చయ వంటి ఆయుర్వేద గ్రంథాలు చెప్పిన ఔషధం ఇది. దీనిలోని ఆరోగ్యకారకాలను వివరించాలంటే ఒక్కమాటలో ఆల్‌ఇన్‌వన్ అని చెప్పవచ్చు. చ్యవన ముని కనుక్కున్న ఫార్ములా ఇది. ఈ ఔషధం ఎనర్జీ బూస్టర్, ఇమ్యూనిటీని పెంచుతుంది. శక్తినిస్తుంది, జీవనకాలాన్ని పెంచుతుంది. మూలికల సూక్ష్మమైన పోషకాల సమ్మిళితం ఇది. తన కంటి చూపు తగ్గినప్పుడు ఈ ఔషధాన్ని వాడడం ద్వారా తిరిగి మునుపటి చూపును పొందినట్లు రాశాడు చ్యవనుడు. అయితే చ్యవనప్రాశను ఇంట్లో సులువుగా తయారు చేసుకునే విధానాన్ని సెలబ్రిటీ షెఫ్ అనన్యా బెనర్జీ ఇలా వివరించారు.

కావలసినవి: ఉసిరి కాయలు– అర కేజీ; బెల్లం లేదా తేనె– 300 గ్రాములు; నెయ్యి– 100 గ్రాములు; నువ్వుల నూనె – టేబుల్ స్పూన్; దాల్చిన చెక్క పొడి– టీ స్పూన్; యాలకుల పొడి– టీ స్పూన్; లవంగాల పొడి– అర టీ స్పూన్; జాజికాయ పొడి– అర టీ స్పూన్; అశ్వగంధ పొడి– టీ స్పూన్; శతావరి పొడి– టీ స్పూన్; డ్రై ఫ్రూట్స్ : కిస్‌మిస్, డేట్స్, ఫిగ్స్ – 50 గ్రాములు (అన్నీ కలిపి).

తయారీ: ● డ్రైఫ్రూట్స్‌ను సన్నగా తరిగి పెట్టుకోవాలి ● ఉసిరికాయలను శుభ్రంగా కడిగి ఆవిరి మీద కానీ నేరుగా నీటిలో కానీ ఉడికించాలి. చల్లారిన తర్వాత కాయలను కొద్దిగా చిదిమి గింజలు తొలగించి గుజ్జు అంతటినీ ఒక పాత్రలో వేసుకోవాలి ● మందపాటి పాత్రను వేడి చేసి అందులో నెయ్యి, నువ్వుల నూనె వేయాలి. అవి వేడెక్కిన తర్వాత ఉసిరికాయల గుజ్జు వేసి గరిటెతో కలుపుతూ పది నుంచి పదిహేను నిమిషాల పాటు మగ్గనివ్వాలి. మిశ్రమం చిక్కబడి, దగ్గరగా అయిన తర్వాత అందులో బెల్లం పొడి లేదా తేనె కలిపి చిన్న మంట మీద ఉంచాలి. మిశ్రమం అడుగుపట్టకుండా కలుపుకుంటూ ఉండాలి. ఈ తీపి... ఉసిరితో సమంగా కలిసిన తర్వాత యాలకులపొడి, లవంగాల పొడి, దాల్చిన చెక్క పొడి, జాజికాయ పొడి, అశ్వగంధ, శతావరి, కిస్‌మిస్ తోపాటు మిగిలిన డ్రైఫ్రూట్స్ పలుకులను వేసి సమంగా కలిసేవరకు గరిటెతో కలియబెట్టి దించేయాలి.

దించిన తర్వాత కూడా పాత్ర వేడికి అడుగున ఉన్న మిశ్రమం మాడే ప్రమాదం ఉంటుంది. కాబట్టి దించిన తర్వాత చల్లారేలోపు రెండు –మూడు సార్లు గరిటెతో కలపాలి ● చల్లారిన తరవాత తేమ లేని బాటిల్‌లోకి తీసుకుని గాలి దూర కుండా గట్టిగా మూత పెట్టాలి. ఫ్రిజ్‌లో పెట్టుకుని శీతాకాలమంతా వాడుకోవచ్చు ● దించిన తర్వాత ఒకసారి రుచి చూసుకుని తీపి సరిపోలేదంటే మరికొంత తేనె కలుపుకోవచ్చు ● ఉసిరికాయలు వ్యాధినిరోధక శక్తిని పెంచడానికి, అశ్వగంధ ఒత్తిడిని తగ్గించడానికి, నెయ్యితోపాటు ఇతర సుగంధద్రవ్యాలు జఠరాగ్నిని పెంచి పోషకాలను దేహం సమర్థంగా శోషించుకోవడానికి దోహదం చేస్తాయి ● రోజుకు పెద్దవాళ్లు రోజూ ఉదయం ఒక టేబుల్ స్పూన్ తినాలి (15–20 గ్రాములు). పిల్లలకైతే టీ స్పూన్ (5–10 గ్రాములు) చాలు. చ్యవనప్రాశ తీసుకోవడం మొదలు పెట్టిన తర్వాత కఫం సమస్యలు కనిపిస్తే మోతాదు తగ్గించాలి లేదా చ్యవనప్రాశను వేడినీటిలో కలిపి తీసుకోవాలి.

వంటిల్లు



నగధగలు – పగడాలేం చెబుతున్నాయి

జాతిరత్నాల్లో రాణిగా ముత్యాన్ని చెబుతారు. పగడాన్ని అందమైన రత్నంగా వ్యవహరిస్తారు. ఇది కూడా ముత్యంలాగానే సముద్రంలోనే ఆవిర్భవిస్తుంది. అయితే ముత్యాన్ని సముద్రంలో తయారయ్యే పద్ధతిలోనే బయట కూడా కల్చర్ చేయవచ్చు. పగడానికి అలాంటి అవకాశం లేదు. అందుబాటులో ఉన్న పగడాల్లో కొన్ని అసలైనవి, కొన్ని నకిలీవి. ఇందులో కల్చర్డ్ కోరల్ అనేది ఇంత వరకు లేదు. సముద్రపు మొక్క నుంచి పగడం తయారవుతుంది.

● పగడంలో ఎరుపు, గులాబీరంగు, ఆరెంజ్, బ్రౌన్‌తో పాటు వైట్, ఎల్లో, గ్రీన్, పర్పుల్, బ్లాక్ కోరల్స్ కూడా ఉంటాయి.

● పగడం అసలుదా నకిలీదా అని తెలుసుకోవడానికి టర్మరిక్ టెస్ట్ సులువైన పద్ధతి. పగడం మీద పసుపు కొమ్ముతో రుద్దాలి. అప్పుడు పగడం మీదున్న ఎరుపు రంగు పగడాన్ని వదిలి పసుపు కొమ్ముకి రంగు అంటితే అది నకిలీ పగడం. అసలు పగడం మీద పసుపు కొమ్ముతో ఎంత రుద్దినా పగడం రంగు వదలదు, పసుపు కొమ్ముకి రంగు అంటదు.





● స్వచ్ఛమైన పగడాన్ని ధరిస్తే అది మానసిక ఆందోళన తగ్గి ప్రశాంతతనిస్తుంది. ఆధ్యాత్మిక చింతనకు దోహదం చేస్తుంది. డిప్రెషన్, స్ట్రెస్, నిద్రలేమి వంటి సమస్యలను దూరం చేస్తుందని అధ్యయనాల్లో తేలింది.

● పగడం చెట్టు నుంచి ఆవిర్భవించినది కాబట్టి ప్రాణం ఉన్న వస్తువులాగానే దీనికి గాలి అందుతుండాలి. ముత్యాలు, పగడాలను సుదీర్ఘకాలం గాలి అందని అలమారల్లో పెట్టరాదు. ముత్యాలు, పగడాల ఆభరణాలను ధరించడం వాటి మన్నిక కోసమే కాదు, మానసిక, శారీరక ఆరోగ్యం కోసం కూడా.

● సాధారణ పగడాల వరుస అయితే భద్రపరచడంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం లేదు. బంగారంలో పొదిగిన ఆభరణాల విషయంలో ఆభరణం నుంచి రాలిపోకుండా ఉండడానికి మెత్తటి కుషన్ ఉన్న బాక్సుల్లో పెట్టాలి.



– జియా నస్రీన్, జెమాలజిస్ట్



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 256

శనివారం 7-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'గులాబీ' గుచ్చుకుంది!

ఆస్ట్రేలియాతో డే నైట్ టెస్టు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 180 ఆలౌట్ -15లో



ఆర్‌బీఐ... ఆచితూచి

వృద్ధికి, ద్రవ్యోల్బణం కట్టడికి సమ ప్రాధాన్యత..వడ్డీరేట్లు యథాతథం-15లో



రాజ్యసభలో నోట్ల కలకలం

రాజ్యసభలో కరెన్సీ నోట్ల కట్టలు లభించడం రాజ్యసభను కుదిపేసింది. అధికార, విపక్ష సభ్యుల వాగ్వాదంతో సభ దద్దరిల్లింది.

వివరాలు 6లో ▸



రైతులపైకి టియర్ గ్యాస్

డిమాండ్ల సాధనకు పంజాబ్–హరియాణా సరిహద్దులో రైతు సంఘాలు చేస్తున్న నిరసనల్లో శుక్రవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది.

వివరాలు 6లో ▸

రికార్డులు రప్పా రప్పా...

తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా రూ.294 కోట్ల గ్రాస్‌తో 'పుష్ప–2' దేశ సినీ చరిత్రలో కొత్త రికార్డులు సృష్టించింది.

వివరాలు 14లో ▸



గ్రూప్‌-1కు తొలగిన అడ్డంకులు

గ్రూప్–1 రీ–నోటిఫికేషన్, భర్తీ ప్రక్రియ, ప్రశ్న పత్రాల కీ తదితరాలకు సంబంధించి దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టేసింది.

వివరాలు 13లో ▸



సంబురాలు.. నిరసనలు

కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వేళ రాజకీయ వేడి

పోటాపోటీగా ప్రజల్లోకి వెళ్లేందుకు అధికార, ప్రతిపక్షాల ఏర్పాట్లు

- రైతు పండుగ మొదలు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ వరకు దూకుడుగా అధికార పక్షం
- రాష్ట్రమంతటా కలియదిరుగుతున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, ఇతర మంత్రులు
- శాఖల వారీగా ప్రగతి నివేదికలు విడుదల.. 7, 8, 9 తేదీల్లో అట్టహాసంగా వేడుకలు
- మరోవైపు బీజేపీ చార్జిషీట్లు.. నేడు నడ్డా రాక.. 6 అబద్ధాలు-66 మోసాల పేరుతో సభ
- నిరసన కార్యక్రమాలతో గులాబీ దళం హడావుడి..

సాక్షి, హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న వేళ రాష్ట్రంలో రాజకీయ వేడి నెలకొంది. ఓవైపు అధికార కాంగ్రెస్ అట్టహాసంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాలు, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నిరసనలు, బీజేపీ చార్జిషీట్లతో వారం రోజులుగా హడావుడి పెరిగిపోయింది. కాంగ్రెస్ సర్కారు రైతు పండుగ పేరుతో గత నెల 30న ప్రారంభించిన ప్రజాపాలన విజయోత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మరోవైపు ప్రజాపాలన విజయోత్సవాలకు కౌంటర్‌గా బీజేపీ, బీఆర్ఎస్‌ల చార్జిషీట్లు, నిరసనలు, బీఆర్ఎస్ నేతల నిర్బంధం వంటివి రాజకీయంగా సెగ పెంచుతున్నాయి.

రైతు పండుగ నుంచి..

గత నెల 30న రైతు పండుగ పేరుతో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన భారీ సభతో కాంగ్రెస్ పార్టీ విజయోత్సవాలను ప్రారంభించింది. రైతు రుణమాఫీకి సంబంధించి నాలుగో విడతగా రూ.2,700 కోట్లను సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విడుదల చేశారు. తర్వాతి రోజున మీడియాతో మాట్లాడిన సీఎం... రైతుల సంక్షేమం కోసం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు సంక్రాంతి తర్వాత రైతు భరోసా అందజేస్తామని ప్రకటించారు. తర్వాతి రోజున ఆరోగ్య ఉత్సవాల్లో పాల్గొనడంతోపాటు సిద్దిపేట జిల్లాలో కోకాకోలా ఫ్యాక్టరీని ప్రారంభించారు. అనంతరం హైదరాబాద్ అభివృద్ధి కోసం చేపట్టే కార్యక్రమాలతో 'హైదరాబాద్ రైజింగ్' పేరిట కార్యక్రమం నిర్వహించారు. తర్వాతి రోజున పెద్దపల్లిలో యువ వికాసం సభలో డిప్యూటీ సీఎం భట్టి, ఇతర మంత్రులతో కలసి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. మరుసటి రోజున ఇందిరమ్మ ఇళ్ల యాప్ ప్రారంభించారు. శుక్రవారం హోంశాఖ ఆధ్వర్యంలో జరిగిన విజయోత్సవాలకు హాజరైన సీఎం రేవంత్.. హోంగార్డులపై వరాల జల్లు కురిపించారు. ఇక 7, 8, 9 తేదీల్లో ఘనంగా విజయోత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. 9న సచివాలయంలో 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఇక వివిధ ప్రభుత్వ శాఖలు గత ఏడాది కాలంలో సాధించిన పురోగతిపై

మిగతా 2వ పేజీలో ▶



అందరికీ వైద్యం మా విధానం..

'సాక్షి' ఇంటర్వ్యూలో వైద్యారోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ

- మౌలిక సదుపాయాలే కాదు.. మానవ వనరులు కూడా ముఖ్యం
- అందుకు వీలుగా డాక్టర్లు, సిబ్బంది నియామకం దిశగా అడుగులు
- ఆదివాసీ ప్రాంతాల్లో కనీసం ప్రాథమిక చికిత్స అందించే ఏర్పాట్లు

- వివరాలు 12లో



దేవత కాదు.. అమ్మ!

16లో

తెలంగాణ తల్లికి సర్కారు సరికొత్త రూపు



హోం శాఖ విజయోత్సవాల్లో ప్రదర్శించిన అత్యాధునిక తుపాకీని సరదాగా ఎక్కుపెడుతున్న సీఎం రేవంత్

హద్దు మీరితే లోపలేయండి

- పోలీస్‌స్టేషన్‌కు వచ్చి దాబూ దర్పం ప్రదర్శిస్తే సహించాల్సిన పనిలేదు
- నేరగాళ్లు ఎవరైనా హోదా ఉండదు.. ప్రొటోకాల్ వర్తించదు.. వారి విషయంలో పోలీసులు కఠినంగానే వ్యవహరించాలి
- హోం శాఖ విజయోత్సవాల్లో సీఎం రేవంత్
- డ్రగ్స్, సైబర్ నేరాల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని వెల్లడి
- అంబేడ్కర్‌కు నివాళులర్పించిన రేవంత్, భట్టి విక్రమార్క

2లో

హోంగార్డులకు రోజుకు రూ. వెయ్యి

వచ్చే జనవరి నుంచి అమలు: సీఎం - 2లో

సర్కారును ఎలా ఎదుర్కొందాం?

రేపు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష భేటీ




- పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సంయుక్త భేటీలో దిశానిర్దేశం చేయనున్న పార్టీ అధినేత కేసీఆర్
- అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ
- తెలంగాణ తల్లికి కొత్త రూపు ఇవ్వడంపై వ్యతిరేకత
- కాంగ్రెస్ విజయోత్సవాలకు దీటుగా బీఆర్ఎస్ కార్యక్రమాలు
- ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌తో కేటీఆర్ భేటీలో నిర్ణయం!

3లో

క్లుప్తంగా...

కాంగ్రెస్ అబద్ధపు హామీలు ఎండగడతాం: లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాలు, అబద్ధపు హామీలను ఎండగడతామని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. ఏడాది పూర్తిచేసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. శుక్రవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ, హైదరాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహిస్తున్న సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరవుతున్నారని తెలిపారు. ఆర్గనైజ్డ్ క్రైం అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్‌పీ) దేశంలో తయారైన కోవాక్సిన్ టీకాకు వ్యతిరేకంగా తప్పుడు కథనాలు రాసిందని గుర్తుచేశారు. ఈ వార్తా పత్రిక కథనం ఆధారంగా కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సంస్థతో రాహుల్‌గాంధీకి ఉన్న సంబంధాలను ఫ్రెంచ్ పత్రిక 'మీడియాపార్ట్' ప్రచురించిందన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ కుర్చీ దగ్గర డబ్బులు దొరికాయని రాజ్యసభ చైర్మన్ చెప్పినా ఈ అంశాన్ని కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని లక్ష్మణ్ విమర్శించారు.

ఇబ్బంది పెడితే కేసీఆర్, కేటీఆర్ అయినా అరెస్ట్

కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి



సాక్షి, న్యూఢిల్లీ: ప్రభుత్వం నడవకుండా ఇబ్బంది పెడితే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎవరినైనా అరెస్టు చేస్తామని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి హెచ్చరించారు. ప్రభుత్వాన్ని నడపనివ్వడం లేదు కాబట్టే అరెస్టులు జరుగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. మల్లు రవి శుక్రవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ.. పదేళ్లుగా తనను పోలీసులు ఎన్నోసార్లు హౌస్ అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. ఏడాదిగా ప్రజాపాలన చక్కగా సాగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి, సర్కార్‌పై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. అదానీ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీపై రాజ్యసభలో నోట్ల కట్ట వివాదాన్ని సృష్టించారని ఆరోపించారు. అదానీ–ప్రధాని మధ్య ఉన్న బంధం బయటపడుతుందనే ఉద్దేశంతోనే అధికార పక్షం ఇలా చేస్తోందని మల్లు రవి దుయ్యబట్టారు.

ఆరు గ్యారెంటీల్లో ప్రభుత్వ వైఫల్యం

ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పాల్

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీ అమల్లో విఫలమైందని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ ఆరోపించారు. ఆయన శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. హామీలు అమలు చేయకపోవడం వల్ల తీవ్ర ప్రజా వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ప్రజాపాలన అంటే రెడ్ల పాలనా?, బీసీల వ్యతిరేక పాలనా? అని సీఎంను నిలదీశారు.

మల్లన్న సేవలో అక్కినేని కుటుంబం



శ్రీశైల మల్లన్న దర్శనానికి వెళ్తున్న అక్కినేని నాగార్జున, నాగ చైతన్య దంపతులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను సినీ నటుడు అక్కినేని నాగార్జున, తనయుడు నాగచైతన్య–శోభిత దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. శ్రీశైల ఆలయం వద్దకు చేరుకున్న వీరికి రాజగోపురం వద్ద ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. నాగ చైతన్య శోభిత వివాహం అయిన తర్వాత మొదటిసారిగా స్వామి అమ్మవార్ల ఆశీస్సులను పొందేందుకు వీరు శ్రీశైలం వచ్చారు.

ఇదం జగత్



అసలు జాబిల్లిపైకి వెళ్లకుండా ఉంటే చాలట సార్..!

హడావుడి చేస్తే లోపలేయండి

పోలీస్‌స్టేషన్‌కు వచ్చి డాబూ దర్పం ప్రదర్శిస్తే సహించాల్సిన పనిలేదు

- నేరగాళ్లు ఎవరైనా హోదా ఉండదు.. ప్రొటోకాల్ వర్తించదు
- వారి విషయంలో పోలీసులు కఠినంగానే వ్యవహరించాలి
- హోం శాఖ విజయోత్సవాల్లో సీఎం రేవంత్‌రెడ్డి



ట్రాన్స్‌జెండర్‌కు నియామకపత్రం అందజేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీజీపీ జితేందర్, మేయర్ విజయలక్ష్మి

సాక్షి, హైదరాబాద్: 'బాధితులను ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. నేరగాళ్లు రాజకీయ నాయకులైనా, అధికారులైనా సరే.. ఎలాంటి హోదా ఉండదు. ప్రొటోకాల్ వర్తించదు. నేరం చేసే వారిపట్ల కఠినంగా వ్యవహరించండి. పోలీస్‌స్టేషన్లకు వచ్చి డాబూ దర్పం ప్రదర్శిస్తూ హడావుడి చేసేవాళ్లను సక్కగా తీసుకుపోయి బొక్కలో వేయండి. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజాప్రతినిధులకు పోలీసులు మర్యాద ఇవ్వడం ఎంత ముఖ్యమో..పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజాప్రతిధులు సహా ఎవరైనా పోలీసులతో మర్యాదగా ప్రవర్తించడం అంతే ముఖ్యం. పోలీసులతో అమర్యాదగా ప్రవర్తించేవారి పట్ల మర్యాదగా ఉండాల్సిన పనిలేదు. ఈ మేరకు ఈ వేదిక నుంచే పోలీస్ శాఖలోని అన్ని స్థాయిల సిబ్బందికి.. ముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా నేను ఈ విషయంలో స్పష్టత ఇస్తున్నా..' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన– ప్రజా విజయోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నెక్లెస్ రోడ్డులోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో హోంశాఖ నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అగ్నిమాపక శాఖకు చెందిన ఎస్‌డీఆర్‌ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఆ తర్వాత పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీజీపీ జితేందర్, ఇతర సీనియర్ ఐపీఎస్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం అగ్నిమాపక శాఖలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎస్‌డీఆర్‌ఎఫ్ లోగోను ఆవిష్కరించారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి డిప్యూటీ సీఎంతో కలిసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు.

ఏడో గ్యారంటీగా ప్రజలకు స్వేచ్ఛ

'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగిస్తున్నాం. గత ప్రభుత్వంలో పోలీసులు రాజకీయ ఒత్తిళ్లతో పనిచేశారు. కానీ గత ఏడాదిగా పైరవీలకు తావులేకుండా సమర్థత ఆధారంగా పోస్టింగ్‌లు ఇస్తున్నాం. రాజకీయ ఒత్తిళ్లు లేనందున రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయి. శాంతిభద్రతలను కాపాడటంతో పాటు ప్రభుత్వ ప్రతిష్టను పెంచే బాధ్యత పోలీసుల చేతుల్లోనే ఉంది. ప్రజా ప్రభుత్వంలో 4 కోట్ల మంది ప్రజలకు స్వేచ్ఛ అనే ఏడో గ్యారంటీని అమలు చేశాం..' అని సీఎం పేర్కొన్నారు.

మానవీయ కోణంలోనే ట్రాన్స్‌జెండర్లకు బాధ్యతలు

'సమాజంలో నిరాదరణకు గురైన ట్రాన్స్‌జెండర్లను మానవీయ కోణంలో ఆదుకునేందుకే వారికి తాత్కాలిక విధానంలో ట్రాఫిక్ అసిస్టెంట్‌లుగా విధులు అప్పగిస్తున్నాం. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద యాచించే ట్రాన్స్‌జెండర్లను నేను గతంలో చూశా. అందుకే వారికి ట్రాఫిక్ విధులు అప్పగించి, నెలకు గౌరవ వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే 50 మంది ట్రాన్స్‌జెండర్లకు నియామక పత్రాలు ఇచ్చాం. భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెంచుతాం. ఇందిరమ్మ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ట్రాన్స్‌జెండర్లకు ఇస్తాం. అన్ని విధాలా అండగా ఉంటాం. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ట్రాన్స్‌జెండర్లు క్రమశిక్షణతో మెలగాలి..' అని ముఖ్యమంత్రి రేవంత్ విజ్ఞప్తి చేశారు.

డ్రగ్స్, సైబర్ నేరాల కేసుల్లో 6 నెలల్లోనే శిక్ష

'గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు మహమ్మారితో పాటు సైబర్ నేరాలు సవాల్ విసురుతున్నాయి. డ్రగ్స్ కట్టడికి ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలు సరిపోవు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే రాష్ట్ర ప్రతిష్ట దిగజారుతుంది. కాబట్టి డ్రగ్స్ కట్టడికి ప్రత్యేక సిబ్బందిని నియమించుకోవాలి. డ్రగ్స్, సైబర్ నేరాల కేసుల్లో ఆరు నెలల్లోనే విచారణ పూర్తి చేసి శిక్షలు విధించేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటుపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం. డ్రగ్స్, సైబర్ క్రైం నియంత్రణ కోసం బీటెక్, ఎంటెక్ చదివిన విద్యార్థులను డేటా అనాలసిస్ కోసం వాడుకోవాలని డీజీపీని ఆదేశిస్తున్నా. అదేవిధంగా నగరాన్ని పట్టిపీడిస్తున్న కాలుష్యం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలి..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

పోలీసులు సమస్యలు ప్రభుత్వం దృష్టికి తేవాలి

'క్రమశిక్షణకు మారుపేరైన పోలీస్ శాఖ సిబ్బంది దాన్ని ఉల్లంఘించడం సరికాదు. పోలీసులు ఆందోళనలు చేయడం వల్ల సమస్యల పరిష్కారం మరింత జటిలం అవుతుంది. పోలీస్ సిబ్బంది తమ సమస్యలేవైనా ఉన్నతాధికారుల దృష్టికి తేవాలి. అధికారుల వద్ద పరిష్కారం కాకపోతే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తేవాలి. అక్కడా పరిష్కారం కాకపోతే నేను స్వయంగా పోలీసుల సమస్యలు పరిష్కరించే బాధ్యత తీసుకుంటా..'అని సీఎం తెలిపారు.

అందరి కోసం పోలీస్: డిప్యూటీ సీఎం

ప్రజా ప్రభుత్వంలో కొంతమంది అవసరాల కోసం కాకుండా, సమాజ అవసరాల కోసం మాత్రమే పోలీస్ వ్యవస్థ పనిచేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దడం కోసం ఫ్రెండ్లీ పోలీస్ కార్యాచరణ ప్రణాళిక తీసుకుని ముందుకు వెళుతున్నామని తెలిపారు. పోలీసు వ్యవస్థకు ఎలాంటి అవసరాలు ఉన్నా తీర్చడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ పోలీస్ సాంకేతికంగా ఎంతో ముందంజలో ఉందని, డయల్ 100కు సమాచారం అందిన పది నిమిషాల్లోనే బాధితుల వద్దకు చేరుకుంటున్నామని చెప్పారు.

ఆకట్టుకున్న విన్యాసాలు..అబ్బురపర్చిన జాగిలాలు

విజయోత్సవాల్లో భాగంగా ఆక్టోపస్ సిబ్బంది ప్రదర్శించిన విన్యాసాలు అలరించాయి. పోలీస్ బ్యాండ్ బృందాలు ఆకట్టుకున్నాయి. పోలీస్ జాగిలాలు తమ ప్రదర్శనతో అబ్బురపరిచాయి. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, మేయర్ విజయలక్ష్మి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, అగ్ని మాపక శాఖ డీజీ నాగిరెడ్డి ఐపీఎస్‌లు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డులకు రోజుకు రూ.వెయ్యి

వీక్లీ పరేడ్ అలవెన్స్ రూ.100 నుంచి రూ.200కు పెంపు

వచ్చే జనవరి నుంచి అమలు

హోంగార్డుల రైజింగ్ డే సందర్భంగా వారికి సీఎం రేవంత్‌రెడ్డి వరాలు ప్రకటించారు. 'పోలీసులతో సమానంగా పనిచేస్తున్న హోంగార్డులకు భరోసా ఇస్తున్నా. రాష్ట్రంలో దాదాపు 14 వేల మందికి పైగా హోంగార్డులు పనిచేస్తున్నారు. డిసెంబర్ 6 హోంగార్డ్స్ రైజింగ్ డే సందర్భంగా మీ సంక్షేమం కోసం పలు నిర్ణయాలు తీసుకున్నాం. రోజువారీ భత్యాన్ని రూ.921 నుంచి రూ.1,000కి పెంచుతున్నాం. అలాగే వీక్లీ పరేడ్ అలవెన్స్ రూ.100 నుంచి రూ.200కు పెంచుతున్నాం. హోంగార్డులు ప్రమాదవశాత్తు కానీ, సహజ మరణం కానీ పొందితే కుటుంబానికి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇస్తాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి మెరుగైన వైద్య సహాయాన్ని కూడా హోంగార్డులకు అందిస్తాం. ఈ నిర్ణయాలన్నీ 2025 జనవరి 1 నుంచి అమల్లోకి తెస్తాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు.

సంబురాలు.. నిరసనలు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రోగ్రెస్ రిపోర్టులను కూడా విడుదల చేయడం గమనార్హం.

చార్జిషీట్లతో ప్రజల్లోకి బీజేపీ..

కాంగ్రెస్ ఏడాది పాలనపై బీజేపీ కొంత దూకుడుగా వెళుతోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కార్యక్రమాలు చేపట్టింది. రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ స్థాయిలలో చార్జిషీట్లు, ఐదు రోజుల పాటు బైక్‌ర్యాలీల నిర్వహణ, కరపత్రాల పంపిణీ ద్వారా... ప్రభుత్వ వైఫల్యాలను 6 అబద్ధాలు– 66 మోసాల పేరుతో ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఇక 7న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా హాజరుకానున్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై బీజేపీ ఎలాంటి విమర్శలు గుప్పిస్తుందన్నది ఆసక్తిగా మారింది. మరోవైపు కేంద్రంలోని గత పదేళ్ల బీజేపీ పాలన, ఇక్కడి ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు రావాలంటూ టీపీసీసీ నేతలు సవాల్ విసరడంతో బీజేపీ చార్జిషీట్ల ఎపిసోడ్ రక్తి కట్టింది.

బీఆర్‌ఎస్ పోరుబాట

కాంగ్రెస్ ఏడాది పాలనపై బీఆర్‌ఎస్ కూడా గట్టిగానే పోరాడుతోంది. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం, రాహుల్‌గాంధీ, తెలంగాణ తల్లి విగ్రహం మార్పు అంశాలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పిస్తున్నారు. చాలా అంశాల్లో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. దీంతో గత కొన్నిరోజుల్లోనే కేటీఆర్, హరీశ్‌రావులపై 10కిపైగా కేసులు నమోదయ్యాయి. ఇక మాజీ మంత్రి హరీశ్‌రావుపై ఫోన్‌ట్యాపింగ్ కేసు నమోదడంతో ప్రధాన ప్రతిపక్షం కొంత అప్రమత్తమైంది. ఇందుకు ప్రతిగా ఆ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన ఫోన్ ట్యాప్ అవుతోందని.. కేసు నమోదు చేయాలంటూ చేసిన హడావుడి రాజకీయ రచ్చకు దారితీసింది. పోలీసులు ఎమ్మెల్యేపైనే కేసు పెట్టి, అదుపులోకి తీసుకోవడం, పరామర్శించేందుకు వెళ్లిన హరీశ్‌రావును కూడా అదుపులోకి తీసుకుని 10 గంటల తర్వాత విడుదల చేయడంపై చర్చజరిగింది. మరోవైపు అంబేడ్కర్ వర్ధంతి నేపథ్యంలో... ప్రభుత్వ తీరును నిరసిస్తూ, అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించాలని పార్టీ శ్రేణులకు బీఆర్‌ఎస్ పిలుపునిచ్చింది. దీంతో శుక్రవారం ఉదయం నుంచే హరీశ్‌రావు, కవిత, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర బీఆర్‌ఎస్ నేతలను పోలీసులు నిర్బంధించారు. ఇక ఈ నెల 9 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అందుకోసం అధికార, ప్రతిపక్షాలు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. దీనితో ఈ రాజకీయ వేడి మరికొంతకాలం కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది.

నేడు నల్లగొండ జిల్లాలో సీఎం పర్యటన

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- సాయంత్రం నల్లగొండలోని ఎస్‌ఎల్‌బీసీలో బహిరంగ సభ



నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొన్నం తదితరులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లంలలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మంజూరు చేసిన ఉదయసముద్రం ఎత్తిపోతల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. లక్ష ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్టులో భాగంగా అప్రోచ్ కెనాల్, టన్నెల్, సర్జ్‌పూల్, పంప్‌హౌస్, మోటార్ల ట్రయల్ రన్, రిజర్వాయర్ నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతకు సంబంధించిన పైలాన్‌ను రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. నల్లగొండ నియోజక వర్గంలో చేపట్టబోయే మరో మూడు ఎత్తిపోతల పథకాలకు అక్కడే సీఎం శంకుస్థాపన చేస్తారు. అనంతరం దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మించిన 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో పూర్తయిన యూనిట్ –2ను ప్రారంభి స్తారు. సాయంత్రం నల్లగొండ పట్టణం ఎస్‌ఎల్ బీసీలో మెడికల్ కాలేజీ భవనాన్ని ప్రారంభిస్తారు. అదే విధంగా నర్సింగ్ కాలేజీ, లైబ్రరీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు పట్టణంలో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు సీఎం అక్కడే శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఎస్‌ఎల్‌బీసీ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను శుక్రవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ పరిశీలించి, అధికారులతో సమీక్షించారు. దామరచర్ల మండలం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటును ఉత్తమ్, తుమ్మల, పొన్నం సందర్శించారు. నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల వద్ద ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్న పైలాన్ ను, రిజర్వాయర్‌ను మంత్రులు ఉత్తమ్, కోమటి రెడ్డి, పొన్నం పరిశీలించారు. నల్లగొండలోని మెడికల్ కళాశాలను, సభా ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలు పార్టీలకతీతంగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రతిపక్షాలది కనికట్టు ప్రచారం

వారి ఆర్భాటమంతా సామాజిక మాధ్యమాల్లోనే

- ఏడాదిలో సంక్షేమ కార్యక్రమాలకు రూ.61,194 కోట్లు ఖర్చు చేశాం
- ఉద్యోగుల జీతాలు, పెన్షన్ కోసం మరో రూ.60 వేల కోట్లు వెచ్చించాం
- మా ప్రభుత్వ కార్యక్రమాలన్నీ ప్రజల విజయాలుగానే భావిస్తున్నాం: డిప్యూటీ సీఎం భట్టి



శుక్రవారం సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ప్రతిపక్ష పార్టీలు కనికట్టు ప్రచారం చేస్తున్నాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క వ్యాఖ్యానించారు. వారి ఆర్భాటమంతా సామాజిక మాధ్యమాల్లోనే కనిపిస్తుందని విమర్శించారు. పదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం చేశారని, వారు చేసిన అప్పులకు ఇప్పుడున్న ప్రభుత్వం వడ్డీలు కట్టాల్సివస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటై ఏడాది కాలం కావొస్తున్న నేపథ్యంలో ఆర్థిక, విద్యుత్, ప్రణాళిక శాఖల పురోగతిపై శుక్రవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు రూ.64,516 కోట్లు వడ్డీ, రీపేమెంట్ల కింద చెల్లింపులు చేశామన్నారు. రాష్ట్రంలోని 3.69 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు, 2.88 లక్షల మంది పెన్షనర్లకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని చెప్పారు. ఏడాది కాలంలో ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ కోసం రూ.60 వేల కోట్లు వెచ్చించామన్నారు. ఇప్పటి వరకు వివిధ పథకాల కింద రూ.61,194 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ నిరుద్యోగులను నట్టేట ముంచిందని, కానీ ప్రజా ప్రభుత్వం ఏడాది కాలంలో దాదాపు 56 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు.

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది...

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోందని భట్టి విక్రమార్క చెప్పారు. రానున్న పదేళ్లలో ప్రస్తుతం కంటే రెట్టింపు డిమాండ్ ఉంటుందని, ఫ్యూచర్‌సిటీ, రీజినల్ రింగురోడ్డు చుట్టూ పరిశ్రమలు, పారిశ్రామిక పార్కులతో డిమాండ్ పెరుగుతుందని వివరించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు పర్యావరణ అనుమతులు తీసుకురాకుండా గత ప్రభుత్వం గాలికి వదిలేసిందని, ఆ తర్వాత ప్రజా ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి అన్నిరకాల అనుమతులు తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రానికి దశాదిశా నిర్దేశించే విధంగా 2047 నాటికి కావాల్సిన విజన్ డాక్యుమెంట్‌ను ప్రణాళికా విభాగం తయారు చేస్తోందన్నారు. ప్రజాపాలన ద్వారా వారం రోజులుగా గ్రామసభలు పెట్టి తీసుకున్న 1.28 కోట్ల దరఖాస్తులను డిజిటలైజ్ చేశామని, ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి, రాయితీ సిలిండర్ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ప్రజాపాలన డిజిటలైజేషన్ నుంచి సమాచారం తీసుకున్నామని చెప్పారు. ప్రణాళిక శాఖ ద్వారా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా 1.11 కోట్ల ఇళ్లను సర్వే చేశామని, ఈ సమాచారాన్ని కంప్యూటరీకరిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

మూడు రోజులు.. అట్టహాసంగా..

ప్రజాపాలన విజయోత్సవాల్లో నేటి నుంచి 'గ్రాండ్ ఫినాలే'

- 7, 8, 9 తేదీల్లో సాంస్కృతిక కార్యక్రమాలు.. డ్రోన్‌షో నిర్వహణ
- చివరి రోజు సాయంత్రం లక్ష మంది మహిళల సమక్షంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

సాక్షి, హైదరాబాద్: ఈనెల 9వ తేదీతో ముగియనున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా చివరి మూడు రోజుల పాటు గ్రాండ్ ఫినాలే పేరుతో అట్టహాసంగా వేడుకలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 7వ తేదీ శనివారం ఉదయం హైదరాబాద్‌లో హోంశాఖ ఆధ్వర్యంలో విపత్తు స్పందన దళాన్ని ప్రారంభిస్తారు. పోలీస్ బ్యాండ్‌తో పాటు ఆయుధాలను ప్రదర్శించనున్నారు. నేరాల నియంత్రణ, యాంటీ డ్రగ్స్ క్యాంపెయినింగ్ స్టాళ్లను ప్రారంభిస్తారు. అదే సమయంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అత్యవసర స్పందన వాహనాలను కూడా ప్రారంభించనున్నారు. అనంతరం సాయంత్రం గ్రాండ్ ఫినాలే కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి. మూడు రోజుల పాటు హైదరాబాద్ నగర వ్యాప్తంగా మిరుమిట్లు గొలిపేలా వీధిలైట్లు, ట్యాంక్‌బండ్ సమీపంలో థాంక్యూ సెల్ఫీ పాయింట్లు, ఫుడ్ స్టాల్స్, హస్తకళల స్టాళ్లు, ఆర్ట్ గ్యాలరీలు ఏర్పాటు చేయనున్నారు. ఫ్లాష్ మాబ్‌షోలు, కల్చరల్ షోలు, మ్యూజిక్ ఫెస్టివల్స్, ప్రముఖులతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మున్సిపల్‌శాఖ, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏలు ఈ గ్రాండ్ ఫినాలే వేడుకలను సమన్వయం చేయనున్నాయి. రెండోరోజు 8వ తేదీ ఆదివారం పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సుకు సంబంధించిన 7 స్టార్టప్‌లను ప్రారంభించనున్నారు. అదేవిధంగా 130 కొత్త మీ సేవ కేంద్రాలు ప్రారంభిస్తారు. అదే రోజు 15 పరిశ్రమలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోనుంది. ఏఐ సిటీలో మౌలికసదుపాయాల కల్పనకు, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేస్తారు. ఇక, చివరి రోజు 9వ తేదీ సోమవారం ఉదయం అసెంబ్లీలో ఈ వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఆ తర్వాత సాయంత్రం సెక్రటేరియెట్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరిస్తారు. లక్ష మంది స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళా సభ్యుల సమక్షంలో ఈ ఆవిష్కరణ జరగనుంది. అనంతరం సభలో సీఎం రేవంత్ ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా నెక్లెస్‌రోడ్డులో బాణసంచా కాల్చడంతో పాటు డ్రోన్‌షో, సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రాండ్ కార్నివాల్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

తండ్రీ కొడుకులు తప్ప ఆ పార్టీలో ఎవరూ మిగలరు

- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్
- తెలంగాణ కోసం కేటీఆర్, ఆయన కుటుంబం ఏం త్యాగం చేసింది
- ప్రజలు మళ్లీ గెలిపిస్తారని ఆయన పగటి కలలు కంటున్నారు



సాక్షి, హైదరాబాద్: తండ్రీకొడుకులు తప్ప బీఆర్‌ఎస్‌లో ఎవరూ మిగలరని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. సోనియా గాంధీ లేనిదే తెలంగాణ లేదని, అధికారం పోయినా కేటీఆర్‌కు అహంకారం తగ్గలేదని అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, ఎమ్మెల్సీలు ఆమేర్‌అలీ ఖాన్, బల్మూరి వెంకట్, టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి, అధికార ప్రతినిధి బైకాని లింగం యాదవ్‌లతో కలసి ఆయన మాట్లాడుతూ సోనియా గాంధీ జన్మదినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 9వ తేదీన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని, ఈ పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కూడా ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి దిశలో పయనిస్తోందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పదేళ్ల కాలంలో 50 వేల ఉద్యోగాలిస్తే, తాము ఏడాదిలోనే ఇచ్చామని చెప్పారు. రాజీవ్ గాంధీ గురించి విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదని అన్నారు. రాజీవ్ కుటుంబం దేశం కోసం అనేక త్యాగాలు చేసిందని, తెలంగాణ కోసం కేటీఆర్, ఆయన కుటుంబం ఏం త్యాగాలు చేసిందని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వస్తే తెలంగాణ తల్లి విగ్రహాన్ని తీసేస్తామని కేటీఆర్ అంటున్నారని, అసలు బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందా? అని ప్రశ్నించారు. ప్రజలు మళ్లీ గెలిపిస్తారని కేటీఆర్ పగటి కలలు కంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టిస్తున్న తెలంగాణ తల్లి విగ్రహం రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఉంటే బీఆర్‌ఎస్ హయాంలో రూపొందించిన విగ్రహం దొరసానిలా ఉందన్నారు. ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌లో బంధించి.. కేటీఆర్, హరీశ్‌రావులు పిల్ల చేష్టలు చేస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వాడిన భాష సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని, చట్టం ఎవరికీ చుట్టం కాదని, శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నం చేస్తే ఎవరినీ సహించేది లేదని హెచ్చరించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పదేళ్లలో తెలంగాణకు చేసిన మేలేంటో చెప్పాలని డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్‌కు అహంకారం ఎక్కువైంది

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల వ్యాఖ్య



సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'సీఎం రేవంత్‌కు అహంకారం ఎక్కువైంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని పట్టుకుని డీఎన్‌ఏ టెస్టులు, గుజరాత్ గులాం అంటూ మాట్లాడుతున్న మాటలు ఆయన అజ్ఞానానికి, అవివేకానికి నిదర్శనం' అని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది తిరగకముందే ప్రజల విశ్వాసం కోల్పోయిందని చెప్పారు. మోసపూరిత హామీలతో ప్రజలను దగాచేస్తున్న ఆ పార్టీ నేతలు.. ప్రజలకు ఏం చేశారని సంబురాలు చేసుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై.. సరూర్‌నగర్ స్టేడియం వేదికగా శనివారం నిర్వహించతలపెట్టిన బీజేపీ బహిరంగ సభ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'కాంగ్రెస్ ప్రభుత్వానివి ఆరు అబద్ధాలు..66 మోసాలు. గత ప్రభుత్వం మట్టికరవడానికి పదేళ్లు పడితే.. అదే రేవంత్ రెడ్డి సర్కార్ అభాసుపాలు కావడానికి, విశ్వాసం కోల్పోవడానికి నెలలే పట్టింది. ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేక పోయింది. దీన్ని డైవర్ట్ చెయ్యడానికే సీఎం తన హోదా, స్థాయిని మరిచి మాట్లాడుతున్నారు' అని విమర్శించారు. ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని సమున్నతంగా కాపాడుతున్నారని బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మరోవైపు 'రాజ్యాంగాన్ని కాపాడండి' అంటూ కొందరు రాజకీయ వక్తలు కుట్రపూరిత ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

సర్కారును ఎలా ఎదుర్కొందాం?

రేపు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష భేటీ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ శాసనసభాపక్షం కీలక భేటీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో ఈ నెల 8న (ఆదివారం) మధ్యాహ్నం ఒంటి గంటకు జరిగే ఈ భేటీకి రావాల్సిందిగా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కొందరు ముఖ్య నేతలను ఆహ్వానించనున్నారు. అసెంబ్లీ ఉభయ సభల్లో లేవనెత్తాల్సిన అంశాలపై పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశాలకు ప్రధాన ప్రతిపక్ష నేత హాజరుకావాలంటూ సీఎం రేవంత్ చేస్తున్న వ్యాఖ్యలపై ఈ భేటీ సందర్భంగా కేసీఆర్ తన మనోగతాన్ని వెల్లడించే అవకాశం ఉందని సమాచారం. 9న జరిగే శాసనసభ బీఏసీ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయించే ఎజెండాలోని అంశాలను బట్టి కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యేదీ, లేనిదీ స్పష్టత వస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

అలా గొంతు నొక్కితే ఎలా?

ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో తమ గొంతునొక్కారని బీఆర్ఎస్ ఆరోపించింది. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనూ అదే రకమైన పరిస్థితి తలెత్తితే ఎలా ఎదుర్కోవాలన్న వ్యూహంపైనా బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. 9న కొత్త రూపుతో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో.. శుక్రవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ అయ్యారు. ఎర్రవల్లి నివాసంలో జరిగిన ఈ భేటీలో పలు అంశాలపై కేసీఆర్ సూచనలు చేసినట్టు సమాచారం.

9న 'తెలంగాణ తల్లి' విగ్రహావిష్కరణ

ఏడాది పాలన విజయోత్సవాల్లో భాగంగా సచివాలయంలో తెలంగాణ తల్లి కొత్త విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆవిష్కరించనుంది. అయితే తెలంగాణ తల్లి విగ్రహం రూపు మార్చడాన్ని వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్ అదే రోజున పోటీ కార్యక్రమానికి సిద్ధమైంది. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఉద్యమకాలంలో రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు సన్నాహాలు చేస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఇక పార్టీ అధినేత కేసీఆర్ కూడా ఈ అంశంపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ సుదీర్ఘ లేఖ విడుదల చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇక రేవంత్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలను ఎత్తిచూపుతూ శనివారం చార్జిషీటు విడుదల చేసేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఈ చార్జిషీటు బాధ్యత అప్పగించినట్టు తెలిసింది. మరోవైపు అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమానికి కేసీఆర్‌ను ఆహ్వానిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ ప్రభుత్వపరంగా ఎలాంటి ఆహ్వానం అందలేదని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

నేడు 'సాక్షి' ఎడ్యుకేషన్ పోటీ పరీక్షల ప్రత్యేక వెబినార్

'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం' అనే అంశంపై..

సాక్షి, ఎడ్యుకేషన్: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్, ఐఈఎస్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికోసం సాక్షి ఎడ్యుకేషన్ ప్రత్యేకంగా ఓ వెబినార్ సిరీస్‌ను నిర్వహిస్తోంది. ఈ సిరీస్‌లో భాగంగా భారత రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లోని పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం అనే అంశంపై శనివారం సాయంత్రం 4:30 గంటల నుంచి 6 గంటల వరకు వెబినార్‌ను నిర్వహించనుంది. కార్యక్రమంలో పలువురు ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్లు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐసీఎఫ్ఏఐ డీన్, ప్రొఫెసర్ తమ్మా కోటిరెడ్డి, కె.వినయ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ పొలిటికల్ సైన్స్, మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ, ఔరంగాబాద్, నిషిత్ రంజన్ చకీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ లా, కేసీసీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లీగల్ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్, ఢిల్లీ పాల్గొననున్నారు. వెబినార్ పూర్తయిన తర్వాత పూర్తి వీడియో సాక్షి ఎడ్యుకేషన్ యూట్యూబ్ చానల్ ద్వారా చూడవచ్చని తెలిపింది. జూమ్ మీటింగ్ వెబినార్ లింక్ https://tinyurl.com/48u2sue5, మీటింగ్ ఐడీ 868 9395 5345, పాస్‌కోడ్ 026085గా పేర్కొంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.

https://tinyurl.com/48u2sue5
మీటింగ్ ఐడీ: 868 9395 5345
పాస్‌కోడ్: 026085

చరిత్రను మారిస్తే సహించేది లేదు

రేవంత్ సర్కారు ఏర్పాటు చేస్తున్నది తెలంగాణ తల్లి విగ్రహమా? కాంగ్రెస్ తల్లి విగ్రహమా?: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం తెలంగాణలోనే ఉన్నా కనీసం పూల మాల వేయాలనే సోయి ప్రభుత్వానికి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మండిపడ్డారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి రోజున కూడా భారీ అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణాన్ని కనీసం శుభ్రం చేయలేదని.. బీఆర్ఎస్‌పై ఉన్న అక్కసును అంబేడ్కర్ విగ్రహంపై ఎందుకు చూపిస్తున్నారని నిలదీశారు. అంబేడ్కర్ భారీ విగ్రహం పట్ల ఈ ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంపై సీఎం రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ చరిత్రను మారుస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం తెలంగాణ భవన్‌లో... అంబేడ్కర్ చిత్రపటానికి కేటీఆర్ నివాళి అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వివరాలు కేటీఆర్ మాటల్లోనే.. ''అంబేడ్కర్ ఆలోచనా విధానం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం వర్ధంతి కార్యక్రమం నిర్వహించడం లేదు. భారీ విగ్రహాన్ని నిర్లక్ష్యం చేయడం వెనుక ఉద్దేశాలను ప్రభుత్వం బయటపెట్టాలి. రాష్ట్రంలో దళితబంధు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్ వంటి పథకాలు నిలిచిపోయాయి. గురుకుల విద్యార్థులను బీఆర్ఎస్ ప్రభుత్వం ఎవరెస్టు శిఖరం ఎక్కిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం పాడె ఎక్కిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు గురుకుల బాటను అడ్డుకుంటూ ఆర్ఎస్ ప్రవీణ్ వంటి నాయకులపై కేసులు పెడుతోంది.

రేవంత్ మాట తీరు మార్చుకోవాలి

సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలను కనీసం నెల రోజుల పాటు నిర్వహించాలి. గత 11 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అన్యాయాలను అసెంబ్లీ వేదికగా ప్రశ్నిస్తాం. లగచర్ల అంశం మొదలుకుని ప్రజా సమస్యలను లేవనెత్తుతాం. కేసీఆర్‌పై కారుకూతలు మానకుంటే సీఎం రేవంత్‌కు గౌరవం ఇవ్వాల్సిన అవసరం లేదు. రేవంత్‌రెడ్డి మాట తీరు మార్చుకుంటేనే ఆయన పదవికి గౌరవం దక్కుతుంది..'' అని కేటీఆర్ పేర్కొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కేటీఆర్

ప్రభుత్వాలు మారితే విగ్రహాల రూపు మారుస్తారా?

''రేవంత్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది తెలంగాణ తల్లి విగ్రహమా? లేక కాంగ్రెస్ తల్లి విగ్రహమా? అనే స్పష్టత ఇవ్వాలి. ప్రభుత్వాలు మారినప్పుడు విగ్రహాల రూపు, చరిత్రను మారుస్తామంటే ఎవరూ ఒప్పుకోరు. ఉద్యమకాలంలో సబ్బండ వర్గాలు, కవులు, కళాకారులు, మేధావులు కలిసి తెలంగాణ పరిస్థితి, సంస్కృతికి అనుగుణంగా తెలంగాణ తల్లి విగ్రహానికి రూపం ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్బంధాలను దాటుకుని తెలంగాణ తల్లి విగ్రహ స్థాపన జరిగింది. తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజీవ్ గాంధీ విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఘనంగా ఏర్పాటు చేస్తాం..''





ఆత్మయందు ధ్యాస కల్గి, మనోబుద్ధి నిశ్చలన్నియు ఆత్మయందే నిలిపి,
యోగమాచరించువాడు జ్ఞానాగ్నిచేత కల్మషములన్నియు
కాల్చివేయబడినవాడై జన్మలు లేని మోక్షము పొందును.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 7 డిసెంబర్ 2024

దిక్కులు చూస్తున్న ఫ్రాన్స్!

యూరప్ దేశాల్లో జర్మనీ తర్వాత రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా వెలిగిపోతున్న ఫ్రాన్స్ సంక్షోభం నుంచి సంక్షోభానికి ప్రయాణిస్తున్నది. దేశాన్ని చుట్టుముట్టిన అనిశ్చితి పోవాలంటే ఎన్నికలొక్కటే మార్గమని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మేక్రాన్ ఆర్నెలల క్రితం భావించి పార్లమెంటు రద్దుచేశారు. కానీ మొన్న జూలైలో నిర్వహించిన ఎన్నికల్లో ఎవరికీ మెజారిటీ రాకపోవటంతో సమస్య మొదటికొచ్చింది. దిక్కుతోచని స్థితిలో రెండు నెలల అనంతరం మైకేల్ బార్నియర్‌ను ప్రధాని పీఠంపై కూర్చోబెట్టారు. కానీ అది మూడునెలల ముచ్చటైంది. ఆరు దశాబ్దాల చరిత్రలో అవిశ్వాస తీర్మానం ద్వారా పతనమైన తొలి ప్రభుత్వం బార్నియర్ దే. అతి తక్కువ కాలం ప్రధానిగా పనిచేసిన అప్రదిష్ట కూడా ఆయనదే. ఫ్రాన్స్ పెద్ద ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. ఉద్యోగాల కోత, పరిశ్రమల మూత రివాజుగా మారాయి. అసలే పడిపోయిన నిజ వేతనాలతో, నిరుద్యోగ బెడదతో బతుకులు ఎలా నెట్టుకు రావాలో తెలియక పౌరులు కొట్టుమిట్టాడుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి క్షీణించటంతో రెస్టరెంట్లు, చిన్నా పెద్దా దుకాణాలు మూసేస్తున్నారు. ఈ దశలో పులి మీద పుట్రలా ప్రభుత్వ వ్యయాన్ని అదుపుచేసే పేరిట బార్నియర్ భారీ కోతలకు దిగారు. ఇది ప్రతిఘటనకు దారితీసింది. పబ్లిక్ రంగ సంస్థల సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇప్పటికే సమ్మెకు పిలుపునిచ్చారు.

కరోనా మహమ్మారి విరుచుకుపడక ముందు యూరప్ దేశాల్లో అగ్రగాములుగా వెలిగిన జర్మనీ, ఫ్రాన్స్‌లు రెండూ 2021నుంచి ఇబ్బందుల్లో కూరుకుపోయాయి. ఆర్థిక స్వస్థతకు తీసుకున్న చర్యలు ఫలించ బోతున్నాయన్న సంకేతాలున్న తరుణంలోనే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వచ్చిపడి ఆర్థిక వ్యవస్థలను మరింత దెబ్బతీసింది. జర్మనీ కొంతవరకూ దీన్ని తట్టుకోగలిగినా ఇంధన సంక్షోభంతో, భారీ వడ్డీ రేట్లతో ఫ్రాన్స్ కుదేలవుతోంది. ఒకపక్క ఊపిరాడనీయని రుణ భారం, మరో పక్క ద్రవ్యలోటు ఆ దేశాన్ని పీడిస్తున్నాయి. లాక్‌డౌన్ సమయంలో సజావుగా నడిచేందుకు, ఉద్యోగులకు వేతనాలు చెల్లించేందుకూ పరిశ్రమలకు ప్రభుత్వం ఉదారంగా పంచిన 15,000 కోట్ల యూరోలు ఆవిరైపోయాయి. సరిగదా... ఇంధన ఆధారిత సంస్థలు ఉత్పత్తిని తగ్గించి వేలాదిమందిని తొలగించబోతున్నామని గత నెలలో ప్రకటించాయి. నెక్సిటీ వంటి భారీ నిర్మాణరంగ సంస్థ సైతం తడిసి మోపెడవుతున్న వడ్డీ రేట్ల కారణంగా కొత్త పెట్టుబడులకు వెళ్లటం లేదని తెలిపింది. పర్యవసానంగా వేలాదిమంది ఉద్యోగాలు కోల్పోక తప్పని స్థితి ఏర్పడింది. ప్రభుత్వ రుణాలు కనీవినీ ఎరుగని రీతిలో 3 లక్షల 20 వేల కోట్ల యూరోలకు చేరాయి. ఇది దేశ జీడీపీ కన్నా 112 శాతం అధికం. గ్రీస్, స్పెయిన్ వంటి దేశాలను మించి ప్రభుత్వ లోటు 6.1 శాతం చేరుకుంది. సంపన్నులకూ, కార్పొరేట్ సంస్థలకూ ఇచ్చిన పన్ను రాయితీల వల్ల కాస్తయినా ప్రయోజనం లేకపోగా, వచ్చే ఏడాది కనీసం 6,000 కోట్ల యూరోలు పొదుపు చేయటానికి తాత్కాలికంగా పన్నులు పెంచుతామని మొన్న అక్టోబర్‌లో ప్రతిపాదించగానే అంతంత మాత్రంగా నడుస్తున్న సంస్థలు అంతెత్తున లేచాయి. కొత్త పెట్టుబడులకు ఆస్కారమే లేని స్థితిలో ఈ పన్నుల మోతేమిటని ప్రశ్నించాయి.

ఫ్రెంచి పౌరులు గర్వపడే పారిస్‌లోని 860 యేళ్లనాటి పురాతన భవంతి నోటర్‌డామ్ కేథడ్రిల్‌కు 2019లో నిప్పంటుకుని చాలా భాగం ధ్వంసమైనప్పుడు సంక్షోభంలో కూరుకుపోయిన వర్తమాన ఆర్థిక స్థితికి అది అద్దం పడుతోందని అనేకులు వ్యాఖ్యానించారు. అయిదేళ్లలో దాన్ని పునర్నిర్మించి అద్భుతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చిన మేక్రాన్ జయప్రదంగా ఆ పని పూర్తిచేయగలిగారు. కానీ ఆర్థికవ్యవస్థ మాత్రం ఆయనకు చుక్కలు చూపిస్తోంది. మామూలుగా అయితే శనివారం 50 మంది ప్రపంచాధినేతలు, కాబోయే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వగైరాల సమక్షంలో ఆ భవంతి ప్రారంభం కాబోయే వేళ మేక్రాన్ సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యేవారు. కానీ తాజా రాజకీయ సంక్షోభం ఎదుర్కొనటం ఎలాగో తెలియక ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

577మంది సభ్యులుండే దిగువసభ 'అసెంబ్లీ నేషనల్'లో ప్రభుత్వం ఏర్పాటుచేసే పక్షానికి కనీసం 289 స్థానాలు కావాలి. కానీ వామపక్ష న్యూ పాపులర్ ఫ్రంట్‌కు 182, మేక్రాన్‌కు చెందిన ఎన్‌సెంబుల్‌కు 168 ఉన్నాయి. తీవ్ర మితవాద పక్షం నేషనల్ ర్యాలీ (ఆర్‌ఎన్)కి 143 సీట్లున్నాయి. వామపక్ష ఫ్రంట్ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని బలపరచటం ద్వారా ఆర్‌ఎన్ ఇప్పుడు బార్నియర్ ప్రభుత్వ పతనానికి కారణమైంది. తన బడ్జెట్ పార్లమెంటులో నెగ్గే స్థితి లేదని తెలిసి రాజ్యాంగంలోని అధికరణ ఉపయోగించి బార్నియర్ దాన్ని అమల్లోకి తెచ్చారు. పర్యవసానంగా అవిశ్వాస తీర్మానం ఎదుర్కొనక తప్పదని అర్థమైనా ఆయన ఈ మార్గం ఎంచుకున్నారు. రాజ్యాంగ నిబంధన ప్రకారం ఏడాది గడిస్తే తప్ప... అంటే వచ్చే ఏడాది జూలై వరకూ మళ్లీ ఎన్నికలు జరపకూడదు. కనుక అప్పటివరకూ ఫ్రాన్స్‌కు ఆపద్ధర్మ ప్రభుత్వమే గతి. ఈలోగా తన వైఫల్యాలను అంగీకరించి మేక్రాన్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాల్సిరావొచ్చు. ఫలితంగా దేశానికి మరిన్ని ఇక్కట్లు తప్పవు. అంతంత మాత్రంగా ఉన్న తమ బతుకులు ఆర్‌ఎన్ నిర్ణయంవల్ల మరింత అధోగతికి చేరాయని జనం అనుకుంటే అధ్యక్ష ఎన్నికల్లో ఆ పదవి దక్కించుకోవాలని తాపత్రయ పడుతున్న ఆర్‌ఎన్ అధినాయకురాలు మెరిన్ లీ పెన్ ఆశలు అడుగంటినట్టే. ఫ్రాన్స్ సంక్షోభం మరింత వికటిస్తే అది మొత్తం యూరప్ దేశాల ఆర్థికవ్యవస్థలను అనిశ్చితిలో పడేస్తుంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధంతోసహా అన్ని సంక్షోభాలూ ఆగితేనే ఈ ప్రమాదం నుంచి గట్టెక్కడం యూరప్‌కు సాధ్యమవుతుంది.

ప్రాచీన భారతంలో వ్యవసాయ తత్వం

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

హరప్పా నాగరికత ఇతర పురాతన నగర నాగరికతల కంటే ఎంతో పరిణతిని చూపింది. పూర్తిగా అభివృద్ధి చెందిన వ్యవసాయ తత్వశాస్త్రం లేకుండా అధునాతన శాస్త్రీయ సాధనాలను తయారు చేయడం సాధ్యం కాదు. క్రీ.పూ. 2600లో నిర్మితమైన చైనా తొలి నగరం చాంగ్‌జౌలో కాల్చిన ఇటుకలు, అధునాతన చెక్క పనితనం ఆనవాళ్లు దొరకలేదు. అంటే, భారతీయ వ్యవసాయవాద సంస్కృతి చైనా కంటే చాలా అభివృద్ధి చెందినది. అయితే చైనా వ్యవసాయ తత్వం చైనా చరిత్రలో భాగం. అదే భారతదేశంలో అలా జరగలేదు. ఒక తత్వశాస్త్రంగా వ్యవసాయవాదాన్ని అధ్యయనం చేయడానికీ, రాయడానికీ అనర్హమైనదిగా భావించారు. పారను, నాగలిని భారతదేశ నాగరికతకు చిహ్నాలుగా చూడకపోవడం ఉత్పత్తి పురోగతిని బలహీనపరిచింది.

నా తాజా పుస్తకం 'ద శూద్ర రెబెలియన్' కోసం పరిశోధిస్తున్నప్పుడు, పూర్వ వేద కాలంలో వ్యవసాయవాదపు (అగ్రికల్చరిజం) తాత్విక ధార ఉందో లేదో తెలుసుకోవడానికి పురాతన భారతీయ సాహిత్యం పరిశీలించాను. రాతపూర్వక ఆధారాలు ఏవీ దొరకలేదు. పురాతన చైనా, గ్రీస్, ఇజ్రాయెల్, ఈజిప్ట్‌లో అటువంటి స్రవంతులు ఉండే అవకాశాలను పరిశీలించాను. భారతదేశమే కాకుండా ఈ దేశాలు కూడా పురాతన ఆలోచనా విధానాలకు ప్రధాన నిర్మాతలు అని మనందరికీ తెలుసు. పురాతన చైనాలో చాలా శక్తిమంతమైన వ్యవసాయవాదపు ఆలోచన ధార ఉందని గుర్తించాను. ఇది క్రీస్తు పూర్వం 770 నుండి 221 మధ్య వృద్ధి చెందింది. వ్యవసాయం గురించి ప్రచారం చేసిన, రాసిన ఆ ప్రధాన తత్వవేత్త జు జింగ్ (క్రీస్తు పూర్వం 372–289). ఇది చైనా చరిత్రలో భాగమైంది.

నిజానికి భారతీయ వ్యవసాయ నాగరికతా చరిత్ర చైనీస్ నాగరికతకు పూర్వం నాటిది. ఆర్యులకు పూర్వం భారతీయులు హరప్పా నాగరికతను నిర్మించినప్పుడు భారతదేశం చాలా అభివృద్ధి చెందిన వ్యవసాయ ఉత్పత్తిని కలిగి ఉంది. ఆనాటికి చైనాలో అంత అధునాతన వ్యవసాయ నాగరికత లేదు. చైనా తొలి నగరం చాంగ్‌జౌ. ఇది క్రీ.పూ 2600లో స్థాపించబడింది. హరప్పా నాగరికత దీని కంటే చాలా పురాతనమైనది. పైగా చైనీస్ నగరం చిన్నది; కాల్చిన ఇటుకలు, అధునాతన చెక్క పనితనం, కాంస్య పనిముట్ల వంటి ఆధారాలు దొరకలేదు.

హరప్పా నాగరికత ఇతర పురాతన నగర నాగరికతల కంటే ఎంతో పరిణతిని చూపింది. పూర్తిగా అభివృద్ధి చెందిన వ్యవసాయ తత్వశాస్త్రం లేకుండా అధునాతన శాస్త్రీయ సాధనాలను తయారు చేయడం సాధ్యం కాదు. తత్వశాస్త్రం, విజ్ఞాన శాస్త్రం రెండూ సన్నిహిత సంబంధం ఉన్న మానసిక అభివృద్ధి ప్రక్రియలు. వేదాలకు పూర్వం భారతదేశం ఆ మిశ్రమ ఆలోచనా విధానాన్ని కలిగి ఉంది.

వ్యవసాయం, వేదాలు

వేదాలు లిఖితరూపం దాల్చి, గ్రంథాలుగా లిఖితమైన తరువాత, తత్వశాస్త్రంగా వ్యవసాయవాదాన్ని అధ్యయనం చేయడానికీ, రాయడానికీ అనర్హమైనదిగా పరిగణించారు. విషాదంగా ఆ ఆలోచనా స్రవంతి మెల్లగా ఉనికిలో లేకుండా పోయింది. దీని ఫలితంగా ప్రాచీన, మధ్యయుగ భారతదేశంలో వ్యవసాయ, చేతివృత్తుల శాస్త్రంలో, ఉత్పత్తిలో భారీ స్తబ్ధత ఏర్పడింది. తోలు సాంకేతికతను అంటరానిదిగా పరిగణించడం; దాని ఉత్పత్తిదారులతో పాటు, పారను, నాగలిని భారతదేశ నాగరికతకు చిహ్నాలుగా ఎన్నడూ చూడకపోవడం ఉత్పత్తి పురోగతిని బలహీనపరిచింది.

అప్పుడు ముస్లిం పాలకులు భిన్నమైన తత్వశాస్త్రంతో వచ్చారు. కానీ తమ పరంపర ప్రకారం కులంలో దైవత్వం ఉందనీ, శూద్ర, దళిత, ఆదివాసీలకు విద్యను అందించడం దేవుని మార్గదర్శకత్వంలో



లేదనే పండితులు త్వరగా ముస్లింల చుట్టూ మూగిపోయారు.

మరో మాటలో చెప్పాలంటే, భారతీయ వ్యవసాయవాద సంస్కృతి చైనా కంటే చాలా అభివృద్ధి చెందినది. మన జాతీయవాదపు పునాది తత్వశాస్త్రం వ్యవసాయ సంస్కృతే తప్ప వేద సంస్కృతి కాదు. కుల సంస్కృతి వ్యవసాయవాదం గురించి రాయడానికీ, దానిని సంరక్షించడానికీ అనుమతించలేదు. ఎందుకంటే, ఆర్యన్ పూర్వ హరప్పన్‌లు అభివృద్ధి చెందిన లిపిని కలిగిలేరు; వైదిక అనంతర కాలంలో నేమో వ్యవసాయదారులను నాల్గవ వర్ణంగా లేదా శూద్ర బానిసలుగా ప్రకటించారు. ఇందులో ప్రస్తుత రెడ్లు, కమ్మలు, కాపులు, మరాఠాలు, పటేళ్లు, జాట్‌లు, మొదలియార్ల నుండి చాకలి వంటి శూద్ర కులాలన్నీ ఉన్నాయి. క్షురకులు (మంగలి) కూడా వీరిలో ఒక భాగం. అందువల్ల బ్రిటిష్ పాలకులు వారందరికీ పాఠశాలలు తెరిచే వరకు, శూద్ర కులాలకు చదవడానికీ, రాయడానికీ అనుమతి లేదు.

అక్బర్ వంటి ముస్లిం రాజులు కూడా, శూద్రులను పర్షియన్ విద్యకు దూరంగా ఉంచాలని చెప్పిన బ్రాహ్మణ పండితుల సలహాను అనుసరించారు. ఇప్పుడు కూడా ఆ చారిత్రక నిరక్షరాస్యత శూద్ర, దళిత, ఆదివాసీ ప్రజానీకంపై తన ప్రభావం చూపుతున్నది.

ఆర్థికంగా దృఢంగా ఉన్న శూద్ర, దళిత, ఆదివాసీలు ఇప్పుడు కూడా తత్వశాస్త్రంతో నిమగ్నమై ఉండకపోవడానికి కారణమవుతున్న ఈ అడ్డంకులను నా పుస్తకం పరిశీలిస్తుంది. చాలావరకు ఆర్‌ఎస్ఎస్ ప్రాపంచిక దృక్పథంతో ప్రభావితులైన సమకాలీన ద్విజులు వ్యవసాయ తత్వశాస్త్రంతో సంబంధం కలిగి ఉండరు. భారతీయ తత్వానికి మూలం వేదాలు అని వారు ఇప్పటికీ చెబుతూనే ఉన్నారు. కానీ వేదాలు వ్యవసాయ ఉత్పాదక క్షేత్ర తత్వాన్ని ప్రతిబింబించలేదు. శూద్రులు, దళితులు, ఆదివాసీలు తాత్విక ఆలోచనలను ఉత్పత్తి చేయగలరని ద్విజ చింతనాపరులు ఇప్పటికీ భావించడం లేదు. వారు వ్యవసాయ తత్వశాస్త్రం, వేదవాదం మధ్య గోడను నిర్మించారు. ఈ గోడ వ్యవసాయ ఉత్పత్తిలో సృజనాత్మకతను నాశనం చేసింది. ప్రస్తుత కాలంలో చైనాలో, ఐరోపాలో జరిగిన విధంగా మన దేశంలో పారిశ్రామిక ఉత్పత్తి పెరగడానికి ఈ వాదం అనుమతించలేదు.

మంచి ఉత్పత్తి, భూమి, విత్తనాల మధ్య సంబంధం గురించీ; నేల స్వభావం, విత్తనాలు, జంతువులు, మానవులతో దాని సంబంధం గురించీ అనేక తాత్విక దర్శనాలు గ్రామ వ్యవసాయ సమాజాలలో ఉన్నాయి అనేది వాస్తవం కాదా? మన గ్రామాల్లో ఇప్పటికీ తాత్విక ఆలోచనలు కీలక పాత్ర పోషిస్తున్నాయా, లేదా? అవును, అవి పని చేస్తున్నాయి. ఒక ప్రదేశంలో వేట, చేపలు పట్టడం అనేవి తగినంత ఆహారం అందించలేనప్పుడు, మొక్కలు, ధాన్యం, పండ్లు, భూమి, నీటి చుట్టూ ఉన్న తాత్వికత మాత్రమే ఆహారం అందించగలిగింది.

ప్రత్యామ్నాయ పద్ధతి

వ్యవసాయానికి సంబంధించిన భారతీయ తత్వాన్ని పునర్నిర్మించడానికీ, హరప్పా వ్యవసాయం నుండి దాని మూలాలను గుర్తించడానికీ ప్రస్తుత గ్రామ స్థాయి వ్యవసాయ ప్రజానీకాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేయడం మిగిలి ఉన్న ఏకైక ప్రత్యామ్నాయం.

పైన పేర్కొన్న పుస్తకంలో శూద్ర వ్యవసాయవాదం, భారతీయ నాగరికత అనే అధ్యాయం ఉంది. ఇది నిజానికి చైనీస్‌తో పోల్చి చూస్తే మన వ్యవసాయ తత్వశాస్త్రపు ప్రాథమిక అధ్యయనం. భారతదేశంలోని వ్యవసాయ కార్యకలాపాలు భౌతికవాదంతో ముడిపడి ఉన్న తాత్విక ఆలోచనలను ఎలా కలిగి ఉంటాయో ఇది నిర్వచిస్తుంది. మతం మాత్రమే తత్వశాస్త్రంతో ముడిపడి ఉందన్నది హిందుత్వ అభిప్రాయం. వాస్తవానికి ఋగ్వేదం రాయకముందే, రామాయణ, మహాభారతాలు రాయకముందే వ్యవసాయ తత్వశాస్త్రం ఆధ్యాత్మిక తత్వశాస్త్రం కంటే లోతుగా ఇక్కడ పాతుకుని ఉంది.

వ్యవసాయదారులను శూద్ర బానిసలుగా అణచివేయడం ద్వారా వేదవాదులు వ్యవసాయవాద తత్వాన్ని కూడా అణచివేశారు. పైగా వ్యవసాయ వ్యతిరేక తాత్విక ఆలోచనా ధోరణి కొనసాగింది.

అయితే, భారతీయ వ్యవసాయ విధానంపై చాలా కొత్త అధ్యయనాలు జరగాల్సి ఉంది. వ్యవసాయం మానవ మనుగడకు జీవనాధారం కాబట్టి దీనికి వైదికం, వేదాంతం, ద్వైతం, అద్వైతం కంటే ఉన్నతమైన హోదా ఇవ్వాలి. మనం ఒక సృజనాత్మక దేశంగా మనుగడ సాగించడానికి వ్యవసాయవాదం వంటి గొప్ప తాత్విక ధోరణులను తిరిగి ప్రోత్సహించాలి. వ్యవస్థీకృత మతాలు ఒకప్పుడు ఇప్పుడు మనం చూస్తున్నట్లుగా లేవు. అనేక శతాబ్దాల తరువాత అవి ఉండక పోవచ్చు. కానీ ఈ భూమిపై మానవ జీవితం ఉన్నంత కాలం ఉత్పత్తి, పంపిణీ తత్వశాస్త్రం మానవ జీవితంలో భాగంగా ఉంటుంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త
(డిసెంబర్ 8న గుంటూరులో 'ద శూద్ర రెబెలియన్' ఆవిష్కరణ)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆత్మ లేదా?



ముస్లింల మసీదులపై వివాదాలు, ఇళ్లపై బుల్డోజర్లు, దుకాణాలపై బ్యానర్లు–పోస్టర్లతో నిరసనలు! ఈ అరాచకత్వపు నగ్ననృత్యం ఎంతకాలం సాగుతుంది? ఈ దేశం, సమాజం ఆత్మ చచ్చిపోయిందా?

– అర్ఫా ఖానమ్ షేర్వానీ, జర్నలిస్ట్

వాస్తవిక చరిత్ర



పెట్టుబడిదారీ విధానపు చరిత్ర అంతా, తమ అదృష్టాన్ని ప్రతిభగా భావించే వ్యవస్థాపకులతో నిండి ఉంది. కానీ వారు లేచిన దానికంటే వేగంగా పడిపోయారు. వాస్తవం క్రూరమైనది.

– అనింద్యో చక్రవర్తి, జర్నలిస్ట్

కాలం కఠినం



పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్‌ను కాపాడటం కోసం తన 17,000 మంది సైనికులను కోల్పోయిన ఇండియా ఇప్పుడు అదే బంగ్లాదేశ్‌కు శత్రువు. కోటి మందికి వసతి, ఆహారం, దుస్తులు ఇచ్చిన ఇండియా ఇప్పుడు శత్రువు. ముప్పై లక్షల మంది బంగ్లాదేశీయులను చంపి, రెండు లక్షల మంది మహిళల మీద అత్యాచారాలు జరిపిన పాకిస్తాన్ ఇప్పుడు మిత్రదేశం.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

ద్వంద్వ ప్రమాణాలు



బంగ్లాదేశ్‌లోని హిందువుల విషయమేమో ఆ దేశపు అంతర్గత వ్యవహారం. మనం మన సొంత దేశం మీద దృష్టి పెట్టాలి! పాలస్తీనా ముస్లింల విషయానికొస్తే, అది ప్రపంచ మానవ హక్కుల ఆందోళన; మనం కూడా ఆ దురాగతాలకు వ్యతిరేకంగా గొంతెత్తాలి.

– ఒమర్ ఘాజీ, రచయిత

పాటించాల్సిందే!



మీకోసం మీరు ఒక నియమాన్ని రూపొందించుకున్నప్పుడు, ఏది ఏమైనా దాన్ని పాటించి తీరండి. ఒక్కసారి ఉల్లంఘిస్తే గనక అది మళ్లీ మళ్లీ ఉల్లంఘనకు గురవుతూనే ఉంటుంది.

– అరుణ్ బోత్రా
పోలీస్ అధికారి

వైజ్ఞానిక వేగుచుక్కలు - 18

తొలి భారతీయ ఉమన్ సర్జన్ జనరల్

ఆర్ట్స్ విభాగంలో బీఏ చదివిన తరువాత ఆధునిక వైద్య విద్యనభ్యసించి దానిలోనూ పట్టా పొందిన తొలి భారతీయ మహిళ మేరీ పూనెన్ లుకోజ్. ఆమె ట్రావెన్కోర్ ప్రెసిడెన్సీలో విధాన సభకు ఎన్నికైన తొలి మహిళగా, ఆ సంస్థానంలో వైద్య పరంగా సర్వతోముఖంగా కృషిచేసిన నాయకురాలుగా చాలా ప్రత్యేకతలు సొంతం చేసుకున్నారు. ట్రావెన్కోర్ సంస్థానంలో కొట్టాయం దగ్గరుండే అయ్మనంలో 1886లో ఆమె జన్మించారు. ఆమె తండ్రికూడా వైద్యుడే. 1909లో మద్రాసు విశ్వవిద్యాలయంలో తొలి (బీఏ) మహిళా పట్టభద్రురాలయ్యారు. తర్వాత లండన్ విశ్వవిద్యాలయంలో చేరి ఎంబీబీఎస్ చేశారు (1915). పిమ్మట డబ్లిన్ లోని రోటండ హాస్పిటల్‌లో అబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీలో స్నాతకోత్తర పట్టాను పొందారు. ప్రపంచంలోనే పీడియాట్రిక్స్‌లో తొలి బోధనా సంస్థ (లండన్)లో అడ్వాన్స్ ట్రెనింగ్ కూడా పూర్తి చేశారు. మొదటి ప్రపంచ యుద్ధం కారణంగా కొంతకాలం రాలేక పోవడంతో లండన్ లోనే కొన్ని ఆసుపత్రులలో పనిచేశారు.



మేరీ పూనెన్ లుకోజ్

1916లో తిరువనంతపురం తిరిగి వచ్చిన తర్వాత, అక్కడే తైకాడ్ ప్రాంతంలోని ఉమెన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో అబ్‌స్టెట్రీషియన్ ఉద్యోగంలో చేరారు. 1917లో న్యాయవాది కె.కె.లుకోజ్‌తో వివాహమైంది. తర్వాతి కాలంలో ఆయన ట్రావెన్కోర్ హైకోర్టు జడ్జి అయ్యారు.

తొలుత స్థానిక స్థాయిలో మద్దతు సంపాదించడానికి తైకాడ్ ఆసుపత్రిలోనే మేరీ మంత్రసానులకు ఒక శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. 1920లో ట్రావెన్కోర్ సంస్థానంలో తొలి సిజేరియన్ చికిత్సను ఆమె హరికేన్ లాంతర్ల సాయంతో నిర్వహించారు. క్రమంగా పదోన్నతి పొందుతూ 1924 నాటికి ఆ సంస్థానం తొలి మహిళా సర్జన్ జనరల్ అయ్యారు. అలా మొత్తం భారతదేశంలోనే ఆమె తొలి మహిళా సర్జన్ జనరల్ అయ్యారు.

1922లో ట్రావెన్కోర్ విధానసభ సభ్యులై పదిహేనేళ్ల పాటు సేవలు అందించారు. 1942లో గరల్స్ గైడ్ మూమెంట్ సంబంధించి మన దేశపు ప్రధాన కమిషనర్‌గా కూడా సేవలందించారు. అలాగే రేడియం వార్డు, డీప్ ఎక్స్‌రే యూనిట్, రేడియం ఇనిస్టిట్యూట్ వంటివి తిరువనంతపురంలో రావడానికి తోడ్పడ్డారు. వీటికి తోడు నాగర్ కోయిల్‌లో టీబీ ఆసుపత్రిని ప్రారంభించారు. సంస్థానంలో చాలా చోట్ల గ్రామీణులకు, అనాథలకు, మారుమూల ప్రాంతాలకు ఉచిత వైద్య సేవలందించే డిస్పెన్సరీలు రావడానికి దోహదపడ్డారు. ఆమె సేవలకు 1975లో భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ఇచ్చి సత్కరించింది. 90 ఏళ్ల వయసులో అంటే 1976 అక్టోబర్ 2న కన్నుమూశారు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్, ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

బ్రిక్స్‌పై సుంకాల వల్ల అమెరికాకే ముప్పు

అభిప్రాయం



బుడ్డిగ జమిందార్

అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన ట్రంప్, 'తాను 2025 జనవరి 20న అధికారం చేపట్టిన వెంటనే అమెరికాతో వాణిజ్యం చేస్తున్న మూడు అగ్రభాగ దేశాలైన చైనా, కెనడా, మెక్సికోలపై భారీ సుంకాలను విధిస్తానని' చెప్పారు. చైనాపై ఇప్పటి వరకూ ఉన్న 60 శాతం సుంకాలతో పాటుగా అదనంగా 10 శాతం, కెనడా, మెక్సికోలపై 25 శాతం సుంకాలను విధిస్తానని ప్రకటించారు. అమెరికా సరిహద్దు వెంబడి అక్రమ మాదక ద్రవ్యాలు సరఫరా అవుతున్నాయనీ, అనధికార వలసదారుల ప్రవేశానికి ప్రతిస్పందనగా తాజా చర్యలు తీసుకోబోతున్నాననీ నవంబరు 26 నాడు ప్రకటించారాయన. తాజాగా నవంబరు 30న ఏకంగా బ్రిక్స్ దేశాలపై 100 శాతం సుంకాలను విధిస్తానని ప్రపంచం విస్తుపోయేలా ప్రకటించారు. 'బ్రిక్స్ దేశాలు (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా, ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ దేశాలు) డాలరుకు దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తూ, ప్రత్యామ్నాయ కరెన్సీకి కృషి చేస్తే... బ్రిక్స్ దేశాలు అద్భుతమైన, శక్తిమంతమైన అమెరికా ఆర్థిక వ్యవస్థతో వాణిజ్య సంబంధాలకు వీడ్కోలు చెప్పాలి. డాలరును వ్యతిరేకించనవే నిబద్ధత ఈ దేశాల నుంచి మా కవసరం' అని ట్రంప్ సోషల్ మీడియాలో రాశారు.



రష్యాలోని కజాన్‌లో 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం

2023లో ప్రపంచ దేశాలతో మొత్తం 773 బిలియన్ల (77,300 కోట్ల డాలర్లు) వాణిజ్య లోటుతో అమెరికా ఆర్థిక వ్యవస్థ జబ్బుపడి ఉంది. కేవలం బ్రిక్స్ దేశాలతోనే 43,350 కోట్ల డాలర్ల వాణిజ్య లోటును అమెరికా కల్గి ఉంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ చైనాతో 279 బిలియన్లు (27,900 కోట్ల డాలర్లు), మెక్సికోతో 15,200 కోట్ల డాలర్లు, చిన్న దేశమైన వియత్నాంతో 10,400 కోట్ల డాలర్ల వాణిజ్యలోటును కలిగి తన కృత్రిమ డాలరు మారకపు విలువతో పబ్బం గడుపుకుంటోంది.

బ్రిక్స్ దేశాల నుంచి దిగుమతులను నిషేధిస్తే... ఆ దేశాలు అమెరికాకు ఎగుమతి చేసే తయారీ వస్తువులను వర్తమాన దేశాలకు, యూరప్‌కు మళ్లించే అవకాశాలుంటాయి. అమెరికాలోని వస్తు ఉత్పత్తి రంగం వెనుకబడి ఉంది. స్వదేశీ డిమాండును ఇప్పుడున్న అమెరికాలోని పరిశ్రమలు తీర్చలేవు. అందువల్ల వస్తు ధరలు విపరీతంగా పెరగవచ్చు. బ్రిక్స్ దేశాలు కొత్త మార్కెట్లను వెతుక్కుంటే అమెరికా ఆర్థిక వ్యవస్థ తిరోగమనం దిశకు మరలవచ్చు. డాలరు ఏకఛత్రాధిపత్యం కోసం అమెరికా తీసుకొంటున్న చర్యలకు ప్రత్యామ్నాయంగా ఇప్పటికే 3 దశాబ్దాల నుండి యూరో కరెన్సీని ఐరోపా యూనియన్ ప్రవేశపెట్టింది. చైనా, రష్యాలు పరస్పరం తమ కరెన్సీలతోనే వాణిజ్యం చేసుకొంటున్నాయి.

2వ ప్రపంచ యుద్ధంలో నష్టపోని అమెరికా ఆయుధ అమ్మకాలతో విపరీతమైన బంగారు నిల్వలను పోగు చేసుకొంది. 1944 జులై నుంచి 'బ్రెట్టిన్ ఉడ్ సిస్టమ్స్' అనే అంతర్జాతీయ ద్రవ్యసంస్థను ఏర్పాటు చేసుకుంది. దాని ద్వారా 44 దేశాల మద్దతుతో డాలరును అంతర్జాతీయ రిజర్వు కరెన్సీగా ఏర్పాటు చేసుకొని 1971 వరకూ బంగారం ఆధారిత డాలరుగా కొనసాగించింది. వాస్తవానికి తన వద్దనున్న బంగారు నిల్వలకు పొంతన లేకుండా డాలరు నోట్లను ముద్రించుకొంటూ ఆధిపత్యం చలాయించింది. ప్రస్తుతం అమెరికా వద్ద 8,133.46 టన్నుల బంగారు నిల్వలున్నాయి. ఈ నిల్వలను అమ్మితే వచ్చే 69,100కోట్ల డాలర్లతో అమెరికా సుమారు 36 లక్షల కోట్ల రుణాలను ఎలా తీరుస్తుంది?

1971 మేలో జర్మనీ డాలరుతో తెగతెంపులు చేసుకొని బ్రెట్టిన్ ఉడ్ సిస్టమ్స్ నుంచి బయటపడిన 3 నెలల్లోనే అనూహ్యమైన ఆర్థిక పురోభివృద్ధి సాధించింది. డాలరుతో పోల్చుకొంటే జర్మన్ మార్కు 7.5 శాతం వృద్ధి రేటు సాధించింది. వెనువెంటనే ప్రపంచ దేశాలన్నీ డాలరు విలువను బంగారం విలువతో సరిపెట్టమని డిమాండు చేశాయి. స్విట్జర్లాండ్, ఫ్రాన్స్‌లు జర్మన్ బాటలో పయనించటంతో తీవ్ర ఒత్తిడికి లోనైన అమెరికా బ్రెట్టిన్ ఉడ్ సిస్టమ్స్ ఆధిపత్యాన్ని కోల్పోయింది. 1971లో (ప్రెసిడెంట్ నిక్సన్ షాక్‌గా పిలవబడే) బంగారు నిల్వతో డాలరు విలువను రద్దు చేసుకొని నేటి 'డాలర్ ఫియట్ ఫ్లోటింగ్' విధానాన్ని ప్రవేశపెట్టింది.

ప్రస్తుతం ట్రంప్ విధిస్తానన్న వాణిజ్య ఆంక్షలతో బ్రిక్స్ కరెన్సీ ఏర్పడి... రానున్న కాలంలో డాలర్, యూరోలతో పోటీపడినా ఆశ్చర్యపోనవసరంలేదు. అదీ గాక రష్యా, చైనా, భారత్ దేశాలు వాణిజ్యపరంగా ఐక్యమైతే ప్రపంచ దిశనే మార్చే అవకాశం ఉంది. ఒకప్పటి ప్రపంచాన్ని తమ కరెన్సీలతో ఆధిపత్యం చలాయించిన దేశాలన్నీ ఇప్పుడు అత్యంత బలహీనమైన ఆర్థికదేశాలుగా మిగిలాయి. అమెరికా కూడా ఈ తరహా దేశంగా మిగులుతుందని ట్రంప్ భయం. పరిస్థితులను పసిగట్టిన ట్రంప్ వాణిజ్య సుంకాలతో ఈ కృత్రిమ డాలరు విలువను నిలబెట్టాలని అనుకుంటున్నారు.

వ్యాసకర్త కె.ఎల్. యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ | 9849491969

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

అరిషడ్వర్గాలపై గెలుపు

ఆధ్యాత్మిక సాధనలో ప్రగతికి అడ్డుపడే, సామాన్య మానవుని జీవన గమనాన్ని సైతం నిరోధించే శత్రువులు 'అరిషడ్వర్గాలు'. అవే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు. సంక్షిప్తంగా కామం అంటే... ఇది కావాలి, అది కావాలి అని తాపత్రయ పడటం, అవసరాలకు మించిన కోరికలు కలిగి ఉండటం! క్రోధం అంటే కోరిన కోరికలు నెరవేరనందుకు చింతిస్తూ, తన కోరికలు నెరవేరనందుకు ఇతరులే కారకులని వారిపై ప్రతీకారం తీర్చుకోవాలని ఉద్రేకంతో నిర్ణయాలు తీసుకోవటం. లోభం అంటే కోరికతో తాను పొందినది తనకే దక్కాలని, ఇతరులకు చెందగూడదనే భావం కలిగి ఉండటం. మోహం అనగా తాను కోరినది కచ్చితంగా తనకే కావాలనీ, ఇతరులు పొందకూడదనీ అతి వ్యామోహం కలిగి ఉండటం. మదం అనగా తాను కోరిన కోరికలన్నీ తీరటానికి కారణం తన గొప్పతనమే నని గర్విస్తూ ఇతరులను లెక్కచేయక పోవటం. మాత్సర్యం అనగా తాను కల్గి ఉన్న సంపదలు ఇతరులకు ఉండకూడదనే, దక్కకూడదనే ఈర్ష్య కలిగి ఉండటం. మనలోనే ఉన్న ఈ ఆరింటినీ జయించటం చాలా కష్టం. ఈ ఆరింటినీ జయించిన వాడే నిజమైన యోగి!



ఈ అరిషడ్వర్గాలు అజ్ఞానం వల్ల కలుగుతున్నాయి. అజ్ఞానం నశిస్తే ఇవన్నీ నశిస్తాయి. దీనికి ఆత్మ సాక్షాత్కారం/ ఆత్మజ్ఞానం కలిగివుండటం ఒక్కటే మార్గం. అన్ని జీవరాశులలో ఉండేది ఒకటే ఆత్మ! అందరి ప్రాణం ఒకటే! మనకున్న అవసరాలే ఎదుటివాడికి కూడా ఉంటాయని తెలియటం ఆత్మజ్ఞానం కలగటానికి మొదటి మెట్టు! ఈ మొదటి మెట్టు ఎక్కితే, తర్వాత మెట్టు– ఎదుటివాడు కూడా నాలాంటి వాడే అని భావన కలుగుతుంది. ఈ మెట్టు కూడా ఎక్కితే, అందరూ ఒకటే అనే భావన కలుగుతుంది!

ఈ భావన కూడా కలిగిన తర్వాత, జీవులన్నింటిలో ఒకటే ఆత్మ ఉందనే భావన పొందొచ్చు! ఇదే ఆత్మ సాక్షాత్కారం! ఇది పొందటానికి అన్ని పరిత్యజించనవసరం లేదు. ఈ సంసారంలోనే తామరాకు మీద నీటి బొట్టులా ఉండటం నేర్చుకుంటే చాలు. ఇది సాధన ద్వారా సాధ్యపడుతుంది.

– సాక్షి

గ్రహం అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిరమాసం, తిథి: శు.షష్ఠి ఉ.9.26 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: ధనిష్ఠ ప.3.53 వరకు, తదుపరి శతభిషం, వర్జ్యం: రా.10.45 నుండి 12.13 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.07 నుండి 7.53 వరకు
అమృతఘడియలు: ఉ.5.47 నుండి 7.21 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.21, సూర్యాస్తమయం: 5.21.

కేసులు ఎత్తేస్తే.. భూములపై ఆలోచిస్తాం

- హకీంపేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో రైతులు



హకీంపేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

దుద్యాల్: పారిశ్రామికవాడ ఏర్పాటుపై దుద్యాల తహసీల్దార్ కిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హకీంపేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ పారిశ్రామిక వాడ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని భావిస్తోందన్నారు. ఈ అంశంపై అభిప్రాయాలు చెప్పాలని సూచించారు. దీనిపై స్థానికులు స్పందిస్తూ.. తమపై అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకుంటే భూములు ఇచ్చే విషయాన్ని ఆలోచిస్తామని చెప్పారు. మరికొందరు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏం పెట్టాలనుకున్నా పట్టా భూములను మాత్రం ఇచ్చేది లేదన్నారు. హకీంపేట్‌లోని 351 ఎకరాల ప్రభుత్వ భూమి, 146.34 పట్టా భూముల సేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ప్రభుత్వం సేకరించే భూమిలో చాలామంది రైతులు కబ్జాలో ఉన్నా.. పట్టాదార్ పాస్‌పుస్తకాలు లేవని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్ మాట్లాడుతూ కబ్జాలో ఉన్న వారందరికీ పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రైతులు అందించిన వినతిపత్రాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్ బాబు, ఆర్‌ఐ వీరశంకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌కోకు 'ఎల్‌డీసీ ఎక్సలెన్స్' అవార్డు

- 14న ఇండోర్‌లో ప్రదానం
- సంస్థకు డిప్యూటీ సీఎం భట్టి అభినందనలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సరఫరా సంస్థ (టీజీ ట్రాన్స్‌కో)కు చెందిన లోడ్ డిస్పాచ్ సెంటర్‌కు ప్రతిష్టాత్మక జాతీయ 'ఎల్‌డీసీ ఎక్సలెన్స్ అవార్డు–2024'లభించింది. నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (గ్రిడ్ ఇండియా), ఫోరమ్ ఆఫ్ లోడ్ డిస్పాచర్స్ (ఎఫ్‌ఓఎల్‌డీ) ఈ అవార్డును ప్రకటించాయి. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ విషయాన్ని వెల్లడించారు. శుక్రవారం ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి ఉత్తమ పద్ధతులు అమలు చేయడం, ఆధునిక సాంకేతికతను వాడడంవల్ల ఈ అవార్డు సాధ్యమైందన్నారు. రాష్ట్ర విద్యుత్ రంగానికి ఇది మరో గౌరవమన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక, ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ భాస్కర్, విద్యుత్ సంస్థల అధికారులను డిప్యూటీ సీఎం అభినందించారు. కాగా, ఈ అవార్డును ఈనెల 14వ తేదీన ఇండోర్‌లో జరిగే జాతీయ విద్యుత్ వ్యవస్థ సదస్సులో ప్రదానం చేస్తారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి బెయిల్ మంజూరు

సిటీ కోర్టులు: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి బెయిల్ మంజూరైంది. బుధవారం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన అనుచరులతో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వాగ్వాదానికి దిగడమే కాకుండా పోలీస్ వాహనానికి తన కారును అడ్డుగా పెట్టి తన విధులకు ఆటంకం కలిగించారని ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఫిర్యాదు చేయగా కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో కౌశిక్‌రెడ్డి తరపు న్యాయవాదులు జక్కుల లక్ష్మణ్, కిరణ్ నాంపల్లి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసి శుక్రవారం వాదనలు వినిపించారు. అనంతరం 3వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు రూ.5 వేలతో రెండు పూచీకత్తులు తీసుకొని బెయిల్ మంజూరు చేసింది. అనంతరం కేసు విచారణను ఫిబ్రవరి 2కు వాయిదా వేస్తున్నట్టు కోర్టు తెలిపింది.

గన్‌మన్ జాడెక్కడ?

- ఎస్సై హరీశ్ విషయంలో కీలక ఆధారాలు అతని వద్దే?

ములుగు: ములుగు జిల్లా వాజేడు ఎస్సై హరీశ్ అనుమానాస్పద ఆత్మహత్యపై పలు రకాల ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ కేసులో కీలక వ్యక్తిగా భావిస్తున్న గన్‌మన్ అందుబాటులో లేకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. కేసును ఛేదించేందుకు వెంకటాపురం(కె) సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో వాజేడు కేంద్రంగా పూర్తిస్థాయి సమాచారం రాబట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికే ఆత్మహత్య అనంతరం సంఘటనా స్థలం నుంచి క్లూస్ టీమ్ సభ్యులు ఎస్సై హరీశ్‌కు సంబంధించిన రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయన ఆత్మహత్య చేసుకోవడానికి ముందు మాట్లాడిన సూర్యాపేట జిల్లా పరిధి చిలుకూరు మండలానికి చెందిన యువతి ఫోన్‌కాల్ లిస్టుపైన మదింపు జరుగుతున్నట్లుగా సమాచారం. ఇదంతా పోలీసు శాఖ పరిధిలో సాఫీగానే జరుగుతున్నా.. వాజేడు ఎస్సైగా హరీశ్ బాధ్యతలను స్వీకరించిన నాటి నుంచి అతను ఆత్మహత్య చేసుకునే వరకు ఎస్‌ఐతో ఉన్న గన్‌మన్ మరుసటి రోజు నుంచి అందుబాటులో లేకపోవడంపై పలు అనుమానాలకు దారితీస్తోంది. సంచలనంగా మారిన ఈ కీలక కేసులో గన్‌మన్‌కు పోలీస్ ఉన్నతాధికారులు సెలవు ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. వివాదాస్పద కేసు వివరాలను బయట పెడతాడని అధికారులు అతడిని సెలవుపై పంపించారా? లేక అతడిని కూడా విచారిస్తున్నారా? అన్న చర్చ జరుగుతోంది. ఘటన జరిగి ఐదు రోజులు గడుస్తున్నా పోలీస్ శాఖ తరఫున అధికారికంగా ఎలాంటి ప్రకటన ఇంతవరకు రాకపోవడం గమనార్హం.

మావోయిస్టు మల్లయ్య మృతదేహం అప్పగింత

- నా భర్త శరీరంపై ఒక్క బుల్లెట్ గాయం లేదు: మల్లయ్య భార్య మీనా
- ప్రభుత్వ వాహనం వద్దని ప్రైవేట్ అంబులెన్స్‌లో తరలింపు



ప్రభుత్వ అంబులెన్స్‌లో నుంచి ప్రైవేట్ అంబులెన్స్‌లోకి మల్లయ్య మృతదేహాన్ని ఎక్కిస్తున్న కుటుంబ సభ్యులు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక అడవుల్లో ఈ నెల 1న జరిగిన ఎన్‌కౌంటర్‌లో చని పోయిన మావోయిస్టు నేత మల్లయ్య అలియాస్ మధు మృతదేహాన్ని పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు అంబులెన్స్‌ను సమకూర్చి తరలిస్తుండగా మల్లయ్య కుటుంబసభ్యులు, ప్రజాస్వామికవాది ఎరకల రాజన్న తదితరులు సీఐ బండారు కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. పోస్టుమార్టం నుంచి మృతదేహాన్ని తరలిస్తుండగా అడ్డుకొని మల్లయ్య బంధువులు తెచ్చిన అంబులెన్సులోకి షిఫ్ట్ చేసి తీసుకెళ్లారు.

ఇది బూటకపు ఎన్‌కౌంటరే

తన భర్త మధుది బూటకపు ఎన్‌కౌంటరే అని అతని భార్య మీనా ఆరోపించారు. హైకోర్టు సూచన మేరకు శుక్రవారం న్యాయవాది, మీనా, కుటుంబసభ్యులు, తహసీల్దార్ సమక్షంలో మృతదేహ పరిశీలన, వీడియో, ఫొటోలు చిత్రీకరించే వెసులుబాటు కలిపించారు. పోస్టుమార్టం గదిలో మృతదేహాన్ని క్షుణ్ణంగా మీనా పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మధు శరీరంపై ఒక్క తూటా గాయం కూడా లేదన్నారు. తల పగులగొట్టి చిత్రహింసలు పెట్టి చంపేశారని ఆరోపించారు. మంత్రి సీతక్క ఆదివాసీ బిడ్డ అయినా, ఆదివాసీల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. హైకోర్టు న్యాయవాది దశరథ్ మాట్లాడుతూ 'మధు మృతదేహంపై పలుచోట్ల గాయాలు ఉన్నాయి. ఆయన మృతిపై అనుమానంగా ఉంది. ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టులు వస్తే నిజం తెలుస్తుంది. మధు ఎన్‌కౌంటర్ విషయాన్ని కోర్టు ద్వారా తేల్చుకుంటాం' అని తెలిపారు.

'ఫోన్ పే' పట్టించింది

- రాయపర్తి ఎస్‌బీఐలో బంగారం చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్
- కారులో పెట్రోల్ కోసం నాందేడ్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో యూపీఐ చెల్లింపులు
- తెలంగాణ, మహారాష్ట్ర మీదుగా నకిలీ కారు నంబర్‌తోనే ప్రయాణం చేసిన దొంగలు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ సీపీ అంబర్‌కిశోర్ ఝా. (ఇన్‌సెట్‌లో) స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

సాక్షి, వరంగల్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో 19 కిలోల బంగారం చోరీ కేసులో ముగ్గురు నిందితులను వరంగల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. గత నెల 18వ తేదీ అర్ధరాత్రి చోరీ చేసిన ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన ఏడుగురు సభ్యులతో కూడిన ముఠా కారులో వరంగల్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లి అక్కడి నుంచి మహారాష్ట్ర వెళ్లినట్టుగా పోలీసులు గుర్తించారు. నాందేడ్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో ఇంధనం కోసం ఫోన్ పే ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు చేయడంతో ఆ ఫోన్ నంబర్ ఆధారంగా ఈ కేసును ఛేదించగలిగారు. తమపైన పోలీసుల నిఘా ఉందని తెలియడంతో తిరిగి తెలంగాణకు వచ్చిన వీరిని చాకచక్యంగా పట్టుకొని 2.520 కిలోల బంగారు ఆభరణాలు, ఒక కారు, రూ.పదివేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

రాజమండ్రిలోనే కుదిరిన స్నేహం

యూపీకి చెందిన మహమ్మద్ నవాబ్ హసన్, సాజిద్ ఖాన్‌లు అన్నదమ్ములు. వీరికి సమీప గ్రామస్తులైన అర్షాద్ అన్సారీ, షాబీర్‌ఖాన్ అలియాస్ బోలెఖాన్‌లు స్నేహితులు. ఓ దొంగతనం కేసులో మహ్మద్ నవాబ్ హసన్, సాజిద్ ఖాన్‌లు రాజమండ్రి జైలుకు వెళ్లారు. ఈ సమయంలోనే మహారాష్ట్రకు చెందిన హిమాన్షు బిగాం చండ్ జాన్వర్, సాగర్ భాస్కర్ గోర్, అక్షయ్ గజానన్ అంబోర్‌లతో పరిచయం ఏర్పడింది. 2024, ఫిబ్రవరి 8న కాకినాడ జిల్లా పత్తిపాక ఎస్‌బీఐ బ్యాంక్‌లో రూ.30 లక్షల నగదు, కోటిన్నర విలువ చేసే బంగారం దోచుకెళ్లారు. సరిగ్గా 40 రోజుల క్రితం కర్ణాటకలోని ఓ ఎస్‌బీఐ బ్యాంక్ లో రూ12.95 కోట్ల విలువైన బంగారం దోచుకెళ్లారు. ఆ తర్వాత గత నెల 19న గూగుల్ మ్యాప్ ద్వారా రాయపర్తి ఎస్‌బీఐ లొకేషన్ గుర్తించడంతోపాటు అక్కడ భద్రతా సిబ్బంది లేకపోవడాన్ని రెక్కీ చేసుకొని నిర్ధారించుకున్నాకే దొంగతనం చేశారు.

రెండున్నర కిలోల బంగారం, కారు స్వాధీనం : వరంగల్ సీపీ

బంగారం చోరీ కేసులో ముగ్గురిని అరెస్టు చేశామని, మరో నలుగురి కోసం గాలిస్తున్నామని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. వీరి నుంచి 2 కిలోల 520 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు మహమ్మద్ నవాబ్ హసన్ రాయపర్తి మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంక్ చోరీ అనువైనదిగా గుర్తించిన తర్వాతే ఈ బ్యాంక్‌లో బంగారం ఎత్తుకెళ్లారన్నారు. నవంబర్ 19న నిందితులు 3 బృందాలుగా విడిపోయి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌కు తిరిగివెళ్లిపోయారు. ఈ భారీ చోరీపై అప్రమత్తమై వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నేతృత్వంలోని వర్ధన్న పేట ఏసీపీ నర్సయ్య, సీసీఎస్ ఏసీపీ భోజరాజు, నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో పదికిపైగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల పట్టుకున్నామని సీపీ కిశోర్ ఝా తెలిపారు. అరెస్టయిన వారిలో అర్షాద్ అన్సారీ, షాబీర్ ఖాన్ అలియాస్ బోలెఖాన్, హిమాన్షు బిగాం చండ్ జాన్వర్ ఉన్నారు.

కీలక నిందితుడు..కేసీఆర్‌కు సన్నిహితుడు

- రాధాకిషన్‌రావుకు బెయిల్ ఇవ్వడం సరికాదు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో హైకోర్టులో పీపీ వాదనలు
- పదవీ విరమణ పొందిన వ్యక్తి ఆదేశాలెలా జారీ చేస్తారన్న పిటిషనర్ తరపు న్యాయవాది

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో రాధాకిషన్‌రావు కీలక నిందితుడని, బీఆర్‌ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావుకు సన్నిహితుడని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు హైకోర్టులో వాదనలు వినిపించారు. ఫోన్లు ట్యాప్ చేసి వాటి ఆధారంగా పలువురిని బెదిరించి నిధులు వసూలు చేశారన్నారు. కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు కవిత, వెంట్రామిరెడ్డిలను తరచూ కలిసే వారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోతుందని తెలిసి సమాచారమంతా ధ్వంసం చేశారని వెల్లడించారు. నిందితులు ప్రభాకర్‌రావు, శ్రవణ్ కుమార్ ఇంకా పరారీలోనే ఉన్నారని, ఈ దశలో బెయిల్ ఇవ్వడం సరికాదన్నారు. అయితే 2023 అక్టోబర్‌లో పదవీ విరమణ పొందిన రాధాకిషన్‌రావు కింది స్థాయి అధికారులకు ఎన్నికల సమయంలో ఎలా ఆదేశాలు జారీ చేస్తారని ఆయన తరపు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు ప్రశ్నించారు. రాజకీయ దురుద్దేశంలో భాగంగానే ఈ కేసులో ఇరికించాలని చూస్తున్నారని, ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాధాకిషన్‌రావుకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. వాదనల అనంతరం న్యాయస్థానం తీర్పు రిజర్వు చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రాధా కిషన్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. ఇతర నిందితులు ఇచ్చిన తప్పుడు వాంగ్మూలం ఆధారంగా తనను అరెస్టు చేశారని, సీనియర్ సిటిజన్ అయిన తను మార్చి నుంచి జైల్లో ఉంటున్నానని తెలిపారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన శుక్రవారం విచారణ చేపట్టారు.

ఇంత వరకు ఒక్క బాధితుడూ లేడు..

'ఎలక్ట్రానిక్ డివైస్‌లోని డేటా పూర్తిగా తొలగించడం సాధ్యం కాదు. డిలీట్ చేసినా హార్డ్‌డిస్క్‌లో ఉంటుంది. గత ప్రభుత్వ పెద్ద ఫోన్ ట్యాపింగ్ వెనకున్నారని పోలీసులు చెబుతున్నా అది ఎవరో పేర్కొనలేదు. బెదిరింపులతో ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్ చేరిన వారుగానీ, తమ వద్ద డబ్బు వసూలు చేశారని చెప్పిన బాధితులుగానీ ఎవరూలేరు. పోలీసులు ఏదో ఒక కథ అల్లి ఆ మేరకు కేసు నడిపిస్తున్నారు..' అని ఉమామహేశ్వర్‌రావు వాదించారు. పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. 'బీఆర్‌ఎస్ అధినేత, అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాధాకిషన్‌రావు కాంగ్రెస్‌కి చెందిన ప్రముఖుల ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. ప్రతిపక్ష పార్టీల నేతలతో పాటు కీలక అధికారులు, న్యాయమూర్తుల ఫోన్లను ట్యాప్ చేశారు. 15 రోజుల్లో దాదాపు 4,500 ఫోన్లు ట్యాప్ చేశారంటే, పదేళ్లలో ఎన్ని ఫోన్లు ట్యాప్ చేశారో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం ఆయన పదవీ కాలాన్ని రెండుసార్లు పొడిగించింది..' అని చెప్పారు. అనంతరం న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు.

పెద్దపల్లి ఎంపీ ఎన్నికపై హైకోర్టులో పిటిషన్

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన పులిపాక రాజుకుమార్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నామినేషన్ దాఖలు చేశారు. అయితే, తన నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారని పేర్కొన్నారు. ఈక్రమంలో ఎంపీ ఎన్నిక కూడా చెల్లదంటూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి, ఎంపీ వంశీ, ఈసీని బాధ్యులను చేస్తూ స్వతంత్ర అభ్యర్థి అయిన రాజుకుమార్ పిటిషన్ వేశారు.

ఊరు కాదిది... నా కుటుంబం!

సొంతూరిలో రాష్ట్రపతి ఉద్వేగం

- ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు
- చిన్ననాటి గురువులకు వందనం

రాయ్‌రంగ్‌పూర్: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్వేగభరితమయ్యారు. తను పుట్టిన ఒడిశా రాష్ట్రం మయూర్‌భంజ్ జిల్లా ఉపర్‌బేడ గ్రామాన్ని శుక్రవారం ఆమె సందర్శించి, అక్కడి గిరిజన మహిళలతో కలిసి డ్యాన్స్ చేశారు. ఉపర్‌బేడ గ్రామాన్ని కేవలం ఒక ప్రదేశంగా తానెన్నడూ భావించలేదని, అదొక కుటుంబమని తన మూలాలను గుర్తు చేసుకుంటూ ఉద్వేగంతో అన్నారు. బమన్‌ఘటి సబ్ డివిజన్‌లోని ఉపర్‌బేడలోని సంతాలి కుటుంబంలో ముర్ము 1958 జూన్ 20న జన్మించారు. 2022 జూలై భారత ప్రథమ పౌరురాలు, రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించాక ఈ గ్రామానికి రావడం ఇదే మొదటిసారి. గ్రామానికి చేరుకున్న వెంటనే ఆమె తను చదువుకున్న ఉపర్‌బేడ అప్పర్ ప్రైమరీ స్కూలుకు వెళ్లారు. రాష్ట్రపతి రాకను పురస్కరించుకుని ఆ పాఠశాలతోపాటు యావత్తు గ్రామాన్ని అందంగా మార్చారు. గ్రామస్తులు, స్కూలు టీచర్లు, విద్యార్థులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. తను పుట్టిన ఇంటికి వెళ్లే దారిలో సంతాలి మహిళలు ఆమెకు గిరిజన సంప్రదాయ వస్త్రధారణతో జానపద నృత్యం చేస్తూ పాటలు పాడుతూ సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ముర్ము కూడా వారితో కాలు కదిపారు. గ్రామ దేవతకు పూజలు చేశారు.

నేనిప్పటికీ ఇక్కడి విద్యార్థినే...

స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ముర్ము విద్యార్థులతో ముచ్చటించారు. ''నాకిప్పుడు 66 ఏళ్లు. అయినా మా స్కూల్‌లో చిన్న విద్యార్థిననే అనుకుంటున్నా. అప్పట్లో మట్టిగోడలుండేవి. మా ఏడో తరగతిలో ఉండగా స్కాలర్‌షిప్ పరీక్ష కోసం మదన్ మోహన్ సార్ వాళ్లింటికి తీసుకెళ్లారు. తన సొంత పిల్లలతోపాటు నన్ను కూడా పరీక్షకు ప్రిపేర్ చేశారు. ఈ గ్రామం, ఈ స్కూలు నాకు అందించిన అభిమానం మరువలేనిది'' అంటూ ఉప్పొంగిపోయారు. తోటి వాళ్లు, ఉపాధ్యాయులు కూడా బయటి వ్యక్తిగా కాక, తనను సొంత కుటుంబసభ్యురాలిగా చూసుకునేవారన్నారు. 'ఆ రోజుల్లో లాంతరు వెలుగులో చదువుకునేదాన్ని. ఆ లాంతరు గ్లాస్ పగిలిపోయి ఉండేది. చదువుకోవడానికి ఇబ్బందయ్యేది. సిరా పెన్నుతో రాయడం కష్టంగా ఉండేది. ఇంకుతో బట్టలు పాడయ్యేవి'' అని గుర్తు చేసుకున్నారు.

గురువులకు వందనం

తనకు విద్య నేర్పిన గురువులను రాష్ట్రపతి ఘనంగా సన్మానించారు. స్కూల్ హెడ్‌మాస్టర్ బిశేశ్వర్ మహంత, క్లాస్ టీచర్ బాసుదేశ్ బెహెరె, 4, 5 తరగతుల్లో ఉండగా క్లాస్‌టీచర్ బసంత కుమార్ గిరిలను సన్మానించారు. ఉపర్‌బేడ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లోని సుమారు 200 మందికి స్కూల్ బ్యాగులు, చాకెట్లు, టిఫిన్ బాక్సులు అందజేశారు. కష్టపడి చదువుకుని, ఉన్నతస్థానాలకు ఎదగాలని వారిని కోరారు.




గురువుకు వందనం: బాల్యంలో తనకు చదువు చెప్పిన గురువును ఒడిశాలోని తన స్వగ్రామం ఉపర్‌బేడలో శాలువతో సత్కరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము


రాజ్యసభలో నోట్ల కలకలం

సింఘ్వీ సీటు వద్ద కరెన్సీ కట్ట

- తనిఖీల్లో గుర్తించారు: ధన్‌ఖడ్
- విచారణకు ఆదేశించినట్టు వెల్లడి
- నిరసనలతో హోరెత్తిన సభ
- సభ్యుని పేరెలా ప్రస్తావిస్తారు: ఖర్గే
- విపక్షాలు బదులివ్వాలి: బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: కరెన్సీ నోట్ల వ్యవహారం శుక్రవారం రాజ్యసభను కుదిపేసింది. అధికార, విపక్ష సభ్యుల వాగ్వాదం, మాటల యుద్ధంతో దుమారం రేగింది. పరస్పర విమర్శలతో వాతావరణం వేడెక్కింది. ఉదయం సభ సమావేశమవగానే చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మను సంఘ్వీ సీటు నుంచి రూ.500, రూ.100 నోట్ల కట్ట దొరికినట్టు ప్రకటించారు. ''గురువారం సభ వాయిదా పడ్డాక భద్రతా సిబ్బంది రోజువారీ తనిఖీలో 222 నంబర్ సీటు వద్ద నోట్ల కట్ట దొరికింది. అది తెలంగాణ నుంచి ఎంపికైన సంఘ్వీకి కేటాయించిన స్థానం. అవి అసలైనవో, నకిలీవో తెలియదు. నిబంధనల ప్రకారం దీనిపై విచారణకు ఆదేశించా. దీన్ని సభ ముందుంచడం నా బాధ్యత. కనుక మీ దృష్టికి తీసుకొస్తున్నా'' అని వివరించారు. ''అవి తమవేనని ఎవరైనా చెబుతారేమోనని చూశా. కానీ ఇప్పటికైతే ఎవరూ ముందుకు రాలేదు. ఇలా నోట్ల కట్టలను కూడా ఎక్కడో పెట్టి మర్చిపోయేన్ని డబ్బులున్నాయేమో మరి!'' అన్నారు. చైర్మన్ ప్రకటన సభలో తీవ్ర గందరగోళానికి దారితీసింది. కాంగ్రెస్ సభ్యులు ఏకంగా సభలోకే నోట్ల కట్టలు తెస్తున్నారంటూ బీజేపీ ఎంపీలు విమర్శలకు దిగారు. దీనిపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. పెద్దపెట్టున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. చైర్మన్ సింఘ్వీ పేరు చెప్పడాన్ని విపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుబట్టారు. విచారణ జరగకుండానే నేరుగా సభ్యుని పేరు బయట పెట్టి ఆయన గౌరవం తగ్గిస్తారా అంటూ ఆక్షేపించారు. అందులో తప్పేముందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ప్రశ్నించారు. ఏ సభ్యుని సీట్లో నోట్లు దొరికాయో చెబితే అభ్యంతరపెట్టడం ఎందుకన్నారు. ''ఇలా సభలోకి నోట్ల కట్టలు తేవడం సరికాదు. దీనిపై సమగ్ర విచారణ జరగాల్సిందే'' అన్నారు. పార్లమెంటులోకి రసాయనాలు వెంట పెట్టుకుని వచ్చిన ఉదంతాలను ధన్‌ఖడ్ గుర్తు చేశారు. ''అందుకే విద్రోహ నివారణ తనిఖీలు కఠినంగా జరగాలన్నది నా ఉద్దేశం. భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. ఆ కోణంలోనే పకడ్బందీగా రోజువారీ తనిఖీలు జరుగుతున్నాయి'' అని వివరించారు. ''సదరు సభ్యుడు గురువారం సభకు హాజరయ్యారు. ఆయన పేరు ప్రస్తావించినంత మాత్రాన విచారణపై ప్రభావమేమీ చూపదు'' అని చెప్పారు. ఇది సభ గౌరవ మర్యాదలకు సంబంధించిన విషయమని సభా నాయకుడు జేపీ నడ్డా అభిప్రాయపడ్డారు. ''దీనిపై విపక్ష సభ్యులు తలో అభిప్రాయం వెలిబుచ్చడం సరికాదు. అంతా ఒక్కతాటిపైకి వచ్చి దీన్ని ఖండిస్తూ తీర్మానం చేద్దాం'' అని సూచించారు. ''కొన్ని అంశాలపై చర్చ కోసం అత్యుత్సాహం చూపిస్తారు. ఇలాంటి కొన్ని అంశాలనేమో దాచేసే ప్రయత్నం చేస్తారు'' అంటూ విపక్షాలపై విమర్శలు గుప్పించారు. వాటిని ఖర్గే తీవ్రంగా ఖండించారు. ఆ అలవాటు అధికార పక్షానిదే తప్ప తమది కాదన్నారు. అధికార పక్ష ఎంపీలను కేంద్ర మంత్రులే తమపైకి ఉసిగొల్పుతున్నారని తిరుచ్చి శివ (డీఎంకే) ఆరోపించారు. ''వాటిని నేను కళ్లారా చూశాను. ఇది ఎంతవరకు సమంజసం?'' అని ప్రశ్నించారు. దాంతో సభలో మరింత గందరగోళం నెలకొంది. దర్యాప్తుకు తాము అడ్డుచెప్పడం లేదని ఖర్గే స్పష్టం చేశారు. సభలో ప్రత్యేకంగా చర్చ అవసరం లేదని మాత్రమే చెబుతున్నామన్నారు. ''ఈ రోజు నోట్లు దొరికాయి. రేపు ఇంకేమీ దొరుకుతాయో తెలియడం లేదు'' అని వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. దీనిపై లోతైన విచారణ జరగాల్సిందేనన్నారు. పరిస్థితి సద్దుమణిగాక జీరో అవర్ కొనసాగింది.





రాజ్యసభలో మాట్లాడుతున్న విపక్షనేత మల్లికార్జున ఖర్గే. శ్రద్ధగా వింటున్న చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్

గ్లాస్ సీలింగ్ వేయాలేమో: సింఘ్వీ



నోట్ల వ్యవహారంపై బీజేపీ చిల్లర రాజకీయాలు చేస్తోందని సింఘ్వీ మండిపడ్డారు. గురువారం రాజ్యసభకు వచ్చినప్పుడు తన వద్ద కేవలం ఒకే ఒక్క రూ.500 నోటుందని ఆయన స్పష్టం చేశారు. ''నేను మూడు నిమిషాలే సభలో ఉన్నా! మధ్యాహ్నం 12.57 గంటలకు సభలో ప్రవేశించా. ఒంటిగంటకే సభ వాయిదా పడింది. 1:30 దాకా క్యాంటీన్లో ఉండి వెళ్లిపోయా'' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ''ఇంకొకరి సీటు వద్ద నోట్ల కట్ట ఎలా వేస్తారు? ఇక్పై గంజాయి వంటివి కూడా పెడతారేమో. ఇక్పై సభ్యులు ఎవరి సీటుకు వారు వైర్ ఫెన్సింగో, గ్లాస్ సీలింగో ఏర్పాటు చేసి, దానికి తాళం వేసి కీస్ తమతోపాటు ఇంటికి తీసుకెళ్లాలేమో!'' అంటూ విమర్శలు గుప్పించారు. ''దీనిపై విచారణ జరగాలి. భద్రతా వైఫల్యముంటే ఆ విషయాలూ వెలుగులోకి రావాలి'' అని సింఘ్వీ డిమాండ్ చేశారు.

విపక్షాల నిరసన

న్యూఢిల్లీ: అదానీ, నోట్ల కట్ట తదితర ఉదంతాలపై విపక్ష సభ్యులు శుక్రవారం పార్లమెంటు ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. అదానీ అంశం నుంచి దృష్టి మళ్లించేందుకు బీజేపీయే నోట్ల కట్ట నాటకాన్ని తెరపైకి తెచ్చిందని ఆరోపించారు. 'మోదీ, అదానీ భాయీ భాయీ' అంటూ రాసిన మాస్కులు ధరించి మకర ద్వారం వద్ద ప్రదర్శనకు దిగారు. విపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రియాంక తదితరులు నిరసనల్లో పాల్గొన్నారు. సభలో అదానీ అంశంపై చర్చించేందుకు ప్రభుత్వానికి దమ్ము లేదని ప్రియాంక ఎద్దేవా చేశారు. అదానీని తక్షణం అరెస్టు చేయాలని రాహుల్ అన్నారు.



నిరసనల్లో పాల్గొన్న ప్రియాంక, రాహుల్

సరిహద్దుల్లో బంగ్లా డ్రోన్లు

న్యూఢిల్లీ: భారత్‌తో సరిహద్దుల్లో బంగ్లాదేశ్ డ్రోన్లను మోహరించింది. టర్కీలో తయారైన అధునాతన బేరక్తార్ టిబి2 డ్రోన్లను పశ్చిమబెంగాల్‌లోని సరిహద్దుల్లో బంగ్లాదేశ్ మోహరించింది. దాంతో భారత్ అప్రమత్తమైంది. షేక్ హసీనా ప్రభుత్వ పతనం తర్వాత సరిహద్దుల్లో తీవ్రవాద కార్యకలాపాలు ఉధృతమయ్యాయనే వార్తల నేపథ్యంలో భారత్ నిఘాను మరింత పెంచింది. బేరక్తార్ టిబి2 డ్రోన్ల మోహరింపునకు సంబంధించి భారత ఆర్మీ వాస్తవాలను బేరీజు వేస్తోంది. బంగ్లాదేశ్ ఇంటలిజెన్స్, సర్వైలెన్స్ 67 విభాగం ఈ డ్రోన్లను పర్యవేక్షిస్తోంది. రక్షణ చర్యల్లో భాగంగా ఈ డ్రోన్లను రంగంలోకి దింపామని బంగ్లా చెబుతున్నా పశ్చిమబెంగాల్‌తో వ్యూహాత్మకమైన సరిహద్దు ప్రదేశాల్లో వీటిని మోహరించడంపై భారత్ అప్రమత్తమైంది. హసీనా ప్రభుత్వ పతనం తర్వాత సరిహద్దుల్లో తీవ్రవాద కార్యకలాపాలు ఊపందుకున్నాయని, చొరబాటు ప్రయత్నాలు పెరిగాయనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి.

చిలీ మాజీ అధ్యక్షురాలికి ఇందిరా శాంతి బహుమతి

న్యూఢిల్లీ: 2024 సంవత్సరానికి గాను ఇందిరాగాంధీ శాంతి బహుమతిని ప్రముఖ మానవ హక్కుల నేత, చిలీ మాజీ దేశాధ్యక్షురాలు మిచెల్ బాచెలెట్ అందుకోనున్నారు. ఇందిరా గాంధీ శాంతి బహుమతి అంతర్జాతీయ జ్యూరీ చైర్మన్, మాజీ జాతీయ భద్రతా సలహాదారు శివశంకర్ మీనన్ శుక్రవారం ఈ విషయం ప్రకటించారు. ప్రపంచ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి కోసం పాటుపడే వారిని ఈ అవార్డుతో గౌరవిస్తారు. ఐరాస మహిళా విభాగం వ్యవస్థాపక డైరెక్టర్‌గా, ఐరాస మానవ హక్కుల హై కమిషనర్‌గా, చిలీ అధ్యక్షురాలిగా లింగ సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం స్వదేశంలో, అంతర్జాతీయంగా మిచెల్ ఎంతగానో కృషి చేశారని ఇందిరా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ పేర్కొంది.

బాలికపై హత్యాచారం కేసులో...
61 రోజుల్లోనే మరణశిక్ష

కోల్‌కతా: ఈ ఏడాది అక్టోబర్‌లో 9 ఏళ్ల బాలికపై అత్యాచారంచేసి హత్యకు పాల్పడిన 19 ఏళ్ల వ్యక్తికి బెంగాల్‌లోని కోర్టు మరణ శిక్ష విధించింది. నేరం చోటుచేసుకున్న నాటి నుంచి కేవలం 61 రోజుల్లోనే విచారణ పూర్తవడం రికార్డు సృష్టించింది. దక్షిణ 24 పరగణాల జిల్లా జయ్‌నగర్‌లో అక్టోబర్ 4న ట్యూషన్ నుంచి వస్తున్న 9 ఏళ్ల బాలికను ముస్తాకిన్ సర్దార్ నిర్బంధించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆపై చంపేశాడు. అప్పటికే ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో ట్రెయినీ వైద్యురాలి హత్యాచార ఘటనతో రాష్ట్రం అట్టుడుకుతోంది. దాంతో బాలిక హత్యాచార కేసులో పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంతో నిందితుడిని కేవలం రెండున్నర గంటల్లోనే అరెస్ట్ చేశారు. అతడిచ్చిన వివరాలతో బాలిక మృతదేహాన్ని అదే రోజు రాత్రి స్వాధీనం చేసుకున్నారు. మిగతా ఆధారాలతో 25 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి బారుయిపూర్ పోక్సో కోర్టులో అక్టోబర్ 30న చార్జిషీట్ వేశారు. కోర్టు విచారణ నవంబర్ 4న మొదలై 26న పూర్తయింది. మొత్తం 36 మంది సాక్షులను విచారించారు. దోషి ముస్తాకిన్ సర్దార్‌కు మరణ శిక్ష విధిస్తూ శుక్రవారం జస్టిస్ సుబ్రతా చటర్జీ తీర్పు వెలువరించారు. రాష్ట్ర చరిత్రలోనే ఇదో రికార్డని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. పోలీసులు, న్యాయాధికారుల కృషిని ప్రశంసించారు.

సత్వర విచారణ నిందితుడి ప్రాథమిక హక్కు: సుప్రీం

న్యూఢిల్లీ: కేసుల్లో వేగంగా విచారణ జరగడం, కోర్టు నుంచి సాధ్యమైనంత త్వరగా తీర్పు పొందడం నిందితుల ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. అండర్ ట్రయల్స్‌ను నిరవధికంగా నిర్బంధంలో ఉంచడం సరికాదని జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ పంకజ్ మిత్తల్‌ల ధర్మాసనం పేర్కొంది. బిహార్‌లో నాలుగేళ్లకు పైగా కస్టడీలో ఉన్న వ్యక్తికి శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. విచారణ ఇప్పట్లో పూర్తయే అవకాశం కనిపించడం లేదు గనుక బెయిలిస్తున్నట్టు వెల్లడించింది.

రైతులపైకి టియర్ గ్యాస్

పలువురికి గాయాలు

- శంభు నుంచి ఢిల్లీ వెళ్లేందుకు రైతుల ప్రయత్నాలు
- బారికేడ్లతో అడ్డుకున్న వైనం
- అంబాలాలో నిషేధాజ్ఞలు
- చలో ఢిల్లీ రేపటికి వాయిదా



శంభు సరిహద్దులో గాయపడ్డ రైతును చికిత్స నిమిత్తం తరలిస్తున్న దృశ్యం

శంభు: పంజాబ్–హరియాణా సరిహద్దుల్లోని శంభు వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి పలు డిమాండ్లతో రైతు సంఘాలు ఢిల్లీ చలో కార్యక్రమాన్ని ప్రకటించడం తెలిసిందే. ఇందులో భాగంగా రైతులు, రైతు సంఘాల నేతలతో కూడిన 101 మందితో కూడిన రైతు జాతా సరిగ్గా మధ్యాహ్నం ఒంటిగంటకు శంభులోని నిరసన దీక్షా శిబిరం నుంచి కాలినడకన బయలుదేరింది. సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ సంఘ్ జెండాలను చేబూనిన రైతులు కొన్ని మీటర్ల దూరం మాత్రమే వెళ్లగలిగారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని, ముందుకు రావద్దని పోలీసులు వారిని పదేపదే కోరారు. అయినప్పటికీ, రైతులు పలు అంచెల బారికేడ్లను దాటుకుని, వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుగా ఏర్పాటు చేసిన ఇనుప మేకులను, ఇనుప ముళ్ల కంచెను తొలగించారు. సిమెంట్ బారికేడ్లనూ దాటేందుకు యత్నించారు. ఇనుప కంచెను కొందరు ఘగ్గర్ నదిలోకి దొర్లించారు. దీంతో, పోలీసులు వారిపైకి పలు రౌండ్ల టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. రైతులు టియర్ గ్యాస్ నుంచి రక్షణ కోసం తడి గన్నీ బ్యాగులతో కళ్లు, ముఖాన్ని కప్పేసుకున్నారు. బారికేడ్లపై నుంచి వస్తున్న వారిపైకి పోలీసులు లాఠీలు ఝళిపించారు. టియర్ గ్యాస్‌తో గాయపడిన కనీసం ఆరుగురు రైతులను అంబులెన్సుల్లో ఆస్పత్రులకు తరలించారు. రైతులు గాయపడిన నేపథ్యంలో జాతాను శుక్రవారానికి నిలిపి వేస్తున్నట్లు రైతు నేత సర్వాన్ సింగ్ చెప్పారు. తదుపరి కార్యాచరణపై చర్చించుకుని, నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, అంబాలా జిల్లాలో గురువారం నుంచే నిషేధాజ్ఞలు అమలవుతున్నాయి. ఐదు, అంతకంటే ఎక్కువ మంది ఒకే చోట గుమికూడరాదని ప్రకటించారు. ముందు జాగ్రత్తగా శుక్రవారం జిల్లాలోని స్కూళ్లకు సెలవు ప్రకటించారు. అంబాలా జిల్లాలోని 11 గ్రామాల పరిధిలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు మొబైల్ ఇంటర్నెట్ సేవలపై నిషేధం విధించారు. పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను ఆ మార్గంలో మోహరించారు.

స్కూలుకు ఆలస్యంగా వచ్చాడని కొట్టినందుకు..
హెడ్‌మాస్టర్‌ను కాల్చి చంపాడు!

ఛతర్‌పూర్: స్కూలుకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థి(17)ని దండించడమే ఆ హెడ్ మాస్టర్ పాలిట శాపమైంది. పగబట్టిన విద్యార్థి బాత్‌రూంలోకి వెళ్తున్న హెడ్ మాస్టర్‌ను వెంబడించి వెంట తెచ్చుకున్న తుపాకీతో కాల్చి చంపాడు. హెడ్ మాస్టర్ ద్విచక్ర వాహనంపై పరారైన అతడిని పోలీసులు పట్టుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను తీవ్ర భయాందోళనలకు గురిచేసిన ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లా ధమోరా ప్రభుత్వ హయ్యార్ సెకండరీ స్కూల్‌లో చోటుచేసుకుంది. ధిలాపూర్ గ్రామంలోని ధమోరా స్కూల్‌లో చదువుకునే ఓ విద్యార్థి తరచూ ఆలస్యంగా క్లాసులకు వస్తుంటాడు. శుక్రవారం కూడా ఆలస్యంగా రావడంతో ప్రధానోపాధ్యాయుడు సురేంద్ర కుమార్ సక్సేనా(55) నిందితుడిని, మరో విద్యార్థిని కొట్టారు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో స్కూల్ ఆవరణలోని బాత్ రూంకి వెళ్తుండగా సక్సేనాను నిందితుడు అనుసరించాడు. వెంట తెచ్చుకున్న నాటు తుపాకీని సక్సేనా తలకు గురిపెట్టి కాల్చాడు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు సక్సేనాకు చెందిన ద్విచక్ర వాహనంపై అక్కడి నుంచి పరారయ్యారు. తుపాకీ శబ్దం విని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉలిక్కి పడ్డారు. ఉపాధ్యాయులు వచ్చి చూడగా సక్సేనా రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించారు. ఈ మేరకు వారు పోలీసులకు సమాచారం అందించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు యూపీ సరిహద్దులకు సమీపంలో నిందితుడిని పట్టుకున్నారు. హత్యకు వాడిన తుపాకీని సైతం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు తరచూ స్కూలుకు ఆలస్యంగా వస్తుంటాడని, సరిగ్గా చదువుకునేవాడు కాదని, ఉపాధ్యాయుల మాటలను లక్ష్య పెట్టే వాడు కాదని దర్యాప్తులో తేలింది. 'అతనొక్కడే కాల్పులు జరిపాడు. అతడొక్కడే నిందితుడనేది స్పష్టమైంది. మరో విద్యార్థి అఘాయిత్యాన్ని ఆపేందుకు మాత్రమే బాత్రూం వద్దకు వచ్చాడు. అనంతరం అతడు ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత అతడు భయంతో ఎటో వెళ్లిపోయాడు. నిందితుడిచ్చిన సమాచారం మేరకు తుపాకీ సమకూర్చిన వ్యక్తి కోసం గాలిస్తున్నాం'అని ఎస్పీ ఆగమ్ జైన్ చెప్పారు.



నవ్వుల్.. పువ్వుల్

పార్లమెంటు ఆవరణలోని ప్రేరణస్థల్‌లో శుక్రవారం నవ్వులు చిందిస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్. అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం ఈ సరదా సన్నివేశానికి వేదికైంది.

ఓట్లతో అభివృద్ధిని తూకం వేయొద్దు

- పదేళ్లుగా ఈశాన్యంలో శరవేగంగా అభివృద్ధి
- ఢిల్లీలో అష్టలక్ష్మి మహోత్సవం ప్రారంభ వేడుకల్లో మోదీ

న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిని గత ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. అక్కడ తక్కువ జనాభా ఉండడం, తక్కువ ఓట్లు, తక్కువ సీట్లు ఉండడమే ఇందుకు కారణమని చెప్పారు. గతంలో అధికారం చెలాయించిన ప్రభుత్వాలు ఓట్ల రాజకీయం చేశాయని ఆక్షేపించారు. ఓట్లు అధికంగా ఉన్న ప్రాంతాలపైనే దృష్టి పెట్టాయని చెప్పారు. ఓట్లతో అభివృద్ధిని తూకం వేసే విధానం సరైంది కాదన్నారు. ఈశాన్య ప్రాంతాల వేడుక అయిన 'అష్టలక్ష్మీ మహోత్సవ్'ను ప్రధాని మోదీ శుక్రవారం ఢిల్లీలోని భారత్ మండపంలో ప్రారంభించారు. మొట్టమొదటిసారిగా అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వమే ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి శాఖలో 20 శాతం నిధులను ఈశాన్య ప్రాంతాల ప్రగతి కోసమే ఖర్చు చేసేలా చర్యలు తీసుకుందని చెప్పారు. గత పదేళ్లగా ఈశాన్యంలో వేగంగా అభివృద్ధి జరుగుతోందని వెల్లడించారు. ఇదంతా సులభంగా జరగలేదని, దేశ అభివృద్ధి ప్రయాణంతో ఈశాన్యాన్ని అనుసంధానించడానికి అన్ని రకాల చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తూర్పు, ఈశాన్య భారతదేశంలో అద్భుతాలు చూడబోతున్నామని వ్యాఖ్యానించారు. ముంబై, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తరహాలో గౌహతి, షిల్లాంగ్, ఇంఫాల్, ఈటా నగర్, ఐజ్వాల్ వంటి నగరాలు ప్రగతి పథంలో దూసుకుపోవడం ఖాయమని ఉద్ఘాటించారు. దేశ అభివృద్ధి చరిత్రలో ఈశాన్యం పాత్ర కీలకంగా మారుతుందని అన్నారు. గత పదేళ్లలో ఈశాన్య ప్రాంతాల ప్రజలను అక్కున చేర్చుకున్నామని నరేంద్ర తెలియజేశారు. వారి మనసుల్లో ఢిల్లీతో ఉన్న దూరాన్ని తగ్గించామన్నారు. గత దశాబ్ద కాలంలో కేంద్ర మంత్రులు 700 సార్లు ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటించారని గుర్తుచేశారు. అష్టలక్ష్మీ మహోత్సవం ఇదే మొదటిసారి. ఈ నెల 8వ తేదీ వరకు మూడు రోజులపాటు ఈ వేడుకలు జరుగుతాయి. ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల ఘనత, సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పడమే ఈ వేడుకల ఉద్దేశం.

పదవి నుంచి తప్పుకోను: మాక్రాన్

త్వరలో ప్రధానిని నియమిస్తానన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు

పారిస్: పదవీకాలం ముగిసేదాకా కొనసాగుతానని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ స్పష్టం చేశారు. కొత్త ప్రధానిని మరికొద్ది రోజుల్లో ప్రకటిస్తానని చెప్పారు. పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం నెగ్గి ప్రధాని మైకేల్ బార్నియర్ రాజీనామా చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాక్రాన్ జాతినుద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ఫ్రెంచ్ ఫార్ రైట్, హార్డ్ లెఫ్ట్ పార్టీలు రిపబ్లికన్ వ్యతిరేక ఫ్రంట్‌కు సహకరిస్తున్నాయని ఆరోపించారు. ''నా నిర్ణయాలపై వ్యతిరేకతతో రాజకీయ ప్రత్యర్థులు గందరగోళాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. వారి దృష్టి ప్రజల సమస్యలపై కాదు. కేవలం అధ్యక్ష ఎన్నికలపైనే ఉంది'' ని విమర్శించారు. తదుపరి ప్రధాని ఎవరనే దానిపై మాక్రాన్ సంకేతాలివ్వలేదు. రక్షణ మంత్రి సెబాస్టియన్ లెకోర్, అంతర్గత మంత్రి బ్రూనో రిటైల్లీయు, ఫ్రాంకోయిస్ బేరూ పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి.

కొత్తగా 85 కేవీలు, 28 'నవోదయ'లు

న్యూఢిల్లీ: దేశంలో కొత్తగా 85 కేంద్రీయ విద్యాలయాలు, 28 నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. అలాగే ఒక కేంద్రీయ విద్యాలయ విస్తరణకు అంగీకారం తెలిపింది. మంత్రివర్గం శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైంది. పలు నిర్ణయాలు తీసుకుంది. మంత్రివర్గం నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు తెలియజేశారు. కొత్తగా ఏర్పాటు కానున్న కేంద్రీయ విద్యాసంస్థలతో 82 వేల మందికిపైగా విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని, వారికి నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం 1,256 కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయి. ఇందులో ఒకటి మాస్కోలో, మరొకటి ఖాట్మాండులో, ఇంకోటి టెహ్రాన్‌లో ఉన్నాయి. ఢిల్లీ మెట్రో నాలుగో దశలో భాగంగా 26.46 కిలోమీటర్ల పొడవైన రిథాలా–కుండ్లీ మార్గానికి సైతం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.


సాక్షి హైదరాబాద్

శనివారం । 7 । డిసెంబర్ । 2024



అంబేడ్కర్ అందరి వాడు

దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు, సవాళ్లకు రాజ్యాంగమే పరిష్కార మార్గాన్ని చూపిస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. -8లో



టూరు.. భలే జోరు..

ఈ నెలలో మిగిలిపోయిన సెలవుల్లో ఎంజాయ్ చేసేందుకు ఉద్యోగులు ప్లాన్ చేసుకుంటున్నారు. పొగమంచు కమ్మిన ప్రాంతాలవైపు ఆకర్షితులవుతున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
30.0/22.0

వాతావరణం

నగరంలో శనివారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 30, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

ఎయిర్ షో..అదరహో..







ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్, సచివాలయ పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన ఎయిర్ షో ఆద్యంతం ఆకట్టుకుంది. 9 ఎయిర్ క్రాఫ్ట్‌లు ఆకాశ వీధుల్లో చక్కర్లు కొట్టడంతో చూపరులు ఆశ్చర్య చకితులయ్యారు. సాగర తీరంలో ఎయిర్ షో విన్యాసాలను నగర వాసులు ఆసక్తిగా తిలకించారు. - ఖైరతాబాద్

మానవ జీవితం సైన్స్‌తో ముడిపడి ఉంది

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను తిలకిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ముషీరాబాద్: మానవ జీవితం సైన్స్‌తో ముడిపడి ఉందని, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని సెయింట్ పాయిస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు వారి ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడతాయన్నారు. ఎగ్జిబిషన్‌కు మొత్తం 1,200 ప్రయోగాలు రాగా 150 ఎంపిక చేసి ఎగ్జిబిట్ చేశారు. 88 ప్రభుత్వ పాఠశాలలు, 62 ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రయోగాలను తయారు చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా విద్యాధికారి రోహిణి, ముషీరాబాద్ డిప్యూటీ ఈఓ చిరంజీవి, శామ్యూల్ రాజ్, విద్యాశాఖ అధికారులు ధర్మేందర్, స్వరూపారాణి, జయలక్ష్మీ భారతి, ముషీరాబాద్ తహసీల్దార్ రాణా ప్రతాప్ సింగ్, సెయింట్ పాయిస్ హై స్కూల్ హెచ్ఎం సిస్టర్ లిండా జరాల్డ్, కోఆర్డినేటర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిలోఫర్‌లో మోడ్రన్ మెకనైజ్డ్ లాండ్రీ ప్రారంభం



లాండ్రీని పరిశీలిస్తున్న డాక్టర్ రవికుమార్

నాంపల్లి: ప్రముఖ చిన్నపిల్లల ఆస్పత్రి నిలోఫర్‌లో శుక్రవారం మోడ్రన్ మెకనైజ్డ్ (ఫుల్లీ ఆటోమేటిక్) లాండ్రీని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. రవికుమార్ ప్రారంభించారు. దీనిని రూ.20 లక్షల వ్యయంతో ఇక్కడ ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలోని 1,300 బెడ్లకు సరిపడా అవసరమైన బెడ్‌షీట్లను మోడ్రన్ లాండ్రీ ద్వారానే ఉతికి శుభ్రం చేస్తారు. ఆస్పత్రిలో ప్రతిరోజూ బెడ్ షీట్లను తొలగిస్తుంటారని, వాటి స్థానంలో ఉతికిన బెడ్ షీట్లను అమర్చుతుంటారని ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికుమార్ పేర్కొన్నారు.

మల్కాజిగిరిలో హైడ్రా కూల్చివేతలు



ఫంక్షన్ హాల్ కూల్చివేత

అల్వాల్/మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గంలో తొలిసారిగా హైడ్రా కూల్చివేతలు శుక్రవారం షురూ చేసింది. ఇప్పటిదాకా మల్కాజిగిరి నియోజకరవర్గంలోని అల్వాల్ ప్రాంతంలో నోటీసులు జారీ చేసినా చర్యలు ప్రారంభించడం ఇదే ప్రథమం. నాగిరెడ్డికుంట నాలా ఆక్రమించి బఫర్ జోన్‌లో ప్రభుత్వ భూమి సర్వే నంబర్లు 14,32లో డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ నిర్మించినట్లు రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులు పూర్తి విచారణ జరిపి హైడ్రా అధికారులకు నివేదిక అందజేయడంతో దీనిని కూల్చివేశారు. అదే ప్రాంతంలో సర్వే నంబరు 32 దోబీఘాట్‌ను కబ్జా చేసి నిర్మించిన ప్రహరీని సైతం కూల్చివేశారు. కోర్టు స్టే ఉన్న సర్వే నంబరు 25లో కూల్చివేతలు చేపట్టలేదని అధికారులు తెలిపారు.

నేటి ఆటో బంద్ వాయిదా



కాచిగూడ: నేడు (శనివారం) జరగనున్న ఆటో బంద్‌ను వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ ఆటో, క్యాబ్ డ్రైవర్ సంఘాల జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం ప్రకటించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ద్వారా జేఏసీ ప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు డిమాండ్లను వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 10న ఆటో సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి డిమాండ్ల సాధనకు ప్రభుత్వ పరంగా తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. దీంతో 10వ తేదీ వరకు ఆటో బంద్‌ను వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. తదుపరి కార్యాచరణను మంత్రితో సమావేశం అనంతరం ప్రకటిస్తామని వెంకటేశం స్పష్టం చేశారు.

నయా కాంతులొస్తున్నాయ్!

- సిటీలో త్వరలో కొత్త వెలుగులు
- చీకటి ప్రాంతాల్లో 16 వేల స్ట్రీట్ లైట్స్
- ఏర్పాట్లలో నిమగ్నమైన జీహెచ్ఎంసీ



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ఎంతో కాలంగా వెలుగులు లేకుండా చీకట్లో మగ్గుతున్న ప్రాంతాల్లో త్వరలోనే వీధి దీపాలు ఏర్పాటు కానున్నాయి. కొత్త సంవత్సరం నాటికి జీహెచ్ఎంసీ పరిధిలో కొత్తగా దాదాపు 16వేల స్ట్రీట్‌లైట్స్ ఏర్పాట్లకు అధికారులు చర్యలు చేపట్టారు. జీహెచ్ఎంసీలో ఎల్ఈడీ స్ట్రీట్‌లైట్స్ ఏర్పాటు, నిర్వహణ బాధ్యతల ఒప్పందం కుదుర్చుకున్న ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) నిర్వాకంతో గత కొన్ని నెలలుగా అనేక ప్రాంతాల్లో స్ట్రీట్‌లైట్స్ వెలగడం లేదు. నగరం విస్తరించి కొత్తగా ఏర్పాటైన కాలనీల్లో స్ట్రీట్‌లైట్స్ ఏర్పాటు చేయలేదు.

రూ.3 కోట్ల వ్యయంతో..

జీహెచ్ఎంసీకి నిత్యం అందుతున్న ఫిర్యాదుల్లో వీధి దీపాలవే అధికంగా ఉంటున్నాయి. స్థానిక ప్రజలకు సమాధానం చెప్పలేక కార్పొరేటర్లు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో.. గడచిన జీహెచ్ఎంసీ పాలకమండలి సమావేశంలోనూ సభ్యులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ పలు పర్యాయాలు సమస్యను ఈఈఎస్ఎల్ దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇక లాభం లేదని జీహెచ్ఎంసీయే ఏర్పాటు చేయాలని అప్పటి కమిషనర్ ఆమ్రపాలి నిర్ణయించారు. అందుకనుగుణంగా టెండర్లు పిలవడం.. కాంట్రాక్టు ఏజెన్సీని ఖరారు చేయడంతో త్వరలోనే స్ట్రీట్‌లైట్స్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈనెలాఖరులోగా వీటిని ఏర్పాటు చేసి కొత్త సంవత్సరానికి చీకట్లు లేకుండా చేయాలనే యోచిస్తున్నారు. ఇందుకుగాను దాదాపు రూ.3 కోట్లు ఖర్చు కానుంది.

సీసీఎంఎస్ బాక్సులు సైతం

జీహెచ్ఎంసీ– ఈఈఎస్ఎల్ ఒప్పందం మేరకు 2018 మే నుంచి వీధిదీపాల బాధ్యతలు ఈఈఎస్ఎల్‌కు అప్పగించారు. దాని గడువు వచ్చే సంవత్సరం ఏప్రిల్ వరకు ఉన్నప్పటికీ, పనులు చేయక పోవడంతో జీహెచ్ఎంసీయే ఏర్పాటు చేస్తోంది. ఎల్ఈడీ స్ట్రీట్‌లైట్స్ రాత్రి చీకటి పడగానే వెలిగి, ఉదయం సూర్యుడు రాగానే ఆటోమేటిక్‌గా ఆరిపోవాల్సి ఉంది. అందుకుగాను 30వేలకు పైగా సెంట్రలైజ్డ్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (సీసీఎంఎస్) బాక్సులు ఉండాలి. కానీ ఈఈఎస్ఎల్ అన్నింటిని ఏర్పాటు చేయలేదు. ఏర్పాటు చేసినవాటిల్లోనూ చాలా ప్రాంతాల్లో పని చేయకపోవడంతో మాన్యువల్‌గానే ఆన్, ఆఫ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా స్ట్రీట్‌లైట్స్ ఏర్పాటుతో పాటు సీసీఎంఎస్ బాక్సుల ఏర్పాటుకు, పని చేయని ప్రాంతాల్లో మరమ్మతుల చర్యలకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. గడచిన రెండు వారాల్లో దాదాపు 500 సీసీఎంఎస్ బాక్స్‌లు ఏర్పాటు చేశారు. కొత్తగా దాదాపు 16 వేల వీధి దీపాలు, 1,800 సీసీఎంఎస్ బాక్సుల్ని ఏర్పాటు చేయనున్నారు.

చీకటి ప్రాంతాల్లో..

ప్రజల నుంచి ఫిర్యాదులందిన ప్రాంతాలతో పాటు జీహెచ్ఎంసీ, పోలీసు విభాగం గుర్తించిన చీకటి ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. అలాంటి ప్రాంతాల్లో పదివేలకు పైగా బల్బులు అవసరమవుతాయని అంచనా. మిగతావి ప్రజల నుంచి ఫిర్యాదులందిన ప్రాంతాల్లో, గ్రేటర్‌లో కొత్తగా వెలసిన కాలనీల్లో, శివారు ప్రాంతాల్లో వినియోగించనున్నారు.

మాన్యువల్ ప్రాంతాల్లో 'ఆటోమేటిక్' చర్యలు

జీహెచ్ఎంసీలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, మలక్‌పేట, కార్వాన్‌లతో పాటు ముషీరాబాద్, అంబర్‌పేట తదితర సర్కిళ్లలో సీసీఎంఎస్ బాక్సులు ఆటోమేటిక్‌గా పని చేయడంలేదు. మాన్యువల్‌గానే ఆన్,ఆఫ్ చేస్తున్నారు. కొత్త స్ట్రీట్ లైట్స్ ఏర్పాటుతో పాటు కొత్త సీసీఎంఎస్ బాక్సులు కూడా ఏర్పాటు చేస్తుండటంతో ఈ ఇబ్బంది కూడా తొలగిపోనుందని సంబంధిత విభాగం చెబుతోంది.

మెట్రోకు బెల్ట్ కనెక్టివిటీ

- లగేజీ మార్పిడి కోసం జంక్షన్‌ల మధ్య ఏర్పాట్లు
- ప్రయాణికుల రాకపోకలకు వాక్‌వేలు, స్కైవాక్‌లు
- ప్రత్యామ్నాయాలపై హెచ్ఏఎంఆర్ఎల్ కసరత్తు
- మెట్రో మొదటి, రెండో జంక్షన్‌ల అనుసంధానం



సాక్షి, సిటీబ్యూరో: మెట్రో జంక్షన్‌ల మధ్య అనుసంధానం కోసం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ (హెచ్ఏఎంఆర్ఎల్) వివిధ రకాల ప్రత్యామ్నాయాలపై కసరత్తు చేస్తోంది. ఆయా మార్గాల్లోంచి బయలుదేరే ప్రయాణికులు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లేందుకు జంక్షన్‌ల వద్ద ట్రెయిన్ మారాల్సి ఉంటుంది. ఎయిర్‌పోర్టు నుంచి నగరంలో ఎక్కడికి వెళ్లాలన్నా జంక్షన్‌ల వద్ద మార్పు తప్పనిసరి. దీంతో లగేజీ తరలింపు సమస్యగా మారనుంది. ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు లగేజీ తీసుకెళ్లడం ఎంతో కష్టం. ఈ క్రమంలో లగేజీ తరలింపుతో పాటు ప్రయాణికులు కూడా పెద్దగా ఇబ్బంది లేకుండా స్టేషన్‌లు మారేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు.

లగేజీ తరలింపునకు బెల్ట్..

నగరంలోని అన్ని వైపుల నుంచి ప్రతిరోజూ కనీసం సుమారు లక్ష మందికి పైగా ప్రయాణికులు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే అవకాశం ఉంది. ఎయిర్‌పోర్టు ప్రయాణికులతో పాటు, వారి కోసం వెళ్లే బంధుమిత్రులు, జీఎమ్మార్ ఉద్యోగులు తదితర వర్గాలకు చెందిన ప్రయాణికులతో ఈ సంఖ్య ఇంకా ఎక్కువే ఉండవచ్చని అంచనా. ప్రస్తుతం 75 వేల మంది ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగిస్తుండగా 2028లో ఎయిర్‌పోర్టు మెట్రో సేవలు ప్రారంభమయ్యే నాటికి లక్ష దాటవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో లక్ష మంది ప్రయాణికులు నిరంతరం రాకపోకలు సాగించేందుకు అనుగుణంగా మెట్రో జంక్షన్‌ల మధ్య లగేజీ కోసం పెద్ద ఎత్తున బెల్ట్‌లను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. అలాగే ప్రయాణికుల కోసం వాక్‌వేలు ఉంటాయి. ఎల్బీనగర్ నుంచి ఎల్బీనగర్ మెట్రో స్టేషన్‌కు స్కైవాక్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. నాగోల్ మెట్రోస్టేషన్ నుంచి నాగోల్ ఎయిర్‌పోర్ట్ మెట్రో స్టేషన్‌కు మధ్య వాక్‌వే ఉంటుంది.

ఎయిర్‌పోర్ట్ మెట్రో స్పెషల్..

మెట్రో రెండో దశలో ఎయిర్‌పోర్టు మెట్రో ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. మిగతా మార్గాల్లో కంటే ఈ రూట్‌లో మెట్రో రైళ్ల వేగం కూడా ఎక్కువే ఉండనుంది. ప్రస్తుతం గంటకు 35 కిలోమీటర్‌ల వేగంతో నడుస్తుండగా, ఎయిర్‌పోర్ట్ రూట్‌లో 45 కిలోమీటర్‌ల వరకు వేగం పెంచే అవకాశం ఉంది. ప్రస్తుతం న్యూఢిల్లీ ఎయిర్‌పోర్ట్ వద్ద ఏర్పాటు చేసినవిధంగా 1.6 కిలోమీటర్‌లు భూగర్భ మెట్రో నిర్మించనున్నారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో స్టేషన్ భూగర్భంలోనే ఉంటుంది. అక్కడి నుంచి ప్రయాణికులు ఎస్కలేటర్లు, లిఫ్టులను వినియోగించి ఎయిర్‌పోర్ట్ ఎంట్రన్స్‌కు చేరుకుంటారు. మరోవైపు ఫోర్త్ సిటీకి మెట్రో అందుబాటులోకి వచ్చే నాటికి హైదరాబాద్ నుంచి ఎయిర్‌పోర్టు మీదుగా ఫోర్త్‌సిటీకి రాకపోకలు సాగించే మెట్రో ప్రయాణికుల సంఖ్య 7 లక్షలు దాటవచ్చని భావిస్తున్నారు.

కాషాయ పార్టీ కదన భేరి

- నేటి బీజేపీ బహిరంగ సభకు సర్వం సన్నద్ధం
- సరూర్‌నగర్ స్టేడియంలో భారీ ఏర్పాట్లు
- జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాక..
- ఎంపీ ఎన్నికల తర్వాత ఇదే తొలి సభ
- 8 జిల్లాల నుంచి రానున్న నేతలు, కార్యకర్తలు

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనా వైఫల్యాలపై భారతీయ జనతాపార్టీ సమర శంఖం పూరించబోతోంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత నగరంలో తొలిసారిగా భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది. సరూర్‌నగర్ స్టేడియం వేదికగా శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా మల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహా పలువురు పార్టీ ప్రముఖులు సభలో పాల్గొంటారు. ఏడాది తర్వాత తొలిసారి నిర్వహిస్తున్న ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాషాయ పార్టీ.. భారీ జన సమీకరణ చేపడుతోంది. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సహా తెలంగాణ వ్యాప్తంగా ఎనిమిది జిల్లాల నుంచి కార్యకర్తలను తరలించాలని నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తైంది. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, అమలులో వైఫల్యాలపై ఈ వేదికగా ఎండగట్టబోతోంది. ఈ మేరకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం సభాస్థలి, ఏర్పాట్లను పరిశీలించారు. ఈటల వెంట రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, సీనియర్ నాయకులు రామ చంద్రారెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి తదితరులు ఉన్నారు.

మూసీ పునరుజ్జీవమే లక్ష్యం: దానకిశోర్

సాక్షి, సిటీబ్యూరో: మూసీ నదికి పూర్వ వైభవం తీసుకురావడమే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు లక్ష్యమని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో 13 రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ అర్బన్ వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా దానకిశోర్ మాట్లాడుతూ.. ఫ్రెంచ్ యాత్రికుడు జీన్ బాప్టిస్ట్ టావెర్నియర్ (16వ శతాబ్దం) మూసీని పారిస్‌లోని సీన్ నదితో పోల్చారని ఉటంకించారు. మూసీ నది నీరు సేవించేలా చేయడమే లక్ష్యమని దానకిశోర్ పేర్కొన్నారు. త్వరలోనే 100 శాతం మురుగునీటిని శుద్ధి చేసిన తొలి దక్షిణాసియా నగరంగా హైదరాబాద్ అవతరించనుందని చెప్పారు. ఫ్రాన్స్ రాయబారి తియరీ మాథౌ మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధి, పర్యావరణ సామర్థ్యం ఎలా సహజీవనం చేయవచ్చో ప్రదర్శిస్తూ హైదరాబాద్‌కు మోడల్ సిటీగా ఉపయోగపడే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఎంఆర్‌డీసీఎల్ ఎండీ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై ప్రత్యేక ప్రణాళిక

టీ హబ్ ఫౌండేషన్ డేలో మంత్రి శ్రీధర్‌బాబు

రాయదుర్గం: నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం విషయంలో కొత్త ఒరవడిపై ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో నిర్వహించిన 9వ ఫౌండేషన్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎకో సిస్టమ్‌లో అభివృద్ధి చేసిన మూడు అద్భుతమైన ఉత్పత్తుల ప్రదర్శనను సైతం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకతల్లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా ఉంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల్లో ప్రపంచ అవసరాలు, డిమాండ్లకు అనుగుణంగా సాంకేతికపరమైన పురోభివృద్ధి కోసం తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. బలమైన శక్తిగా ఉద్భవిస్తున్న విద్యార్థులు ఇక్కడి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు చేసేందుకు కృషి చేయాలన్నారు. తొమ్మిదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన టీ హబ్ లక్ష్యం నెరవేరేందుకు అవసరమైన అన్ని చర్యలనూ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. టీహబ్ పురోభివృద్ధిలో తాత్కాలిక సీఈఓ సుజిత్ జాగీర్దార్, శ్రీకాంత్, ఇతర ఉద్యోగులు, స్టార్టప్‌ల నిర్వాహకులు అభినందనీయులని కొనియాడారు. కార్యక్రమంలో సైయింట్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్, టీ హబ్ బోర్డు డైరెక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, సభ్యుడు శ్రీనివారాజు, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఐటీ సలహాదారు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎకో సిస్టమ్ ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

ఆరోగ్యం బాగాలేదని..

- సూసైడ్ నోట్ రాసి.. హాస్టల్ గదిలో ఉరేసుకుని..
- అనుమానాస్పద స్థితిలో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య
- కళాశాల ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన



కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు



శ్రావణి (ఫైల్)

దుండిగల్: అనుమానాస్పద స్థితిలో బీటెక్ విద్యార్థిని హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం మైలారం కొత్త తండాకు చెందిన బలరాం నాయక్, కవితలకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు శ్రావణి (18) దుండిగల్‌లోని మర్రి లక్ష్మారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ కళాశాలలోని హాస్టల్‌లో ఉంటోంది. రెండు రోజుల క్రితం తన స్వగ్రామానికి వెళ్లి తిరిగి హాస్టల్‌కి వచ్చిన శ్రావణి.. శుక్రవారం తన ఆరోగ్యం బాలేదని కళాశాలకు వెళ్లకుండా హాస్టల్లోనే ఉంది. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో హాస్టల్ గదిలోని తోటి మిత్రులు వచ్చి తలుపులు తట్టినా తీయలేదు. హాస్టల్ నిర్వాహకులకు సమాచారాన్ని ఇచ్చి తలుపులు బద్దలు కొట్టి చూడడంతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. వెంటనే శ్రావణిని సూరారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శ్రావణి తనకు ఆరోగ్యం బాలేదని కడుపు నొప్పి కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్ రాసి ఉందని పోలీసులు తెలిపారు. కాగా.. తమ కుమార్తె శ్రావణి ఎంతో ధైర్యవంతురాలు అని, ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని హాస్టల్ నిర్వాహకులే ఏదో చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ.. కళాశాల ఎదుట మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేపట్టారు. దుండిగల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పి.. ఆందోళనను విరమింపజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలపై హింసను అరికట్టాలి



'లీగల్ క్లినిక్' కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రజాపాలన నోడల్ అధికారి దివ్య

ప్రజాపాలన నోడల్ అధికారి దివ్య

లక్డీకాపూల్: మహిళలపై..ప్రత్యేకంగా అణగారిన వర్గాలపై జరుగుతున్న దోపిడీ, హింసను తుద ముట్టించాలని ప్రజాపాలన నోడల్ అధికారి, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ పిలుపునిచ్చారు. దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ రిసోర్స్ సెంటర్‌లో శుక్రవారం దళిత, ఆదివాసీ స్త్రీలు, బాలికలకు మద్దతుగా నిర్వహించిన 'లీగల్ క్లినిక్' కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమం ద్వారా వెలుగులోకి వచ్చిన కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణిని ఏర్పాటు చేసి, అన్ని శాఖలను దానిలో సమన్వయపరుస్తామన్నారు. లీగల్ క్లినిక్ దృష్టికి వచ్చిన 40 కేసుల్లో హత్యలు, లైంగిక దాడులు, ప్రేమ పేరుతో మోసాలు, దాడులు లాంటి సంఘటనలున్నాయన్నారు. జిల్లా కోర్టు జడ్జి రామదాసు మాట్లాడుతూ..హింసను ఎదిరించడానికి మన చేతిలో ప్రత్యేక చట్టాలు ఆయుధంగా ఉన్నాయన్నారు. ఒకసారి కేసు నమోదు చేశాక మళ్లీ నిందితులు హింసకు గురిచేస్తే కొత్త కేసు నమోదు చేయించాలని.. అప్పుడు వారిపై బైండోవర్ కేసు నమోదవుతుందన్నారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐడీ ఎస్పీ జె.అనన్య, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఎస్పీ శేఖర్‌రెడ్డి, హైదరాబాద్ కమిషనరేట్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ నాయక్, బాలల హక్కుల కమిషన్ సభ్యులు శోభారాణి, బృందాకర్, సైబరాబాద్ కమిషనరేట్ నుంచి సునీత, దళిత స్త్రీ శక్తి కో ఆర్డినేటర్ సత్యకామ జాబాలి, పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల కోసం స్పెషల్ పికప్ వ్యాన్లు

సాక్షి, సిటీబ్యూరో: దూరప్రాంత ప్రయాణికుల కోసం వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక వ్యాన్‌లను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత తెలిపారు. ఈసీఐఎల్ నుంచి ఎల్‌బీనగర్ మార్గంలో విజయవాడ, విశాఖ, కాకినాడ, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు, కందుకూరు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులను బస్సుల వద్దకు తరలించేందుకు పికప్ వ్యాన్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈసీఐఎల్, కాప్రా మున్సిపల్ ఆఫీస్, మౌలాలీ హౌసింగ్‌బోర్డ్ కాలనీ, మల్లాపూర్, నాచారం, హబ్సిగూడ, ఉప్పల్ మెట్రోస్టేషన్, నాగోల్ మెట్రోస్టేషన్‌ల వద్ద ఈ పికప్‌వ్యాన్‌లు అందుబాటులో ఉంటాయి.

ఏసీ బస్సుల టికెట్లపై 10 శాతం తగ్గింపు

అన్ని ఏసీ బస్సుల టికెట్ బేసిక్ చార్జీలపైన 10 శాతం వరకు తగ్గించినట్లు ఆర్ఎం తెలిపారు. ఈ ఆఫర్ ఏసీ స్లీపర్, ఏసీ సీటర్ కమ్ స్లీపర్, రాజధాని బస్సులకు వర్తిస్తుంది. శుక్రవారం నుంచి ఈ రాయితీ సదుపాయాన్ని అమల్లోకి తెచ్చినట్లు చెప్పారు. ప్రయాణికులకు ఉన్నత స్థాయి ప్రయాణాన్ని మరింత అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా ఈ ఆఫర్‌ను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు ప్రయాణికులు www.tgsrtcbus.in టీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

అంబేడ్కర్ అందరి వాడు

వర్ధంతి సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



భట్టి విక్రమార్కకు ఆయన చిత్రపటాన్ని బహూకరించిన జేఎన్‌టీయూ అధికారులు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మల్లు భట్టి విక్రమార్క

కేపీహెచ్‌బీకాలనీ: భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యలకు, సవాళ్లకు రాజ్యాంగమే పరిష్కార మార్గాన్ని చూపిస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశంలోని ప్రతి ఒక్కరూ రాజ్యాంగం చూపిన దారిని అనుసరించి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని 'మహా పరిణివారన్ దివస్' పేరుతో జేఎన్‌టీయూలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ కేవలం అణగారిన వర్గాల కోసం మాత్రమే కాకుండా..అన్ని వర్గాల అభ్యున్నతికి శ్రమించారని అన్నారు. కేవలం దళితులు, గిరిజనులు, అణగారిన వర్గాల కోసమే పనిచేశారని చిత్రీకరించడం సరైంది కాదన్నారు. అంబేడ్కర్ కృషి ద్వారానే అందరికీ సమానంగా ఓటు హక్కు లభించిందన్నారు. 8 గంటల పని విధానాన్ని అమలులోకి తెచ్చిన అంబేడ్కర్‌కు మే డే సందర్భంగా కూడా అందరూ గుర్తు చేసుకోవాలన్నారు. అంబేడ్కర్ మన దేశంలో పుట్టడం మనందరి అదృష్టమని, ఆయన ద్వారా అద్భుతమైన రాజ్యాంగం మన దేశానికి అందుబాటులోకి వచ్చిందన్నారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని అంబేడ్కర్ చూపిన మార్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం బలంగా విశ్వసించి ఈ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఒక ఏడాదిలో రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.70 కోట్లు ఖర్చు చేస్తే..తమ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణానికి ఒక ఏడాదిలోనే రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తుందని వివరించారు. రేపటి భవిష్యత్తుకు మీరే పునాదులని, విద్య ద్వారానే వ్యక్తిత్వ పరిపూర్ణత సాధ్యమని, చదువు మీద దృష్టి పెట్టి అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, జేఎన్‌టీయుహెచ్ రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ మాధవి, వివిధ విభాగాల డైరెక్టర్లు, ప్రొఫెసర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహిణికి డాక్టరేట్



చైతన్య

లక్డీకాపూల్: పట్టుదల ఉంటే చదువుకు వయసు అడ్డం కాదని నిరూపించింది ఓ గృహిణి. బాగ్‌అంబర్ పేటలోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీకి చెందిన అంబాల చైతన్య ఇంటర్‌తోనే చదువు ఆపేసింది. కానీ చదువు మీద మక్కువతో పెళ్లయ్యాక ఏకేఎల్‌ఆర్ ఓరియంటల్ కాలేజీలో డిగ్రీ చదివి పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా పూర్తి చేశారు. అంతటితో ఆగకుండా 'తెలుగు భాష ఆధునీకరణలో తెలంగాణ పత్రికలు–వివిధ సంస్థల పాత్ర' అనే అరుదైన అంశంపై పరిశోధన చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. వయసుతో నిమిత్తం లేకుండా పాతికేళ్ల తర్వాత పట్టుదలతో చదివి డాక్టరేట్ పొందిన చైతన్యను పలువురు అభినందించారు.

40 ప్రత్యేక తాగునీటి శిబిరాలు

సాక్షి,సిటీబ్యూరో: ప్రజా పాలన–ప్రజా విజయోత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా ఈ నెల 7, 8, 9 తేదీల్లో ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా పరిసరాల్లో ప్రజల సౌకర్యార్థం జలమండలి ప్రత్యేక తాగునీటి శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. ఉత్సవాలు జరిగే ప్రాంతాలు, దారులు సహా ట్యాంక్ బండ్, సచివాలయం, పరిసర ప్రాంతాల్లో సుమారు 40 ప్రత్యేక తాగునీటి శిబిరాలు ఏర్పాటు చేయనుంది. వీటిల్లో వాటర్ ప్యాకెట్లు, అవసరమైన చోట్ల డ్రమ్ముల్లోనూ మంచినీరు అందుబాటులో ఉంచుతారు. ఈ తాగునీటి శిబిరాల ఏర్పాట్లను శుక్రవారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు.

'ప్రజావాణి' వల్ల టెంట్ హౌస్ వచ్చింది



లక్డీకాపూల్ : ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో శుక్రవారం ఓ వ్యక్తి తన కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశాడు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం తాటికొండకి చెందిన బాణాల రమేష్ తనకు సబ్సిడీ రుణం మంజూరు చేయించాలని గత అక్టోబర్‌లో ప్రజావాణిలో విన్నవించగా అధికారులు స్పందించి టెంట్ హౌస్ పెట్టుకునేందుకు ఆయనకు రుణం మంజూరు చేయించారు. దీంతో ఆయన శుక్రవారం మరోమారు ప్రజావాణికి వచ్చి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లు ఆయనను అభినందించి మిఠాయి తినిపించారు. కాగా ప్రజావాణికి మొత్తం 360 దరఖాస్తులు అందాయి.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



సదస్సును ప్రారంభిస్తున్న జస్టిస్ చంద్రయ్య తదితరులు

కాచిగూడ: డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అంబేడ్కర్ స్మారకోపన్యాసం కార్యక్రమం నిర్వహించారు. హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ జి.చంద్రయ్య తదితరులు పాల్గొని అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. 'అంబేడ్కర్ జీవితం –ఆశయం, ఆచరణ, విజయాలు' అనే అంశంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ కార్యదర్శి గనుముల జ్ఞానేశ్వర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ లింగయ్య, గడ్డం ఝాన్సీ, డి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



జోస్ ఆలుక్కాస్ 60 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతగా నిలిచిన కె.ఎస్ దుర్గాప్రసాద్‌కు ఎంజీ ఆస్టర్ కారును అందించారు. పంజగుట్టలోని షోరూంలో జరిగిన ఈ కార్యక్రమంలో జోస్ ఆలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్ పాల్ జె.ఆలుక్కాస్, రీజనల్ మేనేజర్ లినో తదితరులు పాల్గొన్నారు. – సాక్షి,సిటీబ్యూరో

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్‌కృష్ణలో ఆకృతి ఆధ్వర్యంలో ఎలైట్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్ హైటెక్స్‌లోని నోవోటెల్ హెచ్‌ఐసీసీలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటలకు హైలైఫ్ సంస్థ ఆధ్వర్యంలో నగల ప్రదర్శన జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ లో ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ జరుగుతుంది.

ఆర్‌సీ పురంలో శ్రీలీల సందడి



రామచంద్రాపురం (పటాన్‌చెరు): సినీ హీరోయిన్ శ్రీలీల రామచంద్రాపురం పట్టణంలో సందడి చేశారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 37వ షో రూమ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వినియోగదారులకు కలకాలం గుర్తుండిపోయేలా కాస్ట్ టు కాస్ట్ అమ్మకాలతో షోరూం ప్రత్యేకతను చాటి చెప్పారని తెలిపారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సంస్థ ఎండీ రాజమౌళి, డైరెక్టర్లు సురేశ్, అభినయ్, రాకేష్, కేశవ్, అభిమన్యులు మాట్లాడుతూ..వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందిస్తూ అందరి మన్ననలను పొందుతున్నామని తెలిపారు.

మంత్రిపై అనుచిత పోస్టుల కేసులో ఇద్దరు అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర మంత్రి సీతక్కను ఉద్దేశించి సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు చేసిన కేసులో సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం ఇద్దరు నిందితుల్ని అరెస్టు చేశారు. వారాసిగూడకు చెందిన టి.విజయ్‌భాను ప్రసాద్, హన్మకొండకు చెందిన జి.ప్రకాష్ ఈ ఏడాది ఆగస్టులో మంత్రి సీతక్కను ఉద్దేశించి సోషల్‌మీడియాలో అనుచిత పోస్టులు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కె.మధులత సాంకేతికంగా దర్యాప్తు చేశారు. ఆధారాలను బట్టి నిందితులను గుర్తించి శుక్రవారం అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. అలాగే మల్లేపల్లికి చెందిన ఓ బాలిక పేరుతో నకిలీ ఇన్‌స్టాగామ్ ఖాతా తెరవడంతో పాటు అశ్లీలంగా మార్ఫింగ్ చేసిన ఫొటోలు పోస్టు చేసిన కార్వాన్ వాసి మోర్యా యశ్వర్ధన్ సింగ్‌ను సైబర్‌క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.

టెక్నికల్ ఫెస్ట్‌లతో నైపుణ్యాల వెలికితీత

- ఏపీ ఎన్‌ఐటీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్‌వీ రమణారావు
- అవంతిలో 'టెక్ విడ్మెట్ 2కే 24' ఫెస్ట్ ప్రారంభం



అవంతిలో టెక్నికల్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

అబ్దుల్లాపూర్‌మెట్: విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు..కళాశాలల్లో నిర్వహించే సాంకేతికోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రాయపూర్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ ఎన్‌ఐటీ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ రమణారావు అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన 'టెక్ విడ్మెట్ 2కే 24' ఫెస్ట్‌ను అవంతి గ్రూప్స్ ఆఫ్ చైర్మన్, ఏపీ మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం, డీఆర్‌డీఏ శాస్త్రవేత్త శ్రావణ్ కుమార్ సంగంకర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఫెస్ట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవంతి గ్రూప్స్ ప్రెసిడెంట్ ముత్తంశెట్టి జ్ఞానేశ్వరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక, మేనేజింగ్ డైరెక్టర్ శ్రావణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎంవీఎస్ఎస్ నందీష్, హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, ఇన్‌చార్జ్ బోసు బాబు, పీఆర్వో శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు.

బీబీనగర్ ఎయిమ్స్, నెహ్రూ జూపార్కు ఎంఓయూ



అవగాహన ఒప్పందం కార్యక్రమంలో జూపార్కు, ఎయిమ్స్ అధికారులు

బహదూర్‌పురా: వన్ హెల్త్‌లో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్, నెహ్రూ జూలాజికల్ పార్కు మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఎయిమ్స్ వ్యవస్థాపక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జూపార్కుతో ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ప్రజారోగ్యాన్ని పెంపొందించడం, జూనోటిక్ వ్యాధులపై పరిశోధన, పర్యావరణ స్థిరత్వం, విద్యను మెరుగుపరిచి వన్యప్రాణుల సంరక్షణను ప్రోత్సాహించడమే ఈ ఒప్పందం ఉద్దేశమని అధికారులు తెలిపారు. జూ కార్మికులు, సంరక్షకులు, జంతువులు, పర్యావరణంపై సమగ్ర నిఘా అధ్యయనానికి ఈ ఒప్పందం తోడ్పడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర జూపార్కుల డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్ హిరేమత్, బీబీనగర్ ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ పరిపాలన విభాగం డాక్టర్ బిపిన్ వర్గీస్, ఎగ్జిక్యూటివ్ డాక్టర్ వికాస్ బాటిల్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.

రాంకీ, పరవస్తు ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

అబిడ్స్: రాంకీ, పరవస్తు ఫౌండేషన్ల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రాంకీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఎం.వి.రామిరెడ్డి, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ నిర్వాహకులు గద్దె భాస్కర్, సందీప్ హరిలు పేర్కొన్నారు. స్టాఫ్‌సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో సాయుధ బలగాలు, కానిస్టేబుళ్ల ఇతర ఉద్యోగాల భర్తీకి అవసరమైన శిక్షణను రాంకీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్లు ఉచితంగా శిక్షణ అందిస్తాయని వారు ఒక సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. సాయుధ బలగాల నియామకంలో 40 వేలకు పైగా కానిస్టేబుళ్ల భర్తీకి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు పోటీపరీక్షల శిక్షణలో పేరొందిన శ్రీధర్ సీసీఈ సెంటర్‌తో కలిసి శిక్షణ ఇస్తామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నెల 22వ తేదీన అర్హత పరీక్ష నిర్వహించి, 25న ఫలితాలు ప్రకటిస్తామన్నారు. అర్హులైన 250 మంది అభ్యర్థులకు ఈ నెల 28వ తేదీ నుంచి శిక్షణ ఇస్తామన్నారు. అదేవిధంగా అర్హత పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా మరో 750 మంది అభ్యర్థులకు ఆన్‌లైన్ శిక్షణ కూడా ఇస్తామన్నారు. శిక్షణతో పాటు వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకై రాంకీ ఫౌండేషన్, పరవస్తు ఫౌండేషన్ల వెబ్‌సైట్లు లేదా 90007 97789, 73375 85959 నెంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

వెస్ట్ బెంగాల్ టు హైదరాబాద్!

- గుట్టుగా బ్రౌన్ హెరాయిన్ అక్రమ రవాణా
- ముగ్గురిని అరెస్టు చేసిన సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్

సాక్షి, సిటీబ్యూరో: పశ్చిమ బెంగాల్ నుంచి మాదకద్రవ్యమైన బ్రౌన్ హెరాయిన్‌ను నగరానికి అక్రమంగా తరలించి, విక్రయిస్తున్న ముఠాకు దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. ఓ వినియోగదారుడు సహా ముగ్గురు నిందితులను పట్టుకుని, వారి నుంచి 50 గ్రాముల డ్రగ్ స్వాధీనం చేసుకున్నట్లు అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పశ్చిమ బెంగాల్ నుంచి నగరానికి వలసవచ్చిన జమాల్ మోమిన్ మొఘల్‌పురలో నివసిస్తూ తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. తేలిగ్గా డబ్బు సంపాదించాలని భావించిన ఇతడు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాడు. తన స్వస్థలంలో తయారు చేసే బ్రౌన్ హెరాయిన్‌కు నగరంలో భారీ డిమాండ్ ఉందని గుర్తించాడు. దీంతో అక్కడ తక్కువ ధరకు దీన్ని ఖరీదు చేసుకువచ్చి మీర్‌చౌక్‌కు చెందిన మొబైల్ టెక్నీషియన్ షేక్ షాబాద్‌కు విక్రయిస్తున్నాడు. ఇతడు అధిక రేట్లకు స్థానికంగా ఉన్న సయ్యద్ అబ్దుల్ మజీద్‌తో పాటు ఇతరులకు అమ్ముతున్నాడు. వీరి వ్యవహారంపై దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర నేతృత్వంలో ఎస్సైలు కె.నర్సింహ్ములు, జి.ఆంజనేయులు, ఎన్.నవీన్ తమ బృందంతో దాడి చేసి ముగ్గురినీ అరెస్టు చేశారు. తదుపరి చర్యల నిమిత్తం మొఘల్‌పుర అధికారులకు అప్పగించి ఇతర కస్టమర్ల కోసం గాలిస్తున్నారు.

కేసుల పేర పాస్‌పోర్టు నిరాకరించొద్దు

అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కేసులున్నాయన్న కారణంగా పాస్‌పోర్టును నిరాకరించడం సరికాదని, పిటిషనర్‌కు పాస్‌పోర్టును అప్పగించాలని సంబంధిత అధికారులను హైకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పాటించాలని స్పష్టం చేసింది. ఖమ్మం కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందన్న కారణంగా తన పాస్‌పోర్టును ఇవ్వడం లేదంటూ హైకోర్టులో హైదరాబాద్‌కు చెందిన పూర్ణచందర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ మౌషుమీ భట్టాచార్య విచారణ చేపట్టి.. ఉత్తర్వులు జారీ చేశారు. 'డిసెంబర్ 9 నుంచి రెండు వారాల్లోగా పిటిషనర్ పాస్‌పోర్టును విడుదల చేయాలి. ఎక్కడ, ఎప్పుడు పాస్‌పోర్టు అందజేస్తారో అధికారులు పిటిషనర్‌కు చెప్పాలి. అనుమతి లేకుండా దేశం విడిచి పారిపోనంటూ పిటిషనర్.. ఖమ్మం జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎదుట అఫిడవిట్ దాఖలు చేయాలి. అఫిడవిట్ దాఖలుపై కోర్టు రెండు వారాల్లో సర్టిఫైడ్ సర్టిఫికెట్ ఇవ్వాలి. దీనిని పిటిషనర్ పాస్‌పోర్టు అధికారులకు అందజేయాలి. ఒకవేళ దీనిని పిటిషనర్ ఉల్లంఘిస్తే అధికారులు నిర్ణయం తీసుకోవచ్చు'అని కోర్టు స్పష్టం చేసింది.

అస్కీ మాజీ డైరెక్టర్ భాగ్యలక్ష్మి అరెస్టు

– ఆమె పీఏ రవికుమార్ సైతం నిందితుడిగా గుర్తింపు

సాక్షి, సిటీబ్యూరో: నకిలీ ఇన్వాయిస్‌లతో కుట్ర పూరితంగా అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాకు (అస్కీ) చెందిన రూ.88.91 లక్షలు స్వాహా చేసిన కేసులో నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) శుక్రవారం మాజీ డైరెక్టర్ డాక్టర్ భాగ్యలక్ష్మిని అరెస్టు చేసింది. ఈ గోల్‌మాల్‌లో ఆమె పీఏగా పని చేసిన ఎం.రవికుమార్ పాత్ర కూడా ఉన్నట్లు గుర్తించామని డీసీపీ ఎన్.శ్వేత పేర్కొన్నారు. అస్కీ ఆధీనంలో సెంటర్ ఫర్ హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్, సెంటర్ ఫర్ అగ్రికల్చర్ రూరల్ డెవలప్‌మెంట్ పేర్లతో కేంద్రాలు పని చేస్తున్నాయి. అస్కీలో ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన భాగ్యలక్ష్మి ఎక్స్‌టెన్షన్‌పై వీటికి డైరెక్టర్‌గా పని చేశారు. 2021–24 మధ్య ఈమె హయాంలో అనేక శిక్షణ కార్యక్రమాలు, ప్రాజెక్టులు జరిగాయి. ఆయా సందర్భాల్లో అవసరాన్ని బట్టి పలు ఏజెన్సీలు, కన్సల్టెంట్లతో పాటు పలువురు విక్రేతలు సేవల్ని వినియోగించుకున్నారు. ఆయా ఏజెన్సీలు, విక్రేతలు ఇచ్చిన ఇన్వాయిస్‌ల ఆధారంగా అస్కీ నిధుల నుంచి చెల్లింపులు చేశారు. ఈ విక్రేతలు, కన్సల్టెంట్స్ జాబితాలో హర్యానాలోని గుర్గావ్‌కు చెందిన షేక్ అభిషేక్ ఇమ్లాక్, నగరానికి చెందిన బల్లపు శృతి, నలమస రజని, మాదాపూర్‌కు చెందిన ఎం.బుర్రయ్య, పాండురంగనగర్‌కు చెందిన ధనలక్ష్మి ఉన్నారు. వీరు ఇచ్చిన ఇన్వాయిస్‌ల ఆధారంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి 2021 మార్చి నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు రూ.88.91 లక్షల చెల్లింపులు చేశారు. తన పీఏ రవికుమార్ సాయంతో ఆ నగదును వారి నుంచి తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ చెల్లింపులతో పాటు ఇతర కార్యకలాపాల నేపథ్యంలో భాగ్యలక్ష్మిని ఈ ఏడాది ఆగస్టు 16న అస్కీ విధుల నుంచి తొలగించింది. శుక్రవారం ఆమెను అరెస్టు చేసిన సీసీఎస్ జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది.

ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేయాలి

పంజగుట్ట: అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 9వ తేదీ నుంచి జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరికి మించి పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఎన్నికల్లో పోటీచేసే అవకాశం లేదన్న జీవోను రద్దు చేసి వారిని కూడా పోటీ చేసేలా చట్టం తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర పోరాట కమిటీ అధ్యక్షుడు అభిమాన్ గాంధీ నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ చట్టాన్ని 1995లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకుని వచ్చారన్నారు. చట్టాలు చేసే ఎమ్మెల్యేలు, ఎంపీలకు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, ప్రభుత్వ నియామకాల్లో లేని నిబంధన కేవలం స్థానిక సంస్థల ఎన్నికలకే ఎందుకు పెట్టారో అర్థం కాలేదన్నారు. చట్టం చేసిన చంద్రబాబు నాయుడే గత నెల 18వ తేదీన చట్టాన్ని రద్దుచేశారని గుర్తు చేశారు. ఇదే విషయమై మంత్రులు, అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షుడు నవీన్, భూక్యా వెంకట్, బానోతు సురేష్, కొండ సమ్మయ్య, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష నేతల అక్రమ అరెస్టులు హేయం



కార్పొరేటర్‌ను హౌస్ అరెస్ట్ చేస్తున్న మధురానగర్ పోలీసులు

వెంగళరావునగర్: ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్టులు చేయడం హేయమైన చర్య అని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. ట్యాంక్‌బండ్ వద్ద జరగనున్న బీఆర్ఎస్ నిరసన కార్యక్రమానికి అనుమతి లేదంటూ శుక్రవారం పోలీసులు పలువురు ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలను గృహ నిర్బంధం చేశారు. దీనిలో భాగంగా మధురానగర్‌కాలనీలోని కార్పొరేటర్ కార్యాలయంలో కార్పొరేటర్ దేదీప్య విజయ్‌ను పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేయడం, నివాళులర్పించడానికి కూడా పోలీసులు అనుమతి ఇవ్వకుండా నిర్బంధించడం ఎంత వరకు సబబు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, కిట్టు, బాలు రజక, యాదగిరి తదితరులు ఉన్నారు.

జూబ్లీహిల్స్ కార్పొరేటర్ హౌస్ అరెస్టు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌ను జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంట్లో హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలని హెచ్చరించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేందుకు వెళ్లనివ్వకుండా నిర్బంధాలు విధించడం ఏమిటని ప్రశ్నించారు. ఒకవైపు ప్రజాపాలన విజయోత్సవాలు అని ప్రచారం చేసుకుంటూ మరోవైపు రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీని ప్రకటించారని విమర్శించారు.

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్షమాపణ చెప్పాలి

కాచిగూడ: వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ 24గంటల్లో వెలమలకు క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో ఆయన ఇంటిని ముట్టడిస్తామని ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు నీలగిరి దివాకర్‌రావు హెచ్చరించారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని వెలమ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శాసనసభ్యుడిగా ఉంటూ ఒక కులాన్ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చెప్యాల హరీశ్‌రావు, కోట్ల నరేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మోతీనగర్‌లో బాబా ఫసియుద్దీన్



నివాళులర్పిస్తున్న బీఎస్పీ నేతలు



రహమత్‌నగర్‌లో దళిత సంఘాల నాయకులు



నివాళులు అర్పిస్తున్న సదానంద్ తదితరులు

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్



కార్మికనగర్‌లో సీఎన్ రెడ్డి



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న దానం నాగేందర్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ వర్ధంతిని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితాంతం వివక్షపై పోరాడారని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల్లో వెలుగులు నింపటానికి ఆయన చేసిన నిరంతర పోరాటం మరువలేనిదన్నారు. దేశానికి అంబేడ్కర్ అందించిన సేవలు చరిత్రలో ఎప్పటికీ గుర్తిండిపోతాయని కొనియాడారు.

– ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ జోన్ బృందం



నివాళులర్పిస్తున్న డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి



నివాళులు అర్పిస్తున్న బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు



ఖైరతాబాద్ రైల్వేగేట్ వద్ద..



ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో..




నివాళులర్పిస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు



బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణలో ఈనెల 6,7,8 తేదీల్లో జరిగే ఆకృతి ఎగ్జిబిషన్‌ను సంస్థ డైరెక్టర్ శశినత శుక్రవారం ప్రారంభించారు.

నియామకం



ఉపేందర్‌రెడ్డి

వెంగళరావునగర్: నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ సీనియర్ నాయకులు కె.ఉపేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా తాను నిర్వహించిన సేవా కార్యక్రమాలతో పాటుగా పార్టీకి చేసిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనకు ఈ పదవి అప్పజెప్పడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనను నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమించడానికి సహకరించిన పార్టీ అధినేతలందరికీ రుణపడి ఉంటానని చెప్పారు. స్థానికంగా పార్టీని మరింత బలోపేతం చేయడానికి అహర్నిశలు పాటు పడతానని తెలియజేశారు. నగర వ్యాప్తంగా ఉన్న పార్టీ నేతలందరినీ కలుపుకునిపోయి పార్టీ కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందించటానికి ముఖ్యపాత్ర పోషిస్తానని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంగళరావునగర్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌కు చెందిన సజ్జద్‌ఖాన్, సల్మాన్‌ఖాన్‌లు మైత్రీవనం నుంచి రహమత్‌నగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. మాస్టర్ కాలేజీ సమీపంలోకి రాగానే ఆటో డ్రైవర్ సడన్‌గా ఎడమవైపు తిరిగాడు. దీంతో ద్విచక్ర వాహనంపై నుంచి ఇద్దరు కిందపడటంతో గాయాలయ్యాయి. అనంతరం బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



పీసీసీ అధ్యక్షుడికి 1969 ఉద్యమకారుల వివరాలు అందజేస్తున్న సుదర్శన్‌రావు

బంజారాహిల్స్: తెలంగాణ సాధన కోసం పోరాడిన 1969 తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల మేరకు 250 గజాల ఇంటి స్థలాన్ని, రూ. 25,000 పింఛన్‌ను మంజూరు చేయాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి సెక్రటరీ జనరల్ సుదర్శన్‌రావు అన్నారు. శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఉద్యమకారుల జాబితాను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా 1969 తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ఒక కమిటీ వేయాలని ఆయన సూచించారు. వచ్చే జీహెచ్ఎంసీ, పంచాయతీ ఎన్నికల్లో ఉద్యమకారులంతా కలిసి ప్రచారం చేసి అభ్యర్థులను గెలిపించుకుంటామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవర్చాలని కోరారు.

పోచమ్మ దేవాలయ పనుల పరిశీలన



పోచమ్మ దేవాలయ పనులను పరిశీలిస్తున్న విజయారెడ్డి

పంజగుట్ట: ఎర్రమంజిల్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయ పనులను శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి పరిశీలించారు. నిమ్స్ విస్తరణలో భాగంగా నిమ్స్‌కు కేటాయించిన స్థలంలో పోచమ్మ దేవాలయం ఉండగా దానిని ఎర్రమంజిల్‌లోని బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వెనక భాగంలో ఈ దేవాలయాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా విజయారెడ్డి దేవాలయ కమిటీ సభ్యులతో పర్యవేక్షించి అక్కడ పనులపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు, కాంగ్రెస్ నాయకులు, దేవాలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా జరగాలి

ఎమ్మెల్సీ, రచయిత గోరేటి వెంకన్న



కమిషన్‌కు ఇవ్వనున్న వినతిపత్రాన్ని ప్రదర్శిస్తున్న దళిత మేధావులు

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణ విషయంలో మాల, మాదిగలు విద్వేషాలకుపోకుండా మేధావులు, సంఘాల నాయకులు కలిసి చర్చించుకుని రాజ్యాంగబద్ధంగా జరిగేలా చూడాలని ఎమ్మెల్సీ, రచయిత గోరేటి వెంకన్న అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో దళిత మేధావుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ గోపీనాథ్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ కె.వై.రత్నంలతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య హక్కు అయిన ఎస్సీ వర్గీకరణను తాము స్వాగతిస్తున్నామన్నారు. అదే సమయంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకోవచ్చు అని తీర్పు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్లు జరగాలి అంటే పార్లమెంట్‌లో అన్ని పార్టీల 2/3 మెజార్టీతో జరగాలి కానీ కేంద్రం తప్పించుకుని రాష్ట్ర ప్రభుత్వాల మీదకు నెట్టేసిందన్నారు. వర్గీకరణను మాల, మాదిగల తగాదాగా చూడరాదని, ఇప్పటికీ బడి మెట్లు ఎక్కని, అసలు రిజర్వేషన్లే ఉపయోగించుకోని ఎన్నో కులాలు ఉన్నాయని వాటి జాబితాను బయటకు తీసి వారిని ఎస్సీ ఏ జాబితాలో చేర్చి వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. మాల, మాదిగలను ఎస్సీ బీ కోటాలో ఉంచాలన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్‌కు అసలు ఎస్సీ జాతీయ కమిషన్ అనుమతి ఉందా అని వారు ప్రశ్నించారు. తాము వర్గీకరణను వ్యతిరేకించడం లేదని, కానీ న్యాయపరమైన చిక్కులు లేకుండా, రాజ్యాంగబద్ధంగా ఎస్సీ 59 కులాల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా వర్గీకరణ చేపట్టాలని సూచించారు. ఇదే విషయమై ఎస్సీ రిజర్వేషన్ ఉపవర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ కుమారస్వామి, డాక్టర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నారాయణ, రాజు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వం అండ



రహమత్‌నగర్: దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి అన్నారు. దివ్యాంగుల సాధికారిత కార్యక్రమంలో భాగంగా రహమత్‌నగర్ వార్డు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వీల్‌చైర్, స్టీల్ హ్యాండ్ స్టిక్స్, ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగవైకల్యాన్ని అధిగమించి ఎంతో మంది దివ్యాంగులు విజయాలు సాధించారని వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ వెంకటకృష్ణ, జీహెచ్ఎంసీ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించడంతో కుమార్తె అదృశ్యం

వెంగళరావునగర్: తల్లి మందలించిందని కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ఒక కుటుంబం స్థానిక జవహర్‌నగర్‌కు వచ్చి స్థిరపడింది. వారికి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. తల్లి దినసరి కూలీ పనులు చేస్తుండగా, ఆమె భర్త మృతి చెందాడు. ఈనెల 5న తల్లి కూలీ పనులకు వెళ్లి ఇంటికి వచ్చేసరికి చిన్న కుమార్తె ఫోన్‌లో మాట్లాడుతుంది. దీంతో ఆమెను మందలించగా యువతి ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని చెప్పి బయటకు వెళ్లిపోయింది. సాయంత్రానికి మళ్లీ ఇంటికి వస్తుందని భావించగా యువతి రాలేదు. యువతి తల్లి పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తల్లి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీ స్టాల్‌లో రూ. 8 వేలు అపహరణ

వెంగళరావునగర్: టీ స్టాల్‌లో చోరీ జరిగి రూ.8 వేలు దోచుకెళ్లిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎల్లారెడ్డిగూడకు చెందిన పి.నాగేశ్వరరావు గత ఐదేళ్లుగా ఆర్‌బీఐ క్వార్టర్స్ వద్ద టీ-స్టాల్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం టీ-స్టాల్ మూసివేసి ఇంటికెళ్ళి మరుసటి రోజు వచ్చాడు. టీ-స్టాల్ తలుపు తెరవగా నగదు ఉన్న లాకర్ ఓపెన్ అయి ఉంది. అందులో ఉండాల్సిన రూ.8వేలు నగదు కనిపించలేదు. దీంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభినందనలు



శ్యామ్‌చరణ్‌రెడ్డిని సన్మానిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్, అనిల్‌కుమార్‌యాదవ్

లిబర్టీ: యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా గుర్రం శ్యామ్ చరణ్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మందడు అంజన్‌కుమార్‌యాదవ్, యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకులు అరవింద్‌కుమార్‌యాదవ్‌లు అభినందించారు. ఈ సందర్భంగా శ్యామ్‌చరణ్‌రెడ్డి మాట్లాడుతూ యువజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం ఇప్పటికే అనేక ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేసి నిరుద్యోగుల్లో వెలుగులు నింపిందని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో నిరుద్యోగులకు పూర్తి న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు.

40 చోట్ల ఉచిత మంచినీటి శిబిరాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 7,8,9 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న 'ప్రజాపాలన-ప్రజా విజయోత్సవం' కార్యక్రమంలో భాగంగా నెక్లెస్‌రోడ్డు, ఎన్టీఆర్‌మార్గ్, ట్యాంక్‌బండ్‌లపై ఉచిత మంచినీటి శిబిరాలు ఏర్పాటు చేసేందుకు జలమండలి నిర్ణయించింది. ఈ ఏర్పాట్లను శుక్రవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్‌లు పరిశీలించారు. మొత్తం 40 చోట్ల ఉచిత మంచినీటి శిబిరాలు, 24 చోట్ల కియోస్క్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఆరు లక్షల మంచినీటి ప్యాకెట్లను సరఫరా చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎక్కడెక్కడ మంచినీటి శిబిరాలు ఏర్పాటు చేయాలో పరిశీలించారు. ఏర్పాట్లు ఘనంగా ఉండాలని సంబంధిత అధికారులకు ఆయన సూచనలు జారీ చేశారు.

రాజకీయాలకు అతీతంగా సదస్సు




బంజారాహిల్స్: రాజకీయాలకు అతీతంగా ఈ నెల 8వ తేదీన జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో ఇండియన్ అమెరికన్స్ ఫోరం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫోరం అధ్యక్ష, ఉపాధ్యక్షులు డాక్టర్ మహ్మద్ జమీల్, ఎస్. శైలజరావులు తెలిపారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తాము ఇండియన్ అమెరికన్ ఫోరం ఆధ్వర్యంలో చేసిన సేవా కార్యక్రమాలతో పాటు చేయబోయే సేవా కార్యక్రమాలపై ఈ సదస్సులో చర్చించనున్నామని తెలిపారు. ఈ సదస్సుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం, మాజీ జస్టిస్ చంద్రకుమార్‌లతో పాటు పలువురు విద్యావేత్తలు, సామాజికవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

అదనపు కట్నం కోసం వివాహితకు వేధింపులు

ఫిలింనగర్: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఓ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమె భర్తతో పాటు అత్తమామ,ఆడపడుచులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... షేక్‌పేట డైమండ్ హిల్స్‌లో నివసించే యువతి (19)కి గత ఏడాది డిసెంబర్ 21వ తేదీన ఖలీముల్లా ఖలీల్ అహ్మద్‌తో వివాహం జరిగింది. పెళ్లి జరిగిన తర్వాత భర్తతోపాటు ఆమె అత్తమామలు, ఆడపడుచులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. అంతేకాకుండా వివాహ సమయంలో ఇచ్చిన బంగారు ఆభరణాలు కూడా తీసుకున్నారు. అంతటితో ఆగకుండా ఆమె బెడ్‌రూమ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వీడియోలను ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేస్తామని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. వీరందరిపై చర్యలు తీసుకోవాలని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో సగటు వ్యక్తి సమయం ఉద్యోగం, వ్యాపారం, ట్రాఫిక్ తంటాలతోనే సగం గడిచిపోతోంది. డిసెంబర్ వచ్చిందంటే ఉద్యోగులకు సెలవులకు ముగిసిపోయే సమయం ఆసన్నమైందని లెక్కలేసుకుంటారు. మరో వైపు క్రిస్మస్ సెలవులు.. దీంతో సెలవుల్లో ఎలా ఎంజాయ్ చేయాలా అని ప్లాన్ చేసుకుంటున్నారు. ఎత్తయిన కొండల్లో దాగిన సరస్సులు, భూమికి పచ్చని చీరకట్టినట్లుండే టీ, కాఫీ ఎస్టేట్‌లు, భూతల స్వర్గంలా పొగమంచు కమ్మిన ప్రాంతాలవైపు ఆకర్షితులవుతున్నారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు హిల్ స్టేషన్స్ తమ డెస్టినేషన్‌గా ఎంపిక చేసుకుంటున్నారు. ఆధ్యాత్మిక ప్రాంతాలకూ డిమాండ్ ఉందని టూర్ ఆపరేటర్లు పేర్కొంటున్నారు. 5 రోజుల నుంచి వారం రోజుల పాటు సాగే టూర్ రూ.8 వేల నుంచి రూ.15 వేల వరకూ ఛార్జ్ చేస్తున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో





హైదరాబాద్ వైబ్స్

టూరు.. భలే జోరు..



- కూల్ వెదర్‌లో నగరవాసుల ప్రయాణాలు
- ప్రకృతి సోయగాలకు యువత దాసోహం
- సెలవుల్లో హిల్ స్టేషన్లకు పరుగులు
- దక్షిణాదిలోని ఆయా ప్రదేశాలపై స్పెషల్ ఫోకస్

ఆంధ్రప్రదేశ్‌లోని అరకు శీతాకాలంలో దట్టమైన పొగ మంచు, పచ్చని చెట్ల మధ్య సాగే ప్రయాణం.. రహదారులు, గుహల్లోంచి దూసుకుపోయే అద్దాల రైలు ప్రయాణం, రంగురంగుల పూల తోటలు, టీ, కాఫీ ఎస్టేట్స్, వంజంగి కొండపై నుంచి కనిపించే పొగ మంచు పొరలు కన్నులకు విందుగా అనిపిస్తుంది. దేశంలోనే అతి పెద్ద గుహలలో ఒకటైన బొర్రా గుహలు ఇక్కడ చూడొచ్చు. సుమారు 80 మీటర్ల లోతు గుహలో దిగొచ్చు. విశాఖపట్నంలో కైలాసగిరి, ఆర్‌కే బీచ్, అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం, విజయవాడ దుర్గాదేవి దర్శనం చేసుకుని తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.

మండువేసవిలో దట్టమైన మేఘాలు..

ప్రిన్సెస్ ఆఫ్ ది హిల్‌గా ప్రసిద్ధి చెందిన కొడైకెనాల్ తమిళనాడులోనే ఉంది. దట్టమైన అడవులు, ఎత్తయిన పర్వతాల నడుమ సాగే ప్రయాణం, సరస్సులు, జలపాతాలు, పిల్లర్ రాక్, బ్రయంట్ పార్క్ ఇక్కడి ప్రత్యేక ఆకర్షణలు. ఈ పర్వతాలపై మండే వేసవిలో సైతం దట్టమైన మేఘాలు మనల్ని కమ్మేస్తాయి. కొడైకెనాల్‌లో ప్రయాణం చేస్తుంటే.. మేఘాల్లో తేలిన ఫీల్ ఉంటుంది. శీతాకాలంలో అయితే మంచు దుప్పటి కప్పేస్తుంది.

ఇటు ఆహ్లాదం.. అటు ఆధ్యాత్మికం..



ముచ్చటగొలిపే మున్నార్..

కేరళలోని మున్నార్ అంటే మూడు నదులు అని అర్థం. ప్రసిద్ధ ఎరవికులం జాతీయ పార్క్ మున్నార్ సమీపంలోనే ఉంటుంది. టీ ఎస్టేట్స్, మట్టుపెట్టి డ్యాం, ఆహ్లాదకరమైన గ్రీనరీ, ఎత్తయిన కొండలు చూడొచ్చు. ప్రకృతి ప్రేమికులకు ఈ ప్రాంతం నచ్చుతుంది. కేరళలోని మరో ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం వయనాడ్ పడమర కనుమలు, వివిధ రకాల వక్షలు, జంతువులు, కొండల మధ్య ప్రయాణం ఆకట్టుకుంటుంది. చెంబ్రా, బాణాసుర సాగర్ డ్యాం పర్యాటకులకు డెస్టినేషన్‌గా నిలుస్తాయి.

కూర్గ్‌లో ట్రెక్కింగ్..

కర్ణాటక రాష్ట్రంలోని కూర్గ్ ట్రెక్కింగ్ చేయాలనుకునే వారికి ఇది అనువైన ప్రదేశం. కనుచూపు మేరలో ఎటు చూసినా కాఫీ, మిరియాలు, యాలుకల తోటలతో సుమనోహరంగా ఉంటుంది. వైల్డ్ లైఫ్, అబ్బే జలపాతం, నగర్‌హోళె నేషనల్ పార్క్‌లు చూడదగ్గ ప్రదేశాలు. అదే సమయంలో నంది హిల్స్‌పై నుంచి సూర్యోదయం చూసేందుకు ప్రకృతి ప్రేమికులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. బెంగళూరు సమీపంలోని ఈ కొండల్లో భోగనందీశ్వరాలయం ఉంటుంది. నంది కోట ప్రధాన ఆకర్షణ.

ఐదు రోజుల ప్రయాణం అద్భుతం..

ఈ సీజన్‌లో హిల్ స్టేషన్స్ చూడటానికి బాగుంటాయని ఫ్రెండ్స్ టూర్ ప్లాన్ చేద్దామని అడిగారు. కొడైకెనాల్ డెస్టినేషన్. మధ్యలో కొన్ని దేవాలయాలు, ఇతర ప్రదేశాలను సందర్శించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. వెళ్లి రావడానికి 5 రోజులు పట్టింది. కొడైకెనాల్ ప్రయాణం మేఘాల్లో తేలినట్లుంది. మధ్యాహ్నం 12 అయినా అక్కడ రెండు మీటర్ల దూరంలో ఉన్న మనిషి కనిపించే పరిస్థితి లేదు. ఈ టూర్ మంచి అనుభూతినిచ్చింది.

- సాయి హర్ష, మణికొండ



క్వీన్ ఆఫ్ హిల్ స్టేషన్..

తమిళనాడులోని ఊటీని క్వీన్ ఆఫ్ హిల్ స్టేషన్‌గా పిలుస్తారు. స్థానికంగా ఉండే బొటానికల్ గార్డెన్, నీలగిరి కొండలు, పర్వతాల మధ్య సరస్సులు, పచ్చని తోటలు ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తాయి. ఊటీని కొత్త జంటలు హనీమూన్ డెస్టినేషన్‌గా పిలుచుకుంటారు. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 2,240 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఊటీకి సమీపంలోనే కూనూర్ ఉంటుంది. ఇక్కడ డాల్ఫిన్ నోస్, ల్యాంబ్స్ రాక్, టీ ఎస్టేట్స్ చూడొచ్చు.



ఆహ్లాదం.. ఆధ్యాత్మికం రెండూ..

ఈ సీజన్‌లో వెకేషన్, ఆధ్యాత్మికం కలిపి మిక్సడ్ టూర్ ప్లాన్స్ ఉంటున్నాయి. గోవా, రామేశ్వరం, ఊటి, కొడైకెనాల్, పాండిచ్చేరి, మున్నార్, మదురై, అరుణాచలం, శభరిమలై వంటి ప్రదేశాలకు ఎక్కువ మంది ప్యాకేజీలు అడుగుతున్నారు. కొన్ని కుటుంబాలు వాహనం మాట్లాడుకుంటున్నారు.

- భాస్కర్‌రెడ్డి, శ్రీసాయి టూర్స్ అండ్ ట్రావెల్స్



హైలైఫ్ 100 మోడల్స్..



మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం ఏర్పాటు చేసిన హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను మిస్ ఇండియా తెలంగాణ 2024 ప్రకృతి కంబం, నటీమణులు రాశిసింగ్, నిత్యాశెట్టి, నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర యువతను ఆకట్టుకునే విధంగా ప్రత్యేక వస్త్రాభరణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ప్రదర్శనలో దాదాపు 100కి పైగా మోడల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్లు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు మోడల్స్ పాల్గొన్నారు.





వివాహితలకు అందాల జీల్

పోస్టర్ ఆవిష్కరణలో సినీ నటి ఇంద్రజ

ఫిలింనగర్: వివాహితలను ప్రోత్సహించడానికి అందాల పోటీలు నిర్వహించడం అభినందనీయమని అలనాటి హీరోయిన్, నటి ఇంద్రజ అన్నారు. జీ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో వివాహితల కోసం నిర్వహించనున్న మిసెస్ క్వీన్ తెలంగాణ అందాల పోటీల పోస్టర్‌ను ఫిలించాంబర్‌లో హీరోయిన్ రాశితో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. అందాల పోటీలు అనగానే ఎక్కువగా అమ్మాయిలకే నిర్వహిస్తుంటారని, కానీ వివాహితల కోసం జీ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎంతో టాలెంట్ ఉన్నప్పటికీ సరైన ప్రోత్సాహం లేకపోవడంతో చాలా మంది వంటింటికే పరిమితం అవుతున్నారని అన్నారు. పెళ్లయిన స్త్రీలకు ఇదొక మంచి వేదిక అని, టాలెంట్‌ను నిరూపించుకొని సత్తా చాటాలని జీ సంస్థ సీఈవో కిరణ్ పిలుపునిచ్చారు. ఈ నెల 14 నుంచి 21 వరకూ ఈవెంట్ ఆడిషన్స్ జరుగుతాయని, డిసెంబర్ 28న ఫైనల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.



ప్యారడైజ్‌లో రాయల్ ఫెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: వారసత్వ రుచులను ప్యారడైజ్ ఫుడ్స్ సజీవంగా ఉంచుతుందని సినీ నటుడు సందీప్ కిషన్ పేర్కొన్నారు. 'రాయల్ ఫెస్టివల్ సీక్రెట్స్ కిచెన్ ఆఫ్ ప్యారడైజ్' కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. నగరంలోని అన్ని అవుట్ లెట్లలో డిసెంబరు, జనవరి రెండు నెలల పాటు బిర్యానీతో పాటు వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా వంటకాలు అందుబాటులో ఉంచుతారని తెలిపారు. దేశంలో ట్రెడిషనల్ రెసిపీలు కనుమరుగవుతున్నాయని, అటువంటి రుచులను ప్రజలకు అందించేందుకు రాయల్ ఫెస్ట్ కార్యక్రమాన్ని రూపొందించామని ప్యారడైజ్ నేషనల్ కార్పొరేట్ చెఫ్ స్వతంత్ర గౌతమ్ పేర్కొన్నారు.

రికార్డ్ బ్రేక్

సాక్షి, సిటీబ్యూరో : ప్రపంచంలో అత్యంత భారీ కేక్‌ను రూపొందించిన ఘనతను సిటీ బేకింగ్ కంపెనీ సొంతం చేసుకుంది. నగరానికి చెందిన హార్లీస్ ఇండియా బేకింగ్ కంపెనీ రూపొందించిన అత్యంత భారీ కేక్‌ను కొండాపూర్‌లోని మాయా కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ప్రదర్శించింది. ఈ కేక్ 2,254 కిలోల బరువు, 70 అడుగుల వెడల్పుతో రూపొందిందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద రష్యన్ మెడోవిక్ హనీ కేక్ గతంలో స్పిన్నీస్ దుబాయ్ కంపెనీ రికార్డును బద్దలు కొట్టామని సంస్థ ఎండీ సురేష్‌నాయక్ వివరించారు. కేక్ రూపకల్పనలో 500 మందికి పైగా బేకర్లు, చెఫ్‌లు, సహాయక సిబ్బంది పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలు రిషినాథ్, నిఖిల్ శుక్లా సంస్థకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యక్ష బేకింగ్ సెషన్స్, సంగీత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.





పర్యావరణ హితానికే.. 1.5 మేటర్స్..

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ వాతావరణ మార్పులను ఎదుర్కోడంలో భిన్న వర్గాలను ఏకతాటిపైకి తెస్తూ గ్లోబల్ వార్మింగ్ 1.5కి పరిమితం చేయడానికి 1.5 మేటర్స్ పేరుతో సరికొత్త పర్యావరణహిత కార్యక్రమం రూపొందింది. దీనిని మాదాపూర్‌లోని టి-వర్క్స్‌లో శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వాలు, కార్పొరేషన్లు, విద్యా సంస్థలు, యువ ఛేంజ్ మేకర్స్‌ను ఈ 1.5 మేటర్స్ కలుపుకుని ముందుకు వెళ్లనుందని, దేశమంతా అనుసంధానించే ఒక పర్యావరణ పరిరక్షణ వేదికగా దీన్ని రూపుదిద్దుతామని కాన్సెప్ట్ రూపకర్త, వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్ వ్యవస్థాపకులు మానవ్ సుభోద్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్ లాంచ్‌లో రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్ పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్.. అక్షర రూపం..



- ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులు
- తమ భావాలను పంచుకునే వేదికగా

బ్రి బుక్స్ వెబ్‌సైట్‌లో రచయితల ఆలోచనలు



బంజారాహిల్స్: కథలు, కవితలు, నవలలు.. గతంలో ఇవి రాయాలంటే పెన్ను, పేపర్ ఉండాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు కంప్యూటర్ పైకి వెళ్లి వెబ్ పేజీలో తమ ఆలోచనలకు అక్షర రూపం ఇవ్వొచ్చు. ఇప్పుడు చాలా మంది ఈ వేదికను వినియోగించుకుంటూ తమ ఆలోచనలను కథలు, కవితల రూపంలో పంచుకుంటున్నారు. బ్రి బుక్స్ వెబ్‌సైట్‌లోకి వెళ్తే.. మనం అనుకున్న కథను లేదా కవితకు అక్షర రూపం ఇవ్వవచ్చు. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకూ తాము అనుకున్న కథను చక్కగా పొందుపరుస్తున్నారు. ఇటీవల కాలంలో చాలా మందికి బ్రి బుక్స్ రాయాలన్న ఆలోచన అంతా ఇంతా కాదు. జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్లో 12వ తరగతి చదువుతున్న ప్రతమ్ అనే విద్యార్థికి ఓ రోజు వచ్చిన కలకు అక్షర రూపం ఇచ్చాడు. 'అంతరిక్షంలో నా సాహసం' అనే ఈ పుస్తకానికి విశేష ఆధరణ లభించింది. కేవలం ఈ వెబ్‌సైట్ చూడటమే కాకుండా ఏవైనా కొనుగోలుచేయాలంటే వాటిని ముద్రించి కూడా పుస్తకాల రూపంలో అందిస్తున్నారు. 8వ తరగతి చదువుతున్న శ్రద్ధ పావులూరి రాసిన మాయాగ్ని (మ్యాజికల్ ఫ్లేమ్) అనే పుస్తకానికి విశేష ఆదరణ లభించింది. ఆమె బ్రి బుక్స్‌లో రాసిన ఈ కథ ప్రపంచవ్యాప్తంగా ఆధరణ చూరగొనడమే కాకుండా ప్రశంసలు కూడా లభించాయి.

14 పేజీలకు మించకుండా..


బ్రి బుక్స్ వెబ్‌సైట్ ఎవరైనా ఉచితంగా వినియోగించుకోవచ్చు. ఇందులో ఇంగ్లిష్‌లో తమ రచనలకు అక్షర రూపం ఇవ్వొచ్చు. ఏదైనా 14 పేజీలకు మించకుండా టైప్ చేయాల్సి ఉంటుంది. వీక్షకుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని ఎవరైనా పుస్తకం కావాలనుకుంటే ముద్రించి విక్రయిస్తారు. ఈ పుస్తకాలకు అమేజాన్‌లో భారీ డిమాండ్ ఉంటుంది. ప్రచురితమైన కథ లేదా కవితకు ఎవరైనా అభిప్రాయాలు వెల్లడించవచ్చు.

నా కలకు అక్షర రూపం..

ఓ రోజు నాకు ఓ కల వచ్చింది. నేను అంతరిక్షంలోకి వెళ్లాను. అక్కడి నుంచి భూమికి రావాలంటే నన్ను గ్రహాంతర వాసులు అడ్డుకోసాగారు. నా తెలివితేటలతో వారిని తప్పించుకొని భూమిపైకి వచ్చాను. దీనికి అక్షరరూపం ఇస్తే బాగుంటుంది అనిపించి బ్రి బుక్స్‌లో రాశాను. దీనిపై పుస్తకాలు కూడా ముద్రించాను. చాలా మంది వీటిని కొనుగోలు చేస్తున్నారు. చదివిన వారు ప్రశంసిస్తూ పోస్టులు పెట్టారు. మరో కథ రాయడానికి ఇది స్ఫూర్తినిచ్చింది.

- ప్రతమ్, 12వ తరగతి బీవీబీపీ స్కూల్





నా ఆలోచనలకు వేదికగా..

నేను కథలు బాగా చదువుతాను. కవితలు కూడా రాస్తాను. అయితే వీటిని పేపర్‌పై పెట్టాలంటే ఇప్పుడున్న బిజీ లైఫ్‌లో చాలా కష్టం. ఈ పరిస్థితుల్లో బ్రి బుక్స్ నా ఆలోచనలకు ఒక వేదికగా నిలిచింది. ఇటీవల నేను రాసిన కథ చాలా మందిని ఆకట్టుకుంది. పుస్తకరూపంలో తీసుకొచ్చాను. కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు, వీక్షకులు దీన్ని చదవడం ఆనందంగా ఉంది.

- సంజన, విద్యార్థిని



ఎవరైనా రాయవచ్చు

బ్రి బుక్స్ చక్కని వేదిక. కంప్యూటర్ ముందు కూర్చొని కీ బోర్డుపై వేళ్లు కదుపుతూ మన ఆలోచనలకు అక్షర రూపం ఇవ్వొచ్చు. ప్రస్తుతం నవలలు రాస్తున్నాను. ఒకప్పుడు రాయాలనుకున్నా.. సమయం ఉండేది కాదు. ఇప్పుడు తీరిక సమయంలో రాయాలనుకున్న కథలు, నవలలను రాసేందుకు ఈ వేదిక అవకాశం కల్పిస్తోంది.

- మధుమతి, ఉపాధ్యాయురాలు

భూముల ధరలు పెరగడం, నిర్మాణ సామగ్రి ధరలు, కార్మికుల వేతనాల భారం.. వంటి రకరకాల కారణాలతో సామాన్యులకు హైదరాబాద్‌లో సొంతిల్లు అనేది అందనంత దూరంలో ఉంటోంది. 2–3 ఏళ్ల క్రితం వరకు కూడా దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోనే గృహాలు అందుబాటు ధరల్లో ఉండేవి. కానీ, హైరైజ్ అపార్ట్‌మెంట్లు, ఆధునిక వసతుల కల్పనతో కూడిన లగ్జరీ హోమ్స్ నిర్మాణంలో బిల్డర్లు పోటీపడుతుండటంతో కోట్లు వెచ్చిస్తే గానీ సొంతింటి కల సాకారం కానీ పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో సామాన్యుల సొంతింటి కల నెరవేరడానికి దగ్గరి దారిని చూపించే ప్రాంతాలపై 'సాక్షి రియల్టీ'ప్రత్యేక కథనం... –సాక్షి, సిటీబ్యూరో



బడ్జెట్ హోమ్స్ కావలెను!

రూ.50 లక్షల లోపు ధర ఉండే ఇళ్లకు ఆదరణ

పోటాపోటీగా గృహాల రేట్లను పెంచేసిన బిల్డర్లు	సామాన్య, మధ్యతరగతి ఇళ్లకు నేటికీ గిరాకీ
అద్దెను ఈఎంఐగా చెలిస్తే ఇల్లు సొంతం	వెస్ట్ హైదరాబాద్ మినహా అన్ని వైపులా ఈ నిర్మాణాలు

రెండు బెడ్‌రూమ్స్, కిచెన్, హాల్, టాయిలెట్స్‌తో 700 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే బడ్జెట్ హోమ్స్‌కు ఇప్పటికీ ఆదరణ ఉంది. చిన్న వ్యాపారులు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, మధ్యస్థాయి ఉద్యోగులు వంటి సామాన్య, మధ్యతరగతి వర్గాలు సొంతింటి కలను బడ్జెట్ హోమ్స్‌తో తీర్చుకుంటారు. అద్దెకు ఉండే బదులు అదే అద్దెసొమ్మును నెలవారీ వాయిదా(ఈఎంఐ) రూపంలో చెల్లిస్తే సొంతిల్లు సొంతమవుతుందనేది వారి ఆలోచనగా ఉంటుంది. దీంతో రూ.50 లక్షలలోపు ధర ఉండే గృహాలకు డిమాండ్ బాగా పెరిగింది.

ఏ ప్రాంతాల్లో కొనొచ్చంటే...

మాదాపూర్, నార్సింగి, నానక్‌రాంగూడ, కోకాపేట వంటి పశ్చిమ హైదరాబాద్ మినహా మిగిలిన మూడు జోన్లలో ఇప్పటికీ సామాన్యులకు రూ.50 లక్షలలోపు ధర ఉండే అఫర్డబుల్ గృహాలు దొరుకుతున్నాయి. ఇబ్రహీంపట్నం, నాగార్జునసాగర్ రోడ్, హయత్‌నగర్, పోచారం, ఘట్‌కేసర్, కీసర, శామీర్‌పేట వంటి ప్రాంతాల్లో బడ్జెట్ హోమ్స్ కొనుగోలు చేయవచ్చు. ఔటర్ లోపల ఉండే నివాస ప్రాంతాల్లోని గేటెడ్ కమ్యూనిటీల్లో ఎంపిక చేసుకోవడం ఉత్తమం. వీటిల్లో క్లబ్ హౌస్, వాకింగ్ ట్రాక్స్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా వంటివి ఉండేలా చూసుకోవాలి. దీంతో ఇల్లు చిన్నగా అనిపించినా, చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది.


పీఎంఏవైను సవరించాలి..

లాభం ఉందంటే అఫర్డబుల్ హౌసింగ్ ప్రాజెక్ట్‌లను చేపట్టేందుకు డెవలపర్లు కూడా ముందుకొస్తారు. అఫర్డబుల్ హౌసింగ్ ప్రాజెక్ట్‌లకు ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు అందించాలి. దీంతో డెవలపర్లలో విశ్వాసం పెరుగుతుంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) పథకం నిబంధనలను సవరించాలి. అన్ని రాష్ట్రాలకు ఒకే విధమైన నిబంధనల వర్తింపు సరికాదు. ఎందుకంటే... 700 చదరపు అడుగుల ఫ్లాట్ అంటే ముంబైలో లగ్జరీ అపార్ట్‌మెంట్. దానిని హైదరాబాద్‌లో బడ్జెట్ హోమ్‌గా పరిగణిస్తుంటారు. అందుకే పీఎంఏవై స్కీమ్ ప్రయోజనాలను గృహ కొనుగోలుదారుల ఆదాయాన్ని బట్టి కాకుండా అపార్ట్‌మెంట్ విస్తీర్ణాన్ని బట్టి వర్తింపజేయాలి. దీంతో ఎక్కువ మంది ఈ పథకానికి అర్హత పొందుతారు.

కొనే ముందు వీటిని పరిశీలించాలి..

- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి విభాగాల నుంచి నిర్మాణ అనుమతులతోపాటు రెరా రిజిస్ట్రేషన్ ఉన్న ప్రాజెక్ట్‌లలోనే కొనుగోలు చేయాలి.
- ప్రమోటర్లు, బిల్డర్ల పాత చరిత్ర చూడాలి. ప్రాజెక్ట్‌లను పూర్తి చేసే ఆర్థిక శక్తి నిర్మాణ సంస్థకు ఉందా లేదో పరిశీలించాలి.
- రోడ్డు, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి కనీస మౌలిక వసతులు ఉన్న ప్రాంతాల్లో కొనుగోలు చేయడం ఉత్తమం
- బడ్జెట్ హోమ్స్ ప్రాజెక్ట్‌లకు సమీపంలో విద్యాసంస్థలు, ఉపాధి అవకాశాలు ఉన్న ప్రాంతాలను ఎంచుకోవడం మంచిది.

వేగంగా అనుమతులివ్వాలి



బడ్జెట్ హోమ్స్‌తో రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది. సొంతింటి కోసం ప్రభుత్వం ఆదాయపడాల్సిన అవసరం, ధనిక, పేద తరగతి మధ్య వ్యత్యాసం తగ్గుతాయి. ఈ తరహా నిర్మాణాలకు అనుమతులు త్వరితగతిన జారీ చేయాలి. ఈ ఇళ్ల రిజిస్ట్రేషన్లలో స్టాంప్ డ్యూటీని తగ్గించాలి. బ్యాంక్‌లు కూడా బడ్జెట్ గృహ కొనుగోలుదారులను ప్రోత్సహించేలా వడ్డీరేట్ల తగ్గింపు, రుణ నిబంధనల సడలింపులతో ప్రత్యేక పథకాన్ని తీసుకురావాలి.

– జక్కా వెంకట్‌రెడ్డి, ఏవీ కన్‌స్ట్రక్షన్స్

గృహ కొనుగోలు నిర్ణయానికి పట్టిన రోజులు:							
ఆర్థిక సంవత్సరం	2019	2020	2021	2022	2023	2024	2025
రోజులు	25	26	33	27	30	25	26



26 రోజుల్లోనే ఇంటి డెసిషన్!

సొంతింటి నిర్ణయానికి పట్టే సమయమిదీ..

- ఆర్థికంగా సన్నద్ధమయ్యాకే ప్రాపర్టీల అన్వేషణ
- ప్రాంతం, వసతులు నచ్చితే చాలు..
- రూ.3 కోట్ల ధర ఉన్న ప్రాపర్టీలకు కేవలం 15 రోజుల్లోనే..
- ప్రాపర్టీ కన్సల్టెన్సీ అనరాక్ అధ్యయనంలో వెల్లడైన అంశాలు

సాక్షి, సిటీబ్యూరో: ఇల్లు కొనే ముందు సవాలక్ష ఎంక్వైరీలు, చర్చలు, లాభనష్టాల బేరీజులు... ఇలా చాంతాడంత లిస్టే ఉంటుంది. కానీ, నేటి యువ తరం గృహ కొనుగోలు నిర్ణయాన్ని చిటికేసినంత ఈజీగా తీసేసుకుంటున్నారు. నాణ్యత, ప్రాంతం, వసతులు నచ్చితే చాలు ధర గురించి ఆలోచించకుండా ముందుకెళ్లిపోతున్నారు. మూడేళ్ల క్రితం వరకు ఇంటి కొనుగోలు నిర్ణయానికి 33 రోజుల సమయం పడితే.. ఈ ఆర్థిక సంవత్సరం అర్ధ వార్షికం(హెచ్1) నాటికి కేవలం 26 రోజుల్లోనే డెసిషన్ తీసుకుంటున్నారు.

- మనదేశంలో అత్యంత ప్రాధాన్య పెట్టుబడి స్థిరాస్తి రంగమే. ప్రాపర్టీ అన్వేషకులు కొనుగోలుదారులుగా మారేందుకు పట్టే సమయం పై ప్రాపర్టీ కన్సల్టెన్సీ అనరాక్ అధ్యయనం చేసి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించింది. 2019, 2024 ఆర్థిక సంవత్సరంలో ఈ కొనుగోలు సమయం కేవలం 25 రోజులుగా ఉంది. 2021 కోవిడ్ మహమ్మారి సమయంలో గరిష్టంగా 33 రోజుల సమయం పట్టింది.

డిమాండ్‌తో వేగంగా నిర్ణయం



కోవిడ్ తర్వాతి నుంచి విశాలైన గృహాలు, హైఎండ్ ప్రాజెక్ట్‌లకు డిమాండ్ పెరిగింది. ఈ విభాగంలో ఇళ్లు వేగంగా అమ్ముడవుతున్న కారణంగా కస్టమర్లు కొనుగోలు నిర్ణయాన్ని వేగంగా తీసుకుంటున్నారు.

– ప్రశాంత్‌రావు, డైరెక్టర్, పాలోమీ ఎస్టేట్స్

వేగానికి కారణమిదే...

ఆర్థికంగా సన్నద్ధమయ్యాకే ప్రాపర్టీలను కొనేందుకు ముందుకొస్తున్నారు. కొన్నేళ్లుగా మార్కెట్‌లో బ్రాండెడ్ డెవలపర్ల నుంచి గృహాల విక్రయాలు పెరిగాయి. నిర్మాణంలో నాణ్యత, గడువు లోగా పూర్తి చేస్తారనే విశ్వాసం ఆయా సంస్థలపై ఉండటంతో కొనుగోలుదారులు త్వరితగతిన నిర్ణయాలు తీసుకుంటున్నారు.

రూ.3 కోట్లయినా చిటికెలో నిర్ణయం..

సాధారణంగా గృహ కొనుగోలులో ధరకే అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. కానీ, యువ కస్టమర్లు ధర గురించి పట్టించుకోవట్లేదు. రూ.3 కోట్ల ధర ఉన్న అల్ట్రా లగ్జరీ గృహాల ఎంపికకు అతి తక్కువగా, కేవలం 15 రోజుల్లోనే నిర్ణయం తీసుకుంటున్నారు. రూ.1–3 కోట్ల ధర ఉన్న ఇళ్లకు 27 రోజులు, రూ.50 లక్షల నుంచి రూ.కోటి రేటు ఉన్న యూనిట్ల కొనుగోలుకు ఏకంగా 30 రోజులు సమయం తీసుకుంటున్నారు.

సేల్ అగ్రిమెంటే కీలకం!

సొంతింటి కల సాకారమా? చెదురుతుందా? అనేది చెప్పవచ్చు



సాక్షి, సిటీబ్యూరో: సొంతింటి కల సాకారంలో కస్టమర్‌తో బిల్డర్ చేసుకునే సేల్ అగ్రిమెంట్ అత్యంత కీలకం. ఒప్పందపత్రంలోని నిబంధనలు, షరతులను బట్టి మన కల తీరుతుందో లేక మధ్యలోనే పటాపంచలవుతుందో ఇట్టే చెప్పేయొచ్చు. అందుకే మనిషికి హృదయ స్పందనలాగే డెవలపర్‌కు, కొనుగోలుదారులకు మధ్య జరిగే సేల్ అగ్రిమెంట్ అంతకంటే ముఖ్యమని తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ–రెరా) సభ్యులు కె.శ్రీనివాస రావు అంటున్నారు. ఆయనతో 'సాక్షి రియల్టీ' ఇంటర్వ్యూ విశేషాలివీ..

బహుళ అంతస్తుల నిర్మాణసంస్థలన్నీ తమకు అనుకూలమైన నిబంధనలను, షరతులను పొందుపరిచి కస్టమైజ్డ్ అగ్రిమెంట్లను రూపొందించి కస్టమర్లతో సేల్ అగ్రిమెంట్ చేసుకుంటున్నాయి. ఇలాంటి వాటిపట్ల గృహ కొనుగోలుదారులు అప్రమత్తంగా వ్యవహరించాలి. పెట్టుబడులకు భద్రత, రక్షణ ఉండాలంటే రెరా రిజిస్ట్రేషన్ ఉన్న ప్రాజెక్ట్‌ల్లో కొనుగోలు చేయడం ఉత్తమం. తక్కువ ధరకు వస్తుందనో, ఆఫర్లు ఇస్తున్నారనో ప్రీలాంచ్, బై బ్యాక్ స్కీమ్స్ వలలో చిక్కితే రోడ్డున పడతారు.

సలహాకు చాలామంది కస్టమర్లు చిక్కుతున్నారు. అయితే సెమీ ఫర్నీష్ ఫ్లాట్‌ను పూర్తి ఫర్నీష్‌గా ఎప్పుడు చేస్తారనే విషయంపై బిల్డర్‌తో సప్లిమెంటరీ అగ్రిమెంట్ చేసుకోవాలి. లేకపోతే రిజిస్ట్రేషన్ అయిపోయిందంటూ టైల్స్, పెయింటింగ్ వంటి తుది మెరుగులు దిద్దకుండా అసంపూర్తి ఫ్లాట్‌నే కస్టమర్‌కు అప్పగించి బిల్డర్లు చేతులు దులుపుకుంటారు. కస్టమర్ల నుంచి వసూలు చేసే కార్పస్ ఫండ్‌ను బిల్డర్ తీసుకోరాదు. అసోసియేషన్‌కు ప్రత్యేకంగా ఎస్క్రో బ్యాంక్ ఖాతాను తెరిచి, వడ్డీతోసహా కార్పస్ ఫండ్‌ను అందులో జమ చేయాలి.

కస్టమర్ల అనుమతి తప్పనిసరి..

కస్టమర్‌తో ఒప్పందం చేసుకున్నాక ప్రాజెక్ట్ లేదా ఫ్లాట్ డిజైనింగ్, ఎలివేషన్ వంటి వాటిల్లో బిల్డర్ ఏమైనా మార్పులు చేయాలంటే 2/3 వంతు కస్టమర్ల అనుమతి తప్పనిసరి. ప్రాజెక్ట్ నిర్మాణాన్ని బిల్డర్ బ్యాంక్ రుణంతోనే కడుతున్నప్పుడు కస్టమర్లు బిల్డర్‌కు పోస్ట్ డేటెడ్ చెక్స్ అందజేయాల్సిన అవసరం లేదు. అంతేకాకుండా డెవలపర్లు కస్టమర్ల నుంచి 10 శాతానికి మించి టోకెన్ అమౌంట్‌ను వసూలు చేయకూడదు.



నిర్మాణం ఆలస్యమైతే వడ్డీ చెల్లించాల్సిందే..

నిర్మాణ దశలను బట్టి డెవలపర్లకు బ్యాంక్ నిధులను విడుదల చేస్తుంది. రెరా నిబంధనల ప్రకారం ఆయా నిధులను ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాలో జమ చేసి, ఆ నిర్మాణ పనుల కోసం మాత్రమే వినియోగించాలి. అయితే డెవలపర్లు నిధులను ఇతర ప్రాజెక్ట్‌లు, అవసరాలకు మళ్లిస్తుండటంతో ప్రాజెక్ట్ తుదిదశకు చేరుకునే సరికి నిధులు సరిపడాలేక అది ఆగిపోతుంది. మరోవైపు నిధులు పూర్తిగా విడుదల కాగానే కస్టమర్‌కు బ్యాంక్ నుంచి నెలవారీ వాయిదా (ఈఎంఐ) చెల్లించడం ప్రారంభమవుతుంది. కానీ, కస్టమర్‌కు ఆ టైంకు ఫ్లాట్ చేతికి రాదు. గృహ ప్రవేశం చేయలేరు. దీంతో బయట అద్దె, ఫ్లాట్‌కు ఈఎంఐ చెల్లించడం కస్టమర్‌కు అదనపు భారంగా మారుతుంది. గడువులోగా ప్రాజెక్ట్‌లను పూర్తి చేయని డెవలపర్లు ఆలస్యం అయిన కాలానికి 10.25 శాతం వడ్డీని కస్టమర్‌కు చెల్లించాల్సిందే. ఒకవేళ సమయానికి కస్టమర్లు బిల్డర్‌కు సొమ్ము చెల్లించకపోతే వారు కూడా 10.25 శాతం వడ్డీని డెవలపర్‌కు అందజేయాల్సిందే.

కార్పస్ ఫండ్ అందజేయాలి..

సెమీ ఫర్నీష్ ఫ్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేసుకుంటే రూ.2 లక్షలు, 3 లక్షల మేర రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గుతాయనే బిల్డర్ల ఉచిత

- బిల్డర్ల కస్టమైజ్డ్ అగ్రిమెంట్లతో మోసపోవద్దు
- కార్పస్ ఫండ్‌ను అసోసియేషన్ ఖాతాలో జమ చేయాలి
- నిర్మాణం ఆలస్యమైతే 10.25 శాతం వడ్డీని కస్టమర్‌కు చెల్లించాల్సిందే..
- రెరా రిజిస్ట్రేషన్ ఉన్న ప్రాజెక్టుల్లోనే కస్టమర్ల పెట్టుబడులకు భద్రత
- తక్కువ ధరకు వస్తుందనో, ఆఫర్లు ఇస్తున్నారనో మోసపోవద్దు

టీజీ– రెరా సభ్యుడు కె.శ్రీనివాసరావు వెల్లడి

భూ యజమానికి చిక్కులు..

నిర్మాణం పూర్తయ్యాక ఫ్లాట్ పొజిషన్‌కు కస్టమర్‌కు రెరా చట్టం ప్రకారం 2 నెలల సమయం ఉంటుంది. కానీ, 15 రోజుల్లోనే పొజిషన్ తీసుకోవాలని బిల్డర్లు కస్టమర్లను ఒత్తిడి చేస్తుంటారు. ఇంటీరియర్ పనులు, వ్యక్తిగత కారణాల వల్ల కొందరు కస్టమర్లు పొజిషన్ తీసుకోవడంలో ఆలస్యం చేస్తుంటారు. మరికొందరు పొజిషన్ తీసుకుంటే అపార్ట్‌మెంట్ నిర్వహణ వ్యయం చెల్లించాల్సి ఉంటుందని ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తుంటారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి స్థల యజమానితో బిల్డర్ ఒప్పందం చేసుకుంటే రెరా చట్టం ప్రకారం డెవలపర్ కూడా ప్రమోటరే అవుతారు. కాబట్టి ఇరువురి మధ్య జరిగే అగ్రిమెంట్లు పారదర్శకంగా ఉండాలి. లేకపోతే భూ యజమానికి కూడా చిక్కులు తప్పవు.

అక్టోబర్‌లో.. రియల్ బ్యాక్!

గ్రేటర్‌లో పెరుగుతున్న రిజిస్ట్రేషన్లు

- సెప్టెంబర్ కంటే అక్టోబర్‌లో 20 శాతం వృద్ధి
- రూ.3,617 కోట్ల విలువైన ప్రాపర్టీల అమ్మకం
- 14 శాతం వాటా రూ.కోటి కంటే ఎక్కువ ధర ఉన్నవే...

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రియల్ ఎస్టేట్ మార్కెట్ మళ్లీ పుంజుకుంది. వరస ఎన్నికలు, కొత్త ప్రభుత్వ విధానాలు, అంతర్జాతీయ మార్కెట్‌లో ఆర్థిక ఒడిదుడుకుల నేపథ్యంలో ఏడాదిన్నర కాలంగా నగర స్థిరాస్తి రంగంలో కొంతకాలంగా ప్రతిష్టంభన నెలకొంది. అయితే, ఇటీవల ప్రభుత్వం కుదురుకోవటం, ఆర్థిక స్థిరత్వం చేకూరడం, అనుకూలమైన వడ్డీ రేట్లు ఉండటంతో కొనుగోలుదారుల్లో విశ్వాసం పెరిగింది. దీంతో గృహ విక్రయాలు ప్రతి నెలా పెరుగుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సెప్టెంబర్‌లో రూ.2,820 కోట్ల విలువైన 4,903 అపార్ట్‌మెంట్లు రిజిస్ట్రేషన్ కాగా.. అక్టోబర్ నాటికి రూ.3,617 కోట్ల విలువైన 5,894 యూనిట్లు అమ్ముడుపోయాయి. నెలరోజుల్లో ప్రాపర్టీ వ్యాల్యూలో 28 శాతం, విక్రయాల్లో 20 శాతం వృద్ధి నమోదైందని నైట్‌ఫ్రాంక్ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది.



14 శాతం వాటా లగ్జరీదే..

గ్రేటర్‌లో గతేడాది జనవరి–అక్టోబర్ మధ్య కాలంలో రూ.30,464 కోట్ల విలువైన 58,390 యూనిట్లు అమ్ముడుపోయాయి. ఈ ఏడాది అదే 10 నెలకాలంలో 65,280 అపార్ట్‌మెంట్లను విక్రయించారు. వీటి విలువ రూ.40,078 కోట్లు. గత నెలలో అమ్ముడైన వాటిల్లో రూ.కోటి విలువైన, 2 వేల చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న లగ్జరీ గృహాలదే 14 శాతం వాటా. గత నెలలో రూ.497 కోట్ల విలువైన 811 లగ్జరీ యూనిట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. రూ.50 లక్షల నుంచి రూ.కోటి ధర ఉన్న 1,601 ప్రాపర్టీలు, రూ.50 లక్షల లోపు ధర ఉన్న 3,482 యూనిట్లు అమ్ముడుపోయాయి.

ఈ ఏడాది నెలవారీగా రిజిస్ట్రేషన్లు...

నెల	యూనిట్లు	విలువ (రూ.కోట్లలో)
జనవరి	5,444	3,293
ఫిబ్రవరి	7,135	4,362
మార్చి	6,870	4,275
ఏప్రిల్	6,696	4,310
మే	6,062	3,760
జూన్	7,056	4,314
జులై	8,781	5,285
ఆగస్టు	6,439	4,043
సెప్టెంబర్	4,903	2,820
అక్టోబర్	5,894	3,617



'లెస్ లగేజ్.. మోర్ కంఫర్ట్'

ప్రయాణానికే కాదు.. ఇంటికీ వర్తిస్తుంది!	ఇంటీరియర్‌పై పెరిగిన ఆసక్తి

సాక్షి, సిటీబ్యూరో: 'లెస్ లగేజ్.. మోర్ కంఫర్ట్'.. ఇది ప్రయాణాలకే కాదు ఇంటికీ వర్తిస్తుంది. విశాలమైన గృహాలలో ప్రతీ వస్తువు, అవసరానికీ ప్రత్యేకంగా స్థలం ఉంటుంది. ఎటొచ్చీ తక్కువ స్థలం ఉండే చిన్న ఇళ్లలోనే ఇబ్బందులు, సవాళ్లు ఎదురవుతాయి. నేర్పుగా కొన్ని మెళకువలు పాటిస్తే చాలు.. చిన్న ఇంటినైనా అందంగా తీర్చిదిద్దొచ్చు. డబుల్ బెడ్‌రూమ్ కొనుక్కునే స్వల్ప ఆదాయ వర్గాలు తక్కువ స్థలంలో ఎక్కువ సామాను పట్టేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. లేకపోతే అవసరమైన సామాన్లతోనే ఇళ్లంతా చిందరవందరగా తయారవుతుంది. ఈ నేపథ్యంలో ఇల్లు స్టైలిష్‌గా, ట్రెండీగా ఉండేందుకు నగరవాసులు ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు.

- గతంలో మాదిరిగా టీవీలకు, పుస్తకాలకు వేర్వేరుగా స్టాండ్లు, అల్మరాల అవసరం లేకుండా పోయింది. ఇంటి నిర్మాణంలోనే ప్రత్యేక ఆకర్షణగా ఉండేలా వీటిని ఏర్పాటు చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. టీవీలను గోడలకు అమర్చుకునే సదుపాయం ఎలాగూ ఉంది. దుస్తులతోపాటు చిన్న చిన్న సామాన్లను సైతం నిల్వ చేసేలా రెండు డోర్లతో స్లైడింగ్ వార్డ్‌రోబ్ కోసం ఆసక్తి చూపుతున్నవారు పెరుగుతున్నారు. దీంతో నైపుణ్యం, ప్రత్యేకత కలిగిన ఇంటీరియర్ డిజైనర్ల డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కొనుగోలుదారుల అభిరుచుల కనుగుణంగా నిర్మాణ సంస్థలు సైతం వీటికి ప్రాధాన్యం ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడుతోంది.



ఇల్లే ఆఫీసు..

కోవిడ్ నేపథ్యంలో మారిన పరిస్థితులతో హోమ్ కమ్ ఆఫీస్‌గా ఉండేలా తమ ఇంటిని మలుచుకుంటున్న వారు కూడా పెరిగిపోతున్నారు. ఆన్‌లైన్‌లో వివిధ పనులు చేస్తున్న వారూ పెరిగిపోయారు. వర్క్ ఫ్రమ్ హోమ్ అనేది కామన్‌గా మారుతోంది. జీహెచ్ఎంసీ వంటి ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ–ఆఫీస్ అమల్లోకి రావడంతో వాటిల్లో పనిచేసే ఉద్యోగులు ఇళ్ల నుంచే పనులు చేసే సౌలభ్యం ఏర్పడింది. పిల్లలకు సైతం ఆన్‌లైన్ క్లాస్‌లు జరుగుతుండటంతో కంప్యూటర్ నిత్యావసరంగా మారింది. అందుకు తగ్గట్టుగా అనువైన టేబుల్, కుర్చీలు తక్కువ స్థలంలోనే పట్టేవాటి కోసం చూస్తున్నారు. తమ అభిరుచికి తగ్గట్టుగా, ఉన్న స్థలంలో ఎక్కువ స్థలం ఆక్రమించకుండా అందంగా అమర్చేలా ఇళ్లను తీర్చిదిద్దగల ఇంటీరియర్ డిజైనర్లు, ఆర్కిటెక్టులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తమ టేస్ట్ ప్రతిబింబించేలా నివాసాన్ని తీర్చిదిద్దుకుంటున్నారు.

క్లుప్తంగా...

రాష్ట్రంలో కొత్తగా 7 నవోదయ పాఠశాలలు

కేంద్ర మంత్రివర్గం ఆమోదం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కొత్తగా ఏడు నవోదయ పాఠశాలల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం రాత్రి జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర సమాచారశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. జగిత్యాల, నిజామాబాద్, కొత్తగూడెం భద్రాద్రి, మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, సూర్యాపేటలో కొత్తగా నవోదయ పాఠశాలలను కేంద్ర నెలకొల్పనుంది. దేశవ్యాప్తంగా మొత్తం 28 నవోదయ పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

నీ వెంటే నేనూ..

తండ్రి మరణంతో కొడుకు ఆత్మహత్య


రాములు (ఫైల్)


శ్రీశైలం (ఫైల్)

సంస్థాన్ నారాయణపురం: తండ్రి మృతి చెందాడని మనస్తాపానికి గురైన కుమారుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గ్రామంలో శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలివి. సర్వేల్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కాటం రాములు అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. రాములు అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. మృతుని కుమారుడు శ్రీశైలం (40) వ్యవసాయ పనులు చేస్తూ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. తండ్రి రాములు మృతితో తీవ్ర మనస్తాపం చెందిన శ్రీశైలం.. అంత్యక్రియలు ముగిసిన వెంటనే గ్రామంలోని ఒక వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

1,921 మంది మానసిక రోగులకు బెంగళూరులో చికిత్స

లోక్‌సభలో కేంద్రసహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు చెందిన 1,921 మంది మానసిక రోగులకు బెంగళూరులోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ అండ్ న్యూరోసైన్సెస్ (ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్) చికిత్స అందించామని కేంద్రం తెలిపింది. 2023–24లో వీరికి ఓపీడీ, ఐపీడీ, ఎమర్జెన్సీ, క్యాజువాలిటీ సేవలు అందించామని వెల్లడించింది. లోక్‌సభలో శుక్రవారం బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు.. కేంద్ర ఆరోగ్య శాఖ సహాయమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ సమాధానం ఇచ్చారు. బెంగళూరులోని ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్‌లో దేశంలోని ఏ రాష్ట్రానికి చెందిన రోగి చేరినా.. అందరికీ సమానంగా వైద్య సేవలు అందుతాయని ప్రతాప్ జాదవ్ స్పష్టం చేశారు.

పిచ్చికుక్కల దాడిలో బాలికకు గాయాలు



కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని చిద్నెపల్లి గ్రామ ప్రధాన రహదారిపై శుక్రవారం పిచ్చి కుక్కలు వీరంగం సృష్టించాయి. గ్రామానికి చెందిన రెండో తరగతి చదువుతున్న మంథెన లాస్యశ్రీపై దాడి చేసి గాయపర్చాయి. సమీపంలోని ప్రభుత్వ పాఠశాలకు ఉదయం నడుచుకుంటూ వెళ్తున్న బాలికపై మూడు కుక్కలు ఒక్కసారిగా దాడికి దిగడంతో తల పైభాగంలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కుక్కలను తరిమికొట్టి చిన్నారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు.

ప్రణీత్‌రావు బెయిల్‌పై కౌంటర్ వేయండి

ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి, హైదరాబాద్ సీపీ, వెస్ట్‌జోన్ డీసీపీ, పంజాగుట్ట ఏసీపీ, దర్యాప్తు అధికారికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణ ఈ నెల 23కు వాయిదా వేసింది. బెయిల్ నిరాకరిస్తూ ట్రయల్ కోర్టు జారీ చేసిన తీర్పును సవాల్ చేస్తూ ప్రణీత్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తు అధికారి ట్రయల్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి, ఇంకా విచారణ ముగియలేదని చెప్పడం సరికాదన్నారు. హోంశాఖ జీపీ మహేశ్‌రాజే వాదనలు వినిపిస్తూ.. ప్రభాకర్‌రావు, శ్రావణ్‌కుమార్ పరారీలో ఉన్నారని, అందుకే తుది చార్జిషీట్ దాఖలు పెండింగ్‌లో ఉందన్నారు.

అందరికీ వైద్యం.. మా విధానం



'సాక్షి' ఇంటర్వ్యూలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

- మౌలిక సదుపాయాలే కాదు.. మానవ వనరులు కూడా ముఖ్యం
- అందుకు తగినట్టుగా డాక్టర్లు, సిబ్బంది నియామకం దిశగా అడుగులు
- ఆదివాసీ ప్రాంతాల్లో కనీస ప్రాథమిక చికిత్స అందించే ఏర్పాట్లు
- ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ట్రామా సెంటర్ లక్ష్యం
- కులగణన పూర్తయ్యాక.. డిజిటల్ హెల్త్‌కార్డులపై దృష్టి
- ఆస్పత్రుల్లో విలువైన పరికరాలున్నా.. వాటిని వినియోగించే సిబ్బంది లేరు
- ఉద్యోగులకు ప్రత్యేక ట్రస్టా? ప్రస్తుతమున్న విధానంలోకి తేవాలా అన్నది 3 నెలల్లో నిర్ణయిస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రజలకు సాధ్యమైనంత త్వరగా, మేలైన వైద్యం అందించడమే తమ లక్ష్యమని.. అందుకోసం మౌలిక సదుపాయాల కల్పనతోపాటు డాక్టర్లు, సిబ్బంది నియామకాలపై దృష్టి పెట్టామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఒక్క ఏడాదిలోనే వైద్యారోగ్య శాఖను ఎవరూ పూర్తిగా బాగుచేయలేరని, ఇది నిరంతర ప్రక్రియ అని చెప్పారు. ప్రాథమిక వైద్యం లభించక ఏజెన్సీ ప్రాంతాల్లో జనం ఇబ్బందులు పడుతున్నారని... అక్కడ సబ్ సెంటర్లు, పల్లె క్లినిక్‌ల ఏర్పాటుకు ఉన్న నిబంధనలను సడలించే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. హైవేలపై రోడ్డు ప్రమాద బాధితులను కాపాడటానికి ప్రతీ 30 కిలోమీటర్లకు ఒక ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మంత్రి రాజనర్సింహ 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

మౌలిక సదుపాయాలు.. మానవ వనరులు ముఖ్యం

రాష్ట్రంలో జనాభాకు అనుగుణంగా జిల్లా ఆస్పత్రులతోపాటు సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు ఉండాలి. వాటిలో మౌలిక వసతులను సమకూర్చడంతోపాటు మానవ వనరులు కూడా తప్పనిసరి. అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి అధికార యంత్రాంగానికి ఆదేశాలిచ్చాం. కొత్తగా 120 నుంచి 150 సబ్ సెంటర్లు అవసరం. అలాగే మరో 75 పీహెచ్‌సీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. భౌగోళిక పరిధిని పరిగణనలోకి తీసుకుని ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాలను కల్పించాల్సి ఉంది. ఆదివాసీ ప్రాంతాల్లో కనీస ప్రాథమిక చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. హైవేలపై ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ట్రామా సెంటర్ చొప్పున 74 ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటే లక్ష్యం. అత్యవసర పరిస్థితుల్లో పది నిమిషాల్లోనే అంబులెన్స్ సమీపంలోని దవాఖానకు తీసుకెళ్లేలా చేయడమే మా లక్ష్యం. ఇందుకోసం కొత్తగా 213 అంబులెన్సులను తీసుకొచ్చాం. ఇంకో 80 వరకు అవసరం ఉంది. ప్రతి మండలానికి ఓ అంబులెన్స్ అందుబాటులోకి తెస్తున్నాం. మానవ వనరుల కల్పనలో భాగంగా ఇప్పటివరకు 7,774 పోస్టులను భర్తీ చేశాం. మరో 6,470 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇటీవలే 442 అసిస్టెంట్ సివిల్ సర్జన్లను, 24 మంది ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లను నియమించాం. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీలకు కూడా మౌలిక వసతులు, మానవ వనరులను అందించే ప్రయత్నంలో ఉన్నాం.



ఆరోగ్యశ్రీలో కొత్తగా 163 రకాల చికిత్సలు..

50 పడకలున్న ప్రతి ఆస్పత్రి ఆరోగ్యశ్రీ కింద ఎంప్యానల్ అయ్యేలా నిబంధనలు సరళీకరించాం. ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే 1,375 చికిత్సలకు సంబంధించి ప్రైవేటు ఆస్పత్రులకు ఇచ్చే ధరలను 2013 తరువాత 22శాతం పెంచాం. కొత్తగా 163 రకాల చికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చాం. ఈ ఏడాది రూ.487.29 కోట్లను ఆరోగ్యశ్రీకి కేటాయించాం. ఆరోగ్యశ్రీ పరిధిలోని ఆస్పత్రులు రోగులకు రూ.10 లక్షల వరకు చికిత్స అందించాల్సిందే. రాష్ట్రంలో పేదలందరికీ డిజిటల్ హెల్త్‌కార్డులు జారీ చేస్తాం. దీనికి సంబంధించి కసరత్తు సాగుతోంది. కులగణన పూర్తయిన తర్వాత హెల్త్‌కార్డులపై దృష్టి పెడతాం. ఉద్యోగులు, జర్నలిస్టులకు సంబంధించి ఏం చేయాలనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. హెల్త్‌కార్డులా? ట్రస్ట్ ద్వారానా? ఇన్సూరెన్స్ పరిధిలోనా? అనే విషయంలో త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటాం.

కొత్తగా 8 మెడికల్ కాలేజీలు.. 16 నర్సింగ్ కాలేజీలు

అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే రాష్ట్రంలో కొత్తగా 8 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చాం. జిల్లాకో వైద్య కళాశాలను, అనుబంధంగా ఆస్పత్రులను ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా అందుబాటులోకి తెచ్చాం. ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను 3,690 నుంచి 4,090కి పెంచాం. 16 నర్సింగ్ కళాశాలలను తీసుకొచ్చి.. కొత్తగా 960 నర్సింగ్ సీట్లను అందుబాటులోకి తెచ్చాం. 28 పారామెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశాం. నర్సింగ్, పారామెడికల్ కాలేజీల ఏర్పాటుకు రూ.500 కోట్లు కేటాయించాం. అన్ని ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో అవయవాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. గాంధీ, ఉస్మానియా, ఎంజీఎంలలో అవయవ మార్పిడి కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి.

కొత్త పోస్టులు తెచ్చాం... కట్టుదిట్టం చేశాం..

రాష్ట్రంలో పదేళ్లు డ్రగ్స్ డైరెక్టర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్, వైద్యవిధాన పరిషత్ కమిషనర్ పోస్టులను ఇన్‌చార్జులతో నడిపారు. మేం అధికారంలోకి వచ్చాక పూర్తిస్థాయి నియామకాలు చేపట్టాం. డైరెక్టర్ ఆఫ్ ఆయుష్ పోస్టు ఏర్పాటుకు కూడా ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం. వైద్యవిధాన పరిషత్ స్థానంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ తీసుకురావాలని నిర్ణయించాం. అలాగే వివిధ విభాగాధిపతుల కార్యాలయాల్లో వైఫల్యాలపై దృష్టి పెట్టాం. మెడికల్ ఎడ్యుకేషన్‌తో పాటు ప్రైమరీ, సెకండరీ ఎడ్యుకేషన్ మీద కూడా దృష్టి పెట్టాం. వైద్యశాఖలో బదిలీలపై కొన్ని ఆరోపణలు వచ్చిన మాట వాస్తవమే. వాటిపై అంతర్గతంగా విచారణ జరుగుతోంది. బాధ్యులపై చర్యలు ఉంటాయి..'' అని దామోదర రాజనర్సింహ వెల్లడించారు.

సామాన్యుడికి వైద్యం అందాలి

జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా పట్టణం నుంచి గ్రామస్థాయిలోని వారికి కూడా బీపీ, షుగర్, కేన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లాలో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) క్లినిక్‌లను అందుబాటులోకి తెచ్చాం. అలాగే డయాలసిస్ పేషెంట్లకు అవసరమైన సర్జరీల కోసం రూ.33 కోట్లతో 7 వాస్క్యులర్ సెంటర్లు, ప్రధాన జిల్లా ఆస్పత్రుల్లో వాస్కులర్ విభాగాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. కేన్సర్ రోగులకు చికిత్స కోసం 4 రీజినల్ కేన్సర్ సెంటర్ల ఏర్పాటు ఆలోచనలో ఉన్నాం. ప్రతి జిల్లాకు ఓ సెంట్రల్ మెడిసినల్ స్టోర్ (సీఎంఎస్) ఏర్పాటు చేశాం. ట్రాన్స్‌జెండర్ల కోసం 32 మైత్రి క్లినిక్స్ ఏర్పాటు చేశాం.

'ఫుడ్ సేఫ్టీ'కి అధిక ప్రాధాన్యత

గత ప్రభుత్వంలో ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) అంశాన్ని పట్టించుకోలేదు. పెరిగిన జనాభా, హోటళ్లకు అనుగుణంగా సిబ్బందిని పెంచలేదు. మౌలిక సదుపాయాలను కల్పించలేదు. పాత ల్యాబ్ మినహా నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. త్వరలో నాలుగు ప్రాంతాల్లో నాలుగు అధునాతన ల్యాబ్‌ల ఏర్పాటుతోపాటు ఫుడ్ సేఫ్టీని కట్టుదిట్టం చేస్తాం. ప్రజలు కూడా తగిన అవగాహనతో ఉండాలి.

ఆరు హామీలే కాదు.. నూట అరవై ప్రజోపయోగ పనులు

- ఏడాది పాలనలోనే ఎంతో మార్పు వచ్చిందన్న కాంగ్రెస్ సర్కారు
- సుస్థిర ప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్నాం
- పథకాలు, పనులపై అధికారులతో సీఎం రేవంత్ నిరంతర సమీక్షలు
- రోజుకో వినూత్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం అడుగులు అంటూ సీఎంవో ప్రెస్‌నోట్

సాక్షి, హైదరాబాద్: ''ప్రజలకు ఇచ్చిన మాటను ప్రజా ప్రభుత్వం నూటికి నూరు పాళ్లు నిలబెట్టుకుంది. తొలి ఏడాదిలోనే సుస్థిర ప్రజాస్వామిక పాలనతో దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలబెట్టింది. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలకే పరిమితం కాకుండా.. దాదాపు 160 వినూత్న కార్యక్రమాలను చేపట్టింది. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం రోజుకో వినూత్న ఆలోచనతో వీటికి శ్రీకారం చుట్టారు..'' అని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. అధికారం చేపట్టిన తొలిరోజు నుంచే సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ సమ్మిళిత అభివృద్ధి కోసం నిరంతర సమీక్షలు, సమావేశాలు నిర్వహించారని పేర్కొంది. పదేళ్ల విధ్వంసపు ఆనవాళ్లను చెరిపేసి... తెలంగాణ పునర్వైభవాన్ని కొనసాగిస్తూనే, అన్ని రంగాల్లో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చిందని తెలిపింది.

వెల్లువెత్తిన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు

ఏడాది పాలనలో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తటంతోపాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగాయని.. తొలి ఏడాదిలోనే 55,143 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని సీఎంవో పేర్కొంది. తెలంగాణలో నిరుద్యోగిత శాతం తగ్గుముఖం పట్టిందని కేంద్ర గణాంక శాఖ నిర్వహించిన లేబర్ ఫోర్స్ సర్వే ఈ విషయాన్ని వెల్లడించిందని తెలిపింది. ''ఈ వానాకాలంలో ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 67 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తే 153 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి కావటం విశేషం. దేశాభివృద్ధిలో రాష్ట్రం కీలక పాత్ర పోషిస్తోందని ఇటీవలే కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ వెల్లడించింది. జీఎస్డీపీ వృద్ధిలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ టాప్‌లో ఉందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్డీపీ దాదాపు రూ.15.52 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేసింది..'' అని సీఎంవో పేర్కొంది.

'పట్నం' ఫైర్

జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై పరుష పదజాలంతో విరుచుకుపడిన మహేందర్‌రెడ్డి



తాండూరు, షాద్‌నగర్ రూరల్: శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అధికారులపై నోరు పారేసుకున్నారు. తాండూరులో మెప్మా ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం రెండు దుకాణాలను కేటాయించగా, వీటిని ప్రారంభించేందుకు శుక్రవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. లోపలకు వెళ్లిన అనంతరం క్యాంటీన్ ప్రారంభోత్సవానికి తనను ఎందుకు ఆహ్వానించలేదని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిశంకర్‌పై మహేందర్‌రెడ్డి పరుష పదజాలంతో విరుచుకుపడ్డారు. అధికారిక కార్యక్రమాలపై తనకు సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో మనస్తాపానికి గురైన సూపరింటెండెంట్ రాజీనామాకు సిద్ధమవ్వగా ఎమ్మెల్యే సర్దిచెప్పారు. ఈ విషయమై డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రదీప్‌ను వివరణ కోరగా సూపరింటెండెంట్‌పై మహేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన మాట వాస్తవమేనని, కానీ రవిశంకర్ రాజీనామా చేయలేదన్నారు.

వీర్లపల్లి వీరంగం..



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నోరు జారిన వీడియో శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వారం రోజుల క్రితం ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో శంకర్ వెలమ కులస్తులపై ఫైర్ అయ్యారు. 'వెలమ నా కొడుకుల్లారా ఖబడ్దార్.. ఇప్పటి నుంచి మీ ఆటలు నడవనీయం. మేము బయటకువస్తే వీపులు విమానాలు మోగుతాయి' అంటూ తీవ్ర పదజాలంతో దూషణలు చేశారు. ఎమ్మెల్యే శంకర్ చేసిన వ్యాఖ్యలు ఒక ప్రజాప్రతినిధి స్థాయికి తగవని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆయన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ అధికారిక వైఖరి అవునో కాదో ముఖ్యమంత్రి రేవంత్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టత ఇవ్వాలని 'ఎక్స్' లో కవిత కోరారు.

శంకర్ వ్యాఖ్యలపై వివరణ కోరిన టీపీసీసీ చీఫ్

సాక్షి, హైదరాబాద్: వెలమ సామాజికవర్గాన్ని ఉద్దేశించి షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ స్పందించింది. వెంటనే వివరణ ఇవ్వాలని సదరు ఎమ్మెల్యేను కాంగ్రెస్ పార్టీ ఆదేశించింది. ఈ మేరకు ఎమ్మెల్యే శంకర్‌ను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ వివరణ కోరారని గాంధీభవన్ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించాయి.

త్వరలో కొత్త ఉస్మానియా ఆస్పత్రికి శంకుస్థాపన

ఆరోగ్య శాఖమంత్రి దామోదర వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కొత్త ఉస్మానియా ఆస్పత్రికి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ వెల్లడించారు. ఒక హోటల్‌లో శుక్రవారం 'ది వీక్' పత్రిక నిర్వహించిన బెస్ట్ హాస్పిటల్స్ అవార్డ్స్–2024 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఆస్పత్రులకు అవార్డులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పౌరులున్న సమాజం అభివృద్ధిలో ముందుంటుందని అభిప్రాయపడ్డారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. ప్రజలు అనారోగ్యంతో అప్పులపాలు కాకూడదన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు సానుభూతితో వ్యవహరించాలని, అధిక చార్జీలు వసూలు చేసి రోగులను ఇబ్బంది పెట్టొద్దని హితవు పలికారు. ఏడాదిలోనే 8 వైద్య, 16 నర్సింగ్, 28 పారామెడికల్ కళాశాలలను ప్రారంభించినట్టు మంత్రి దామోదర వివరించారు.

తీరానికి కొట్టుకొచ్చిన మిస్సైల్

- భయాందోళనలకు గురైన మత్స్యకారులు
- స్వాధీనం చేసుకున్న మెరైన్ పోలీసులు


కొత్తపట్నం తీరానికి కొట్టుకొచ్చిన మిస్సైల్

కొత్తపట్నం: ప్రకాశం జిల్లా కొత్తపట్నంలోని సముద్ర తీరానికి శుక్రవారం సాయంత్రం క్షిపణి (మిస్సైల్) కొట్టుకొచ్చింది. దీంతో అక్కడి మత్స్యకారులు భయందోళనలకు గురయ్యారు. అది పేలుతుందేమోనని పరుగులు తీశారు. సమాచారం అందుకున్న మెరైన్ ఎస్సై సుబ్బారావు సిబ్బందితో వెళ్లి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. మిస్సైల్‌ని స్వాధీనం చేసుకుని భద్రపర్చారు. వివరాల్లోకి వెళితే.. చొరబాటుదారులు వచ్చినప్పుడు వారిని ఏవిధంగా ఎదుర్కోవాలనే దానిపై బాపట్ల జిల్లా సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ ఫైరింగ్ బేస్‌లో శిక్షణ ఇస్తున్నారు. శత్రు దాడులను మిస్సైళ్ల ద్వారా ఎలా ఎదుర్కోవాలో వివరిస్తున్నారు. బయట పేల్చితే ప్రాణనష్టం జరుగుతుందనే ఉద్దేశంతో సముద్రంలో వదులుతున్నారు. ఒక్కసారి మిస్సైల్ పంపితే 150 కిలోమీటర్ల దూరంలో పడి పేలుతుంది. ఏటా డిసెంబర్ 2 నుంచి 13వ తేదీ వరకు శిక్షణ ఇస్తారు. ఒక్కోసారి సముద్రంలో పేలిన మిస్సైళ్లు తీరానికి కొట్టుకొస్తుంటాయి. సూర్యలంకలో వదిలే మిస్సైళ్లు 150 కి.మీ. దూరంలో ఎక్కడైనా పడవచ్చని.. వేటాడే సమయంలో ప్రాణనష్టం జరుగుతుందని.. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



కన్నుల పండువగా పంచమి తీర్థం

చంద్రగిరి: శ్రీవారి పట్టపురాణి శ్రీపద్మావతి అమ్మవారు ఆవిర్భవించిన పద్మసరోవరం(పుష్కరిణి)లో శుక్రవారం పంచమి తీర్థం(చక్రస్నానం) భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాసం, శుక్లపక్ష పంచమి తిథి, ఉత్తరాషాఢ నక్షత్రం, శుక్రవారం రోజున స్వర్ణకమ లంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు పద్మావతీదే విగా అవతరించి శ్రీవారిని అనుగ్రహించారు. అమ్మవారు ఆవిర్భవించిన పద్మసరో వరంలో ఏటా కార్తీక మాసంలో నిర్వహించే పంచమి తీర్థం రోజున స్నానమాచరిస్తే సకల పాపాలు హరించుకుపోయి కోటిజన్మల పుణ్యఫలం చేకూరుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



విదేశీ పక్షుల సందడి

రకరకాల విదేశీ పక్షుల రాకతో గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, ఉప్పలపాడులోని వలస పక్షుల విడిది కేంద్రం సందడిగా మారింది. ఈ కేంద్రంలో గూడ బాతులు (పెలికాన్స్), ఎర్రకాళ్ల కొంగలు (పెయిడెంట్ స్టార్క్స్), నత్తగుల్ల కొంగలు (ఓపెన్‌బిల్) పచ్చటి చెట్లపై గుంపులు గుంపులుగా సేదతీరుతూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు.

పోలవరం పూర్తయితే సాగర్ నుంచి 80 టీఎంసీలు తగ్గించుకుంటాం

- జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌లో ఏపీ తరఫున సాక్షి ఏకే గోయల్
- క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి.. తదుపరి విచారణ జనవరి 16, 17 తేదీల్లో

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు పూర్తయితే 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టా సిస్టమ్(కేడీఎస్)కు తరలిస్తామని..ఆ మేరకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి 80 టీఎంసీల కృష్ణా జలాలను తగ్గించుకుంటామని ఏపీ తరఫున సాక్షి ఏకే.గోయల్ వెల్లడించారు. జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2 లో శుక్రవారం సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల ఆపరేషనల్ ప్రోటోకాల్స్‌పై జరిగిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో తెలంగాణ న్యాయవాది వైద్యనాథన్ ప్రశ్నలకు గోయల్ బదులిచ్చారు. 80 టీఎంసీల గోదావరి జలాలను లెక్కించారా అని ప్రశ్నించగా లేదని గోయల్ చెప్పారు. 80 టీఎంసీల గోదావరి జలాలను పోలవరం ప్రాజెక్టు ద్వారా కేడీఎస్‌కు తరలిస్తే.. సాగర్ నుంచి ఆ మేరకు 80 టీఎంసీల కృష్ణా జలాలను కోత పెడతారా అని మరోసారి ప్రశ్నించగా అవును అని బదులిచ్చారు. సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకోవడానికి బచావత్ ట్రిబ్యునల్ వెసులుబాటు కల్పించింది. ఆ 80 టీఎంసీల్లో 35 టీఎంసీలను వినియోగించుకోవడానికి మహారాష్ట్ర, కర్ణాటకలు ప్రణాళికలు రూపొందించగా, మిగిలిన 45 టీఎంసీలు ఉమ్మడి ఏపీ నికర లభ్యతగా ఉన్నట్టు భావించవచ్చా అని ప్రశ్నించగా.. తానేమీ వ్యాఖ్యానించలేను అని బదులిచ్చారు. ఈ జలాలపై నిర్ణయం తీసుకునే అధికారం ట్రిబ్యునల్‌కే ఉందని గుర్తు చేశారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తయిన తర్వాత కూడా ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి నీటిని తరలించాల్సి ఉంటుంది కదా అని ప్రశ్నించగా...టన్నెల్ పూర్తికాగానే సాగర్ నుంచి ఏఎంఆర్పీకి నీటి తరలింపును నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. శ్రీశైలం నుంచి గ్రావిటీతో నీటిని తరలించే అవకాశం ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌తో రానుందని బదులిచ్చారు.

నెట్టెంపాడు ప్రాజెక్టు నీటి కేటాయింపులను ప్రోటోకాల్‌లో ఎందుకు చేర్చలేదు అని ప్రశ్నించగా, జూరాల నుంచి మిగులు జలాలను తరలించడమే నెట్టెంపాడు ప్రాజెక్టు లక్ష్యమని బదులిచ్చారు. షెడ్యూల్–11లోని ప్రాజెక్టులకు ఉమ్మడి ఏపీకి బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీల నుంచి కేటాయింపులున్నాయా అని ప్రశ్నించగా.. 'లేవు' అని బదులిచ్చారు. దీంతో ఆపరేషనల్ ప్రోటోకాల్స్‌పై ఏపీ తరఫు సాక్షిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసే ప్రక్రియ ముగిసింది. ట్రిబ్యునల్ విచారణను వేగిరం చేయాలని తెలంగాణ వేసిన ఇంటర్ లోకేటరీ అప్లికేషన్(ఐఏ)పై కౌంటర్ దాఖలు చేయడానికి ఏపీకి ట్రిబ్యునల్ రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ 2025 జనవరి 16, 17వ తేదీల్లో జరగనుంది.

క్లుప్తంగా...

కుంభమేళాకు రండి

సీఎం రేవంత్‌కు యూపీ ప్రభుత్వ ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: వచ్చే నెలలో జరిగే కుంభమేళాకు రావాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం.. సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించింది. ఈ మేరకు యూపీ ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎంను కలిసి ప్రయాగ్‌రాజ్ కుంభమేళా ఆహ్వానాన్ని అందజేశారు.

అంబేడ్కర్‌కు నివాళి: బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి దేశ అభ్యున్నతి కోసం అంబేడ్కర్ చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి పాల్గొన్నారు.

జనవరి 13 నుంచి 'మహా కుంభమేళా'

- కుంభ్ 'హైదరాబాద్ రోడ్‌షో'లో యూపీ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య

సాక్షి, హైదరాబాద్: జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్)లో నిర్వహించనున్న 'మహా కుంభమేళా'కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నట్టు యూపీ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య వెల్లడించారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డిలను కుంభమేళాకు రావాల్సిందిగా ఆహ్వానించినట్టు ఆయన తెలియజేశారు. ఈ కుంభమేళాకు సంబంధించి ప్రచారం నిమిత్తం 'హైదరాబాద్ రోడ్‌షో'లో భాగంగా శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌర్య విలేకరులతో మాట్లాడుతూ... యూపీ ప్రభుత్వం, సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలో మహా కుంభమేళాను అత్యంత భక్తిశ్రద్ధలతో పవిత్రంగా, భక్తులు, యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలియజేశారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తున్న భారత్‌లో.. అత్యంత ప్రత్యేకత కలిగిన ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో పాల్గొనాల్సిందిగా తెలంగాణ ప్రజలను ఆహ్వానిస్తున్నామన్నారు. 'ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్-సమావేశి భారత్'నినాదంలో భాగంగా దేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక భావనలను ప్రతిబింబించేలా దీనిని నిర్వహిస్తున్నామని చెప్పారు. పర్యావరణహితంగా, కాలుష్య రహితంగా కుంభమేళాకు ఏర్పాట్లు చేస్తున్నామని గ్రీన్ కుంభమేళాగా దీనిని నిర్వహించబోతున్నామని ఆయన వెల్లడించారు.

సమ సమాజ నిర్మాణ దార్శనికుడు అంబేడ్కర్

రాజ్యాంగ నిర్మాతకు కేసీఆర్ నివాళి



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమ సమాజ నిర్మాణ దార్శనికుడు అని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. వివక్షకు వ్యతిరేకంగా జీవితకాలం పోరాడిన అంబేడ్కర్ కీర్తిని ప్రపంచానికి చాటేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పిస్తూ శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలను ఈ సందర్భంగా కేసీఆర్ గుర్తు చేసుకున్నారు.

హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీద్దాం: కవిత

విషాహారం తిని మృతిచెందిన విద్యార్థిని కుటుంబానికి రూ.2 లక్షల సాయం



సాక్షి, హైదరాబాద్: బూటకపు హామీలతో తెలంగాణ యువతను కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన తెలంగాణ జాగృతి నాయకులతో శుక్రవారం తన నివాసంలో కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువ వికాసం కింద రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు ఇస్తామని, విద్యాజ్యోతి పథకం కింద ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ యువతకు రూ.5 లక్షలు ఇస్తామని తదితర ఎన్నో హామీలిచ్చి కాంగ్రెస్ ఓట్లు దండుకుందని, దీనిపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆమె పిలుపునిచ్చారు.

విద్యార్థిని కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రభుత్వ పాఠశాలలో విషాహారం తిని మరణించిన విద్యార్థిని శైలజ కుటుంబానికి కవిత రూ.2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, వ్యవసాయ భూమి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు.

నెల రోజుల్లో టెన్త్ సిలబస్ పూర్తి చేయాలి

- తర్వాత రివిజన్ మొదలు పెట్టాలి
- ప్రభుత్వ పాఠశాలలకు విద్యాశాఖ ఉత్తర్వులు... అదెలా సాధ్యమని ప్రశ్నిస్తున్న టీచర్లు

సాక్షి, హైదరాబాద్: పదవ తరగతి సిలబస్‌ను జనవరి 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని అన్ని పాఠశాలలకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. సిలబస్ అయిన వెంటనే పునశ్చరణ చేపట్టాలని సూచించింది. టెన్త్ పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేందుకు ప్రతీ హెచ్‌ఎం శ్రద్ధ తీసుకోవాలని కోరింది. మంచి ఫలితాలు సాధించే స్కూళ్లకు ఈసారి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇచ్చే అవకాశం ఉందని విద్యాశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రైవేటు బడులతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఫలితాలు ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమని విద్యాశాఖ పేర్కొంది. ఈ ఏడాది కొత్తగా 11,062 మంది టీచర్ల నియామకం కూడా చేపట్టారని, పుస్తకాలు కూడా సకాలంలో అందించామని, ఫలితాలు తక్కువగా వస్తే స్కూల్ హెచ్‌ఎంలు సమాధానం చెప్పాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు.

30 రోజుల పక్కా ప్రణాళిక..

మార్చి నెలలో టెన్త్ పరీక్షలు జరుగుతాయి. ప్రభుత్వ స్కూల్ విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ సూచించింది. ఉదయం గంట, సాయంత్రం గంట ఇప్పటికే ఈ తరగతులు నిర్వహిస్తున్నారు. సిలబస్ పూర్తయిన తర్వాత పూర్తి స్థాయిలో రివిజన్‌పైనే దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఇందులో సబ్జెక్టులో ముఖ్యమైన, కష్టమైన చాప్టర్లపై దృష్టి పెట్టాలని హెచ్‌ఎంలను జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. 30 రోజుల పాటు ప్రణాళికబద్ధంగా రివిజన్ చేయాలని తెలిపారు.

బదిలీలు, పదోన్నతులతోనే కాలం పూర్తి..

జనవరి 10 నాటికి సిలబస్ పూర్తి చేయడం ఎలా సాధ్యమని పలువురు టీచర్లు ప్రశ్నిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోని స్కూళ్లలో కొంతమేర టీచర్ల కొరత లేదని, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి భిన్నంగా ఉందంటున్నారు. కొన్ని పాఠశాలల్లో 40 శాతం మేర సిలబస్ మాత్రమే పూర్తయిందని డీఈవోలు ఇటీవల విద్యాశాఖకు తెలిపారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో 30 శాతానికి మించి సిలబస్ పూర్తవ్వలేదంటున్నారు. డీఎస్సీ నియామకాలు చేపట్టే వరకూ అనేక చోట్ల టీచర్ల కొరత ఉంది. అక్టోబర్‌లో టీచర్లు వచ్చినా బోధన వెంటనే చేపట్టడం సాధ్యం కాలేదంటున్నారు. ఈ ఏడాది విద్యారంభంలోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టారు. దీంతో చాలా స్కూళ్లలో టెన్త్ బోధన ఆలస్యంగా మొదలైందని చెబుతున్నారు. జనవరి 10 నాటికే సిలబస్ పూర్తవ్వాలనే లక్ష్యం వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతుందని వారంటున్నారు.



గ్రూప్-1కు తొలగిన అడ్డంకులు

- నోటిఫికేషన్ రద్దు కుదరదన్న సుప్రీంకోర్టు
- మెయిన్స్ పరీక్షల రద్దు కూడా అవసరం లేదని స్పష్టీకరణ
- పరీక్షల నిర్వహణలో కోర్టులు జోక్యం చేసుకుంటే నియామకాలు నిలిచిపోతాయని వ్యాఖ్య
- ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్
- త్వరలో మెయిన్స్ ఫలితాల వెల్లడికి టీజీపీఎస్సీ కసరత్తు



సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి అడ్డంకులు తొలగిపోయాయి. గ్రూప్-1 రీనోటిఫికేషన్, భర్తీ ప్రక్రియ, ప్రశ్నపత్రాల కీ తదితర అంశాలకు సంబంధించి దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టేసింది. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దు చేయడం కుదరదని స్పష్టం చేసింది. అలాగే పిటిషనర్లు మెయిన్స్‌కు క్వాలిఫై కాలేదని, మెయిన్స్ పరీక్షలు రద్దు చేయాల్సిన అవసరం లేదని జస్టిస్ పమిడిఘటం శ్రీ నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. పరీక్షల నిర్వహణలో కోర్టుల జోక్యం అవసరం లేదని, దీనివల్ల ఉద్యోగ నియామకాల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుందని తేల్చిచెప్పింది. మెయిన్స్ పరీక్షలను రద్దు చేయాల్సిన అవసరం లేదని పేర్కొంది. పిటిషనర్ల అభ్యంతరాలను తోసిపుచ్చింది. తదుపరి ప్రక్రియ చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

మెయిన్స్ ఫలితాల విడుదలే తరువాయి

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో 563 గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా జూన్‌లో ప్రిలిమ్స్ నిర్వహించిన కమిషన్ అక్టోబర్‌లో మెయిన్స్ పరీక్షలను కూడా నిర్వహించింది. అయితే గత ప్రభుత్వంలో టీజీపీఎస్సీ జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయడంతో పాటు మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపికలో జీఓ 55కు బదులుగా జీఓ 29ని తీసుకురావడం, అదేవిధంగా ప్రిలిమ్స్ పరీక్షలకు సంబంధించి ప్రశ్నలకు జవాబులు, 'కీ'లపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలువురు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో ఇప్పటికే రెండుసార్లు ప్రిలిమ్స్ పరీక్షలు రాసిన పలువురు అభ్యర్థుల్లో సుప్రీంకోర్టు తీర్పు ఏవిధంగా ఉంటుందనే ఆందోళన నెలకొంది. తాజాగా ఆ పిటిషన్లను కొట్టివేయడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. సుప్రీంకోర్టులో, అంతకుముందు హైకోర్టులో గ్రూప్-1పై ఇప్పటివరకు నమోదైన అన్ని కేసుల విచారణ పూర్తికావడంతో ఉద్యోగాల భర్తీకి అడ్డంకులు పూర్తిగా తొలగిపోయినట్లేనని టీజీపీఎస్సీ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా నిర్వహించిన మెయిన్స్ పరీక్షలకు సంబంధించి ఫలితాలు విడుదల చేసిన వెంటనే ఉద్యోగాల భర్తీ దాదాపు కొలిక్కిరానుంది. ప్రస్తుతం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో మెయిన్స్ పరీక్షలకు సంబంధించి జవాబుపత్రాల మూల్యాంకనం కొనసాగుతోంది. ఇందుకోసం కమిషన్ ప్రత్యేకంగా ప్రొఫెసర్లతో కూడిన కమిటీలను ఏర్పాటు చేసింది.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న మంత్రులు దామోదర, దుద్దిళ్ల, జూపల్లి

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

- మంత్రులు దామోదర, దుద్దిళ్ల, జూపల్లి... కొడంగల్‌లో బాహుబలి కిచెన్ షెడ్డు ప్రారంభం
- 28 వేల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిత్యం ఫ్రీ బ్రేక్ ఫాస్ట్

కొడంగల్: విద్య, వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు అన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో నిర్మించిన బాహుబలి కిచెన్ షెడ్డును శుక్రవారం వారు ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఫ్రీ బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. కొడంగల్ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇప్పటికే భారీ మొత్తంలో నిధులు కేటాయించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు.

దేశంలోనే పెద్ద కిచెన్ షెడ్డు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో దేశంలోనే అతి పెద్ద కిచెన్ షెడ్డును కొడంగల్‌లో నిర్మించే అవకాశం కలిగిందని హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ తెలంగాణ అధ్యక్షుడు శ్రీసత్య గౌరచంద్ర దాస ప్రభుజీ అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్మించిన సెంట్రలైజ్‌డ్ కమ్యూనిటీ కిచెన్ షెడ్డు ద్వారా నియోజకవర్గంలోని 312 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 28 వేల మంది విద్యార్థులకు ప్రతీరోజు ఉదయం అల్పాహారం అందించనున్నట్టు తెలిపారు. సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, వయాట్రీస్ సంస్థ ఇండియా సీఎస్ఆర్ హెడ్ మిచెల్ డొమెనికా తదితరులు పాల్గొన్నారు.

రేవతి కుటుంబానికి రూ.25 లక్షల సాయం

- వైద్య ఖర్చులన్నీ భరిస్తాం
- సంధ్య థియేటర్ ఘటనపై నటుడు అల్లు అర్జున్ ప్రకటన



సాక్షి, హైదరాబాద్: పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై నటుడు అల్లు అర్జున్ స్పందించారు. అక్కడ జరిగిన ఘటనలో రేవతి అనే మహిళ మృతిచెందడం, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడటం తమను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, తన తరఫున రూ.25 లక్షల ఆర్థికసాయం అందిస్తానని వెల్లడించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు. 'పుష్ప-2 ప్రీమియర్ షో చూడటానికి ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్‌కు వెళ్లాం. అక్కడ జరిగిన తొక్కిసలాటలో రేవతి చనిపోయారని, ఆమె కుమారుడు గాయపడ్డారని తెలిసి షాక్‌కు గురయ్యాం. థియేటర్‌కు వెళ్లి అభిమానులతో సినిమా చూడటం అనేది గత 20 ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఇన్నేళ్లుగా ఎప్పుడూ ఏమీ జరగలేదు. ఇప్పుడు ఊహించని ఈ ఘటన జరిగేసరికి షాక్‌కు గురయ్యాం. ప్రేక్షకులు థియేటర్‌కి వచ్చి ఎంజాయ్ చేయడానికే మేం సినిమాలు తీస్తుంటాం. అలాంటి థియేటర్ వద్ద ఇలా జరగడం బాధగా ఉంది. రేవతి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. మేం ఏం చేసినా.. ఎంత మాట్లాడినా జరిగిన నష్టం పూడ్చలేనిది. నా తరపు నుంచి రూ.25 లక్షల ఆర్థికసాయం చేయాలని నిర్ణయించుకున్నాను. అలాగే ఈ ఘటనకు సంబంధించి జరిగిన వైద్య ఖర్చులన్నీ మేమే భరిస్తాం. వారి కుటుంబానికి ఏం కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నాం'అని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వానికి రూ.లక్ష జరిమానా

రిట్ పిటిషన్ దాఖలుకు 161 రోజుల ఆలస్యంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు రూ.లక్ష జరిమానా విధించింది. హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసేందుకు 161 రోజులు ఆలస్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి (ఓవోపీఎస్) పథకం కింద చేయూతనివ్వాలని తెలంగాణకు చెందిన ఒక విద్యార్థి 2013లో ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నాడు. అయితే.. విద్యార్థి తండ్రి వార్షిక ఆదాయం రూ.2 లక్షలు మించి ఉందంటూ ప్రభుత్వం దరఖాస్తును తిరస్కరించింది. దీనిపై విద్యార్థి తండ్రి గంటా వెంకట నరహరి హైకోర్టును ఆశ్రయించగా.. రూ.10 లక్షల స్కాలర్‌షిప్ ఇవ్వాలని ఆదేశించింది. అయితే హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పును రాష్ట్ర ప్రభుత్వం 161 రోజుల తర్వాత సవాల్ చేసింది.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ వీసీగా ఘంటా చక్రపాణి

- నియామకం.. వెంటనే బాధ్యతల స్వీకరణ
- బాలకిష్టారెడ్డికి జేఎన్టీయూహెచ్ ఇన్‌చార్జి వీసీ బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా ఘంటా చక్రపాణి నియమితులయ్యారు. ఈ పోస్టులో ఆయన మూడేళ్ల పాటు కొనసాగుతారు. నియామక ఉత్తర్వులను శుక్రవారం గవర్నర్ అనుమతితో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.శ్రీధర్ విడుదల చేశారు. కాగా, శుక్రవారం రాత్రి ఆయన వీసీగా బాధ్యతలు స్వీకరించారు.

కాకతీయ వర్సిటీ నుంచి కెరీర్ ప్రారంభం..

ఘంటా చక్రపాణి కరీంనగర్ జిల్లా యాస్వాడ గ్రామంలో ఓ రైతు కుటుంబంలో జన్మించారు. ఆ తర్వాత కుటుంబం పెద్దపల్లి జిల్లా ధూలికట్ట గ్రామానికి వెళ్లింది. ప్రభుత్వ స్కూల్‌లోనే ఆయన విద్యాభ్యాసం పూర్తయింది. సుల్తానాబాద్ జూనియర్ కాలేజీలో, కరీంనగర్ డిగ్రీ కాలేజీలో చదువుకున్నారు. 1990లో ఉస్మానియా వర్సిటీ నుంచి ఎంఏ సోషియాలజీలో గోల్డ్ మెడల్ పొందారు. 1992లో కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పీజీ డిప్లొమా, 2001లో సోషియాలజీ ఆఫ్ రిలీజియన్‌లో పీహెచ్‌డీ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో అధ్యాపకుడిగా మొదలైన ఆయన కెరీర్ అంచెలంచెలుగా ఎదిగింది. 1994లో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో రిజిస్ట్రార్, అకడమిక్స్ డైరెక్టర్‌గా పనిచేశారు. సామాజిక అంశాలపై విశేష అనుభవం ఉన్న చక్రపాణి పలు అవార్డులు పొందారు. తెలంగాణ వాదాన్ని బలంగా విన్పించేవారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఆయన తొలి చైర్మన్‌గా వ్యవహరించారు. కంప్యూటర్ బేస్డ్ నియామక పరీక్షను తొలిసారి ప్రవేశపెట్టారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఘంటా చక్రపాణి

జేఎన్టీయూహెచ్ ఇన్‌చార్జి వీసీగా బాలకిష్టారెడ్డి

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూహెచ్) ఇన్‌చార్జి ఉపకులపతిగా ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డిని ప్రభుత్వం నియమించింది. పూర్తి స్థాయి వీసీ నియామకం జరిగే వరకు ఆయన ఈ స్థానంలో కొనసాగుతారు. ఇటీవల అన్ని యూనివర్సిటీలకు వీసీల నియామకం చేపట్టారు. జేఎన్టీయూహెచ్ వీసీ కోసం నియమించిన సెర్చ్ కమిటీ సిఫార్సు చేసిన పేర్లను ప్రభుత్వం గవర్నర్‌కు పంపకుండా నిలిపివేసింది. మరో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అప్పటికే ఈ వర్సిటీ తాత్కాలిక వీసీగా అప్పటి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న బుర్రా వెంకటేశం కొనసాగుతున్నారు. ఆయన ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఇన్‌చార్జి వీసీ నియామకం అనివార్యమైంది.

డిసెంబర్ చివరి నాటికి టూరిజం పాలసీ సిద్ధం చేయండి

అధికారులకు సీఎం ఆదేశం



టూరిజం శాఖ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో జూపల్లి, స్మితా సబర్వాల్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: డిసెంబర్ 31 నాటికి రాష్ట్రానికి ప్రత్యేకంగా పర్యాటక విధానాన్ని సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దానిని తదుపరి శాసనసభ సమావేశాల్లో చర్చకు ఉంచి సమగ్రంగా చర్చించనున్నట్టు వెల్లడించారు. శుక్రవారం రాత్రి ఆయన పర్యాటక శాఖపై సమీక్షించారు. తెలంగాణలో వాతావరణపరంగా అనుకూల పరిస్థితి ఉండటం, శాంతిభద్రతలు మెరుగ్గా ఉండటం పర్యాటక రంగ పురోగతికి కలిసొచ్చే అంశాలని, వీటిని వినియోగించుకుంటూ పర్యాటకులు అధికంగా రాష్ట్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యాటకశాఖ స్వయంసమృద్ధి సాధించేలా చూడాలని, ఇందుకోసం కాన్సెప్ట్ టూరిజంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. దుబాయ్, సింగపూర్, చైనాల్లో పర్యాటకరంగం వృద్ధి చెందేందుకు అనుసరించిన పద్ధతులను అధ్యయనం చేసి స్థానికంగా అనువైన అంశాలను అనుసరించాలని చెప్పారు. తమిళనాడు తరహాలో ఆటోమొబైల్ రంగం స్థానికంగా అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. టైగర్ రిజర్వ్ ఫారెస్టులు పర్యాటకులను బాగా ఆకట్టుకుంటాయని, ఇందుకోసం మధ్యప్రదేశ్, మహారాష్ట్రల నుంచి తెలంగాణకు పులులు వచ్చేలా చూడాలని సూచించారు. పులులు తిరిగే ప్రాంతాలకు చేరువగా ఉన్న దేవాలయాలను అనుసంధానిస్తూ ఎకో టూరిజం-టెంపుల్ టూరిజంను అభివృద్ధి చేయాలని సూచించారు. మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల దేవాలయాలకు వెళ్లే వారి సంఖ్య పెరిగిందని, ఇది కూడా పర్యాటకాభివృద్ధికి దోహదమయ్యే అంశమేనన్నారు. ఫ్యూచర్ సిటీలో మెగా కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని, అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 20 నిమిషాల్లో దానికి చేరుకునేలా చర్యలు చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు అనువైన ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు. పర్యాటకాభివృద్ధి సంస్థ నుంచి లీజుకు తీసుకున్న స్థలాలను గడువు ముగిసినా ఖాళీ చేయని సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా స్థలాలపై ఉన్న కోర్టు స్టేలను ఎత్తివేసేలా అడ్వొకేట్ జనరల్‌తో చర్చించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉస్మానియా ఆస్పత్రిని ఖాళీ చేసిన తర్వాత ఆ భవనాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నట్టు వెల్లడించారు. చార్మినార్‌ను మరింత మంది సందర్శించాలంటే ఏం చేయాలో తేల్చి ఆమేరకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఆ శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, ఎండీ ప్రకాశ్‌రెడ్డి, సీఎం ఓఎస్డీ శ్రీనివాసులు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు 18న నోటిఫికేషన్

- నెలన్నరపాటు దరఖాస్తులు
- ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: గురుకుల సొసైటీలో ప్రవేశాలకు ఈనెల 18న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు ఎస్సీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి వెల్లడించారు. ముందుగా ఐదోతరగతి ప్రవేశాల ప్రకటన జారీ చేస్తామన్నారు. దరఖాస్తు ప్రక్రియ నెలన్నరపాటు సాగుతుందని, ఫిబ్రవరి 23న రాతపరీక్ష నిర్వహించి జూన్ 12లోగా ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను కూడా జతచేయాల్సి ఉంటుందని, 2024లో తీసుకున్న ధ్రువపత్రాలు చెల్లుతాయన్నారు. గురుకుల సొసైటీ కార్యక్రమాలపై శుక్రవారం సొసైటీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అర్హత పరీక్ష నిర్వహించడం లేదని, పదోతరగతి పాసైన విద్యార్థులకు నేరుగా ఇంటర్ ప్రవేశాలు కల్పిస్తామన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)ల్లో మాత్రం అత్యధిక మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. గురుకులాల్లో నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ప్రత్యేకంగా మార్గదర్శకాలు రూపొందిస్తున్నామని ఆమె వెల్లడించారు. కొందరు ఉద్దేశపూర్వకంగా గురుకులాలపై ఆరోపణలు చేస్తున్నారని, వారు మెరుగైన వసతుల కల్పనకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

పార్లమెంట్‌లో బీసీల డిమాండ్లను చర్చించాలి

- ఓబీసీ జాతీయ సదస్సులో జాజుల
- దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి: ఎంపీ మల్లు రవి



సాక్షి, న్యూఢిల్లీ: బీసీల సమస్యలు, డిమాండ్లపై దేశవ్యాప్తంగా ఉన్న బీసీ ఎంపీలు అంతా కలసి ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేక చర్చ చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి హక్కుల కోసం పోరాటాలు చేస్తుంటే కేంద్రంలో ఉన్న ఏ ఒక్క ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదన్నారు. బీసీల హక్కులను ఎన్‌డీఏ సర్కార్ కాలరాస్తోందని మండిపడ్డారు. ఓబీసీల ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు అన్ని రాష్ట్రాల్లో త్వరలో బస్సు యాత్ర చేపట్టి, లక్షమందితో ఢిల్లీని స్తంభింపచేస్తామని హెచ్చరించారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఓబీసీ జాతీయ సదస్సును నిర్వహించారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. అఖండ భారత్, స్వర్ణ భారత్ అంటున్న ప్రధాని మోదీకి దేశంలో 60 శాతం ఉన్న బీసీల ఆకాంక్షలు గుర్తుకు రావడం లేదా అని ప్రశ్నించారు. బీసీల అభివృద్ధే దేశాభివృద్ధిగా భావించినప్పుడే అఖండ భారత్‌గా మారుతుందన్నారు. కాగా, తెలంగాణలో మాదిరిగా దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని ఎంపీ మల్లు రవి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్, బీసీ సంక్షేమ సంఘం ఏపీ అధ్యక్షుడు కేసిన శంకర్రావు, గోవా అధ్యక్షుడు మధు నాయక్, ఢిల్లీ అధ్యక్షుడు హన్స్‌రాజ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నక్క వాగులోకి అక్రమ వ్యర్థాలు... రాల్‌ప్రో టెక్నో క్రాఫ్ట్స్‌కు మూసివేత నోటీసులు

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి సమీపంలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట్ గ్రామం నక్కవాగులోకి అక్రమంగా ఫ్యాక్టరీ వ్యర్థాలను విడుదల చేసిన రాల్‌ప్రో టెక్నో క్రాఫ్ట్స్‌కు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీపీసీబీ) మూసివేత నోటీసులు జారీచేసింది. గత నెల 29న సంగారెడ్డి జిల్లా ఇస్మాయిల్‌ఖాన్‌పేట్ బ్రిడ్జి సమీపంలోని నక్క వాగులోకి ట్యాంకర్ ద్వారా వ్యర్థాలను విడుదల చేస్తున్న సందర్భంగా పెట్రోలింగ్ టీపీసీబీ అధికారులు పట్టుకున్నారు. నేమ్ ప్లేట్ లేదా రిజిస్ట్రేషన్ నంబర్ కూడా లేని ట్యాంకర్ డ్రైవర్ తప్పించుకోగా అతని సహాయకుడిని (కేతావత్ దేవదాస్) పట్టుకున్నారు. తర్వాత అతను పరిశ్రమ పేరును వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం తుర్కల్‌ఖానాపూర్ గ్రామంలోని రాల్‌ప్రో టెక్నో క్రాఫ్ట్స్‌కు చెందిన ఈ వాహనానికి ఎలాంటి పత్రాలు లేదా మెటీరియల్ ఇన్వాయిస్ కాపీలు లేకుండా వ్యర్థజలాల్ని విడుదల చేస్తూ పట్టుబడినట్టు అధికారులు తెలిపారు. డ్రైవర్ అసిస్టెంట్ కూడా ఇదే విషయాన్ని లిఖితపూర్వకంగా సమర్పించాడు. ట్యాంకర్‌లో ఉన్న వ్యర్థాలు ఆల్కలీన్ స్వభావం కలిగి ఉన్నాయని సూచిస్తున్నాయి. స్వాధీనం చేసుకున్న ట్యాంకర్‌ను కస్టడీ కోసం పటాన్‌చెరులోని పీఈటీఎల్ వద్ద ఉంచినట్టు అధికారులు చెప్పారు. అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను గుర్తించాలంటూ పీసీబీ సంగారెడ్డి స్థానిక అధికారులు, సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల్లోగా పారిశ్రామిక వ్యర్థాల తరలింపు, రవాణా రోడ్లపై మాత్రమే జరగాలని స్పష్టంచేశారు.

సోలార్ మాడ్యూల్స్ తయారీపై ఎంవోయూ

సాక్షి, హైదరాబాద్: అత్యధిక సామర్థ్యం గల సోలార్ సెల్స్, సోలార్ మాడ్యూల్స్ తయారీ, పరిశోధనకు హైదరాబాద్ బిట్స్ పిలానీ, ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరింది. బిట్స్ పిలానీ విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణలు చేసేందుకు వీలుగా అవసరమైన సాంకేతిక సహకారాన్ని ప్రీమియర్ ఎనర్జీస్ అందిస్తుంది. ఇది ఉన్నత విద్య పరిశోధనకు ఊతమిస్తుందని ఇరు పక్షాలు ఈ సందర్భంగా తెలిపాయి. కార్యక్రమంలో బిట్స్ పిలానీ ఉపకులపతి ప్రొఫెసర్ వి.రాంగోపాల్‌రావు, డైరెక్టర్, డీన్స్ ప్రొఫెసర్ సౌమ్యో ముఖర్జీ, ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ చైర్మన్ సురేందర్ పాల్ సింగ్ సలూజా తదితరులు పాల్గొన్నారు.

29న గుర్తింపు పొందిన పాఠశాలల సంఘం ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సంఘం కార్యవర్గ ఎన్నికలను ఈ నెల 29న నిర్వహించనున్నట్టు ప్రధాన ఎన్నికల అధికారి ఎస్.నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఈ నెల 10 నుంచి 15లోగా నామినేషన్ పత్రాలు దాఖలు చేయాలని కోరారు. సభ్యులు వాట్సాప్ ద్వారా బ్యాలెట్ పేపర్ లింకులపై క్లిక్ చేసి ఓటు వేయాలని సూచించారు.

చలికాలాన్ని వెచ్చగా కప్పేద్దాం



చలికాలం అందమైన కాలం. మంచి వాతావరణం ఉంటుంది. ఎండ తీవ్రత తక్కువగా ఉంటుంది. ఉదయాలు పొగమంచు ఆహ్లాదాన్నిస్తే. రాత్రుళ్లు రారమ్మంటూ వెచ్చని రగ్గులు ఆహ్వానిస్తాయి. చాయ్‌లు వేడివేడిగా గొంతులో నుంచి జారుతుంటాయి. తొందరగా ఇల్లు చేరాలనిపిస్తుంది. కిటికీలు మూసి తలుపులేసి వెచ్చగా ఇంట్లో గడపడంలో ఆనందం తెలుస్తుంది. అయితే చలికాలంలో పాటించాల్సిన జాగ్రత్తలు కూడా ఉంటాయి. వాటిని దృష్టిలో పెట్టుకుంటే హాయిగా ఈ కాలాన్ని దాటేయొచ్చు.



- చలికాలంలో చర్మం పొడిబారడం సహజం. దీనికి ఇంటి చిట్కాలు ఉన్నాయి. పసుపును వంటల్లో వాడాలి. అది చర్మాన్ని మామూలు స్థితికి తీసుకురావడంలో సాయం చేస్తుంది. పసుపు, పాలు, తేనె కలిపి ప్యాక్ వేసుకున్నా మంచి ఫలితం ఉంటుంది. పూర్వం మన పెద్దలు వాడినట్టుగా రోజూ చర్మానికి కొబ్బరి నూనె, ఆముదం రాసుకుని, కొద్ది సేపు మర్దనా చేసి గోరువెచ్చని నీళ్లతో స్నానం చేస్తే చర్మం నిగనిగ.
- ఆహారంలో జాగ్రత్తలూ అవసరమే. కేకులు, కుకీలు వంటి బేకరీ పదార్థాలు, శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. ఫ్రిజ్‌లో పెట్టిన పదార్థాలు తినకూడదు. ఏ పూటకా పూట వండుకున్న వేడి ఆహారం మంచిది. హోటళ్లల్లో దొరికే ఆహారానికి దూరంగా ఉండాలి. ముఖ్యంగా రోడ్డు మీద అమ్మే పదార్థాలు తినకూడదు.



- మిరియాలు శరీరంలోని ఉష్ణానికి సహకరిస్తాయి. నెయ్యి కూడా మంచిదే. ఈ కాలంలో అల్లం తురుముని వేడి నీళ్లలో వేసుకుని తీసుకుంటే చాలా మంచిది. మామూలు టీలో అల్లం వాడితే ఆ రుచే వేరు. చలికాలంలో సహజంగా పలకరించే జలుబు దగ్గు వంటి వాటిని తేనెతో తిప్పి కొట్టచ్చు. బెల్లం కూడా ఒంటిని వేడిగా మారుస్తుంది.
- రోజుకు కనీసం 7-8 గ్లాసుల గోరువెచ్చని నీళ్లు తాగాలి. దీనివల్ల రక్త ప్రసరణ బాగా జరగడంతోపాటు, చర్మం నిగనిగలాడుతుంది.
- దాల్చిన చెక్క, జీలకర్ర, సొంఠి వంటి సుగంధ ద్రవ్యాలు యాంటీ ఫంగల్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి చలి కాలంలో రోగనిరోధక శక్తిని పెంపొందించడమే కాకుండా, జీర్ణశక్తిని మెరుగుపరిచి, ఆకలిని పెంచుతాయి. ఆవాలు, ఇంగువ, నల్ల మిరియాలు, మెంతులు, జీలకర్ర ఇవన్నీ కూడా చలికాలంలో వచ్చే ఫ్లూ, జలుబును దూరం చేస్తాయి.

వంటకాలలో పెసరపప్పు, మెంతులు, మెంతి పొడి వాడటం వల్ల ఆకలి పుట్టడమే కాకుండా, శరీరానికి వెచ్చదనం వస్తుంది.

- చలికాలంలో రొట్టెలు మంచి ఆహారం. గోధుమ పిండి, జొన్న పిండి, మొక్క జొన్న పిండి, బార్లీ పిండి, రాగి పిండి వంటి వాటితో తయారు చేసిన రొట్టెలను రోటి పచ్చళ్లతో నంజుకు తింటే మంచిది.
- చంటిపిల్లలు ఉంటే వారిని వెచ్చని దుస్తుల్లో ఉంచడం, కాసేపు ఉదయపు ఎండ చూపించడం మంచిది. రోజూ గోరువెచ్చటి నీళ్లతో స్నానం చేయించాలి. చిన్నపిల్లల్ని చలిలో తిరగనివ్వకూడదు. ఈ కాలంలో దుమ్ము ప్రమాదం. ఎప్పుడూ ఇల్లు శుభ్రంగా ఉంచుకోవాలి. పెద్దవయసు వారు ఉన్ని టోపీలతో పాటు చెవిలో దూది పెట్టుకోవడం మంచిది. పెదవులకు లిప్‌బామ్ రాయడం మంచిది.
- ఇక ఈ కాలంలో ప్రయాణాలు చేసే వారు తప్పనిసరిగా రాత్రి ప్రయాణాలు నివారించాలి. తెల్లవారు జాము గాలి కూడా అంత మంచిది కాదు కాబట్టి మార్నింగ్ వాక్ చేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.

పేరెంటింగ్

పిల్లలు మాట వినడం లేదా?



'ఈ పిల్లలతో అసలు పడలేక పోతున్నాం, ఒక్క మాట కూడా వినడం లేదు' ఈ మధ్యకాలంలో పేరెంట్స్ నుంచి అధికంగా వస్తున్న కంప్లైంట్ ఇదే. నిజానికి ఈ రోజుల్లో పిల్లల్ని క్రమశిక్షణతో పెంచడమే పెద్ద టాస్క్ అయిపోయింది. అయితే పిల్లలు మాటలు వినకపోవడానికి చాలా కారణాలుంటాయంటున్నారు నిపుణులు. చిత్రం ఏమిటంటే కొన్నిసార్లు వాళ్లు మాట వినకపోవడానికి తల్లిదండ్రులు కూడా కారణమవుతారట. ఆ వివరాలు ఒకసారి చూద్దాం.

చాలామంది పేరెంట్స్ తమ పిల్లల్ని కంట్రోల్ చేయడానికి వారిపై తీవ్రమైన ఆంక్షలు విధిస్తుంటారు. 'అక్కడికి వెళ్లకూడదు, ఇది తినకూడదు' అంటూ పిల్లల ఆశల్ని ఆలోచనలనీ అదుపు చేయడానికి ప్రయత్నిస్తుంటారు. దాంతో పిల్లలు సహజంగానే ఎదిరించే తత్వాన్ని అలవరచుకుంటారు. ఆ క్రమంలో మరింత మొండిగా అయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే పిల్లలపై ఆంక్షలు విధించేటప్పుడు అది ఎందుకు వద్దో వారికి అర్థమయ్యేలా వివరంగా చెప్పడం మంచిది. అలా చెప్పడం వల్ల పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య అవగాహన, అనుబంధం పెరుగుతుంది కూడా.

పిల్లలు ఎక్కువగా తల్లిదండ్రుల నుంచి ప్రత్యేక శ్రద్ధను, గుర్తింపుని కోరుకుంటారు. అలాంటి సమయంలో వారిని పట్టించుకోకపోతే వారు కూడా పేరెంట్స్‌ని నిర్లక్ష్యం చేసే ప్రమాదం ఉంటుంది. అదే విధంగా కొందరు తల్లిదండ్రులు తమ వ్యక్తిగత లేదా ఆఫీస్ పనుల్లో మునిగిపోయి పిల్లల్ని పట్టించుకోరు. వారికోసం తగిన సమయం కేటాయించ లేరు. అలాంటి వారి పిల్లలు తమ పేరెంట్స్ మాటని లైట్ తీసుకుంటారు. ఈ ఇబ్బందులూ ఇగో సమస్యలూ రాకుండా ఉండాలంటే వీలుచిక్కినప్పుడల్లా పిల్లలపై కాస్త దృష్టి పెడుతుండాలి.



సాధారణంగా పిల్లలు ఎదిగే కొద్దీ స్నేహితుల కారణంగానో, వారికి పెరిగిన అవగాహన కారణంగానో కొత్త కొత్త ఆశలు, కోరికలు పుట్టుకొస్తుంటాయి. వాటిని పిల్లలు చాలా ఉత్సాహంగా పేరెంట్స్‌తో పంచుకునేందుకు ప్రయత్నిస్తారు. అప్పుడు తల్లిదండ్రులు వాటిపై ఏమాత్రం ఆసక్తి చూపకుండా... ఉదాసీనంగా ఉంటే పిల్లలు నిరుత్సాహపడిపోతారు. కొందరు పేరెంట్స్ అయితే పిల్లలు ఏమడిగినా పూర్తిగా వినకుండానే నో చెప్పేస్తుంటారు. దాంతో వారు చిన్నబుచ్చుకుంటారు. అందుకే పిల్లలు ఏదైనా అడిగినప్పుడు వెంటనే కాదు, లేదు అని వారి ఆశలపై నీరు చల్లకూడదు. వీలైతే వారి కోరికల వల్ల కలిగే ఇబ్బందులను వారికి వివరించి, వారంతట వారే 'అమ్మో వద్దులే' అనేట్టుగా చేయగలగాలి.

సాధారణంగా చాలామంది పెద్దలకు ఒక చెడు అలవాటు ఉంటుంది, అది తమ పిల్లలను ఇతరుల పిల్లలతో పోల్చి తిట్టడం. దానివల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. అనవసరమైన ఆందోళన, ఆత్మనూన్యత భావం పెరిగిపోతాయి. అంతేకాకుండా అసహనంతో పేరెంట్స్ మీదే కోపం కలుగుతుంది. ఆ తర్వాత మొండితనం పెరిగి మాట వినకపోవడం అనే అవలక్షణం ఏర్పడుతుంది. నిజంగానే మీ పిల్లలు ఇతరుల పిల్లల కంటే తక్కువ స్థాయిలో ఉన్నట్లు మీకనిపిస్తే.. వారిని దగ్గర కూచోబెట్టుకుని మీరు పోల్చాలనుకున్న వారి నుంచి ఎలా స్ఫూర్తిని పొందాలో సున్నితంగా వివరించాలి. అంతేకానీ, నలుగురిలో పిల్లలను అవమానించడం, నలుగురితో పోల్చి తిట్టడం మంచి అలవాటు కాదు. దాని వల్ల పేరెంట్స్ వారి పిల్లల దగ్గర తమ విలువను పోగొట్టుకునే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. 'మొదట పిల్లలను డీల్ చేసే పద్ధతిలో మార్పు వస్తే.. ఆటోమేటిక్‌గా పిల్లలు మారతారు, మాట వింటారు' అంటున్నారు నిపుణులు.

ఈ జ్యూస్‌ను మరేదీ బీట్ చేయలేదు!

మనం రకరకాల పండ్ల రసాలు తాగుతుంటాం. అయితే వాటికన్నా బీట్‌రూట్ రసం తీసుకోవడం చాలా మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. వారి మాటల్లోనే చెప్పాలంటే...

బీట్‌రూట్‌లో మనకి కావాల్సిన అనేక పోషకాలున్నాయి.

ఐరన్ తక్కువగా ఉన్నవారు బీట్‌రూట్ జ్యూస్ రోజూ తాగితే ఐరన్ పెరుగుతుంది. అలాగే రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయులు కూడా పెరుగుతాయి.



- నీరసంతో బాధపడేవారు కొన్ని బీట్ రూట్ ముక్కలు తిన్నా లేదంటే బీట్ రూట్ జ్యూస్ తాగినా తక్షణ శక్తి వస్తుంది. బీట్ రూట్‌లో బి, సి విటమిన్స్ అధికం. రక్తపోటు నియంత్రణలో ఉండేందుకు బీట్ రూట్ దోహదం చేస్తుంది.
- రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగితే శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ కరిగిపోతుంది. అలాగే అధిక కొవ్వు సమస్యతో బాధ పడేవారు ఈ జ్యూస్ తాగితే కొవ్వు కరుగుతుంది.
- మూడీగా ఉండేవారు అప్పుడప్పుడు బీట్ రూట్ జ్యూస్ తాగుతుంటే ఉల్లాసంగా ఉండగలుగుతారు.
- గర్భిణులకు కావాల్సిన ఫోలిక్ యాసిడ్ బీట్ రూట్ ద్వారా అందుతుంది. గర్భంలోని పిండం సక్రమంగా ఎదగాలంటే గర్భిణులు రోజూ బీట్ రూట్ జ్యూస్ తాగడం మంచిది. కాలేయాన్ని బీట్ రూట్ శుభ్రపరుస్తుంది.
- చర్మ సంబంధిత వ్యాధులు రావు.
- ఎముకల్ని గట్టిగా ఉంచే శక్తి కూడా బీట్ రూట్ కు ఉంటుంది.
- బీట్ రూట్ జ్యూస్ తాగేవారికి జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మెదడుకు కావాల్సిన రక్త సరఫరా అయ్యేలా బీట్ రూట్ చేయగలదు. ఏకాగ్రతను పెంచగల శక్తి కూడా బీట్ రూట్‌కు ఉంది. అందుకే ఫ్రెష్ బీట్‌రూట్ జ్యూస్ తాగాలి,

పీకాక్ బటర్ ఫ్లైస్

రెక్కలే అందం... ఆయుధం





వీటి రెక్కలు.. నెమలి ఈకలను తలపిస్తాయి. ఎవరో కూర్చుని ఓపిగ్గా రంగులద్దినట్లే ఉంటాయి. ఆ రెక్కల్లో అక్కడక్కడా కంటి నమూనాలు ప్రత్యేకంగా కనిపిస్తాయి. నిజానికి అవి వాటి ప్రాణాలను కాపాడే ఆయుధాలు. ఎందుకంటే వీటిని వేటాడే జంతువులను భయపెట్టేలా ఆ రెక్కలు రూపొందాయి. ఇవి సాధారణంగా యూరప్, ఆసియాలో ఎక్కువగా కనిపిస్తాయి.

సినిమా

మీలో ఒకడు



● రామ్

'మీకు సుపరిచితుడు... మీలో ఒకడు... మీ సాగర్' అంటూ రామ్ తాజా చిత్రం లుక్ విడుదలైంది. రామ్ పోతినేని హీరోగా మహేశ్‌బాబు .పి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి ఓ సినిమా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైన సందర్భంగా రామ్ చేస్తున్న సాగర్ పాత్రను పరిచయం చేసి, లుక్‌ని విడుదల చేశారు. పాత రోజుల హెయిర్ స్టయిల్, క్లీన్ షేవ్‌తో రామ్ వింటేజ్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఈ హీరోకి ఇది 22వ సినిమా. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మధు నీలకందన్, సంగీతం: వివేక్–మెర్విన్, సీఈవో: చెర్రీ.

రికార్డులు రప్పా రప్పా...

- తొలిరోజు రూ. 294 కోట్ల వసూళ్లు సాధించిన 'పుష్ప 2'
- బాలీవుడ్‌లో రూ. 72 కోట్లతో తొలి స్థానం
- నైజాంలో రూ. 30 కోట్లతో ఫస్ట్ ప్లేస్



● అల్లు అర్జున్

''ఆ బిడ్డ మీద ఒక్క చిన్న గీత పడాలా... గంగమ్మ తల్లి జాతరలో యాటను నరికినట్లు రప్పా రప్పా నరుకుతా.. ఒక్కొక్కడిని రప్పా రప్పా రప్పా...'' అంటూ విలన్లకి వార్నింగ్ ఇస్తాడు పుష్పరాజ్. 'పుష్ప 2: ది రూల్' చిత్రంలో హీరో అల్లు అర్జున్ చెప్పిన బోలెడన్ని పవర్‌ఫుల్ డైలాగ్స్‌లో ఇదొకటి. ఇక ఇక్కడ పేర్కొన్న డైలాగ్‌లానే రప్పా రప్పా అంటూ ఇప్పటివరకూ ఉన్న రికార్డులను చెరిపేసి, సరికొత్త రికార్డులను సృష్టించారు అల్లు అర్జున్. ఇప్పటివరకూ ఏ భారతీయ సినిమా సాధించని విధంగా తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా రూ. 294 కోట్ల గ్రాస్ రాబట్టి సరికొత్త రికార్డులను సెట్ చేసింది 'పుష్ప2: ది రూల్' సినిమా. అల్లు అర్జున్, రష్మికా మందన్నా జోడీగా నటించిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రీలీల ప్రత్యేక పాటలో నటించారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం (డిసెంబరు 5)న ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. అయితే డిసెంబరు 4న రాత్రి 9:30 గంటల నుంచి ప్రారంభమైన ప్రీమియర్స్‌కి అనూహ్యమైన స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా 12,500 స్క్రీన్స్‌లో ఈ చిత్రం విడుదలైంది. భారతీయ సినీ చరిత్రలో ఇప్పటివరకూ ఏ సినిమా సాధించని విధంగా మొదటి రోజు రూ. 294 కోట్ల గ్రాస్‌తో ఆల్ టైమ్ రికార్డ్ సృష్టించినట్లు మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించింది. ఇండియాలో ఇప్పటివరకు మొదటి రోజు భారీ వసూళ్లు సాధించిన చిత్రాల్లో 'ఆర్ఆర్ఆర్' (2022) రూ. 233 కోట్ల గ్రాస్‌తో ప్రథమ స్థానంలో ఉంది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా నటించిన ఈ చిత్రానికి రాజమౌళి దర్శకత్వం వహించారు. అయితే రూ. 294 కోట్ల గ్రాస్ వసూళ్లతో 'ఆర్ఆర్ఆర్' రికార్డును బ్రేక్ చేసింది 'పుష్ప 2: ది రూల్'. అదే విధంగా నైజాంలోనూ రికార్డులను తిరగ రాసింది 'పుష్ప 2'. ఇప్పటివరకూ మొదటి రోజు వసూళ్లలో రూ. 23కోట్ల గ్రాస్‌తో 'ఆర్ఆర్ఆర్' చిత్రం మొదటి స్థానంలో ఉండగా, రూ. 30 కోట్ల గ్రాస్ వసూళ్లతో సరికొత్త రికార్డుని సృష్టించి, మొదటి స్థానంలో నిలిచింది 'పుష్ప 2: ది రూల్'.

హిందీలోనూ తొలి రోజు రూ. 72 కోట్ల వసూళ్లతో 'పుష్ప 2' రికార్డు సృష్టించింది. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. బాలీవుడ్‌లో ఇప్పటివరకు మొదటిరోజు అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా షారుక్ ఖాన్ నటించిన 'జవాన్' రూ. 65.5 కోట్లతో మొదటి స్థానంలో ఉంది. అయితే, తాజాగా 'పుష్ప 2' రూ. 72 కోట్ల వసూళ్లతో 'జవాన్'ని రెండో స్థానానికి పరిమితం చేసింది. హిందీలో షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, సల్మాన్ ఖాన్ వంటి స్టార్స్‌కు కూడా సాధ్యం కాని రికార్డులను అల్లు అర్జున్ క్రియేట్ చేశారు. 'పుష్ప: ది రైజ్' (2021) చిత్రంలో తన అద్భుతమైన నటనకుగానూ జాతీయ అవార్డు అందుకున్నారు అల్లు అర్జున్. ఆ సినిమా బ్లాక్‌బస్టర్ కావడం, ఆయనకి జాతీయ అవార్డు రావడంతో ఉత్తరాదిలోనూ అల్లు అర్జున్‌కి స్టార్‌డమ్, ఫ్యాన్ బేస్ పెరిగిపోయింది. ఈ కారణంగానే హిందీలో 'పుష్ప 2'కి భారీ ఓపెనింగ్స్ వచ్చాయని ట్రేడ్ విశ్లేషకులు అంటున్నారు. మరి... రానున్న రోజుల్లో రప్పా రప్పా అంటూ 'పుష్ప 2' ఇంకెన్ని రికార్డులు సాధిస్తుందో వేచి చూడాల్సిందే.


అతను రాక్షసుడా?



● సన్నీ డియోల్

'అతను రాక్షసుడా?.., కాదు... రాక్షసుడు కాదు.., అయితే అతను దేవుడే...' అనే అర్థం వచ్చే హిందీ సంభాషణలతో హిందీ చిత్రం 'జాట్' ట్రైలర్ విడుదలైంది. సన్నీ డియోల్ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం ఇది. శుక్రవారం ఈ చిత్రం టీజర్ విడుదలైంది. ఈ యాక్షన్ ప్యాక్డ్ టీజర్‌లో విలన్లను రఫ్ఫాడించారు సన్నీ డియోల్. ఆయన పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో టీజర్ స్పష్టం చేస్తోంది. సన్నీ డియోల్, రణదీప్ హుడా తదితరులతో ఈ టీజర్ సాగుతుంది. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ చిత్రం విడుదల కానుంది. వినీత్ కుమార్ సింగ్, సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: రిషి పంజాబీ.

మన దేశం 75 వసంతాల వేడుకకు సన్నాహాలు



● 'మన దేశం'లో ఎన్టీఆర్

దివంగత ప్రముఖ నటుడు ఎన్టీఆర్ హీరోగా నటించిన తొలి చిత్రం 'మన దేశం' 75 సంవత్సరాలు (1949 నవంబర్ 24న ఈ చిత్రం విడుదలైంది) పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఈ నెల 14న తెలుగు చిత్ర పరిశ్రమ ఓ వేడుక జరపనుంది. ఈ వేడుక ఏర్పాట్లు గురించి చర్చించడానికి శుక్రవారం హైదరాబాద్‌లోని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి కార్యాలయంలో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ చలన చిత్ర వాణిజ్య మండలి, తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్, తెలుగు సినీ రైటర్స్ అసోసియేషన్, తెలుగు సినీ దర్శకుల సంఘం ప్రతినిధులు కలిశారు. ఈ వేడుకలో పలువురు సినీ నిర్మాతలు, సినీ ప్రదర్శకులు, పంపిణీదారులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొంటారని పేర్కొన్నారు.

శివాజీ చరిత్ర నేటి తరానికి చెప్పాలి
- రిషబ్ శెట్టి



''ఛత్రపతి శివాజీగారికి నేను అభిమానిని. ఆయన పాత్రలో నటించే అవకాశం రావడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను'' అని హీరో రిషబ్ శెట్టి చెప్పారు. 'కాంతార' సినిమాతో దేశవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకున్నారు కన్నడ హీరో రిషబ్ శెట్టి. ఆ సినిమా క్రేజ్‌తో ఆయన అన్నీ పాన్ ఇండియా చిత్రాలనే ఎంపిక చేసుకుంటున్నారు. అందులో భాగంగా ఛత్రపతి శివాజీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతున్న 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్' అనే పాన్ ఇండియన్ చిత్రంలో నటిస్తున్నారు. ఈ మూవీకి సందీప్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల ఈ సినిమాను ప్రకటించి, ఛత్రపతి శివాజీగా రిషబ్ శెట్టి ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. తాజాగా ఈ సినిమా గురించి రిషబ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ– ''ఛత్రపతి శివాజీగారికి నేను బిగ్ ఫ్యాన్‌ని. 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్' గురించి నాకు చెప్పగానే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా చేస్తానని చెప్పాను. ఇలాంటి బయోపిక్‌లలో నటించే అవకాశాలు చాలా అరుదుగా వస్తాయి. శివాజీగారి పాత్రలో నటించే చాన్స్ రావడం నాకు దక్కిన గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నా. ఆయన చరిత్రను నేటి తరానికి చెప్పడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. ఆ పాత్రకు ప్రాణం పోయడానికి సిద్ధంగా ఉన్నాను. శివాజీగారి గురించి ఇప్పటివరకూ తెలియని ఎన్నో విషయాలను తెలుసుకోవడానికి సిద్ధంగా ఉండండి'' అని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్'ని 2027 జనవరి 21న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్.

మరచిపోలేని ఓ జ్ఞాపకం



● భర్త జగత్ దేశాయ్, కుమారుడు ఇళైతో అమలా పాల్

నాగచైతన్య హీరోగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన 'బెజవాడ' సినిమాతో తెలుగుకి పరిచయమయ్యారు హీరోయిన్ అమలా పాల్. ఆ తర్వాత రామ్‌చరణ్‌తో 'నాయక్', అల్లు అర్జున్‌తో 'ఇద్దరమ్మాయిలతో', నానీతో 'జెండాపై కపిరాజు' వంటి సినిమాల్లో నటించి, తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారామె. అలాగే మలయాళం, తమిళ ఇండస్ట్రీలోనూ అమలా పాల్‌కి మంచి నటిగా పేరుంది. ఇదిలా ఉంటే... 2023 నవంబరు 5న జగత్ దేశాయ్‌ని వివాహం చేసుకున్నారు అమలాపాల్. వారికి ఇళై అనే కుమారుడు ఉన్నాడు. కాగా అమల–జగత్ కలిసి తమ వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కేరళలోని కుమారకట్‌లో గల వెంబనాడ్ సరస్సు మధ్యలో ప్రత్యేకంగా సిద్ధం చేసిన వేదికపై జరుపుకున్న వివాహ వార్షికోత్సవానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను అమలా పాల్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి, తన మనసులోని భావాలను పంచుకున్నారు. ''అద్భుతమైన భర్తకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు. ఇది నా జీవితంలో మరిచిపోలేని ఓ జ్ఞాపకంగా మిగిలిపోతుంది. నువ్వు నాకు ప్రపోజ్ చేసినప్పటి నుండి నాకు ఇచ్చిన ప్రతి సర్‌ప్రైజ్ గుర్తుంది. ప్రేమను శాశ్వతంగా పంచే వ్యక్తి భర్తగా ఉన్నందుకు నేనెంతో సంతోషంగా ఉన్నాను. నన్ను ఎంతో ప్రేమ, ఆత్మీయతలతో చూసుకునే భర్త దొరకడం నా అదృష్టం'' అని రాసుకొచ్చారామె. ఈ ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. పలువురు నెటిజన్లు అమలా పాల్–జగత్ దేశాయ్‌కి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	57	81,709
నిఫ్టీ ▽	31	24,678

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	19,801	△	100
డోజోన్స్	44,673	▽	93
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,309	▽	41
డాక్స్	20,386	△	27
షాంఘై	3,404	△	35
నికాయ్	39,091	▽	304

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్


బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	76,187
బంగారం (99.5 స్వచ్ఛత)	75,882
వెండి (కిలో)	90,820

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.90	85.19
£	బ్రిటన్ పౌండ్	105.70	108.71
€	యూరో	87.44	90.19
¥	జపాన్ ఎన్ (100)	45.32	61.33
AU$	ఆస్ట్రేలియా డాలర్	52.22	55.20
S$	సింగపూర్ డాలర్	60.97	63.81
SAR	సౌదీ రియాల్	21.70	23.25
UAE D	యూఏఈ దిర్హామ్	22.18	23.18
¥	చైనా యువాన్	10.79	12.62

ఆర్‌బీఐ.. ఆచితూచి!



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి కమిటీ (ఎంపీసీ) పాలసీ సమీక్షా మూడు రోజుల సమావేశం ఒకవైపు ధరల కట్టడి–మరోవైపు వృద్ధికి విఘాతంలేని సమతుల విధాన నిర్ణయాలను తీసుకుంది. అయితే ధరల కట్టడే తొలి ప్రాధాన్యతని స్పష్టం చేసింది. ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) దేశ స్థూల ఉత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు క్రితం అంచనాలను ఏకంగా 60 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) 7.2 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించిన గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల పాలసీ కమిటీ (ఎంపీసీ), ద్రవ్యోల్బణం కట్టడి విషయంలో రాజీ లేదని సంకేతాలు ఇచ్చింది. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు– రెపోను యథాతథంగా 6.5 శాతంగానే కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేసింది. ద్రవ్యోల్బణం భయాలు పొంచి ఉన్నాయని స్పష్టం చేస్తూ, వార్షిక రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను 4.5% నుంచి 4.8%కి పెంచింది. అయితే వృద్ధి పెరుగుదలకూ తాను ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. బ్యాంకులు తమ వద్ద ఉంచుకునే నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్‌ఆర్) పరిమితిని 4.5 నుంచి 4 శాతానికి తగ్గించింది. దీనితో బ్యాంకింగ్ వద్ద దాదాపు రూ.1.6 లక్షల కోట్ల అదనపు నిల్వలు ఒనగూరనున్నాయి. బ్యాంకింగ్ వ్యవస్థలో తగిన నిధుల లభ్యతకు, స్వల్ప కాలిక రుణ రేటు తగ్గి, రుణ డిమాండ్ పెరగడానికి దోహదపడే అంశమిది.

వృద్ధికి.. ద్రవ్యోల్బణ కట్టడికి సమ ప్రాధాన్యత
- ఎకానమీ మందగమనం సంకేతాలు
- జీడీపీ వృద్ధి రేటు అంచనా 7.2 శాతం నుంచి 6.6 శాతానికి కోత
- రిటైల్ ద్రవ్యోల్బణం అంచనా 4.5 శాతం నుంచి 4.8 శాతానికి అప్
- కీలక వడ్డీరేటు యథాతథంగా 6.5 శాతం వద్దే కొనసాగింపు
- సీఆర్‌ఆర్ 4.5 శాతం నుంచి 4 శాతానికి తగ్గింపు
- దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.1.6 లక్షల కోట్ల అదనపు నిధులు

డిసెంబర్ 14, 28 తేదీల్లో రెండు దశల్లో సీఆర్‌ఆర్ తగ్గింపు నిర్ణయం అమలవుతుంది.

యథాతథ రేటుకు నలుగురే ఓటు..

అయితే విధాన నిర్ణయ కమిటీలోని ఆరుగురు సభ్యుల్లో నలుగురు మాత్రమే యథాతథ రెపో రేటును కొనసాగించడానికి ఓటు చేయడం గమనార్హం. అటు కఠినం కాకుండా, ఇటు సరళతరం కాకుండా యథాతథ ''తటస్థ వైఖరి''ని కొనసాగించాలని వీరు నిర్ణయించారు. అయితే ఎక్స్‌టర్నల్ సభ్యులు ఇరువురు నగేష్ కుమార్, రామ్ సింగ్‌లు వృద్ధి లక్ష్యంగా రెపో రేటును పావు శాతం తగ్గించాలని ఓటు చేయడం గమనార్హం.

వరుసగా '11'వ సారీ...

యథాతథ రేటు కొనసాగింపు ఇది వరుసగా 11వ సారి. 2023 ఫిబ్రవరి నుంచి జరిగిన ద్వైమాసిక సమీక్షా సమావేశాల్లో ఆర్‌బీఐ యథాతథ 6.5 శాతం రెపో రేటును కొనసాగిస్తోంది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం, దీనితో పొంచి ఉన్న ద్రవ్యోల్బణం భయాలు దీనికి ప్రధాన కారణం. భారత్ రిటైల్ ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో ఆందోళనకరంగా 14 నెలల గరిష్ట స్థాయిలో 6.2 శాతంగా (2023 ఇదే నెలతో పోల్చి) నమోదయిన నేపథ్యం ప్రధానంగా పాలసీ సమీక్ష యథాతథ రేటు నిర్ణయానికి కారణమైంది.

మరికొన్ని అంశాలు..
- యూపీఐ ద్వారా చిన్న మొత్తాల్లో రుణాలిచ్చేందుకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు అనుమతి.
- సాధారణ ప్రజలకు సమాచారాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయడానికి ఆర్‌బీఐ పాడ్‌కాస్ట్‌లను ప్రారంభించనుంది.
- ఆర్థిక రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) బాధ్యతాయుతమైన, నైతిక వినియోగం కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేయడానికి ఆర్‌బీఐ నిపుణుల కమిటీ ఏర్పాటు.
- ఆర్థిక మోసాలకు పాల్పడే అక్రమ ఖాతాలను తొలగించేందుకు ఆర్‌బీఐ ఇన్నోవేటివ్ హబ్ డిజైన్ చేసిన 'మ్యూల్‌హంటర్.ఏఐ'ని వినియోగించుకోవాలని బ్యాంకింగ్‌కు సూచన.
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 5 నుంచి 7వ తేదీ వరకూ తదుపరి పాలసీ సమీక్ష.

ధరల కట్టడే మా లక్ష్యం..

ద్రవ్యోల్బణాన్ని గట్టిగా పట్టి ఉంచడానికి రిజర్వ్ బ్యాంక్ దృష్టి కేంద్రీకరించింది. ద్రవ్యోల్బణం– వృద్ధి మధ్య సమతౌల్యత అస్థిరంగా ఉంది. క్యూ2లో ఊహించిన దానికన్నా తక్కువగా 5.4 శాతం జీడీపీ వృద్ధి రేటు– అక్టోబర్‌లో 6 శాతం పైబడిన రిటైల్ ద్రవ్యోల్బణాన్ని ఇక్కడ ప్రస్తావించాల్సి ఉంటుంది. వృద్ధి స్పీడ్– ధరల కట్టడి మధ్య సమతుల్యత సాధించడానికి అన్ని సాధనాలను అందుబాటులోకి తీసుకువస్తాం.

– శక్తికాంతదాస్, ఆర్‌బీఐ గవర్నర్

రూపాయి రక్షణకు చర్యలు...

డాలర్ మారకంలో రూపాయి విలువ సరికొత్త కనిష్టాలను చూస్తున్న నేపథ్యంలో విదేశీ నిధుల ఆకర్షణ ద్వారా దేశీ కరెన్సీకి ప్రయోజనం చేకూర్చే కీలక నిర్ణయం వెలువడింది. విదేశీ కరెన్సీ నాన్–రెసిడెంట్ బ్యాంక్ డిపాజిట్లు (ఎఫ్‌సీఎన్ఆర్–బీ) డిపాజిట్లపై వడ్డీ రేట్ల సీలింగ్‌లను కాలానుగుణంగా పెంచాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. శుక్రవారం నుండి బ్యాంకులు ఒక సంవత్సరం నుంచి 3 ఏళ్ల వరకూ మెచ్యూరిటీకి డిపాజిట్ రేట్లను పెంచడానికి అనుమతించారు.

వ్యవసాయ రంగానికి వరం

ఆర్థిక వ్యవస్థలో దాదాపు 25% వాటా ఉన్న వ్యవసాయ రంగం పురోభివృద్ధిపైనా ఆర్‌బీఐ దృష్టి సారించడం గమనార్హం. వ్యవసాయ రంగంలో తనఖా లేని రుణాల పరిమితిని ప్రస్తుత 1.6 లక్షల నుంచి రూ. 2 లక్షలకు పెంచుతూ పాలసీ నిర్ణయం తీసుకుంది. 2010లో ఈ రుణ పరిమితిని లక్షకు పెంచగా, 2019లో రూ.1.6 లక్షలకు పెంచారు. చిన్న మధ్య తరహా రైతులకు ప్రయోజనం చేకూర్చే అంశమిది. దీనిపై త్వరలో ఒక సర్క్యులర్ జారీ అవుతుంది.

పరిస్థితులకు అనుగుణంగా..



ప్రస్తుత ఎకానమీ పరిస్థితులకు అనుగుణంగా ఉంది. సీఆర్‌ఆర్ తగ్గింపు వల్ల బ్యాంకింగ్‌పై నిధుల సమీకరణ వ్యయ భారం తగ్గుతుంది. ఉత్పాదక రంగాలకు మరింత రుణ లభ్యతకు దోహదపడుతుంది. వ్యవసాయ రంగానికి దోహదపడే నిర్ణయాలు హర్షణీయం. ఏఐకి సంబంధించి తీసుకున్న నిర్ణయాలు బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేస్తాయి.

– సీఎస్ శెట్టి, ఎస్‌బీఐ చైర్మన్

వృద్ధికి దోహదం



ఆర్‌బీఐ పాలసీ విధాన నిర్ణయాలు ఊహించిన విధంగానే ఉన్నాయి. సీఆర్‌ఆర్ కోత ఎకానమీ వృద్ధికి దోహదపడే అంశం. తగిన సమయంలో వ్యవస్థలో ద్రవ్య లభ్యత మెరుగుకు తీసుకున్న సరైన నిర్ణయం ఇది.

– హర్ష్ వర్ధన్ అగర్వాల్, ఫిక్కీ ప్రెసిడెంట్

5 రోజుల లాభాలకు బ్రేక్

- మెప్పించని ఆర్‌బీఐ పాలసీ...
- స్వల్పంగా నష్టపోయిన సెన్సెక్స్, నిఫ్టీ

ముంబై: దేశీ స్టాక్ మార్కెట్ల 5 రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. రిజర్వ్ బ్యాంక్ పాలసీ సమీక్ష సందర్భంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) వృద్ధి అంచనాలకు కోత విధించడం, రెపో రేటును యథాతథంగా కొనసాగించడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. కాగా, ఆర్థిక వ్యవస్థ బలహీన ధోరణి నేపథ్యంలో వ్యవస్థలోకి ద్రవ్య సరఫరా పెంచేందుకు నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్‌ఆర్)ని అర శాతం (4 శాతానికి) తగ్గిస్తూ ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం లాభాలతో మొదలైన మార్కెట్లు ఇంట్రాడేలో తీవ్ర హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. సెన్సెక్స్ 81,926 పాయింట్ల గరిష్టాన్ని, 81,506 పాయింట్ల కనిష్టాన్ని తాకింది. అంటే 420 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. చివరకు 57 పాయింట్ల నష్టంతో 81,709 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ కూడా ఒడిదుడుకుల మధ్య 31 పాయింట్లు కోల్పోయి 24,678 వద్ద ముగిసింది. గడిచిన 5 సెషన్లలో సెన్సెక్స్ 2,722 పాయింట్లు దూసుకెళ్లడం తెలిసిందే. సెన్సెక్స్ 30 షేర్లలో అదానీ పోర్ట్స్, భారతి ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ తదితర కంపెనీలు నష్టాలతో ముగిశాయి.

నిరాశపరిచిన సుర్క్ష డయాగ్నోస్టిక్...

సుర్క్ష డయాగ్నోస్టిక్ షేరు లిస్టింగ్‌లో నిరాశపరిచింది. ఇష్యూ ధర రూ.441తో పోలిస్తే బీఎస్‌ఈలో 0.9 శాతం డిస్కౌంట్‌తో రూ.415 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో దాదాపు 6% క్షీణించింది. చివరకు 5.2% నష్టంతో రూ.418 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.2,177 కోట్లుగా నమోదైంది.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఇక బంగారానికీ హాల్‌మార్క్!	వాహనాలు మరింత ప్రియం

జీఆర్‌టీ రూబీ, ఎమరాల్డ్ మేళా



హైదరాబాద్: ఆభరణాల రంగంలో ఉన్న జీఆర్‌టీ జ్యువెలర్స్ రూబీ, ఎమరాల్డ్ మేళా నిర్వహిస్తోంది. ఇది శక్తివంతమైన రత్నాలు, అద్భుత కళాత్మకతతో కూడిన వేడుక అని కంపెనీ తెలిపింది. ఈ సందర్భంగా బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.50 తగ్గింపు, పాత బంగారు ఆభరణాల మార్పిడిపై గ్రాముకు రూ.50 అదనంగా, రూబీ, ఎమరాల్డ్ స్టోన్ విలువపై 20 శాతం తగ్గింపుతోసహా ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని వివరించింది. ఈ ఆఫర్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలోని షోరూముల్లో ప్రత్యేకంగా అందుబాటులో ఉన్నాయని సంస్థ ఎండీ ఆనంద్ అనంతపద్మనాభన్ తెలిపారు.

ఐపీవోకి ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్



- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు
- 10.18 కోట్ల షేర్ల విక్రయం

న్యూఢిల్లీ: కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా తమ పబ్లిక్ ఇష్యూకి సంబంధించి నియంత్రణ సంస్థ సెబీకి దరఖాస్తు సమర్పించింది. కంపెనీ ప్రమోటర్ అయిన దక్షిణ కొరియా దిగ్గజం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ 10.18 కోట్ల షేర్లను విక్రయించనుంది. ఒక్కో షేరు ముఖ విలువ రూ. 10గా ఉంటుంది. పబ్లిక్ ఇష్యూ అనంతరం ప్రమోటరు షేర్‌హోల్డింగ్ 15 శాతం మేర తగ్గి 57.69 కోట్ల షేర్లకు పరిమితమవుతుంది. కాగా, ఎల్‌జీ ఇండియా.. భారత ఎక్స్ఛేంజీల్లో లిస్టయిన రెండో కొరియన్ కంపెనీ కానుంది. ఇప్పటికే హ్యుందాయ్ ఇండియా లిస్టయిన సంగతి తెలిసిందే.

11 నుంచి మొబిక్విక్ ఐపీవో

డిజిటల్ చెల్లింపుల సంస్థ మొబిక్విక్ పబ్లిక్ ఇష్యూ డిసెంబర్ 11న ప్రారంభమై 13న ముగియనుంది. ఒక్కో షేరు ధర శ్రేణిని రూ. 265–279గా నిర్ణయించినట్లు కంపెనీ పేర్కొంది. ఈ ఇష్యూ ద్వారా మొబిక్విక్ రూ.572 కోట్లు సమీకరించనుంది. కనీసం 53 షేర్లకు బిడ్లు దాఖలు చేయాల్సి ఉంటుంది.

విశాల్ మెగామార్ట్ ధర శ్రేణి రూ. 74–78 ..

రూ.8,000 కోట్ల సమీకరణ కోసం విశాల్ మెగా మార్ట్ తలపెట్టిన ఐపీవో కూడా డిసెంబర్ 11న ప్రారంభమై 13న ముగియనుంది. ఒక్కో షేరుకు ధర శ్రేణిని రూ. 74–78గా కంపెనీ నిర్ణయించింది. ఇది పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉంటుంది.

మెరిసిన సూర్యవంశీ: ఫైనల్లో భారత్



షార్జా: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన యువ భారత జట్టు అండర్–19 ఆసియాకప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. 13 ఏళ్ల ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (36 బంతుల్లో 67 : 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరిపించడంతో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో భారత జట్టు 7 వికెట్లతో శ్రీలంక జట్టును ఓడించింది. మొదట శ్రీలంక 46.2 ఓవర్లలో 173 పరుగులకు ఆలౌటైంది. యువ భారత బౌలర్లలో చేతన్‌శర్మ 3... కిరణ్, ఆయుశ్ 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. అనంతరం యువ భారత్ 21.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఐపీఎల్ మెగా వేలంలో రూ.1 కోటీ 10 లక్షలకు అమ్ముడుపోయి అందరి దృష్టిని ఆకర్షించిన వైభవ్ మరోసారి విధ్వంస రచన చేశాడు. గత మ్యాచ్‌లో అర్ధశతకంతో రాణించిన వైభవ్... ఈ మ్యాచ్‌లోనూ ధాటిగా ఆడటంతో భారత జట్టు 170 బంతులు మిగిలుండగానే నెగ్గింది. మరో సెమీఫైనల్లో బంగ్లాదేశ్ 7 వికెట్లతో పాకిస్తాన్‌పై నెగ్గింది. ఆదివారం జరిగే ఫైనల్లో బంగ్లాదేశ్‌తో భారత్ తలపడుతుంది.



స్టార్క్

'గులాబీ' గుచ్చుకుంది!

డే అండ్ నైట్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 180 ఆలౌట్

మిచెల్ స్టార్క్‌కు 6 వికెట్లు

ఆస్ట్రేలియా 86/1

నాలుగేళ్ల క్రితం తమకు అచ్చిరాని అడిలైడ్ మైదానంలో అదే డే అండ్ నైట్ టెస్టులో మరోసారి గులాబీ బంతిని సమర్థంగా ఎదుర్కోవడంలో భారత బ్యాటర్లు విఫలమయ్యారు. 'పింక్ బాల్' స్పెషలిస్ట్ స్టార్క్ పదునైన బంతులతో చెలరేగడంతో రెండు సెషన్లకే భారత బ్యాటర్లు తమ ఇన్నింగ్స్‌ను ముగించారు. ఒక్క నితీశ్ కుమార్ రెడ్డి మాత్రమే తన దూకుడుతో ఆకట్టుకోగలిగాడు. గత టెస్టులో కుప్పకూలిన ఆస్ట్రేలియా టాపార్డర్ ఇప్పుడు కాస్త పట్టుదల కనబర్చడంతో తొలి రోజు ఆధిపత్యం ఆతిథ్య జట్టు ఖాతాలో చేరింది. పెర్త్ టెస్టు తరహాలోనే మన బౌలర్లు ప్రత్యర్థిని పడగొడతారా లేక రెండో రోజు బలమైన బ్యాటింగ్‌తో ఆస్ట్రేలియా పటిష్ట స్థితికి చేరుతుందా చూడాలి.

అడిలైడ్: ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో భారత బ్యాటింగ్ తడబడింది. గత మ్యాచ్ తరహాలోనే తొలి ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోరుకే పరిమితమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 44.1 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌటైంది. నితీశ్ కుమార్ రెడ్డి (54 బంతుల్లో 42; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా... రాహుల్ (64 బంతుల్లో 37; 6 ఫోర్లు), గిల్ (51 బంతుల్లో 31; 5 ఫోర్లు) కీలక పరుగులు సాధించారు. మిచెల్ స్టార్క్ (6/48) తన కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనతో భారత్‌ను దెబ్బ కొట్టాడు. అనంతరం ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ నష్టపోయి 33 ఓవర్లలో 86 పరుగులు చేసింది. మెక్‌స్వీనీ (38 బ్యాటింగ్; 6 ఫోర్లు), లబుషేన్ (20 బ్యాటింగ్; 3 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. భారత తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఆస్ట్రేలియా మరో 94 పరుగులు వెనుకబడి ఉంది. ఈ ఆసక్తికర పోరుకు తొలి రోజు రికార్డు స్థాయిలో 50,186 మంది ప్రేక్షకులు హాజరు కావడం విశేషం. పదేళ్ల క్రితం మైదానంలో గాయపడి మృతి చెందిన ఫిల్ హ్యూస్, ఇటీవల కన్నుమూసిన మాజీ ఆటగాడు ఇయాన్ రెడ్‌పాత్ స్మృతిలో ఆసీస్ ఆటగాళ్లు భుజాలకు నలుపు రంగు బ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు.

కీలక భాగస్వామ్యం...

భారత ఇన్నింగ్స్ అనూహ్య రీతిలో మొదలైంది. మ్యాచ్ తొలి బంతికి యశస్వి జైస్వాల్ (0)ను అవుట్ చేసి స్టార్క్ దెబ్బ కొట్టాడు. 140.4 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన బంతికి జైస్వాల్ వికెట్ల ముందు దొరికిపోయాడు. ఆ తర్వాత గిల్ ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేయగా, రాహుల్ కాస్త జాగ్రత్త ప్రదర్శించాడు. బోలండ్ తొలి ఓవర్లో రాహుల్ కొంత ఉత్కంఠను ఎదుర్కొన్నాడు. తొలి బంతికి అతను కీపర్‌కు క్యాచ్ ఇవ్వగా అది 'నోబాల్' అయింది. అయితే ఆ తర్వాత రీప్లేలో బంతి బ్యాట్‌కు తాకలేదని కూడా తేలింది. అదే ఓవర్లో రాహుల్ ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను ఖ్వాజా వదిలేశాడు. అయితే కొద్ది సేపటి తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. 12 పరుగుల వ్యవధిలో భారత్ 3 కీలక వికెట్లు కోల్పోయింది. రాహుల్, కోహ్లి (7)లను స్టార్క్ అవుట్ చేయగా... గిల్ వికెట్ బోలండ్ ఖాతాలో చేరడంతో తొలి సెషన్ ముగిసేసరికి స్కోరు 82/4కు చేరింది. బ్రేక్ తర్వాత కూడా పరిస్థితి మారలేదు. ఆరో స్థానంలో ఆడిన రోహిత్ శర్మ (3) విఫలం కాగా... రిషభ్ పంత్ (21; 2 ఫోర్లు), అశ్విన్ (22; 3 ఫోర్లు) ఎక్కువ సేపు నిలవలేకపోయారు. హర్షిత్ రాణా (0)ను అవుట్ చేసి స్టార్క్ ఐదో వికెట్‌ను తన ఖాతాలో వేసుకోగా, స్టార్క్ బౌలింగ్‌లోనే భారీ షాట్ ఆడే క్రమంలో నితీశ్ చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. రెండో సెషన్‌లో భారత్ 21.1 ఓవర్లలో 98 పరుగులు చేసి 6 వికెట్లు కోల్పోయింది.

వికెట్ కాపాడుకుంటూ...

తొలి టెస్టులో ఆరంభంలోనే వికెట్లు కోల్పోయి ఓటమికి బాటలు పడటంతో ఈసారి ఆసీస్ ఓపెనర్లు జాగ్రత్తగా ఇన్నింగ్స్‌ను ఆరంభించారు. అయితే 2 పరుగుల వద్ద మెక్‌స్వీనీ ఇచ్చిన క్యాచ్‌ను పంత్ వదిలేయం కూడా కలిసొచ్చింది. పంత్ అడ్డుగా రాకపోతే బంతి నేరుగా రోహిత్ చేతుల్లోకి వెళ్లేది! తొలి 10 ఓవర్లలో ఆసీస్ వికెట్ కోల్పోలేదు. అయితే బుమ్రా వేసిన తర్వాతి ఓవర్లో ఉస్మాన్ ఖ్వాజా (13; 2 ఫోర్లు) పెవిలియన్ చేరాడు. వరుస వైఫల్యాలతో జట్టులో స్థానం కోల్పోయే స్థితిలో క్రీజ్‌లోకి వచ్చిన లబుషేన్ ఈ సారి కూడా ఆరంభంలో బాగా తడబడ్డాడు. ఎట్టకేలకు 19వ బంతికి అతను ఖాతా తెరిచాడు. మరోవైపు క్రీజులో నిలదొక్కుకున్న తర్వాత మెక్‌స్వీనీ కొన్ని చక్కటి షాట్లతో ఆకట్టుకున్నాడు. 22 ఓవర్ల పాటు ఈ జోడీని విడదీయడంలో భారత బౌలర్లు విఫలమయ్యారు.



రోహిత్



'రివర్స్ స్కూప్'తో నితీశ్ సిక్సర్

నితీశ్... తగ్గేదేలే

పెర్త్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత టాప్ స్కోరర్‌గా నిలిచిన ఆంధ్ర కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి ఈ మ్యాచ్‌లోనూ దానిని పునరావృతం చేశాడు. ఈసారి బ్యాటింగ్ ఆర్డర్‌లో ఏడో స్థానంలో బరిలోకి దిగిన అతని ఆట వల్లే భారత్ ఈమాత్రం స్కోరు చేయగలిగింది. భారత్ ఇన్నింగ్స్‌లో 3 సిక్స్‌లూ అతని ద్వారానే వచ్చాయి. స్టార్క్ బౌలింగ్‌లో ఎక్స్‌ట్రా కవర్ మీదుగా అద్భుత సిక్స్ కొట్టిన అతను... బోలండ్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఒక ఫోర్‌తో ధాటిని ప్రదర్శించాడు. ఇందులో స్లిప్ కార్డన్ మీదుగా 'రివర్స్ స్కూప్'తో అతను కొట్టిన సిక్సర్ ఆట మొత్తానికే హైలైట్‌గా నిలిచింది. ఆస్ట్రేలియా గడ్డపై పేసర్ల బౌలింగ్‌లో అత్యధిక (5) సిక్స్‌లు కొట్టిన భారత బ్యాటర్‌గా తన రెండో టెస్టులోనే నితీశ్ గుర్తింపు సాధించడం విశేషం.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీ) (బి) స్టార్క్ 0; రాహుల్ (సి) మెక్‌స్వీనీ (బి) స్టార్క్ 37; గిల్ (ఎల్బీ) (బి) బోలండ్ 31; కోహ్లి (సి) స్మిత్ (బి) స్టార్క్ 7; పంత్ (సి) లబుషేన్ (బి) కమిన్స్ 21; రోహిత్ (ఎల్బీ) (బి) బోలండ్ 3; నితీశ్ కుమార్ రెడ్డి (సి) హెడ్ (బి) స్టార్క్ 42; అశ్విన్ (ఎల్బీ) (బి) స్టార్క్ 22; హర్షిత్ (బి) స్టార్క్ 0; బుమ్రా (సి) ఖ్వాజా (బి) కమిన్స్ 0; సిరాజ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (44.1 ఓవర్లలో ఆలౌట్) 180.** **వికెట్ల పతనం:** 1-0, 2-69, 3-77, 4-81, 5-87, 6-109, 7-141, 8-141, 9-176, 10-180. **బౌలింగ్:** స్టార్క్ 14.1-2-48-6, కమిన్స్ 12-4-41-2, బోలండ్ 13-0-54-2, లయన్ 1-0-6-0, మార్ష్ 4-0-26-0. **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** ఖ్వాజా (సి) రోహిత్ (బి) బుమ్రా 13; మెక్‌స్వీనీ (బ్యాటింగ్) 38; లబుషేన్ (బ్యాటింగ్) 20; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (33 ఓవర్లలో వికెట్ నష్టానికి) 86.** **వికెట్ల పతనం:** 1-24. **బౌలింగ్:** బుమ్రా 11-4-13-1, సిరాజ్ 10-3-29-0, హర్షిత్ 8-2-18-0, నితీశ్ 3-1-12-0, అశ్విన్ 1-1-0-0.

3 ఆసీస్ ఓపెనర్ ఖ్వాజాను అవుట్ చేయడంతో బుమ్రా ఈ ఏడాది టెస్టుల్లో 50 వికెట్లను పూర్తి చేసుకున్నాడు. తద్వారా ఒకే ఏడాది 50 అంతకంటే ఎక్కువ వికెట్లు పడగొట్టిన మూడో భారతీయ పేసర్‌గా బుమ్రా గుర్తింపు పొందాడు. గతంలో కపిల్ దేవ్ రెండుసార్లు (1983లో 18 టెస్టుల్లో 75 వికెట్లు; 1979లో 17 టెస్టుల్లో 74 వికెట్లు), జహీర్ ఖాన్ (2002లో 15 టెస్టుల్లో 51 వికెట్లు) ఒకసారి ఈ ఘనత సాధించారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...

అక్రమంగా మందులు నిల్వచేస్తే కఠిన చర్యలు

- నిందితులకు ఐదేళ్ల జైలు: డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: మందులు అక్రమంగా నిల్వ చేస్తే డ్రగ్స్‌ అండ్‌ కాస్మెటిక్స్‌ యాక్ట్‌ ప్రకారం చర్యలు తప్పవని డ్రగ్స్‌ కంట్రోల్‌ అడ్మినిస్ట్రేషన్‌ (డీసీఏ) డీజీ వీబీ కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు. లైసెన్స్‌ లేకుండా మందులు విక్రయించినా చర్యలు తప్పవని చెప్పారు. ఈ నేరానికి పాల్పడిన వారికి ఐదేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందని స్పష్టం చేశారు. అక్రమంగా మందుల నిల్వ, మందుల తయారీ, అమ్మకాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే డీసీఏ టోల్‌ ఫ్రీ నంబర్‌ 1800–599–6969లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. కాగా, లైసెన్స్‌ లేకుండా మందులు విక్రయిస్తున్నట్టు అందిన సమాచారంతో డ్రగ్‌ కంట్రోల్‌ అడ్మినిస్ట్రేషన్‌ అధికారులు కొంపల్లిలోని గ్లోబల్‌ యానిమల్‌ ఆస్పత్రిలో సోదాలు నిర్వహించినట్టు కమలాసన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి డ్రగ్‌ లైసెన్స్‌లు లేకుండానే మందులు విక్రయిస్తున్నట్టు గుర్తించామన్నారు. మొత్తం రూ.50 వేల విలువైన 41 రకాల మందులు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

నేడు ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌కు మంత్రి పొన్నం

కేసీఆర్‌ను ఆహ్వానించనున్న మంత్రి..



సాక్షి, హైదరాబాద్‌: శనివారం నుంచి 3రోజుల పాటు జరగనున్న ప్రజా పాలన ఉత్సవాలు, సోమవారం సచివాలయంలో జరిగే తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రాష్ట్ర గవర్నర్‌తో పాటు ప్రతిపక్ష నేతలను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్, ప్రొటోకాల్‌ అధికారులు శనివారం వెళ్లి ఆహ్వానాలు అందజేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మను కలిసి ఆహ్వానిస్తారని, మధ్యాహ్నం 2 గంటలకు ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి ఆహ్వానం అందజేస్తారని, ఆ తర్వాత కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను ఆహ్వానిస్తారని మంత్రి పొన్నం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.



ఆకాశ కాన్వాస్‌పై ప్రకృతి చిత్రించిన రంగవల్లిలా ఉన్న ఈ ఫొటో భలే ఉంది కదూ.. ఉత్తర ధ్రువ కాంతులను క్లిక్‌మనిపించే ఫొటోగ్రాఫర్ల (నార్తర్న్‌ లైట్స్‌ ఫొటోగ్రాఫర్‌ ఆఫ్‌ ద ఇయర్‌-2024) ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా తీసిన 25 అత్యుత్తమ ఫొటోల్లో దీన్ని ఒకటిగా 'కాప్చర్‌ ద అట్లాస్‌' సంస్థ ఎంపిక చేసింది. క్రొయేషియాలోని ఇస్ట్రియా వద్ద ఉరోస్‌ ఫింక్‌ అనే ఫొటోగ్రాఫర్‌ దీన్ని తీశారు. ఉత్తర ధ్రువం వద్ద ఆకాశంలో రంగురంగుల కాంతులు కనిపిస్తుండగా అదే సమయంలో భూమి వైపు ఉల్కలు దూసుకొస్తుండటం ఇందులోని విశేషం.

దేవత కాదు... అమ్మ!

తెలంగాణ తల్లికి సర్కారు సరికొత్త రూపు

- రాష్ట్ర సామాజిక పరిస్థితికి దర్పణం
- 9న సచివాలయంలో సాక్షాత్కారం

సాక్షి, హైదరాబాద్‌: 'మన అమ్మ.. సోదరి.. నిత్య శ్రమమూర్తిలాగా, పంట పొలాల్లో పనిచేస్తున్న తల్లి లాగా.. తెలంగాణ ధీరత్వానికి ప్రతీకగా, చాకలి ఐలమ్మ లాగా.. కొత్త తెలంగాణ తల్లి రూపం ఉంటుంది. దేవతలాగా కిరీట ధారిణి అయి, గడీల్లో ఆడంబరంగా ధగధగ నగలతో ఉండే మహిళ రూపులో ఉండొద్దు. తెలంగాణ సామాజిక పరిస్థితికి అద్దం పట్టేలా.. ప్రేమానురాగాలు, ధీరత్వం ఉట్టిపడే మాతృమూర్తిలా తెలంగాణ తల్లి ఉండాలన్న ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టు ఏర్పాటు చేసుకుందాం'.. కాంగ్రెస్‌ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్న మాటలివి. దీనికి తగ్గట్టుగానే తెలంగాణ తల్లికి కొత్త రూపు ఇచ్చారు. ఇదే కొత్త రూపుతో రాష్ట్ర పరిపాలన కేంద్రమైన సచివాలయంలో ఈనెల 9న సగౌరవంగా సాక్షాత్కరించబోతోంది. ఉమ్మడి రాష్ట్రంలో.. తలపై కిరీటం, మెడలో మల్లెపూ దండ, కుడిచేతిలో పూర్ణ కలశం, ఎడమ చేతిలో వరికంకి ధరించి దేవతా రూపంలో ఉన్న తెలుగుతల్లి తరహాలోనే రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ తల్లికి రూపమిచ్చారు. అయితే కలశం బదులు తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ, వరికంకి బదులు మొక్కజొన్న కంకిని చేరుస్తూ కొంత మార్పు చేశారు. చూడగానే దేవతారూపమే స్ఫురించేది. కానీ ఇప్పుడు ఆ రూపాన్ని పూర్తిగా మారుస్తూ ఏ కోశానా దేవతలాగా కనిపించకుండా, తెలంగాణ సగటు మహిళా రూపం స్ఫురించేలా విగ్రహాన్ని తీర్చిదిద్దారు. ఎక్కడా ఆడంబరానికి తావివ్వకుండా సగటు అమ్మను, కష్టించి పనిచేసే మహిళను ప్రతిబింబించే వస్త్రధారణ ఉండేలా జాగ్రత్త తీసుకున్నారు. అమ్మ ప్రేమను వ్యక్తీకరించే కవళికలతో మోమును తీర్చిదిద్దారు..



తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయనున్న స్థలం ఇదే...

ముడిచిన కొప్పు, మెడలో కంటె..

- కొత్తగా కొలువుదీరబోతున్న తెలంగాణ తల్లి ముడిచిన కొప్పు, మెడలో కంటెతో రెండు సాధారణ బంగారు హారాలు, చెవులకు సాధారణ జూకాలు, చిన్న ముక్కుపుడక, చేతులకు ఆకుపచ్చ మట్టి గాజులు, కాళ్లకు పట్టీలు, మెట్టెలు ధరించి ఉంటుంది.
- సాధారణ నేత తరహా చీర కనిపిస్తుంది. బంగారు వర్ణం అంచు ఉన్న ఆకుపచ్చ రంగు చీర, ఎరుపు వర్ణం రవిక ఉంటుంది.
- ఇంటి పనుల్లో తలమునకలయ్యే మహిళలు చీర కొంగును ముడిచిన తీరును ప్రతిబింబిస్తుంది. కుడి చేయిని అభయహస్తంగా తీర్చిదిద్దారు. ఎడమ చేతిలో మొక్కజొన్న, పచ్చ జొన్న, సజ్జ, వరికంకి.. ఇలా తెలంగాణ సంప్రదాయ పంటలైన తృణధాన్యాల గుర్తులు ఏర్పాటు చేశారు.
- పీఠం దిగువన తెలంగాణ ఉద్యమానికి గుర్తుగా బిగించిన పిడికిళ్లు కనిపిస్తాయి. పైభాగంలో.. పైకి ఎత్తుతున్న తరహాలో చేతుల రూపాలు ఏర్పాటు చేశారు.

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక తెలంగాణ తల్లి

తెలంగాణ తల్లి కాంస్య విగ్రహ రూపకర్త ఎంవీ రమణారెడ్డి

సాక్షి, హైదరాబాద్‌: కొత్తగా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ ప్రజల అస్తిత్వానికి ప్రతీక అని, తెలంగాణ సంస్కృతి, చరిత్ర, తొలి, మలిదశలుగా సాగిన మహత్తర ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ఆకాంక్షలకు ప్రతిరూపమని ప్రముఖ శిల్పకారుడు, తెలంగాణ తల్లి కాంస్య విగ్రహ రూపకర్త ఎంవీ రమణారెడ్డి అన్నారు. ప్రముఖ శిల్పి ప్రొఫెసర్‌ గంగాధర్‌ రూపొందించిన తెలంగాణ తల్లి నూతన విగ్రహాన్ని తాను కాంస్యవిగ్రహంగా మలిచినట్లు తెలిపారు. తెలంగాణ సంప్రదాయపు స్త్రీమూర్తిగా, సబ్బండవర్గాల ప్రజల ఆకాంక్షలకు స్ఫూర్తిగా అందరినీ ఆకట్టుకోనుందన్నారు. బోనాలు, బతుకమ్మ, సమ్మక్క–సారలమ్మ, సదర్‌ పండుగలతో, చేతివృత్తులు, చేనేత ప్రతిభలను విరజిమ్మే తెలంగాణ రాష్ట్రానికి ప్రతీకగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించినట్లు ఆయన వివరించారు.



పులి అక్కడే ఉంది!

సిర్పూర్‌ (టి): కుమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లాలో ఇటీవల మనుషులపై దాడి చేసిన పెద్దపులి ఇంకా సరిహద్దు దాటి మహారాష్ట్ర వైపు వెళ్లలేదని తెలుస్తోంది. సిర్పూర్‌(టి) రేంజ్‌ పరిధిలోని దుబ్బగూడ కాలనీ సమీపంలో రైతు సురేశ్‌పై దాడి చేసిన పెద్దపులి ఈ రేంజ్‌ పరిధిలోనే తిరుగుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. సిర్పూర్‌(టి) మండలం ఇటిక్యాల పహాడ్‌ గ్రామ అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం పెద్దపులి అడుగు జాడలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. అదే పులి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో చీలపెల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గేదెపై దాడి చేసి హతమార్చింది. పులి జాడ కోసం ప్రత్యేక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నా ఇప్పటివరకు ఎక్కడా సీసీ కెమెరాలకు మాత్రం చిక్కలేదు. పాదముద్రల ఆధారంగా ఎటు వెళ్తుందో అంచనాల ప్రకారం కొత్త ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం పులి హతమార్చిన గేదె కళేబరం వద్ద కూడా కెమెరాలు అమర్చి, కళేబరాన్ని అలాగే ఉంచారు. ఆహారం కోసం తిరిగి వచ్చే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. పెద్దపులి సిర్పూర్‌ (టి) రేంజ్‌ పరిధిలోని ఇటిక్యాల పహాడ్, చీలపల్లి, మాకిడి, మాలిని ప్రాంతాల్లోనే సంచరిస్తోందని అటవీశాఖ అధికారి ఒకరు వెల్లడించారు.

పిల్లర్ల మధ్య ఇరుక్కున్న విద్యార్థిని తల

పిల్లర్‌ను పెకిలించడంతో బాలిక క్షేమం



అచ్చంపేట రూరల్‌: నాగర్‌కర్నూల్‌ జిల్లా పులిజాల ప్రాథమికోన్నత పాఠశాలలో పాత, కొత్త భవనాలకు సంబంధించిన రెండు పిల్లర్ల మధ్య ఒక విద్యార్థిని తల ఇరుక్కుని విలవిల్లాడిపోయింది. ఉపాధ్యాయులు తాపీమేస్త్రీలను రప్పించి.. పిల్లర్‌ను పెకిలించి అతికష్టం మీద ఆమెను బయటకు తీశారు. అచ్చంపేట మండలం పులిజాల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం యథావిధిగా ప్రార్థన జరిగింది. అనంతరం విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లారు. ఈ క్రమంలో మూడో తరగతి విద్యార్థిని సరిత తరగతి గదిలోకి వెళ్లేముందు.. వంగి చెప్పులు విప్పి.. పైకి లేస్తున్న క్రమంలో కొత్త, పాత భవనాల పిల్లర్ల మధ్యలో తల ఇరుక్కుపోయింది. ఎంత ప్రయత్నించినా.. తల బయటకు రాకపోవడంతో తల్లడిల్లిపోయింది. బాలిక గట్టిగా ఏడవడంతో.. పక్కనే ఉన్న విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. వారు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో.. వెంటనే గ్రామంలోని మేస్త్రీలను పిలిపించారు. వారు వచ్చి ఒక పిల్లర్‌ను సుత్తితో పెకిలించారు. అతికష్టం మీద విద్యార్థిని తలను బయటకు తీయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థిని ఎలాంటి గాయాలు కాకుండా ప్రమాదం నుంచి బయటపడింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

లైసెన్సులకు ఆ'వల'..

- జలాశయాల్లో చేపల వేట లైసెన్స్‌ల జారీకి ఉత్తర్వులు
- ఏడాదిన్నర అయినా అమలుకాని ఆదేశాలు
- భూ నిర్వాసితులు, మత్స్యకార సొసైటీల నిరీక్షణ
- అనుమతి లేకుండా చేపలు పడుతున్న పలువురు
- పట్టించుకోని మత్స్య శాఖ

సాక్షి, సిద్దిపేట:

సిద్దిపేట జిల్లాలోని రంగనాయక, కొమురవెల్లి మల్లన్న సాగర్, కొండపోచమ్మ జలాశయాల్లో చేపలు పట్టేందుకు మత్స్యశాఖ అనుమతులు ఇవ్వడం లేదు. ఆయా జలాశయాల్లో చేపలు పట్టేందుకు భూ నిర్వాసితులు, స్థానిక మత్స్యకారులకు లైసెన్స్‌లు జారీ చేయాలని గతేడాది ఏప్రిల్‌లో అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది. కానీ ఇప్పటి వరకు లైసెన్స్‌లను జిల్లా మత్స్యశాఖ జారీ చేయలేదు. మరోవైపు పలువురు అనుమతులు లేకుండానే చేపలు పట్టి విక్రయిస్తున్నారు.

రక్షణ లేకుండా చేపల వేట

ఇరిగేషన్, మత్స్యశాఖ అనుమతులు లేకుండానే జలాశయాల్లోకి పలువురు చేపల వేటకు వెళ్తున్నారు. చేపల వేటకు వెళ్లేవారు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వం ఉచితంగా వదిలిన చేపలు ఒక్కొక్కటి సుమారు 3 నుంచి 5 కేజీల బరువు పెరిగాయి. రొయ్యలు ఒక్కొక్కటి సుమారు 150 గ్రాముల వరకు పెరిగే అవకాశాలున్నాయి. మత్స్యశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో.. పలువురు అనుమతులు లేకుండానే చేపలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి భూ నిర్వాసితులు, స్థానిక మత్స్యకారులకు లైసెన్స్‌లు జారీ చేసి ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.


రంగనాయక సాగర్ జలాశయం


మల్లన్నసాగర్‌లో పట్టిన చేపలు ఆటోలో తీసుకెళ్తూ..

ఏడాదిన్నరగా ఎదురు చూపులు

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రంగనాయక సాగర్ జలాశయాన్ని 3 టీఎంసీలు, తొగుటలో మల్లన్నసాగర్ జలాశయాన్ని 50 టీఎంసీలు, మర్కూక్ మండలంలో కొండపోచమ్మ జలాశయాన్ని 15 టీఎంసీల నీటి సామర్థ్యం ఉండే విధంగా నిర్మించారు. ఇందుకు ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ భూమి కోల్పోగా, మత్స్యకార సొసైటీలు ఉపాధికి దూరమయ్యాయి. ఈ జలాశయాలను కాళేశ్వరం నీటితో నింపుతున్నారు. రెండేళ్లుగా వీటిలో ప్రభుత్వం చేప, రొయ్య పిల్లలను వదులుతోంది. చేపలు పట్టుకునే హక్కులను కల్పించాలని భూ నిర్వాసితులు, స్థానిక మత్స్యకారులు ఉన్నత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. దీంతో గతేడాది ఏప్రిల్‌లో మత్స్యశాఖ అధికారులు స్పందించి భూ నిర్వాసితులు, స్థానిక మత్స్యకారుల్లో నైపుణ్యం కలిగిన వారికి లైసెన్స్‌లు జారీ చేసి.. రుసుం వసూలు చేయాలని ఉత్తర్వులను జారీ చేశారు.

తెప్ప, పుట్టిల్లో వెళ్లాలని..

తెప్ప, పుట్టి, అరిగే ద్వారా పలు జాగ్రత్తలు పాటిస్తూ.. జలాశయంలోకి వెళ్లాలని, 25ఎంఎం మెష్ ఉన్న చేపల వలతోనే చేపలు పట్టాలని మత్స్యశాఖ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. భూ నిర్వాసితులు, స్థానిక మత్స్యకారులకు నైపుణ్య పరీక్షను నిర్వహించి లైసెన్స్‌లను జారీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జలాశయాల కోసం మల్లన్నసాగర్‌లో 5,618, కొండపోచమ్మలో 1,438, రంగనాయకసాగర్‌లో 980 ఎకరాల భూముల్ని ఆయా గ్రామాల ప్రజలు కోల్పోయారు. ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశపడ్డారు. కానీ ఇప్పటి వరకు జిల్లా మత్స్యశాఖ అధికారులు లైసెన్స్‌లను జారీ చేయలేదు. జలాశయాల్లో చేపలు పట్టుకునేందుకు లైసెన్స్‌లు జారీ చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించినప్పుడు.. వాటిలో పెరిగిన చేపల రుచి చూడవచ్చని జిల్లా వాసులు ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్నారు.

త్వరలో లైసెన్సుల జారీ



ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం రంగనాయక సాగర్, కొండపోచమ్మ, మల్లన్నసాగర్‌లలో చేపలు పట్టేవారి కోసం లైసెన్స్‌లను జారీ చేస్తాం. జలాశయాల్లో ఎవరూ చేపలు పట్టకుండా చర్యలు తీసుకుంటాం.

– వరదారెడ్డి, మత్స్యశాఖ అధికారి, సిద్దిపేట

పద్మశాలీలకు ప్రభుత్వ శాఖల్లో ప్రాధాన్యం కల్పించాలి

సీఎం రేవంత్‌కు దాసు సురేశ్ వినతి



సాక్షి, హైదరాబాద్: తమ అద్వితీయ ప్రతిభతో దేశవ్యాప్తంగా, ఖండాంతరంగా విస్తరించిన పద్మశాలీలకు ప్రభుత్వ శాఖల్లో సముచిత ప్రాధాన్యం కల్పించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. శుక్రవారం వరల్డ్ పద్మశాలీ ఫోరమ్ ఆధ్వర్యంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు దేశాల్లో వృత్తిరీత్యా, వ్యాపారరీత్యా స్థిరపడిన పద్మశాలీ ప్రముఖులు పాల్గొన్నారు. తెలంగాణ ఆవిర్భావం, తదనంతర పరిణామాల్లో పద్మశాలీలు కీలకపాత్ర పోషించారని పలు దేశాల పద్మశాలీ ప్రముఖులు ఉద్ఘాటించారు. దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున విస్తరించి, పలు రంగాల్లో తమ ప్రతిభను కనబరుస్తున్న పద్మశాలీలకు తెలంగాణ ప్రభుత్వం ప్రముఖ స్థానాల్లో ప్రాతినిధ్యం కల్పించాలని పలువురు ప్రముఖులు కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న సురేశ్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం నియమించిన నామినేటెడ్ పదవుల్లో, విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకంలో పద్మశాలీలకు, బీసీలకు తీరని అన్యాయం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే పద్మశాలీలకు రూ.1,000 కోట్ల నిధులతో హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్, పద్మశాలీ కార్పొరేషన్ల నియామకం చేపట్టాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతులుగా, చట్టసభల్లో, నామినేటెడ్ పదవుల్లో, పద్మశాలీలకు అవకాశాలను కల్పించాలని సురేశ్ కోరారు.

అసెంబ్లీ ఆవరణలో అంబేడ్కర్ వర్ధంతి వేడుకలు

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను శాసనసభ ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, అసెంబ్లీ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీ దయానంద్, లెజిస్లేటివ్ సెక్రటరీ వి.నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న అధ్యక్షుడు ఏ రవీందర్ రెడ్డి, కార్యదర్శి జీ సంజీవ్ రెడ్డి, ట్రెజరర్ కట్ట శ్రావ్య, చిక్కుడు ప్రభాకర్ తదితరులు

కేటీఆర్..ఆత్మపరిశీలన చేసుకో!

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దయాకర్



సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ ఎన్నిసార్లు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారో కేటీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ తరహాలో కనీసం పూల దండలు కూడా వేయకుండా నివాళులర్పించే సంస్కృతి తమది కాదని చెప్పారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి రోజు కూడా రాజకీయం చేయాలనుకోవడం బాధాకరమన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు విరుద్ధంగా పాలించిన కేసీఆర్ కుమారుడు కేటీఆర్ మాటలు వింటుంటే ఆశ్చర్యంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ఏర్పాటు చేసినట్టు రాజసంతో విలాసవంతంగా ఉండే తెలంగాణ తల్లి కాకుండా.. సగటు తెలంగాణ తల్లి ఎలా ఉంటుందో ఆ విధంగా విగ్రహాన్ని రూపొందించామని స్పష్టం చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డికి జూనియర్ లెక్చరర్ల పాలాభిషేకం

గాంధీభవన్, ఓయూ ఆర్ట్స్ కాలేజీలో సంబరాలు

సాక్షి, హైదరాబాద్: టీజీపీఎస్సీ ద్వారా సెలెక్ట్ అయిన 1,392 మంది జూనియర్ లెక్చరర్లు శుక్రవారం గాంధీభవన్, ఉస్మానియా యూనివర్సిటీకి తరలివచ్చి కృతజ్ఞత భావంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం చేశారు. తెలంగాణలో 8 ఏళ్ల తర్వాత వచ్చిన నోటిఫికేషన్.. రెండేళ్ల కిందట భర్తీకి నోచుకుని జేఎల్ పోస్టుల ఫలితాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం త్వరితగతిన ఇవ్వడం గర్వకారణమని అభ్యర్థులు అన్నారు. ఈ విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులకు పెద్ద పండుగ వాతావరణాన్ని కల్పించిందని పేర్కొన్నారు. అందులో భాగంగా 1,392 మంది జేఎల్స్‌గా సెలెక్ట్ అయిన తమకు కూడా నియామకపత్రాలు ఇస్తే ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ముందుంటామని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే నిరుపేద విద్యార్థులకు ఎంసెట్, నీట్ తదితర ఉన్నత ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనపరిచేలా కృషి చేస్తామన్నారు. విద్యారంగ ప్రక్షాళన లక్ష్యానికి మద్దతుగా ఉంటూ రేవంత్‌రెడ్డి మార్గదర్శకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, విద్యార్థుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని చెప్పారు.

కాంగ్రెస్ హయాంలోనే మహిళలకు పెద్దపీట

- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు
- మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలు

సాక్షి, హైదరాబాద్: మహిళలు, రైతులు, యువతకు కాంగ్రెస్ పార్టీ హయాంలోనే పెద్దపీట ఉంటుందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు వ్యాఖ్యానించారు. శుక్రవారం మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నేతలు తిక్కతిక్కగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పదేళ్ల పాటు ఆ రెండు పార్టీలు తెలంగాణకు చేసిందేమీ లేదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు కవిత, శంభు ఉషశ్రీ, లక్ష్మీరంగారెడ్డి, జయమ్మలతో పాటు రాష్ట్ర ఆఫీసు బేరర్లు, మహిళా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

చేపల వలలో కొండచిలువ



కొండపాక(గజ్వేల్): చేపల వలకు కొండచిలువ చిక్కడంతో మత్స్యకారులు భయాందోళనతో పరుగులు తీశారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడ్గలోని చెరువులో శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామంలోని ఊర చెరువులో మత్స్యకారులు చేపలు పట్టేందుకు వల వేశారు. కాసేపయ్యాక వలను బయటకు లాగగా.. చేపలకు బదులు పెద్ద కొండచిలువ బయటపడింది. దీంతో మత్స్యకారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అనంతరం అక్కడున్న కొందరు వెంటనే కొండచిలువను చంపేశారు.

బీఆర్ఎస్ గిల్లి గొడవలు పెట్టుకోవాలని చూస్తోంది

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ గిల్లి గొడవలు పెట్టుకోవాలని చూస్తోందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాన్ని అడుగడుగునా అడ్డుకున్న విషయాన్ని బీఆర్ఎస్ నేతలు మర్చిపోయారా? అని ప్రశ్నించారు. అంబేడ్కర్ వర్ధంతి రోజున ఆ పార్టీ నేతలు నిరసనలకు దిగడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. శుక్రవారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల తీరుపై ధ్వజమెత్తారు. అంబేడ్కర్ పేరు మీద ఉన్న ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును రద్దు చేసి, దళితబంధు పేరుతో దగా చేసి, దళితుల భూములను రాబందుల్లా లాక్కుని, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి రాష్ట్ర ప్రజల సెంటిమెంట్ అని, అలాంటి తల్లి విగ్రహంపై కేటీఆర్ విమర్శలు ఎందుకని నిలదీశారు. బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని లక్ష్మణ్‌కుమార్ అన్నారు.

ఆదివాసీల కల్పవృక్షం.. ఇప్ప చెట్టు

- అడవి బిడ్డలకు ఆర్థిక వనరుగా భరోసా
- బలవర్థక మందుల తయారీలో పువ్వు వినియోగం

కొత్తగూడ: ఇప్ప చెట్టు ఆదివాసీల కల్పవృక్షంగా పేరుగాంచింది. వారికి పలు రకాల ఆదాయాన్ని సమకూరుస్తూ ఆర్థిక భరోసానిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఏజెన్సీ ప్రాంత అడవుల్లో విరివిగా కనిపించే ఇప్పచెట్లకు ఆదివాసీ తెగలో కొందరు పూజలు చేస్తారు. ఇప్ప నుంచి వచ్చే పూలు, గింజలతో ఆదివాసీ తెగలకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఇప్ప పువ్వులో ఎన్నో బలవర్ధకమైన పోషకాలుంటాయి. ముఖ్యంగా కుడుములు చేసుకుని తినడం ఆదివాసీల ఆహారపు అలవాటు. గతంలో ఆదివాసీలు ఇప్పపువ్వుతో సారాయి తయారు చేసుకుని తాగేవారు. ప్రస్తుతం జీసీసీ (గిరిజన సహకార సంస్థ) ద్వారా పలు ఆయుర్వేద కంపెనీలు ఇప్ప పువ్వును సేకరించి శవన్‌ప్రాష్, బిస్కెట్ల తయారీలో ఉపయోగిస్తున్నారు.

దైవారాధనకు ఇప్ప నూనె

ఇప్ప గింజలతో నూనె తీస్తారు. ప్రాచీన కాలంలో ఆదివాసీ కుటుంబాలు వంటల తయారీలో ఈ నూనె వాడుకునేవారు. ప్రస్తుతం దైవారాధనలో ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఆదివాసీలు గింజలను పట్టించి కిలో ఇప్ప నూనెకు బదులు కిలో వంట నూనె (సన్‌ఫ్లవర్, గ్రౌండ్‌నట్ ఆయిల్, రైస్‌రిచ్ తదితర) తీసుకుంటున్నారు. ఎక్కువ మొత్తంలో సేకరించిన వారు జీసీసీకి విక్రయిస్తున్నారు. జీసీసీ ఇప్పపువ్వును కిలో రూ.30, ఇప్ప పలుకు రూ.29తో కొనుగోలు చేస్తోంది. దీంతో స్థానికులు ఇప్ప పువ్వు, గింజల సేకరణకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.


ఇసుర్రాయి సాయంతో గింజలపై పొట్టు తీస్తున్న వృద్ధురాలు


అడవి నుంచి గింజలు సేకరించి తీసుకువస్తున్న మహిళలు

ఆదివాసీలకు ఇప్పచెట్టుతో అవినాభావ సంబంధం

ఏజెన్సీ ప్రాంతంలో నివసించే ఆదివాసీ తెగలకు ఇప్ప చెట్టుతో అవినాభావ సంబంధం ఉంటుంది. ఏటా జూన్ ప్రారంభంలో ఇప్ప చెట్టుకు పూజలు చేస్తారు. ఎలాంటి పురుగు మందులు, ఎరువులు లేకుండా సహజ సిద్ధంగా లభించే ఇప్ప ఉత్పత్తులను తక్కువ రేటుతో కొనుగోలు చేస్తున్నారు. ఇప్ప పువ్వుకు రూ.100, పలుకులకు రూ.50 చెల్లించాలి.

– వానం వీరస్వామి, ఉపాధ్యాయుడు

విక్రయానికి ఇబ్బందులు లేకుండా చూడాలి

ఇప్ప పువ్వు సేకరించి శుద్ధి చేసి విక్రయించుకునేందుకు వెళ్తే కొనుగోలు చేసే వారు ఆలస్యం చేస్తున్నారు. గతంలో కొనుగోలు చేసిందే తరలించలేదు అంటూ ఇబ్బందులు పెడుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని సేకరణ సమయంలో ఇబ్బందులు లేకుండా చూడాలి.

– దాట్ల సుదర్శన్, కొత్తపల్లి గ్రామస్తులు

క్లుప్తంగా...

ట్యాబ్లెట్ వికటించటంతో చిన్నారి మృతి

బల్లికురవ: బతుకుదెరువుకు రాష్ట్రాలు దాటి వలస వచ్చిన కుటుంబంలో ఆడుతూ పాడుతూ తిరుగుతున్న చిన్నారికి కడుపునొప్పి రావటంతో స్థానిక ఆరోగ్య కార్యకర్త ఇచ్చిన మాత్ర వేయగానే అది వికటించటంతో వైద్యం అందేలోపు చనిపోయింది. వివరాల్లోకి వెళితే... కర్ణాటక రాష్ట్రం నుంచి మంగేస్, రంజిత దంపతులు 20 ఏళ్ల క్రితం బాపట్ల జిల్లా బల్లికురవ మండలం ఈర్లకొండ క్వారీలో పనిచేసేందుకు వలస వచ్చారు. కొత్తమల్లాయపాలెం గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరికి డింపుల్ అనే 5 సంవత్సరాల బాలిక ఉంది. గురువారం కడుపునొప్పిగా ఉండటంతో స్థానిక ఆరోగ్య కార్యకర్తలను కుటుంబ సభ్యులు సంప్రదించగా ట్యాబ్‌లెట్ ఇచ్చారు. ఆ ట్యాబ్‌లెట్ వేసుకున్న కొద్దిసేపటికే ఆరోగ్యం విషమించింది. తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు చికిత్సకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యుడి సూచన మేరకు మెరుగైన చికిత్సకు గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో గురువారం రాత్రి చనిపోయింది. చిన్నారి విగత జీవిగా మారటంతో ఆ కుటుంబంలో, తోటి కార్మికుల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం చిన్నారికి అంత్యక్రియలు ముగించారు. దీనిపై వైద్య సిబ్బందిని వివరణ అడగ్గా 15 రోజుల క్రితం బాలిక తల్లికి ఆరోగ్యం బాగోలేనప్పుడు మాత్రలు ఇచ్చామే తప్ప.. బాలికకు బాగాలేనప్పుడు మాత్రలు ఇవ్వలేదని చెబుతున్నారు.

పోలవరం ప్రాజెక్టులో ఆక్టోపస్ మాక్‌డ్రిల్


ఆక్టోపస్ పోలీసులకు సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టులో ఆంధ్రప్రదేశ్ ఆక్టోపస్ పోలీసులు శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద దాడి జరిగినప్పుడు, అసాంఘిక శక్తులు విజృంభించినప్పుడు భద్రతా బలగాల సంసిద్ధతను పరీక్షించే లక్ష్యంతో జరిగిన ఈ కసరత్తును ఆక్టోపస్ సీనియర్ పోలీసు అధికారుల పర్యవేక్షణలో జరిగింది. ఏలూరు జిల్లా పోలవరం పోలీసులు పోలవరం ప్రాజెక్టు భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్‌పీఎస్ సిబ్బంది, ప్రాజెక్టు నిర్మాణ సంస్థ ఎంఈఐఎల్ సిబ్బంది సహకారంతో డ్రిల్ నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు వంటి భారీ నిర్మాణాలను ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులు లక్ష్యంగా చేసుకున్నప్పుడు స్పందించడంతో పాటు, వారిని సమర్థవంతంగా తమ శక్తిసామర్థ్యాలు, ఆయుధ సంపత్తితో వ్యూహాత్మకంగా ఎలా ఎదుర్కొంటారో ఈ మాక్ డ్రిల్‌లో పోలీసులు ప్రదర్శించారు. ప్రాజెక్టు భద్రత, వివిధ సంస్థల మధ్య సమన్వయం, సన్నద్ధతను, ప్రతిస్పందనను అంచనా వేయడానికే డ్రిల్ నిర్వహించినట్టు చెప్పారు. ఆక్టోపస్ విభాగం డీఎస్పీ తిరుపతి మాట్లాడుతూ ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు ఆక్టోపస్ పోలీసుల సంసిద్ధతను అంచనా వేయడానికి మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు. ఇది నిరంతరం కొనసాగుతుందన్నారు. సన్నద్ధతను మెరుగుపర్చుకోవడంతో పాటు మరింత వేగంగా స్పందించేందుకు కొనసాగిస్తామన్నారు. మాక్ డ్రిల్‌లో పోలవరం పోలీసులు, ప్రాజెక్టు భద్రతను పర్యవేక్షించే ఎస్‌పీఎఫ్ సిబ్బందితో ఆక్టోపస్ పోలీసుల బృందం సమావేశమైంది. ఈ సమావేశంలో పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, ఎస్‌పీఎఫ్ సీఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫ్రాన్స్ అమ్మాయి.. గొల్లపల్లి అబ్బాయి

వివాహ బంధంతో ఒక్కటైన వైనం



హిందూపురం: ప్రేమకు సరిహద్దులు లేవని ఓ జంట మరోమారు రుజువు చేసింది. ఫ్రాన్స్ దేశస్తురాలైన ఆడ్ సవిన్, శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గొల్లపల్లికి చెందిన గొల్లసందీప్ యాదవ్ శుక్రవారం మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో హిందూపురంలో ఘనంగా జరిగింది. గొల్లపల్లికి చెందిన సామాన్య రైతు కేసప్ప, గంగమ్మ 11వ సంతానమైన సందీప్ యాదవ్ ఫ్రాన్స్‌లోని యూనివర్సిటీ ఆఫ్ సీఎస్ఆర్‌లో సైంటిస్ట్‌గా స్థిరపడ్డాడు. అక్కడ గూగుల్ సంస్థలో పనిచేస్తున్న ఫ్రాన్స్ దేశస్తురాలు ఆడ్ సవిన్‌తో పరిచయం కాస్తా ప్రేమగా మారింది. వీరి ప్రేమకు ఇరు కుటుంబ సభ్యులు అంగీకారం తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా వివాహం చేసుకున్నారు.

వనాలు వదిలి జనాలపైకి..



- ఎలుగుబంట్లు, గుర్తు తెలియని జంతువులతో బిక్కుబిక్కుమంటున్న ఉద్దానం
- కొత్తూరు, పాలకొండ, వీరఘట్టం, ఎల్ఎన్‌పేట ఏరియాల్లో ఏనుగుల విధ్వంసం
- తాజాగా జిల్లాలో పులి సంచారంతో భయాందోళన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

వన్య మృగాలు వనాలు వదిలి జనాలపైకి పడుతున్నాయి. ఆవులు, మేకలను పులి తినేసి భయపెడుతుండగా, ఏనుగులు, ఎలుగుబంట్లు ఏకంగా మనుషుల్నే చంపేస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో కొత్తూరు, వజ్రపుకొత్తూరు, మందస, వీరఘట్టం, సీతంపేట, పాతపట్నం, పలాస తదితర ప్రాంతాల్లో ఈ రకమైన ఘటనలు ఇప్పటికే జరిగాయి. దీంతో వన్య మృగాలు సంచరిస్తున్న వార్తలు వస్తే చాలు ఈ ప్రాంతాలు వణికిపోతున్నాయి.

సరిగ్గా ఏడాది క్రితం..

శ్రీకాకుళం జిల్లాలో కొంతకాలంగా పులులు, ఎలుగుబంట్లు, ఇతర జంతువులు జనారణ్యంలో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో ఎలుగుబంట్లు దాడులు చేస్తుండగా, కొత్తూరు, పాలకొండ, భామిని తదితర ప్రాంతాల్లో ఏనుగులు విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఇవి చాలదన్నట్టు మధ్యలో పులులు కూడా సంచరిస్తున్నాయి. గత ఏడాది నవంబర్‌లో ఇదే రకంగా పులి సంచరించగా సరిగ్గా ఏడాదికి మళ్లీ పులి జిల్లాలోకి ప్రవేశించింది. తగ్గుతున్న అటవీ విస్తీర్ణం, పెరుగుతున్న ఆక్రమణల వల్లే జంతువులు ఇలా ఊళ్లమీదకు వస్తున్నట్టు తెలుస్తోంది.


పులి పాద ముద్రలు

పులి సంచారమిలా..

- ఒడిశా నుంచి మందస రిజర్వు ఫారెస్టు మీదుగా సాబకోట, బుడంబో తదితర గిరిజన ప్రాంతాలను దాటుకుంటూ వజ్రపుకొత్తూరు తీర ప్రాంతం మీదుగా సంతబొమ్మాళి వైపునకు చేరుకుంది. ఈ మండలంలోని హనుమంతునాయుడుపేట పంచాయతీ కేశనాయుడుపేటలో పులి తిరిగిందన్న ప్రచారం జరిగింది. ఇదే సమయంలో భద్రాచలం శాంతమూర్తికి చెందిన ఆవు మృతి చెందింది. పులి కారణంగా చనిపోయిందా? మరే జంతువు కారణంగా చనిపోయిందో స్పష్టత లేదు.



ఇదే కారణమా..?

'పులులు చాలా అరుదుగా అడవులను వదిల జనావాసాల వైపు వస్తుంటాయి. నవంబర్, డిసెంబర్ నెలల్లో మగ, ఆడ పులులు జతకట్టే సమయం కావడంతో తమ జోడు కోసం అవి సాధారణం కంటే ఎక్కువ దూరం ప్రయాణిస్తాయి. అలాంటి సందర్భాల్లో అడవిని దాటి సరిహద్దు ప్రాంతాల్లోని పంటపొలాలు, గ్రామాల్లోకి వస్తుంటాయి. ఈ సమయంలో దాడులు అధికంగా జరిగే అవకాశం ఉంది. వేసవి ఎండలతో అటవీ ప్రాంతంలో తాగునీటి వనరులు తగ్గినప్పుడు కూడా అవి జనావాసాల వైపు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. రైతులు పశువులను మేత కోసం అడవుల్లోకి తీసుకెళ్లడంతో వాటిని వేటాడేందుకు యత్నిస్తాయి. అటవీ సరిహద్దు ప్రాంతంలోని పంట పొలాల్లో పశువులు, మేకలు, గొర్రెలను మందలుగా ఉంచడంతో వాటిని కూడా వేటాడే అవకాశాలు ఉంటాయి.' అని నిపుణులు చెబుతున్నారు.

- కోటబొమ్మాళి మండలం పొడుగుపాడు సమీపంలో పెద్దపులి ఆనవాళ్లు కనిపించాయి. సారవకోట మండలం జమ చక్రం, సోమయ్యపేట, అన్నుపురం, వాబచుట్టు, బోరుభద్ర పరిసర ప్రాంతాల్లో సంచరించిన పులి పాతపట్నం మండలంలోకి ప్రవేశించింది. బోరుభద్ర, దాసుపురం, గురండి, తీమర, తామర, పెద్దసీదిలో సంచరించింది. తీమరలోని బెండి రామారావు మామిడితోటలో బైరి లక్ష్మణరావుకు చెందిన ఆవుదూడను చంపేసింది.
- ఇదే సమయంలో ఉద్దానంలో గుర్తు తెలియని జంతువు కూడా తిరుగుతోంది. దాని దాడి ఎక్కువగా ఉంది. వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలాల్లోని ఒంకులూరు, మెట్టూరు, కొండపల్లి, అనకాపల్లి, బహడపల్లి, కొండలోగాం గ్రామాల్లో ఈ జంతువు సంచరించింది. పలాస మండలంలో నీలావతిలో రెండు ఆవు దూడలను చంపేసింది.

జాగ్రత్త సుమా

- అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు వన్య మృగాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి.
- సాయంత్రం 5గంటల నుంచి ఉదయం 7గంటల వరకు అటవీ ప్రాంతాల్లోకి వెళ్లకూడదు. పులులు గ్రామాల్లోకి, పొలాల్లోకి వస్తే శివారు ప్రాంత ప్రజలు వెంటనే అప్రమత్తమై శబ్దం చేస్తూ చాకచక్యంగా తిరిగి అడవిలోకి పంపించాలి.
- పులి అరుపులు, పాద ముద్రలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి.
- పంటల కాపలాకు రాత్రి సమయంలో ఒంటరిగా వెళ్లకుండా బృందంగా వెళ్లాలి.
- పొలాల్లో మంచెలు ఏర్పాటు చేసుకుని గుంపులుగా ఉండాలి.
- పశువుల కాపరులు పగలంతా మేత కోసం సంచరించి రాత్రి అటవీ ప్రాంతంలో మందను ఉంచి బస చేస్తుంటారు.
- పులులు వాటిని వేటాడేందుకు వస్తుంటాయి.
- రాత్రి సమయంలో అటవీ ప్రాంతంలో ఉండటం సురక్షితం కాదని అటవీశాఖ సిబ్బంది చెబుతున్నారు.

అడవులు తగ్గుముఖం పట్టడం వలనే

అడవుల శాతం తగ్గు ముఖం పట్టడంతో కొన్ని రకాల వన్య మృగాలు ఆహార అన్వేషణలో జనాలు ఉండే చోటుకు వస్తున్నాయి. అయితే ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నిరంతరం ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. సాంకేతిక పరంగా ట్రాకింగ్ కెమెరాలతో పులి వంటి వన్యప్రాణుల కదలికలను గుర్తిస్తున్నాం. మాకున్న సమాచారం ప్రకారం ఇటీవల జిల్లాలో ప్రవేశించిన పెద్ద పులి ప్రస్తుతం ఒడిశాలోకి వెళ్లిపోయింది.

– నాగేంద్ర, టెక్కలి డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్



ఇబ్బందికరంగానే ఉంది...

మా మండలంలో పులి తిరుగుతుందని పేపర్లు, వాట్సాప్‌లలో చూస్తుంటే భయమేస్తుంది. మేము నిత్యం కొండలు, పంట పొలాలలో మేకలు, గొర్రెలతో మందలు వేసుకుని పడుకుంటున్నాం. మా ఊరికి దగ్గర్లో ఉన్న జమచక్రం, సోమయ్యపేట గ్రామాలలో పులి అడుగులు గుర్తించడంతో ఆయా గ్రామాల నుంచి మందలు తీసుకొచ్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో మరింత ఇబ్బంది పడుతున్నాం.

– పల్ల ముఖలింగం, వడ్డినవలస, సారవకోట మండలం.



భయం.. భయం..

పులి మా గ్రామ పంట పొలాల్లో తిరగడంతో మాకు భయంగా ఉంది. పశువులు మేతకు తీసుకు వెళ్లడానికి, ఉదయం పొలాలకు వెళ్లలన్నా భయంగా ఉంది. ఇప్పటికే ఆవుదూడను తీసేసింది. పులి ఉందని అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు.

– మద్ది నారాయణరెడ్డి, పెద్దసీది గ్రామం, పాతపట్నం మండలం



ఆందోళనకరమే..

పులి సంచరిస్తున్న వార్తలతో ఆందోళనగా ఉంది. మా గ్రామం వైపు పులి వచ్చిందని మాకు తెలియదు, మంగళవారం ఉదయం ఆవుదూడపై దాడి చేయడంతో మాకు పులి వచ్చిందని తెలిసింది. దీంతో పంట పొలాలవైపు వెళ్లాలంటే భయంగా ఉంది.

– బండి ఆనంద్, తీమర గ్రామం, పాతపట్నం మండలం

22వసారి తిరుమలకు ఆకేపాటి పాదయాత్ర



రాజంపేట: పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు నడిచివెళ్లిన కాలిబాటలో రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి శుక్రవారం తిరుమల మహాపాదయాత్ర చేపట్టారు. అన్నమయ్య జిల్లా రాజంపేట మండలంలోని ఆకేపాడు ఆలయాల సముదాయం నుంచి ఈయన పాదయాత్ర బయలుదేరింది. కడప-రేణిగుంట జాతీయరహదారిలో ఆకేపాడు క్రాస్‌నుంచి బయలుదేరి రాజంపేట పాతబస్టాండు వరకు చేరుకుంది. అడుగుడునా ఘనంగా స్వాగతం పలికారు. గజమాలలతో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనువాసులు, బద్వేలు ఎమ్మెల్యే సుధారాణి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, కడప డిప్యూటీమేయర్ నిత్యానందరెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ బాలయ్యతోపాటు పలువురు నాయకులు పాదయాత్రలో ఆకేపాటి వెంట నడిచారు. వందాలదిమంది గోవిందమాలలు ధరించిన భక్తులతో కలిసి పాదయాత్రను ప్రారంభించారు.

త్వరలోనే పల్నాడులో సీబీజీ ప్లాంట్

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి ప్రాంతంలోని రైతులు సుముఖంగా ఉంటే రిలయన్స్ కంపెనీ సీబీజీ (బయో గ్యాస్) ప్లాంట్ త్వరలో ఏర్పాటుకు చర్యలు చేపడతామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలో శుక్రవారం ఆయన పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణతో కలిసి సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, సత్తెనపల్లిలో కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.1.30 కోట్లతో నిర్మించిన ఆల్కలీన్ వాటర్ ప్లాంట్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రిలయన్స్ కంపెనీతో ముఖ్యమంత్రి చంద్రబాబు జరిపిన చర్చల ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా 500 సీబీజీ (బయో గ్యాస్) ప్లాంట్లు ఏర్పాటు కాబోతున్నాయన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి కనిగిరి, దర్శి, మార్కాపురం వంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా సత్తెనపల్లి ప్రాంతంలో బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

సీనియర్ దర్శకుడు జయభారతీ కన్నుమూత



తమిళసినిమా: సీనియర్ సినీ దర్శకుడు జయభారతీ శుక్రవారం చెన్నైలో కన్నుమూశారు. ఈయన వయస్సు 77 ఏళ్లు. ఈయన 1979లో దర్శకత్వం వహించిన మొదటి చిత్రం గుడిసై. మంచి విజయాన్ని సాధించిన ఈ చిత్రం జాతీయ అవార్డుతోపాటు పలు ఇతర అవార్డులను కైవసం చేసుకుంది. స్థానిక ఆవడిలో నివసిస్తున్న ఈయన గత కొంత కాలంగా శ్వాసకోశ సమస్యలతో బాధ పడుతూ స్థానిక గిండి సమీపంలోని ఓమందూర్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చారు. వైద్యం ఫలించక శుక్రవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిశారు.

మత్స్య మాఫియా గుప్పిట్లో కృష్ణా తీరం



- స్థానిక మత్స్యకారుల ఉపాధికి గండి
- పెద్ద పెద్ద బోట్లతో నదిలో భారీగా వేట
- ఉద్యోగాల పేరుతో యువకులతో వెట్టిచాకిరీ
- అనుమతి లేకుండా యథేచ్ఛగా వేట
- ఒక్క ఉమ్మడి కర్నూలు జిల్లాఓనే ఏటా రూ. 50 కోట్ల వ్యాపారం
- చోద్యం చూస్తున్న మత్స్య శాఖ అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్/కొత్తపల్లి: కృష్ణానదీ తీరం వెంట చేపల మాఫియా రెచ్చిపోతుంది. మత్స్యశాఖ నిబంధనలకు వ్యతిరేకంగా కొందరు దళారులు తీరం వెంట ఉన్న మత్స్యకారులతో కలిసి మత్స్య సంపదను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల అండతో స్థానిక మత్స్యకారుల పొట్టకొడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి మైనర్లను కలీకి తీసుకువచ్చి వారతో చేపలు పట్టిస్తున్నారు. లంచాల మత్తులో మునిగే కొందరు అధికారులు నిబంధనలకు నీళ్లొదిలి చేపల మాఫియాకు కొమ్ముకాస్తున్నారు.

నిబంధనలివే...

- తీరంలోని గ్రామాల మత్స్యకారులు సంప్రదాయవేట సాగించి ఆయా గ్రామాల పరిధిలోనే విక్రయించుకోవాలి
- చేపల పునరుత్పత్తి జరిగే మూడు నెలల కాలంలో వేటను చేయరాదు.
- అలివివలలు వేసి చిన్న చేపలను పట్టరాదు.
- మత్స్యశాఖ జారీ చేసిన లైసెన్స్‌లు ఉన్న వారే చేపల వేట చేపట్టాలి

తీరంవెంట వివాదాలు

శ్రీశైలం జలాశయం నదీతీరం వెంట పలు వివాదాలు ఉన్నాయి. తెంగాణ, ఆంధ్రప్రాంతాలు విడిపోవడంతో ఆ గట్టు తెలంగాణకు, ఈ గట్టు ఆంధ్రప్రాంతానికి వచ్చింది. రెండురాష్ట్రాల మత్స్యకారుల మధ్య పెద్దపెద్ద వివాదాలే జరిగాయి. నాటి శ్రీశైలం ఎంఎల్ఏ శిల్పా. చక్రపాణిరెడ్డి,తెలంగాణ మహబూబ్ నగర్ ఎంఎల్ఏ గువ్వల బాలరాజు ఇరుప్రాంతాల మత్స్యకారులతో చర్చలు జరిపి లింగాలగట్టు మత్స్యకారులు సంవత్సరానికి తెలంగాణ మత్స్యకారులకు రు.5లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

అక్రమ వేట సాగే ప్రాంతాలివే..

- శ్రీశైలం జలాశయం ఎగువ భాగంలో నీరిగంగ, గజ్జలకొండ, ఆవులమంద, గువ్వలకుంట్ల, గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం, కపిలేశ్వరం, కొక్కెరంచ, కపిలేశ్వరం, పాతమాడుగుల, సంగమేశ్వరం, కొత్తపల్లి ఆపై ప్రాంతాలు
- శ్రీశైలం జలాశయానికి దిగువ భాగంలో లింగాలగట్టు, వజ్రాలమడుగు, వియర్‌డ్యాం, నల్లవాగు, జెండాపెంట, బొమ్మర్ల, కయ్య, ఏడొంపులు, నాగార్జునసాగర్ మీదుగా విజయవాడ వరకు కొనసాగుతుంది.
- కృష్ణాతీరంలో కోట్లాది రూపాయల అక్రమ చేపల బిజినెస్ నడుస్తోంది. ఒక్క ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శ్రీశైలం జలాశయం ఎగువ, దిగువ ప్రాంతాల్లో సంవత్సరానికి రూ. 50 కోట్ల బిజినెస్ జరుగుతందని మత్స్యకారులు చెబుతున్నారు. శ్రీశైలం మండలంలోని లింగాలగట్టులోనే ప్రభుత్వ అనుమతులు లేని బడా షేట్లకు చెందిన 13 చేపల కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీల ద్వారా అధిక బరువున్న చేపలు కలకత్తాకి ఎగుమతవుతున్నాయి. ఫారెస్ట్ చెక్‌పోస్టులలో ఉన్న సిబ్బందిని మేనేజ్ చేసుకుంటు ఇక్కడి ప్రజలకు చెందాల్సిన చేపలను తరలిస్తున్నారు.

నది పరిధిపై పెత్తనం

శ్రీశైలం జలాశయం ఎగువ, దిగువ నదీ ప్రవాహ పరిధులపై దమ్మున్నోడిదే పైచేయి. తీరంలో ఒక్కొక్కరు నా పరిధి ఇంత వరకు నీ పరిధి ఇంత వరకు అని పంచుకుంటారు. పంచుకున్న ప్రాంతంలో చేపలు పట్టుకోవడం, లేదా కూలీల ద్వారా కొసాగించడం, లీజుకు ఇచ్చుకోవడం, అవసర పరిస్థితులలో అమ్ముకోవడం కూడా జరుగుతుంది. అటువంటి సమస్యల పరిష్కారానికి అప్పటి మావోయిస్టులు, ఇప్పటి ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారు.

ఉద్యోగాల పేరిట యువకులతో వెట్టిచాకిరి

కొంత మంది దళారులు గుంటూరు, వైజాగ్, విజయవాడ, ఇతర ప్రాంతాల్లోని కొంతమంది మధ్యవర్తులను వాడుకుని పనిలేక ఇబ్బందులు పడుతున్న యువకులను ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి తీసుకువచ్చి కృష్ణానదిలో చేపలు పట్టిస్తున్నారని సమాచారం. చేపల వేట రాని యువకులు మేము ఈ పనిచేయలేము అని ఎదిరిస్తే ముఠాలు వారిని చితకబాది, ఫోన్లు తీసుకొని బందీలుగా మార్చి వారితో వెట్టిచాకిరీ చేయిస్తున్నాయి.


కృష్ణా తీరంలో చేపల వేటకు వలలను సిద్ధం చేస్తున్న మత్స్యకారులు (ఫైల్)

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ లైన్ టీబీసీ వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 46,957 మంది స్వామివారిని దర్శించుకోగా 21,560 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

11 నుంచి హనుమత్ వ్రతం ఉత్సవాలు

సింహాచలం: సింహగిరి మెట్ల మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 11 నుంచి 13 వరకు హనుమత్ వ్రతం ఉత్సవాలను నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు శుక్రవారం తెలిపారు. 11న ఉదయం 7.30 నుంచి 11.30 వరకు గణపతిపూజ, పుణ్యాహవచనం, సుందరకాండ పారాయణం ఉంటాయన్నారు. 12న ఉదయం విశేష పూజలు జరుగుతాన్నారు. 13న ఉదయం 6 నుంచి 7 వరకు స్వామికి పంచామృతాభిషేకం, 7 నుంచి అలంకరణ, 7.30 నుంచి 9 వరకు లక్ష తమలపాకుల పూజ, 9 గంటల నుంచి పట్టాభిషేక పారాయణం, 9.30 నుంచి 10.30 వరకు విశేష హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు ఉపాధ్యాయుల రమేష్, ప్రయాగ రాంబాబు, కూచుమంచి ప్రసాద్, దేవులపల్లి ప్రకాష్ తదితరులు హోమం నిర్వహించారు.సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలో పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు.

విద్యా సమాచారం

ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సర్వం సిద్ధం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం 'వేవ్స్- 2024'కు సర్వం సిద్ధమైంది. శనివారం మధ్యాహ్నం 3గంటల నుంచి బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది.

పాలిటెక్నిక్ కళాశాలలో టెక్ ఫెస్ట్ ప్రారంభం



గుంటూరు రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్ తెలిపారు. నల్లపాడులోని ఎంబీటీఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో టెక్ ఫెస్ట్- 2024ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వినూత్న ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని సమాజాభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ క్రమశిక్షణతో కష్టపడితే ఉన్నత లక్ష్యాలను సులువుగా సాధించవచ్చని తెలిపారు. కొమ్మాలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రస్తుతం మంచి అవకాశాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన 113 వినూత్న ఆవిష్కరణల స్టాల్స్‌ను సందర్శించి, వాటి గురించి తెలుసుకున్నారు. విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు ఏర్పాటు చేసిన 113 ఆవిష్కరణలను ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులు 1,350 మంది సందర్శించారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







పండగ కళ

క్రిస్మస్ చెట్టు వెలిగింది

క్రిస్మస్ ఎంతో దూరం లేదు. అమెరికాలో క్రిస్మస్ చెట్టును ఇళ్లలో, కూడళ్ల దగ్గర, ముఖ్య ప్రదేశాలలో ప్రతిష్ఠించడంతో క్రిస్మస్ వేడుకలను ప్రారంభించడం అలవాటు. ఇదిగో ఇక్కడ చూశారా? డిసెంబర్ 4న న్యూయార్క్‌లోని రాక్‌ఫెల్లర్ సెంటర్‌లో ఎంత పెద్ద క్రిస్మస్ ట్రీని వెలిగించారో. ఈ వేడుకను **'క్రిస్మస్ ట్రీ లైటింగ్ సెర్మని'** అంటారు. ఆ పక్కనే లండన్‌లో ఎలిజెబెత్ టవర్ పక్కన ఎంత పెద్ద క్రిస్మస్ ట్రీని వెలిగించారో చూడండి.


• అమెరికా


• లండన్

• పాడుదాం గేయం

మంచి అలవాట్లు

పొద్దున్న లేచే అలవాటు
మంచిది.. మంచిది.. మంచిది
ఆలస్యంగా నిదుర లేవడం
వద్దది.. వద్దది.. వద్దది

త్వరగా బడికి చేరుకోవడం
అదే.. అదే.. మంచిది
ఆలస్యంగా బడికెళ్లడం
వద్దే వద్దు ఆ సంగతి

అందరితో స్నేహంగా ఉండటం
ఎంతో.. ఎంతో.. మంచిది
తోటివారితో తగవులాడటం
చాలా.. చాలా.. చెడ్డది

శ్రద్ధగా పాఠం వినడం
భలే.. భలే.. మంచిది
గురువులను గౌరవించకపోవడం
వద్దే వద్దది.. వద్దది

చెప్పిన పాఠం ఇంట్లో చదవడం
ఆహా.. ఆహా.. మంచిది
పాఠం వదిలి ఆటలకెళ్లడం
అయ్యో.. అయ్యో.. చెడ్డది

మంచి అలవాట్లు మనకుంటే
ఎంతో ఎంతో మంచిది
చెడ్డదారిలో అడుగులేస్తే
ఎంతో చెడ్డది.. చెడ్డది

దట్ క్రిస్మస్ శాంటా తాత వస్తున్నాడు... పిల్లలూ బీ రెడీ

క్రిస్మస్ పండుగ రాబోతుందంటే మన దీపావళిలాగా హాలీవుడ్‌లో సినిమాల రిలీజులు జోరందుకుంటాయి. స్టార్ హీరోల సినిమాల నుండి చిన్న సినిమాల వరకూ రిలీజయ్యి ప్రపంచ ప్రేక్షకులను ఉర్రూతలూగించడానికి ముందుకొస్తాయి. మరీ ముఖ్యంగా పిల్లల కోసం ఈ సీజన్‌లో ఎన్నో సినిమాలు రిలీజ్ అవుతాయి. ఇంక యానిమేటెడ్ సినిమాల గురించి అయితే చెప్పనే అక్కరలేదు, ఈ క్రిస్మస్ సీజన్‌లో భాగంగా నెట్‌ఫ్లిక్స్ ఓటిటి వేదికగా ఇటీవల 'దట్ క్రిస్మస్' అనే ఫాంటసీ యానిమేటెడ్ కిడ్స్ మూవీ రిలీజ్ అయింది. ప్రముఖ రచయిత రిచర్డ్ కర్టిస్ రాసిన 'దట్ క్రిస్మస్ అండ్ అదర్ స్టోరీస్ సైమన్ ఓటో' ఆధారంగా ఈ సినిమా తీశారు. 2024 అక్టోబరు నెలలో జరిగిన లండన్ ఫెస్టివల్‌లో ఈ సినిమాని స్పెషల్‌గా స్క్రీన్ చేశారు. ఇక ఈ సినిమా స్టోరీ ఏంటంటే...క్రిస్మస్ పండుగ అంటే బంధుమిత్రులు కూడే పండగ. కుటుంబాలు కలిసి ఎంజాయ్ చేసే పండుగ. ఈ పండుగకు పిల్లలు ఎదురు చూసే వ్యక్తి గిఫ్ట్స్ తెచ్చే శాంటా. అలాంటి శాంటా ఓ మిస్టేక్ వల్ల ఇవ్వాల్సిన గిఫ్ట్‌ను టైంకి ఇవ్వలేకపోతే ఏమవుతుంది అన్నదే ఈ సినిమా. వెల్లింగ్టన్‌లో వున్న టౌన్స్ ఫాక్ నగరానికి ఈసారి క్రిస్మస్ పండుగ తనతో పాటు పెద్ద మంచు తుఫానును తీసుకు వస్తుంది. శాంటాతాత గిఫ్ట్స్‌తో బయలుదేరి దారిలో తుఫానులో చిక్కుకుంటాడు. మరి శాంటాతాత ఆ తుఫాను నుండి తప్పించుకుని టౌన్స్ ఫాక్ నగరంలోని కిడ్స్‌కు గిఫ్ట్స్ ఇస్తాడా లేదా అన్నది 'దట్ క్రిస్మస్' సినిమాలోనే చూడాలి. సినిమా అంతా చాలా సూపర్‌గా ఉంటుంది. కిడ్స్... గ్రాబ్ యువర్ స్నాక్స్ అండ్ ట్యూన్ టు నెట్ ఫ్లిక్స్ టు వాచ్ 'దట్ క్రిస్మస్'.


- ఇంటూరు హరికృష్ణ

• సినిమా చూద్దామా?









ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం మంచిదే. అలా అని మన తల్లి భాషను మరవకూడదు. ఇక్కడ ఉన్న పదాలు మీకు తెలియపోతే తెలుసుకోండి. రాతలోనో, మాటలలోనో వాడితే అది మీ సొంతం అవుతుంది.

ఈ వారం కొన్ని పదాలు...

జగతి	లోకం
జట	జడ
జఠరము	కడుపు
జలదము	మేఘం
జామాతా	అల్లుడు
భంబు	ఆకాశం
భాసిల్లు	ప్రకాశించు
మంగళం	శుభం, క్షేమం
భానుడు	సూర్యుడు
భిత్తి	గోడ
భృత్యుడు	సేవకుడు
భేకము	కప్ప
భ్రుకుటి	కనుబొమ
మంజీరము	అందె

• మన సామెతలు

* నిద్ర సుఖమెరుగదు. ఆకలి రుచి ఎరుగదు.

* నిప్పు తొక్కిన కోతి వలే...

* నీరు నూనె కలుస్తాయా!

* నాగలి ఉన్న ఊళ్లో ఆకలి చేరదు

* నారు, నీరు, నోరు ఉంటే ఏ రాజ్యంలో ఉన్నా ఒకటే

* నిత్య కళ్యాణం పచ్చతోరణం

* నిండా మునిగిన వాడికి చలి ఏమిటి!

* మాటకు మా ఇంటికి.... కూడుకు మీ ఇంటికి అన్నట్లు

* మాట వెండి- మౌనం బంగారం

* మాన్పిందే మందు బతికిందే ఊరు

• మహనీయులు | మేరీ క్యూరీ

రెండుసార్లు నోబెల్ పొందిన ఏకైక మహిళ



ఆమె పుట్టింది రష్యా దేశంలోని వార్సాలో. ఐదుగురు పిల్లల్లో ఈ పాప చిన్నది. పదేళ్ల వయసులో తల్లి క్షయ వ్యాధితో మరణించింది. దీంతో తోబుట్టువులే ఆమెను పెంచారు. చిన్ననాటి నుంచి ఆమెకు విజ్ఞాన శాస్త్రమంటే చాలా ఇష్టం. ఆ విషయాల గురించి ఆ పాప తెలుసుకుంటూ ఉండేది.

ఇంట్లో పేదరికం కారణంగా ఆమె ఎక్కువగా చదువుకోలేకపోయింది. తనకొచ్చిన చదువుతో ఉపాధ్యాయురాలిగా మారింది. విశ్వవిద్యాలయానికి వెళ్లాలనే ఉద్దేశంతో 1891లో ఫ్రాన్స్‌కు వెళ్లి అక్కడ సోర్బోన్ యూనివర్సిటీలో చేరింది. అక్కడ భౌతిక, గణిత శాస్త్రాలను చదివింది. 1894లో ప్యారిస్ నగరంలో శాస్త్రవేత్త పియరీ క్యూరీని కలుసుకుంది. ఏడాది తర్వాత వారిద్దరూ వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వారిద్దరూ కలిసి పరిశోధనలు చేశారు. యురేనియంపై పలు ప్రయోగాలు చేసి కీలకమైన విషయాలు కనుక్కున్నారు. ఆ సమయంలోనే రేడియో ధార్మికతను కనిపెట్టారు. ఆ పరిశోధనలకు గానూ 1903లో ఆమెతోపాటు ఆమె భర్త పియర్, హెన్రీ బెక్వెరెల్‌లకు భౌతిక శాస్త్రంలో నోబెల్ పురస్కారాన్ని ఇచ్చారు.

1906లో పియరీ ఓ రోడ్డు ప్రమాదంలో మరణించారు. జీవితంలో మరోసారి ఆమెను విషాదం చుట్టుముట్టింది. అయినా కుంగిపోక పరిశోధనలు కొనసాగించింది. ప్రపంచానికి ఎన్నో కొత్త విషయాలు నేర్పింది. రేడియో ధార్మికతను కొలిచే సాధనాన్ని రూపొందించినందుకు 1911లో రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతిని అందుకుందామె. ఇలా రెండు వేర్వేరు విభాగాల్లో నోబెల్ బహుమతి అందుకున్న ఏకైక మహిళ ఆమె.

ఆమె కనిపెట్టిన రేడియో ధార్మికత ఇవాళ అనేక రంగాల్లో వినియోగిస్తున్నారు. ముఖ్యంగా క్యాన్సర్ చికిత్సలో దానికి కీలకపాత్ర ఉంది. తన జీవితమంతా పరిశోధనలకే అంకితం చేసిన ఆమె పేరు 'మేరీ క్యూరీ'. ఆమెనే 'మేడమ్ క్యూరీ' అని కూడా అంటారు. తన జీవితంలో ఆమె ఎన్నో అవమానాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయినా ఏనాడూ వెనకడుగు వేయకుండా కష్టపడి అనుకున్నది సాధించారు. ఆమె స్ఫూర్తితో మీరూ భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి.

బుజ్జి రచయితంత పుస్తకం రాశాడంట



• సయిదీ అల్-మీరీ

మామూలుగా నాలుగేళ్ల వయసులో పిల్లలు అప్పుడప్పుడే ఊహ తెలిసి ప్రపంచాన్ని పరిశీలించడం మొదలుపెడతారు. మెల్లగా అక్షరాలు రాయడం నేర్చుకుంటారు. పుస్తకాలు చదవాలన్నా ఆ వయసులో వారికి చేతకాదు. కానీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుదాబీకి చెందిన 'సయిదీ అల్-మీరీ' అనే పిల్లాడు మాత్రం నాలుగేళ్ల వయసులోనే పుస్తకం రాశాడు. అంతేకాదు, దాన్ని వెయ్యి కాపీలు అమ్మి, గిన్నిస్ బుక్స్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించాడు.

కథలు వినడం పట్ల ఆసక్తి ఉన్న అల్-మీరీ "The Elephant Saeed and the Bear' అనే పుస్తకం రాశాడు. ఏనుగు, ఎలుగుబంటి మధ్య ఏర్పడ్డ స్నేహమే ఈ పుస్తకంలోని కథాంశం. ఇంత చిన్న వయసులో అతను పుస్తకం రాసేందుకు స్ఫూర్తి ఎవరో తెలుసా? అతని అక్కే. 'అల్-దబీ' అనే ఆ పాప చిన్నవయసులోనే రెండు భాషల్లో పుస్తకాలు రాసి ప్రచురించింది. రెండు భాషల్లో పుస్తకం రాసిన అతి చిన్న వ్యక్తిగా ఆమెకూ ప్రపంచ రికార్డ్ ఉంది. ఆ స్ఫూర్తితోనే అల్-మీరీ పుస్తకం రాశాడు.

ఒక పుస్తకం రాయగానే తన పనైపోయిందని అతను అనుకోలేదు. "My True Friend' పేరుతో రెండో పుస్తకం ప్రచురించాడు. చిన్నవయసులో పుస్తకాల సిరీస్ రాసే రచయితగా రికార్డు నెలకొల్పాలని ఆశపడుతున్నాడు. మరిన్ని పుస్తకాలు రాయాలన్న ఆలోచనతో ఉన్నాడు. పుస్తకాలు రాయడం చాలా బాగుంటుందని, పాఠకులు వాటిని చదివి ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చని వివరిస్తున్నాడు.



ఏనుగులూ గుర్రాలూ 64 గళ్ల మెదడుకు మేత





చదరంగం (చెస్) ఆడితే మెదడు చురుగ్గా మారుతుందని అంటుంటారు. చాలామంది ఈ ఆటలో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో పురస్కారాలు అందుకుంటున్నారు. ఈ చదరంగం చరిత్రేమిటో తెలుసా?

చదరంగం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. అయితే దీని పుట్టిల్లు మాత్రం భారతదేశమే. ఏడో శతాబ్దంలో చదరంగం ఆట మొదలైనట్లు చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. 'చతురంగం' అనే పేరుతో మొదలైన ఈ ఆట కాలక్రమేణా చదరంగంగా మారింది. 'చతురంగం' అంటే సేనలోని నాలుగు విభాగాలు. సైనికులు, ఏనుగులు, గుర్రాలు, ఒంటెలు.. ఈ నాలుగు కలిపి ఆడే ఆట కాబట్టి ఆ పేరు వచ్చిందని అంటారు.

భారతదేశం నుంచి పర్షియా దేశానికి వెళ్లిన ఈ ఆట అక్కడ విశేషమైన పేరు తెచ్చుకుంది. ఈ ఆట ఆడటాన్ని రాజులు గొప్ప విషయంగా భావించేవారు. అక్కడే ఈ ఆటకు సంబంధించి కొన్ని కొత్త నిబంధనులు ఏర్పాటు చేశారు. రాజును ఓడించే క్రమంలో వేసే ఎత్తును 'షా మాట్' అనడం పర్షియాలోనే మొదలైంది. ఆ తర్వాత అదే 'చెక్‌మేట్'గా మారింది. ఆ తర్వాత చదరంగం అనేక దేశాలకు విస్తరించింది. ఒక్కో చోట ఒక్కో పేరుతో ఈ ఆట ఆడటం మొదలుపెట్టారు. అందర్నీ చదరంగం ఆకర్షించింది. ఇతర దేశాల నుంచి ప్రత్యేకంగా చదరంగం బోర్డులు, ఆడేందుకు అవసరమైన వస్తువులు తెప్పించుకునేవారు. ఈ ఆట ఆడటాన్ని విజ్ఞానవంతుల కాలక్షేపంగా భావించేవారు.

1851లో లండన్‌లో తొలిసారి చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. జర్మనీకి చెందిన అడాల్ఫ్ ఆండర్సన్ ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచారు. ఆ తర్వాత వివిధ దేశాల్లో పోటీలు నిర్వహించడం మొదలుపెట్టారు. ఎంతోమంది చదరంగ నిపుణులు, క్రీడాకారులు తయారయ్యారు. ప్యారిస్‌లో 'ప్రపంచ చదరంగ సమాఖ్య' 1924లో, 'ప్రపంచ మహిళా వరల్డ్ చెస్ ఛాంపియన్‌షిప్' 1927లో ప్రారంభమయ్యాయి.

మనదేశంలో అనేకమంది చెస్ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నారు. వారిలో ప్రధానంగా చెప్పుకోవాల్సింది విశ్వనాథన్ ఆనంద్ పేరు. ఐదుసార్లు ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్, రెండు సార్లు చెస్ వరల్డ్ కప్ సాధించారు. 1988లో మన దేశం నుంచి ఎంపికైన తొలి చెస్ గ్రాండ్ మాస్టర్ ఆయన. ప్రస్తుతం అంతర్జాతీయ చెస్ సమాఖ్యకు ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. తెలుగువారిలో కోనేరు హంపి, పి.హరికృష్ణ, ద్రోణవల్లి హారిక, ఎం.వర్షిణి, ఈ.అర్జున్, వేల్పుల సరయు లాంటి వారు చదరంగంలో రాణిస్తున్నారు. చదరంగం గురించి అనేకమంది పుస్తకాలు కూడా రాశారు. మీరు కూడా చెస్ ఆడండి. మీ మెదడును చురుగ్గా మార్చుకోండి.

ఇండస్‌టవర్స్‌లో వాటా విక్రయం

వొడాఫోన్ నిధుల సమీకరణ వ్యూహం

న్యూఢిల్లీ: బ్రిటిష్ టెలికం దిగ్గజం వొడాఫోన్ నిధుల సమీకరణ బాట పట్టింది. దేశీ సంస్థ ఇండస్ టవర్స్‌లో 3 శాతం వాటాను విక్రయించనుంది. బీఎస్ఈలో ఇండస్ టవర్స్ షేరు తాజా ధర రూ. 358.75 ప్రకారం వాటా విక్రయం ద్వారా రూ. 2,841 కోట్లు సమకూర్చుకునే వీలుంది. ఈ నిధులలో తొలుత 10.1 కోట్ల డాలర్లు(సుమారు రూ. 856 కోట్లు) దేశీ టెలికం విభాగం వొడాఫోన్ ఐడియా రుణాల చెల్లింపులకు వినియోగించనుంది. ఇండస్ టవర్స్‌లో మిగిలిన వాటాలో 3 శాతాన్ని(7.92 కోట్ల షేర్లు)ను వొడాఫోన్ గ్రూప్ పీఎల్‌సీ బుక్‌బిల్డింగ్ పద్ధతిన విక్రయించనున్నట్లు వొడాఫోన్ ఐడియా పేర్కొంది. ఈ లావాదేవీ తదుపరి ఇండస్ టవర్స్‌లో వొడాఫోన్ గ్రూప్ వాటా 1 శాతానికంటే తక్కువకు పరిమితంకానున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం ఇండస్ టవర్స్‌లో వొడాఫోన్ గ్రూప్ 8.25 కోట్ల షేర్లు(3.1 శాతం వాటా) కలిగి ఉంది. కాగా.. ఈ ఏడాది జూన్‌లో వొడాఫోన్ గ్రూప్ ఇండస్ టవర్స్‌లో 18 శాతం వాటాను రూ. 15,300 కోట్లకు విక్రయించింది.

బీఎస్ఈలో ఇండస్ టవర్స్ షేరు 1.10 శాతం ఎగసి రూ. 365 వద్ద ముగిసింది.

వొడాఫోన్ గ్రూప్ నుంచి పెట్టుబడులు

వొడాఫోన్ ఐడియా తాజా ప్రతిపాదన

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం వొడాఫోన్ ఐడియా ప్రమోటర్ సంస్థ వొడాఫోన్ గ్రూప్ నుంచి నిధుల సమీకరణకు తెరతీయనుంది. ఈక్విటీ షేర్లు లేదా, మార్పిడికి వీలయ్యే సెక్యూరిటీల జారీ ద్వారా రూ. 2,000 కోట్లు సమకూర్చుకునేందుకు ప్రతిపాదించింది. ప్రిఫరెన్షియల్ పద్ధతిలో ఒకేసారి లేదా దశలవారీగా సెక్యూరిటీలను జారీ చేయనున్నట్లు తెలియజేసింది. ఈ నెల 9న నిర్వహించనున్న సమావేశంలో బోర్డు తాజా ప్రతిపాదనను పరిశీలించనున్నట్లు వెల్లడించింది. కాగా.. ఇండస్ టవర్స్‌లో 3 శాతం వాటా విక్రయం ద్వారా వొడాఫోన్ గ్రూప్ సుమారు రూ. 2,800 కోట్లు అందుకోనున్న నేపథ్యంలో తాజా ప్రతిపాదనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నిధులలో రూ. 856 కోట్లు వొడాఫోన్ ఐడియా రుణ చెల్లింపులకు వినియోగించనున్న సంగతి తెలిసిందే. మిగిలిన నిధులను సైతం ఈక్విటీ మార్గంలో వొడాఫోన్ ఐడియాకు సమకూర్చనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వొడాఫోన్ ఐడియాలో వొడాఫోన్ గ్రూప్ 22.56 శాతం వాటాను కలిగి ఉంది. అంతేకాకుండా ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు 14.76 శాతం, ప్రభుత్వానికి 23.15 శాతం చొప్పున వాటా ఉంది.

బీఎస్ఈలో వొడాఫోన్ ఐడియా షేరు స్వల్పంగా పెరిగి రూ. 8.12 వద్ద ముగిసింది.

బంగారానికీ హాల్‌మార్క్..!

- ప్రభుత్వ పరిశీలనలో ప్రతిపాదన
- కంజ్యూమర్ అఫైర్స్ సెక్రటరీ నిధి ఖరే
- ఇప్పటికే ఆభరణాలకు హాల్‌మార్క్



న్యూఢిల్లీ: బంగారంతో చేసిన ఆభరణాలు, కళాకృతులకు ఇప్పటికే హాల్‌మార్క్ తప్పనిసరి. అయితే బంగారు కడ్డీలకూ ఇకపై హాల్‌మార్క్ తప్పనిసరి చేయాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని కంజ్యూమర్ అఫైర్స్ సెక్రటరీ నిధి ఖరే వెల్లడించారు. రత్నాలు, ఆభరణాల అంశంపై సీఐఐ నిర్వహించిన సదస్సులో శుక్రవారం ఆమె ప్రసంగించారు. ప్రజలు నాణ్యమైన, ఖచ్చితమైన ఉత్పత్తులను పొందేలా చూడటం ద్వారా వినియోగదారుల ప్రయోజనాలను కాపాడాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. 'మార్కెట్‌లో వినియోగదారులకు ఎక్కువ నమ్మకం, పారదర్శకతను హాల్‌మార్క్ నిర్ధారిస్తుంది. స్వర్ణకారులు వాస్తవానికి బంగారాన్ని దిగుమతి చేసుకుంటున్నప్పుడు చాలా సందర్భాల్లో వారు పొందుతున్న, కొనుగోలు చేస్తున్న బంగారం నాణ్యత గురించి వారికి ఖచ్చితంగా తెలియదు. కాబట్టి మొత్తం వ్యవస్థ ఖచ్చితత్వం కోసం, నిజాయితీ కోసం గుర్తింపు రావాలని నేను భావిస్తున్నాను' అని వివరించారు. ప్రతిపాదన కార్యరూపంలోకి వస్తే బంగారు కడ్డీలు, బిస్కట్స్, కాయిన్స్‌కు హాల్‌మార్క్ తప్పనిసరి అవుతుంది.

రెండవ అతిపెద్ద ఎగుమతిదారు..

ప్రపంచంలో రెండవ అతిపెద్ద రత్నాభరణాల ఎగుమతిదారుగా భారత్ నిలిచింది. దేశం నుంచి జరుగుతున్న మొత్తం ఎగుమతుల్లో 3.5% వాటాను ఈ రంగం కలిగి ఉందని నిధి వివరించారు. 'భారత ప్రభుత్వం ఈ పరిశ్రమ సామర్థ్యాన్ని గుర్తించింది. ఎగుమతులను ప్రోత్సహించడం కోసం దీనిని ప్రాధాన్య రంగాల్లో ఒకటిగా భావిస్తోంది. జెమ్స్, జువెల్లరీ రంగం భారత ఆర్థిక వ్యవస్థకు కీలక మూలస్తంభం. ఈ రంగం ఎగుమతులు, ఉపాధి రెండింటికీ చాలా గణనీయంగా దోహదపడుతోంది' అని నిధి ఖరే వివరించారు. అంతర్జాతీయ మార్కెట్లలో భారతీయ ఆభరణాలు ప్రాచుర్యం పొందేందుకు కృషి చేయాలని పరిశ్రమకు ఈ సందర్భంగా ఉద్బోధించారు. ముడిసరుకు నాణ్యతను నిర్ధారించడానికి బంగారు కడ్డీలకు తప్పనిసరిగా హాల్ మార్క్ చేయాల్సిన అవసరం ఉందని జెమ్స్, జువెల్లరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (జీజేఈపీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సవ్యసాచి రే అన్నారు.

40 కోట్లకు పైగా ఆభరణాలు..

2021 జూన్ 23 నుండి ప్రారంభమైన బంగారు ఆభరణాలు, కళాఖండాల తప్పనిసరి హాల్‌మార్కింగ్ నిబంధన విజయవంతంగా అమలవుతోందని నిధి ఖరే అన్నారు. '40 కోట్లకు పైగా బంగారు ఆభరణాలు ప్రత్యేక హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్‌తో (హెచ్‌యుఐడీ) హాల్‌మార్క్ చేయబడ్డాయి. దేశవ్యాప్తంగా నమోదిత నగల వ్యాపారుల సంఖ్య దాదాపు 1.95 లక్షలకు చేరింది. అసేయింగ్, హాల్‌మార్కింగ్ కేంద్రాల (ఏహెచ్‌సీ) సంఖ్య 1,600కి పైగా ఉంది. ల్యాబ్‌లో తయారైన వజ్రాలకు డిమాండ్ పెరుగుతోంది. వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించే ప్రయత్నాల్లో భాగంగా ల్యాబ్‌లో తయారైన వజ్రాల కోసం నిబంధనలను రూపొందిస్తున్నాం' అని ఖరే చెప్పారు. భారత రత్నాలు, ఆభరణాల విపణి పరిమాణం 2023లో 44 బిలియన్ డాలర్లు ఉంది. ఇది 2030 నాటికి 134 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా అని ఆమె తెలిపారు.

జీడీపీ మందగమనం వ్యవస్థీకృతం కాదు

- క్యూ3లో పుంజుకుంటుంది
- కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి తగ్గుముఖం పట్టడం అన్నది.. వ్యవస్థీకృతం కాదని (ఆర్థిక వ్యవస్థ అంతటా) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి మెరుగైన మూలధన వ్యయాల మద్దతుతోతగ్గిన మేర డిసెంబర్ త్రైమాసికంలో (క్యూ3) భర్తీ అయ్యి మోస్తరు స్థాయికి వృద్ధి చేరుకుంటున్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 5.4 శాతానికి పడిపోవడం తెలిసిందే. ఇది ఏడు త్రైమాసికాల కనిష్ఠ రేటు కావడం గమనార్హం. జూన్ త్రైమాసికంలో వృద్ధి రేటు 6.7 శాతంగా ఉంది. ''ఇది వ్యవస్థ అంతటా మందగమనం కాదు. ప్రభుత్వం వైపు నుంచి వ్యయాలు, మూలధన వ్యయాలు లోపించడం వల్లే. క్యూ3లో ఇవన్నీ సర్దుకుంటాయి. భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా వచ్చే ఏడాది, తర్వాత కూడా కొనసాగుతుంది''అని ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా ఆర్థిక మంత్రి చెప్పారు. అంతర్జాతీయ డిమాండ్ స్తబ్దుగా ఉండడం ఎగుమతుల వృద్ధిపై ప్రభావం చూపించినట్టు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం వైపు నుంచి పెద్ద ఎత్తున మూలధన వ్యయాలు చేయకపోవడం, కొన్ని రంగాల్లో తగ్గిన కార్యకలాపాలు వృద్ధిపై ప్రభావం చూపించడం తెలిసిందే. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.11.11 లక్షల కోట్ల మూలధన వ్యయాలను కేంద్రం లక్ష్యంగా నిర్దేశించుకోగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో 37.3 శాతమే ఖర్చు చేసింది.

చర్యలు తీసుకుంటున్నాం..

''దేశ ప్రజల కొనుగోలు శక్తి మెరుగుపడుతోంది. అదే సమయంలో వేతనాల్లోనూ మందగమనం ఆందోళనలు నెలకొన్నాయి. ఈ అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇవి దేశ వినియోగంపై ప్రభావం చూపించగలవు. ప్రతి సవాలు నుంచి అవకాశాలను చూసే ప్రధాన మంత్రి మనకు ఉన్నారు. కరోనా సమయంలో ఎదురైన సవాళ్లను అవకాశాలుగా మలుచుకుని సంస్కరణలు తీసుకొచ్చాం. ఆ సమయంలో ఐదు మినీ బడ్జెట్లను ప్రవేశపెట్టాం. విడిగా ప్రతి ఒక్కటీ తనవంతు మద్దతునిచ్చింది''అని మంత్రి సీతారామన్ వివరించారు.

ప్రధాన పోర్టుల్లో రవాణా తగ్గుముఖం

నవంబర్‌లో 5 శాతం క్షీణత

ముంబై: దేశవ్యాప్తంగా ప్రధాన ఓడ రేవుల్లో (పోర్టులు) సరుకు రవాణా నవంబర్ నెలలో 4.95 శాతం మేర తగ్గింది. 67.53 మిలియన్ టన్నుల రవాణా నమోదైంది. క్రితం ఏడాది ఇదే నెలలో రవాణా 71.05 మిలియన్ టన్నులుగా ఉన్నట్టు ఇండియన్ పోర్ట్స్ అసోసియేషన్ (ఐపీఏ) ప్రకటించింది. జవహర్ లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ (జేఎన్‌పీఏ), దీన్‌దయాళ్ పోర్టులు మాత్రం రవాణాలో సానుకూల వృద్ధిని చూపించాయి. మిగిలిన 10 ప్రధాన పోర్టుల్లో రవాణా పరిమాణం తగ్గింది. కేంద్ర ప్రభుత్వం నియంత్రణలో 12 పెద్ద పోర్టులు పనిచేస్తున్నాయి. ఇవి దీన్‌దయాళ్ (కాండ్లా), ముంబై పోర్ట్, జేఎన్‌పీ, మర్ముగోవా, న్యూ మంగళూరు, కొచ్చిన్, చెన్నై, కామరాజార్ (ఎన్నోర్), వీవో చిదంబరనార్, విశాఖపట్నం, పారదీప్, కోల్‌కతా పోర్టులు. జేఎన్‌పీఏలో నవంబర్‌లో సరుకు రవాణా 12.34 శాతం పెరిగింది. దీన్‌దయాళ్ పోర్టులో 10.10 శాతం వృద్ధి చెందింది. మర్ముగోవా పోర్ట్‌లో 29.64 శాతం క్షీణించగా, న్యూ మంగళూరు పోర్టులో 19 శాతం తగ్గింది.



వాహనాలు మరింత ప్రియం

- ధరలు పెంచుతున్న తయారీ సంస్థలు
- జనవరి 1 నుంచి సవరించిన ధరలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థలు ధరలు పెంచేందుకు సిద్ధం అయ్యాయి. కొత్త సంవత్సరం నుంచి సవరించిన ధరలను అమలు చేయనున్నట్టు ఒకదాని తర్వాత ఒకటి ప్రకటిస్తున్నాయి. కంపెనీ, మోడల్‌ను బట్టి 4 శాతం వరకు ధరలు అధికం చేయనున్నట్టు వెల్లడించాయి. ముడిసరుకు వ్యయాలు, నిర్వహణ ఖర్చులు, రవాణా వ్యయాలు భారం కావడం, ప్రతికూల మారకపు రేటు ఇందుకు కారణమని కంపెనీలు చెబుతున్నాయి. కొంత భారాన్ని కంపెనీ భరించిందని, తప్పనిసరి పరిస్థితుల్లోనే అదనపు భారాన్ని కస్టమర్లకు బదిలీ చేయాల్సి వస్తోందని వివరించాయి. తాజాగా వాహన తయారీ దిగ్గజాలు మారుతీ సుజుకీ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా మేము సైతం అంటూ ధరలను సవరించేందుకు వరుస కట్టాయి.

మారుతీ సుజుకీ సైతం..

2025 జనవరి 1 నుండి అన్ని మోడళ్ల ధరలను 4 శాతం వరకు పెంచనున్నట్లు మారుతీ సుజుకీ ఇండియా శుక్రవారం ప్రకటించింది. అధికం అవుతున్న ముడిసరుకు వ్యయాలు, నిర్వహణ ఖర్చుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. అనవసర ఖర్చులను కట్టడి చేయడానికి, వినియోగదారులపై ప్రభావాన్ని తగ్గించడానికి నిరంతరం కృషి చేస్తున్నప్పుడు.. పెరిగిన వ్యయంలో కొంత భాగాన్ని మార్కెట్‌కు బదిలీ చేయాల్సి ఉంటుందని పేర్కొంది. తయారీ ఖర్చుల భారం, ప్రతికూల మారకపు రేటు, రవాణా వ్యయాలు దూసుకెళ్లిన కారణంగా ధరల పెరుగుదల తప్పనిసరి అని వెల్లడించింది. ఎస్‌యూవీలు, వాణిజ్య వాహనాల ధరలను 3 శాతం వరకు అధికం చేయనున్నట్టు మహీంద్రా అండ్ మహీంద్రా వెల్లడించింది. సవరించిన ధరలు జనవరి 1 నుంచి అమలులోకి వస్తాయని తెలిపింది. అదనపు ఖర్చులను వీలైనంత ఎక్కువగా స్వీకరించడానికి ప్రయత్నం చేశామని, అయితే ఈ పెరుగుదలలో కొంత భాగాన్ని కస్టమర్లకు బదిలీ చేయాల్సి వస్తోందని వివరించింది.

ఇతర కంపెనీలు కూడా..

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా 2025 జనవరి 1 నుంచి అన్ని మోడళ్ల ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. నిరంతరం దూసుకెళుతున్న ముడిసరుకుల ఖర్చులు, ఇతర బాహ్య కారకాల ఫలితమే ధరల సవరణ అని కంపెనీ తెలిపింది. 'నాణ్యత, ఆవిష్కరణ, స్థిరత్వానికి మా అంకితభావం ప్రాధాన్యతగా నిలిచింది. అలాగే మా ఆఫర్లను నిరంతరం మెరుగుపరచడానికి మమ్మల్ని నడిపిస్తుంది. ఈ క్రమంలో పెరుగుతున్న ముడిసరుకు వ్యయాలను భర్తీ చేయడానికి చిన్నపాటి ధరల సవరణలు అనివార్యం' అని జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సతీందర్ సింగ్ బజ్వా తెలిపారు. కాగా, హుందాయ్ అన్ని మోడళ్ల ధరలను రూ.25,000 వరకు పెంచుతున్నట్టు గురువారం ప్రకటించిన సంగతి తెలిసిందే. వివిధ లగ్జరీ కార్ల తయారీ సంస్థలు మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడి సైతం వచ్చే నెల నుండి వాహనాల ధరలను సవరిస్తున్నట్లు ప్రకటించాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
7-12-2024	
విశాఖ	610-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	620-00
విజయవాడ	620-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	620-00
వరంగల్	622-00
రిటైల్ ధర	6.80

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	818	3.21
BAJAJ-AUTO	9,100.00	2.34
AXISBANK	1,183.90	1.5
BPCL	300.8	1.28
DRREDDY	1,253.55	1.1

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	1,257.80	-1.51
CIPLA	1,477.00	-1.42
BHARTIARTL	1,597.75	-1.09
HDFCLIFE	636.2	-1.08
INDUSINDBK	988.35	-0.99

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,745
ఎన్ఎస్ఈ	1,08,779
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,66,771
ఎఫ్ఐఐ	- 1,830
డీఐఐ	+ 1,659

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	67.34	$ 68.30
బ్రెంట్	71.15	$ 72.09

హోజరీ పరిశ్రమకు సానుకూల పరిస్థితులు

- 10-12 శాతం మేర అధిక ఆదాయం
- 2024-25లో ఉంటుందని క్రిసిల్ అంచనా



ముంబై: హోజరీ తయారీదారులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10-12 శాతం మేర అధిక ఆదాయం సమకూరుతుందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ కోలుకోవడంతో అధిక అమ్మకాలు, ఎగుమతుల మార్కెట్ నుంచి వృద్ధి అనుకూలించనున్నట్టు పేర్కొంది. పరిశ్రమ నిర్వహణ మార్జిన్ 1.5-2 శాతం మేర బలపడతుందంటూ.. ముడి సరుకుల వ్యయాలు తగ్గడం, సామర్థ్యం పుంపు, అధిక అమ్మకాలను అనుకూలతలుగా ప్రస్తావించింది. హోజరీ రంగంపై క్రిసిల్ రేటింగ్స్ ఒక నివేదిక విడుదల చేసింది. వర్షాలు సాధారణం కంటే అధికంగా ఉండడం, కనీస మద్దతు ధరల పెంపు, ప్రభుత్వం నుంచి అధిక వ్యయాలు వంటి సానుకూలతలను ప్రస్తావించింది. మధ్య ప్రాచ్యం, ఉత్తరాఫ్రికాకు ఎగుమతుల్లో వృద్ధికితోడు, పట్టణ డిమాండ్ సైతం అమ్మకాలు పెరిగేందుకు సాయపడనున్నట్టు క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ అర్ధచంద్ర తెలిపారు. సాధారణంగా ఆర్థిక సంవత్సరం చివర్లో హోజరీ ఉత్పత్తుల అమ్మకాలు పెరుగుతాయని, వేసవికి ముందు ఛానల్ భాగస్వాములు నిల్వలు పెంచుకుంటారని క్రిసిల్ నివేదిక వివరించింది. యార్న్ ధరలు స్థిరంగా ఉండడం, అమ్మకాల ధరలు 1-2 శాతం తగ్గడంతో విక్రయ భాగస్వాముల నుంచి డిమాండ్ పెరగడానికి దోహదపడినట్టు తెలిపింది. హోజరీ పరిశ్రమ నిర్వహణ మార్జిన్ 1.5-2 శాతం మేర పెరిగి 11.5-12 శాతానికి చేరుకుంటుందని అంచనా వేసింది.

పరిమితంగానే రుణభారం..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో హోజరీ పరిశ్రమలో సామర్థ్య వినియోగం మోస్తరుగా ఉంటుందని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. భారీ విస్తరణకు అవకాశం లేదని తెలిపింది. ఇది దీర్ఘకాల రుణ సమీకరణ, రుణ వ్యయాలను తగ్గిస్తుందని వివరించింది. ఇన్వెంటరీ కాలం తగ్గడంతో మూలధన అవసరాలు కూడా తగ్గుతాయని పేర్కొంది. ''ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో హోజరీ పరిశ్రమ ఇన్వెంటరీ పీరియడ్ (ఉత్పత్తుల నిల్వల సమయం) 90-100 రోజులకు తగ్గుతుంది. ఇది చారిత్రక కనిష్ఠ స్థాయి. పరిమిత మూలధన అవసరాలు, రుణాలతో పెద్ద ఎత్తున విస్తరణ లేకపోవడంతో పరిశ్రమ రుణభారం నియంత్రిత స్థాయిలోనే ఉండనుంది''అని క్రిసిల్ రేటింగ్స్ వివరించింది.

విస్తరణ బాటలో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్



న్యూఢిల్లీ: బడ్జెట్ విమానయాన సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ .. గల్ఫ్, మధ్య ప్రాచ్యంలో స్థానాన్ని పటిష్టం చేసుకోవడంతో పాటు ఆగ్నేయాసియాలోనూ తమ కార్యకలాపాలను విస్తరించనుంది. బ్యాంకాక్, సింగపూర్, కొలంబో తదితర కొత్త రూట్లను పరిశీలిస్తున్నట్లు సంస్థ ఎండీ అలోక్ సింగ్ తెలిపారు. 2025 మార్చి వేసవి షెడ్యూల్‌లో ఖాట్మండూ రూట్‌లో సర్వీసులు మొదలుపెడతామని, వచ్చే ఆర్థిక సంవత్సరం లేదా ఆపై సంవత్సరం వియత్నాంకి ఫ్లయిట్స్‌ను ప్రారంభించే అవకాశం ఉందని ఆయన వివరించారు. ప్రధానంగా 5.5-6 గంటల ప్రయాణ దూరం ఉండే రూట్లు, ద్వితీయ .. తృతీయ శ్రేణి నగరాలకు సర్వీసులపై దృష్టి పెడుతున్నట్లు పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభ పరిస్థితుల కారణంగా కోల్‌కతా నుంచి ఢాకాకు డైరెక్ట్ ఫ్లయిట్స్ ప్రణాళికను వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. దేశీయంగా విమాన ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే ఏడాది మార్చి నాటికి తమ విమానాల సంఖ్యను ప్రస్తుతమున్న 90 నుంచి 100కి పెంచుకోనున్నట్లు సింగ్ చెప్పారు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం దేశీయంగా 36, అంతర్జాతీయంగా 15 గమ్యస్థానాలకు నిత్యం 400 ఫ్లయిట్స్ నడుపుతోంది.

టైర్-2 నగరాల్లో ఇళ్ల ధరలకు రెక్కలు

గుంటూరులో 51% పెరుగుదల

- విశాఖలో 29%, విజయవాడలో 21 %
- దేశవ్యాప్తంగా 23 నగరాల్లో ధరల వృద్ధి
- ప్రాప్ ఈక్విటీ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ద్వితీయ శ్రేణి నగరాల్లో (టైర్-2) ఇళ్ల ధరలు ఈ ఏడాది జనవరి-సెప్టెంబర్ మధ్య కాలంలో గణనీయంగా పెరిగాయి. 23 ప్రముఖ పట్టణాల్లో సగటున 65 శాతం ఎగిసినట్టు ప్రాప్ ఈక్విటీ సంస్థ వెల్లడించింది. అదే విధంగా ఐదు నగరాల్లో ధరలు తగ్గాయి. ముఖ్యంగా దక్షిణాదిన గుంటూరు పట్టణంలో 51 శాతం మేర ధరల్లో పెరుగుదల కనిపించింది. ఆ తర్వాత విశాఖ పట్టణంలో 29 శాతం, విజయవాడలో 21 శాతం చొప్పున పెరిగాయి. దక్షిణాదిలోనే మంగళూరులో 41 శాతం, కోయింబత్తూర్‌లో 11 శాతం, గోవాలో 6 శాతం, కోచిలో 2 శాతం చొప్పున వృద్ధి చెందాయి. త్రివేంద్రంలో మాత్రం 4 శాతం, మైసూర్‌లో 14 శాతం చొప్పున ధరలు తగ్గాయి.

జైపూర్ టాప్..

టైర్-2 పట్టణాల్లో దేశంలోనే అత్యధికంగా జైపూర్‌లో 65 శాతం మేర ధరలు పెరిగినట్టు ప్రాప్ ఈక్విటీ నివేదిక తెలిపింది. జనవరి-సెప్టెంబర్ మధ్య కాలంలో కొత్తగా ప్రారంభించిన ప్రాజెక్టుల్లో చదరపు అడుగు (ఎస్ఎఫ్‌టీ) ధర రూ.6,979కు చేరింది. క్రితం సంవత్సరం ఇదే కాలంలో రూ.4,240గా ఉండడం గమనార్హం.

ఉత్తరాదిన ఆగ్రా..

ఉత్తరాదిన ఆగ్రాలో ఇళ్ల ధరలు 59 శాతం పెరిగాయి. ఆ తర్వాత చండీగఢ్‌లో 34 శాతం, భివాండీలో 25 శాతం, ఇండోర్‌లో 20 శాతం, డెహ్రాడూన్‌లో 14 శాతం, లుధియానాలో 11 శాతం, లక్నోలో ఒక శాతం చొప్పున ధరల్లో వృద్ధి కనిపించింది. భోపాల్‌లో 5 శాతం, మోహాలిలో 8 శాతం, సోనేపట్‌లో 26 శాతం చొప్పున ధరలు పతనమయ్యాయి.

పశ్చిమాన గాంధీనగర్

పశ్చిమభారత్‌లో గాంధీనగర్‌లో అత్యధికంగా 19 శాతం మేర ఇళ్ల ధరలు ఎగిశాయి. ఆ తర్వాత సూరత్‌లో 14 శాతం, నాగ్‌పూర్‌లో 12 శాతం, వడోదరలో 10 శాతం, నాసిక్‌లో 4 శాతం, అహ్మదాబాద్లో 4 శాతం చొప్పున ధరలు పెరిగాయి. తూర్పున భువనేశ్వర్‌లో 15 శాతం, రాయ్‌పూర్‌లో 14 శాతం చొప్పున ఇళ్ల ధరల్లో వృద్ధి కనిపించింది.

బలంగా డిమాండ్..

''టైర్-2 నగరాల్లో డెవలపర్లు, కార్పొరేట్లు, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్లు, ఇన్వెస్టర్ల సమూహం నుంచి ఇళ్లకు ఆసక్తి పెరిగింది. ఈ నగరాల్లో భూమి చౌకగా లభించడం, మౌలిక ససతులతో పెద్ద ఎత్తున అనుసంధానత, బలమైన డిమాండ్ వెరసి ప్రీమియం, లగ్జరీ ఇళ్ల సరఫరా మెరుగుపడింది'' అని ప్రాప్‌ఈక్విటీ వ్యవస్థాపకుడు, సీఈవో సమీర్ జసూజా తెలిపారు.

స్టార్ అగ్రివేర్ హౌసింగ్ ఐపీవో బాట

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: స్టార్ అగ్రివేర్‌హౌసింగ్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. టెక్నాలజీ ఆధారంగా వ్యవసాయ సంబంధ(అగ్రికల్చర్) సర్వీసులందించే కంపెనీ ఐపీవోలో భాగంగా రూ. 450 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 2.69 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. కంపెనీలో ప్రమోటర్ల వాటా 88.17 శాతంకాగా.. క్లేమోర్ ఇన్వెస్ట్‌మెంట్స్(మారిషస్) పీటీఈకి 11.83 శాతం వాటా ఉంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 120 కోట్లు కంపెనీకి, రూ. 125 కోట్లు అనుబంధ సంస్థకు వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం కేటాయించనుంది. మరో అనుబంధ సంస్థ ఏఎఫ్ఎల్ మూలధన పటిష్టతకు రూ. 100 కోట్లు అందించనుంది.



తల్లిదండ్రులు కరుణ, మురళీధర్, గర్ల్‌ఫ్రెండ్ జూలియానా జుజు చాన్‌లతో సాహిత్ రెడ్డి

‘భారత్‌తో నా అనుబంధం ప్రత్యేకం’

- యువ గోల్ఫర్లకు నా ప్రయాణం స్ఫూర్తినివ్వాలి
- భారత సంతతికి చెందిన అమెరికా గోల్ఫర్ తీగల సాహిత్ రెడ్డి వ్యాఖ్య



న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక ప్రొఫెషనల్ గోల్ఫ్ అసోసియేషన్ (పీజీఏ) టూర్‌లో తీగల సాహిత్ రెడ్డి గత నాలుగేళ్లుగా నిలకడగా రాణిస్తున్నాడు. గత ఏడాది ఫోర్టినెట్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకొని తన ఖాతాలో తొలి టైటిల్‌ను వేసుకున్నాడు. అమెరికాకు ప్రాతినిధ్యం వహిస్తున్న సాహిత్ ప్రస్తుతం వరల్డ్ ర్యాంకింగ్స్‌లో 12వ స్థానంలో ఉన్నాడు. కాలిఫోర్నియాలో పుట్టి పెరిగిన అతనికి భారత్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. సాహిత్ తల్లిదండ్రులు మురళీధర్, కరుణ హైదరాబాద్‌కు చెందినవారు. ఐఐటీ మద్రాస్‌లో చదువు పూర్తి చేసుకున్న అనంతరం మురళీధర్ 1980ల్లో అమెరికాకు వలస వెళ్లిపోయారు. అయితే ఆయన తన మూలాలు మాత్రం మర్చిపోలేదు. తన పిల్లల్లో కూడా ‘భారతీయత’ అనే భావన ఉండేలా వారిని పెంచారు. ప్రతీ ఏటా ఒక్కసారైనా ఈ కుటుంబం భారత్‌కు వచ్చి వెళుతుంది. ‘నా భారత సంస్కృతి, వారసత్వం అంటే నాకు చాలా ఇష్టం. కొద్ది రోజుల క్రితం భారత్‌లోనే ఉన్నాను. నాకు ఇక్కడ లభించిన ఆదరాభిమానాలను మరచిపోలేను’ అని సాహిత్ చెప్పాడు. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలను తన పిల్లలు తరచుగా కలిస్తే భారత్‌తో అనుబంధం కొనసాగుతుందనే ఉద్దేశంతోనే ఇదంతా చేస్తున్నామని మురళీధర్ వెల్లడించారు. తమ కుటుంబానికి ఆంధ్ర రుచులు అంటే ఎంతో ఇష్టమని... అమెరికాలోనే కాకుండా ఇక్కడికి వచ్చినప్పుడు కూడా వాటిని తినేందుకే తాము ఆసక్తి చూపిస్తామని ఆయన చెప్పారు. ప్రొఫెషనల్ గోల్ఫర్‌గా మారిన తర్వాత సాహిత్ తొలిసారి హైదరాబాద్‌కు వచ్చాడు. ‘భారత్‌లోనే ఉండే సన్నిహితులు నా ఆటను ప్రశంసిస్తుంటే చాలా ఆనందంగా అనిపించింది. టూర్‌లో ఫలితాల గురించి ప్రస్తుతం ఆలోచించడం లేదు. కెరీర్ కంటే కూడా ఈ అనుబంధాలు సంతృప్తినిచ్చాయి. నేను గోల్ఫర్‌గా మారడంలో నా తల్లిదండ్రుల పాత్ర చాలా ఉంది. భారత్ నుంచి వచ్చిన ఎన్నో ఏళ్ల తర్వాత కూడా అవే విలువలు కొనసాగించారు. వాటి మధ్య మమ్మల్ని పెంచడం కొంత ఆశ్చర్యకరంగా, గర్వంగా కూడా అనిపిస్తుంది’ అని సాహిత్ వ్యాఖ్యానించాడు. అయితే తన వ్యక్తిగత విజయాల కంటే రాబోయే తరపు భారత గోల్ఫర్లకు స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నట్లు సాహిత్ తెలిపాడు. ‘భారత్‌లో గోల్ఫ్ పరిస్థితి మారుతోంది. కొంత డబ్బు, ఇతర సౌకర్యాలు రావడం వల్ల కుర్రాళ్లకు కోచింగ్ అవకాశాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. దేశంలో అంతా క్రికెట్ విస్తరించి ఉందనే విషయం నాకూ తెలుసు. ఇలాంటి సమయంలో ప్రతిభ ఉన్న భారత గోల్ఫర్లు విదేశాలకు వెళ్లి భారత మూలాలు ఉన్న ఆటగాళ్లుగా గుర్తింపు తెచ్చుకుంటూ ప్రపంచవ్యాప్తంగా మంచి విజయాలు సాధించాలని కోరుకుంటున్నా. ఇలాంటివారు నన్ను చూసి స్ఫూర్తి పొందుతారని ఆశిస్తున్నా’ అని సాహిత్ అభిప్రాయ వ్యక్తం చేశాడు.

జై షా స్థానంలో శమ్మీ సిల్వా

దుబాయ్: శ్రీలంకకు చెందిన శమ్మీ సిల్వా ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మూడు దఫాలుగా అధ్యక్ష పీఠంపై ఉన్న జై షా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్‌గా ఈ నెల 1న పదవీ బాధ్యతలు చేపట్టారు. దీంతో ఏసీసీ కొత్త అధ్యక్షుడిగా శమ్మీ వ్యవహరించనున్నారు. ఏసీసీలో శమ్మీకి ఇదేం కొత్తకాదు. ఇది వరకు పలు హోదాల్లో పని చేశారు. చివరగా ఏసీసీ ఫైనాన్స్–మార్కెటింగ్ కమిటీకి చైర్మన్‌గా ఉన్నారు.

వెరిన్ అజేయ సెంచరీ

- దక్షిణాఫ్రికా 358 ఆలౌట్
- శ్రీలంక 242/3



వెరిన్

పోర్ట్ ఎలిజబెత్: దక్షిణాఫ్రికా మిడిలార్డర్ బ్యాటర్ కైల్ వెరిన్ (133 బంతుల్లో 105 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. దీంతో శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 103.4 ఓవర్లలో 358 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 269/7తో రెండో రోజు ఆట కొనసాగించిన ఆతిథ్య జట్టులో వెరిన్... టెయిలెండర్ల అండతో మొండిగా పోరాడాడు. ఆట మొదలైన కాసేపటికే కేశవ్ మహరాజ్ (0) డకౌటయ్యాడు. 269 వద్దే ఎనిమిదో వికెట్ కోల్పోగా చేతిలో ఉన్న రెండు వికెట్లతో వెరిన్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. రబడ (23; 5 ఫోర్లు)తో కలిసి వెరిన్ తొమ్మిదో వికెట్‌కు 56 పరుగులు జోడించాడు. తర్వాత వచ్చిన ప్యాటర్సన్ (9) సహకారంతో సెంచరీని చకచకా పూర్తి చేసుకున్నాడు. లంక బౌలర్లలో లహిరు కుమార 4, అసిత ఫెర్నాండో 3, విశ్వ ఫెర్నాండో 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ మొదలు పెట్టిన శ్రీలంక ఆట ముగిసే సమయానికి 67 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. ఓపెనర్ నిసాంక (89; 11 ఫోర్లు, 1 సిక్స్), చండీమల్ (44; 5 ఫోర్లు) రాణించారు. ఏంజెలో మాథ్యూస్ (40 బ్యాటింగ్; 6 ఫోర్లు), కమిందు మెండిస్ (30 బ్యాటింగ్; 3 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. ఇంకా 116 పరుగులు వెనుకబడి ఉన్న శ్రీలంక చేతిలో 7 వికెట్లున్నాయి. సఫారీ బౌలర్లలో రబడ, ప్యాటర్సన్, కేశవ్ తలా ఒక వికెట్ తీశారు.

బ్రూక్ మెరుపు శతకం

- ఇంగ్లండ్ 280 ఆలౌట్
- న్యూజిలాండ్ 86/5
- తొలి రోజే 15 వికెట్లు



బ్రూక్

వెల్లింగ్టన్: మిడిలార్డర్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (115 బంతుల్లో 123; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు) మరోసారి సెంచరీతో కదంతొక్కాడు. న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో భారీ సెంచరీతో ఇంగ్లండ్‌ను గెలిపించిన బ్రూక్... శుక్రవారం ప్రారంభమైన రెండో టెస్టులోనూ మూడంకెల స్కోరు చేయడంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 54.4 ఓవర్లలో 280 పరుగులకు ఆలౌటైంది. 43 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన దశలో ఓలీ పోప్ (66; 7 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి బ్రూక్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 174 పరుగులు జోడించారు. ఈ క్రమంలో బ్రూక్ సుదీర్ఘ ఫార్మాట్‌లో ఎనిమిదో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (2), జో రూట్ (3), బెన్ డకెట్ (0) విఫలమవ్వగా... జాక్ క్రాలీ (23 బంతుల్లో 17; 1 ఫోర్, 1 సిక్స్), బెథెల్ (28 బంతుల్లో 16; 3 ఫోర్లు) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. సౌతీ వేసిన తొలి ఓవర్ చివరి బంతికి క్రాలీ సిక్స్ కొట్టాడు. తద్వారా మ్యాచ్ తొలి ఓవర్‌లోనే సిక్స్ కొట్టిన తొలి ఇంగ్లండ్ బ్యాటర్‌గా అతను గుర్తింపు పొందాడు. న్యూజిలాండ్ బౌలర్లలో నాథన్ స్మిత్ 4, రూర్కె 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ (37; 3 ఫోర్లు) ఒక్కడే కాస్త పోరాడగా... టామ్ లాథమ్ (17; 1 ఫోర్), కాన్వే (11; 2 ఫోర్లు), రచిన్ రవీంద్ర (3), మిచెల్ (6) పెవిలియన్‌కు వరుస కట్టారు. ఇంగ్లండ్ బౌలర్లలో కార్స్ 2, వోక్స్, అట్కిన్సన్, స్టోక్స్ ఒక్కో వికెట్ తీశారు. చేతిలో 5 వికెట్లు ఉన్న ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు ఇంగ్లండ్ స్కోరుకు ఇంకా 194 పరుగులు వెనుకబడి ఉంది. పేసర్ల జోరు సాగుతున్న పోరులో తొలి రోజే 15 వికెట్లు నేలకూలాయి. రూర్కె (0 బ్యాటింగ్), బ్లండెల్ (7 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.



జయహో జార్ఖండ్

- జాతీయ సబ్ జూనియర్ మహిళల హాకీ టైటిల్ సొంతం
- ఫైనల్లో మధ్యప్రదేశ్‌పై 1–0 గోల్‌తో విజయం

సాక్షి, హైదరాబాద్: గత ఏడాది రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకున్న జార్ఖండ్ జట్టు ఈసారి మాత్రం విన్నర్స్ ట్రోఫీని సొంతం చేసుకుంది. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం జరిగిన జాతీయ సబ్ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌లో జార్ఖండ్ విజేతగా అవతరించింది. హోరాహోరీగా సాగిన తుది సమరంలో పుష్పా డాంగ్ సారథ్యంలోని జార్ఖండ్ జట్టు 1–0 గోల్ తేడాతో కృష్ణ శర్మ నాయకత్వంలోని మధ్యప్రదేశ్ జట్టును ఓడించింది. ఆట 15వ నిమిషంలో ఎడమ వైపు నుంచి జమునా కుమారి బంతితో దూసుకెళ్లి హెమ్‌రోమ్ లియోనికి పాస్ అందించింది. హెమ్‌రోమ్ ఎలాంటి తప్పిదం చేయకుండా బంతిని లక్ష్యానికి చేర్చింది. దాంతో జార్ఖండ్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్ జట్టు స్కోరును సమం చేసేందుకు విఫలయత్నం చేసింది. అయితే జార్ఖండ్ డిఫెన్స్ అత్యంత పటిష్టంగా ఉండటంతో చివరకు మధ్యప్రదేశ్‌కు ఓటమి తప్పలేదు. గత ఏడాది ఫైనల్లో హరియాణా చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన జార్ఖండ్ ఈసారి మాత్రం టోర్నీ మొత్తం పకడ్బందీ ఆటతీరుతో అదరగొట్టింది. టోర్నీ మొత్తంలో ఒక్క మ్యాచ్‌లోనూ ఓడని జార్ఖండ్ ప్రత్యర్థి జట్లకు ఒకే ఒక్క గోల్ సమర్పించుకోవడం విశేషం. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో మిజోరం జట్టు 4–3 గోల్స్ తేడాతో ఒడిశా జట్టుపై గెలిచింది. విజేతగా నిలిచిన జార్ఖండ్ జట్టుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రూ. 3 లక్షలు... రన్నరప్ మధ్యప్రదేశ్‌కు రూ. 2 లక్షలు... మూడో స్థానంలో నిలిచిన మిజోరం జట్టుకు రూ. 1 లక్ష ప్రైజ్‌మనీని ప్రకటించారు. బహుమతి ప్రదానోత్సవంలో హాకీ ఇండియా కార్యదర్శి భోలానాథ్ సింగ్, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (ఎస్‌ఏటీజీ) చైర్మన్ శివసేనా రెడ్డి, ఎస్‌ఏటీజీ మేనేజింగ్ డైరెక్టర్ సోనీబాలా దేవి, తెలంగాణ హాకీ సంఘం కార్యదర్శి భీమ్ సింగ్, అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

272 మొత్తం 28 జట్లు పాల్గొన్న జాతీయ సబ్ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌లో నమోదైన మొత్తం గోల్స్. ఇందులో 191 ఫీల్డ్ గోల్స్, 76 పెనాల్టీ కార్నర్ గోల్స్, 5 పెనాల్టీ స్ట్రోక్ గోల్స్ ఉన్నాయి.

తమిళ్ తలైవాస్ తడాఖా

గుజరాత్ జెయింట్స్‌పై ఘనవిజయం



గుజరాత్ జెయింట్స్ జట్టుపై తమిళ్ తలైవాస్ ప్లేయర్ రెయిడింగ్

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో తమిళ్ తలైవాస్ జట్టు ఆరో విజయం నమోదు చేసుకుంది. శుక్రవారం జరిగిన ఈ పోరులో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన తలైవాస్ 40–27 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది. తలైవాస్ తరఫున మొయిన్ షఫాఘి 13 పాయింట్లతో సత్తా చాటగా... సౌరభ్, హిమాన్షు చెరో 7 పాయింట్లు సాధించారు. గుజరాత్ జెయింట్స్ తరఫున హిమాన్షు 11 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. తాజా సీజన్‌లో 16 మ్యాచ్‌లాడిన తమిళ్ తలైవాస్ 6 విజయాలు, 9 పరాజయాలు, ఒక ‘టై’తో 38 పాయింట్లు సంపాదించింది. ప్రస్తుతం తలైవాస్ తొమ్మిదో స్థానంలో ఉంది. మరోవైపు గుజరాత్ 16 మ్యాచ్‌ల్లో పదో పరాజయం మూటగట్టుకుంది. శుక్రవారమే జరిగిన రెండో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 42–36 తేడాతో పట్నా పైరేట్స్‌ను చిత్తు చేసింది. హరియాణా జట్టు తరఫున శివమ్ 11 పాయింట్లు, మొహమ్మద్ రెజా 9 పాయింట్లు సాధించగా.. సంజయ్ ధుల్, వినయ్ చెరో 5 పాయింట్లు ఖాతాలో వేసుకున్నారు. పట్నా తరఫున దేవాంక్ 13 పాయింట్లతో పోరాడాడు. ఓవరాల్‌గా ఇరు జట్లు రెయిడింగ్‌లో చెరో 19 పాయింట్లు సాధించగా... డిఫెన్స్‌లో సత్తా చాటిన స్టీలర్స్ విజాయన్ని ఖరారు చేసుకుంది. ఈ సీజన్‌లో 17 మ్యాచ్‌లాడిన స్టీలర్స్ 13 విజయాలు, 4 పరాజయాలతో 67 పాయింట్లు సాధించింది. తమ అగ్రస్థానాన్ని పటిష్టం చేసుకుంది. పట్నా పైరేట్స్ 53 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో పుణేరి పల్టన్ (రాత్రి 8 గంటలకు), తెలుగు టైటాన్స్‌తో బెంగాల్ వారియర్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

స్విమ్మర్ కార్తీక్‌కు రెండు పతకాలు



సాక్షి, హైదరాబాద్: ‘సైవస్ ఇండియా’ సంస్థ ఆధ్వర్యంలో చెన్నైలో జరిగిన ఇండియా ఓపెన్ జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో తెలంగాణకు చెందిన కొల్లి కార్తీక్ అగ్నేయ రెండు పతకాలు సాధించాడు. మేధో వైకల్యం ఉన్న వారి కోసం ఈ టోర్నీని ప్రత్యేకంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా 200 మందికంటే ఎక్కువ మంది స్విమ్మర్లు ఈ టోర్నీలో పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన 14 ఏళ్ల కొల్లి కార్తీక్ అండర్–17 బాలుర 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో స్వర్ణ పతకాన్ని సాధించాడు. కార్తీక్ 14 నిమిషాల 47.99 సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానంలో నిలిచాడు. విక్కీ స్విమ్మింగ్ అకాడమీలో హెడ్ కోచ్ శివేందర్ వద్ద కార్తీక్ శిక్షణ తీసుకుంటున్నాడు. అండర్–17 బాలుర 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఈవెంట్‌లో కార్తీక్ (4 నిమిషాల 42.11 సెకన్లు) రజత పతకాన్ని సాధించాడు.



భారత హ్యాండ్‌బాల్ జట్టుకు నిరాశ

న్యూఢిల్లీ: ఆసియా మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య భారత జట్టు పోరాటం లీగ్ దశలోనే ముగిసింది. సెమీఫైనల్ చేరాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత జట్టు ఓడిపోయింది. జపాన్ జట్టుతో శుక్రవారం జరిగిన గ్రూప్ ‘బి’ చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 15–48 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. భారత్ తరఫున భావన శర్మ 7 గోల్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలువగా... ప్రియాంక 3 గోల్స్, సుష్మా 2 గోల్స్, మణీందర్ కౌర్ 2 గోల్స్, షాలిని ఠాకూర్ 1 గోల్ చేశారు. నాలుగు జట్లున్న గ్రూప్ ‘బి’లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన జపాన్, రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన ఇరాన్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాయి. గ్రూప్ ‘ఎ’ నుంచి దక్షిణ కొరియా, కజకిస్తాన్ సెమీఫైనల్లోకి ప్రవేశించాయి.

తండ్రి కాబోతున్న వెర్‌స్టాపెన్



అబుదాబి: ఫార్ములావన్ చాంపియన్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ త్వరలో తండ్రి కాబోతున్నాడు. తన ప్రియురాలు కెల్లీ పికెట్ గర్భం దాల్చినట్లు వెర్‌స్టాపెన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ‘మినీ వెర్‌స్టాపెన్‌-పికెట్ వస్తున్నారు’ అని ఈ రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ పేర్కొన్నాడు. ఇతని గర్ల్‌ఫ్రెండ్ కెల్లీది రేసింగ్ కుటుంబమే! ఆమె తండ్రి నెల్సన్ పికెట్ 1980 దశకంలో మూడుసార్లు ఫార్ములావన్ చాంపియన్‌గా నిలిచాడు. సోదరుడు నెల్సన్ పికెట్ జూనియర్ కూడా కొన్నాళ్లు ఫార్ములావన్ సర్క్యూట్‌లో దూసుకెళ్లాడు. 2000 సంవత్సరంలో జూనియర్ నెల్సన్ రెనో జట్టు డ్రైవర్‌గా కెరీర్‌ను కొనసాగించాడు. తదనంతరం ఎలక్ట్రిక్ కార్లకు సంబంధించిన ‘ఫార్ములా–ఈ’ సిరీస్ వైపు అడుగులేశాడు. ఈ క్రమంలో 2014–15లో ప్రారంభమైన ‘ఫార్ములా–ఈ’ తొలి సీజన్‌లో అతను చాంపియన్‌గా ఆవిర్భవించాడు. వెర్‌స్టాపెన్ తండ్రి జోస్ 1990 దశకంలో ఫార్ములావన్ డ్రైవర్‌గా ఉన్నాడు. కాగా ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్ పదో రేసు విజయంపై కన్నేశాడు. ఆదివారం సీజన్ చివరి రేస్ అబుదాబి గ్రాండ్‌ప్రి జరుగనుంది.

2026 యూత్ ఒలింపిక్స్ నుంచి హాకీ, షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్ తొలగింపు

న్యూఢిల్లీ: అంతర్జాతీయస్థాయిలో భారత్ నిలకడగా పతకాలు సాధించే ఈవెంట్లపైనే తరచూ కత్తెర వేస్తున్నారు. ఇప్పుడు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) కూడా భారత క్రీడా వర్గాలకు మింగుడు పడని నిర్ణయం తీసుకుంది. 2026లో జరిగే యూత్ ఒలింపిక్స్ క్రీడల్లో షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్, హాకీ క్రీడాంశాలకు మంగళం పాడింది. సెనెగల్ దేశం ఆతిథ్యమివ్వబోయే ఈ యూత్ విశ్వక్రీడలు డాకర్ నగరంలో జరుగనున్నాయి. బ్యూనస్ ఎయిర్స్‌లో 2018లో జరిగిన గత యూత్ ఒలింపిక్స్‌లో భారత్ 13 (3 స్వర్ణాలు, 9 రజతాలు, ఒక కాంస్యం) పతకాలు గెలుపొందింది. ఇందులో షూటర్లు 4 (2స్వర్ణాలు, 2 రజతాలు), హాకీలో 2 రజతాలు, వెయిట్‌లిఫ్టింగ్‌లో ఒక బంగారు పతకం అంటే 7 పతకాలు గెలిచారు. సగానికి మించి పతకాలు సాధించిన క్రీడాంశాలు సెనెగల్‌లో లేకపోవడం భారత క్రీడాకారులకు గుండెకోతను మిగిల్చనుంది. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన మను భాకర్ యూత్ ఒలింపిక్స్‌లో స్వర్ణం, రజతం నెగ్గింది. ఇటీవల లూసానేలో సమావేశమైన ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు 25 క్రీడాంశాలకే పరిమితం చేసింది. 15 ఏళ్ల నుంచి 18 ఏళ్ల లోపు వయసున్న క్రీడాకారులు పాల్గొనే సెనెగల్ యూత్ ఒలింపిక్స్ నిజానికి 2022లోనే జరగాల్సి ఉంది. అయితే కరోనా, టోక్యో ఒలింపిక్స్ వాయిదాతో నాలుగేళ్ల తర్వాత నిర్వహించనున్నారు.

గాజాలో ఆకలి కేకలు



ఇజ్రాయెల్ దిగ్బంధంలో ఉన్న గాజాలో పాలస్తీనియన్లు పడుతున్న అంతులేని అగచాట్లకు నిదర్శనం ఈ ఫొటోలు. కనీసం ఆహారం సైతం దొరక్క వాళ్లు అలమటిస్తున్నారు. శుక్రవారం ఖాన్‌యూనిస్‌లోని శరణార్థి శిబిరం సమీపంలోని ఉచిత ఆహార పంపిణీ కేంద్రం వద్ద పాలస్తీనా మహిళలు, బాలికలు ఆహారం కోసం ఇలా పోటీ పడ్డారు. వారి దురవస్థ అందరినీ కంటతడి పెట్టిస్తోంది. ఇజ్రాయెల్ వైమానిక దాడుల తీవ్రత నేపథ్యంలో గాజాకు ఆహార పంపిణీని తాత్కాలికంగా నిలిపేస్తున్నట్టు ఐరాస సహాయ సంస్థలు ఇటీవలే ప్రకటించడం తెలిసిందే. దాంతో గాజావాసుల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడింది. యుద్ధ తీవ్రత నేపథ్యంలో చాలాకాలంగా వారంతా ఐరాస సాయంపైనే ఆధారపడి బతుకీడుస్తూ వస్తున్నారు. దాంతో గాజాలో ఆకలి కేకలు మిన్నంటడం ఖాయమంటూ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇంతటి కారుచీకట్లలోనూ ఒక కాంతిరేఖ మిణుకుమంటోంది. ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు మళ్లీ మొదలైనట్టు హమాస్ ప్రతినిధి బస్సెమ్ నయీమ్ తాజాగా చెప్పారు. పరస్పరం బందీల విడుదలతో 14 నెలల పై చిలుకు యుద్ధానికి త్వరలోనే ముగింపు వస్తుందని ఆశిస్తున్నట్టు వివరించారు.



దక్షిణ కొరియాలో తాజాగా ఎమర్జెన్సీ విధింపు తీవ్ర దుమారానికే దారితీసింది. విపక్షాల్లోని ఉత్తర కొరియా అనుకూల దేశద్రోహ శక్తుల ఏరివేత కోసమంటూ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ తీసుకున్న నిర్ణయం దేశమంతటా అలజడి రేపింది. విపక్షాలతో పాటు సొంత పార్టీ నుంచీ దీనిపై తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. విపక్షాలన్నీ కలిసి కొన్ని గంటల్లోనే పార్లమెంటు ఓటింగ్ ద్వారా మార్షల్ లాను ఎత్తేశాయి. దేశంపై సైనిక పాలనను రుద్దజూశారంటూ విపక్ష డెమొక్రటిక్ పార్టీ యూన్‌పై అభిశంసన తీర్మానమూ ప్రవేశపెట్టింది. దాంతో దేశం పెను రాజకీయ సంక్షోభంలో పడింది. అభిశంసనలు, జైలు, హత్యల వంటి మరకలు దక్షిణ కొరియా అధ్యక్ష చరిత్రలో పరిపాటే. నిజానికి ఆ దేశ రాజకీయ చరిత్రంతా తిరుగుబాట్లమయమే!

అభిశంసనలు.. ఆత్మహత్య... జైలు శిక్షలు!

దక్షిణ కొరియా అధ్యక్షుల వివాదాస్పద చరిత్ర

విద్యార్థుల తిరుగుబాటు

దక్షిణ కొరియా తొలి అధ్యక్షుడు సింగ్మన్ రీ 1960లో విద్యార్థుల భారీ తిరుగుబాటు దెబ్బకు రాజీనామా చేసి తప్పుకోవాల్సి వచ్చింది. ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడటంతో యువతలో ఆయనపై ఆగ్రహం పెల్లుబుకింది. దిగిపోవాల్సిందేనంటూ డిమాండ్లు వెల్లువెత్తాయి. రాజీనామా అనంతరం రీ దేశ బహిష్కరణకు గురయ్యారు. హవాయికి వెళ్లిపోయి 1965లో మరణించేదాకా అక్కడే గడపాల్సి వచ్చింది.

సైనిక తిరుగుబాటు

మరో అధ్యక్షుడు యున్ పో సన్ 1961లో సైనికాధికారి పార్క్ చుంగ్ హీ సైనిక తిరుగుబాటు వల్ల పదవీచ్యుతుడయ్యాడు. అయినా యున్‌కు కొంతకాలం పదవిలో కొనసాగేందుకు పార్క్ అనుమతించినా నెమ్మదిగా ప్రభుత్వాన్ని తన అ. దీనంలోకి తెచ్చుకున్నారు. తరవాత 1963 ఎన్నికల్లో నెగ్గి అధికారాన్ని యున్ స్థానంలో అధ్యక్షుడయ్యారు.

రాజద్రోహం, జైలు

గ్వాంగ్జు తిరుగుబాటును క్రూరంగా అణచివేసిన చున్ డూ హ్వాన్ 1987లో పదవి నుంచి వైదొలిగారు. భారీ నిరసనల ఫలితంగా అధ్యక్ష పదవి నుంచి తప్పుకొన్నారు. కొరియా యుద్ధ సమయంలో తన అనుచరుడు రోహ్ టే వూకు అధికారం అప్పగించారు. అనంతరం అవినీతి, హింసతో దేశం కుదేలైంది. దాంతో తిరుగుబాటు ఇతర నేరాల కింద చున్, రోహ్ రాజద్రోహం అభియోగాలను ఎదుర్కొన్నారు. చున్‌కు మరణశిక్ష విధించానా తరవాత జీవిత ఖైదుగా మార్చారు. రోహ్‌కు ఇరవై రెండున్నరేళ్ల జైలు శిక్ష విధించారు. రెండేళ్ల జైలు శిక్ష నంతరం ఇద్దరికీ 1998లో క్షమాభిక్ష లభించింది.

అవినీతి, ఆత్మహత్య

2003 నుంచి 2008 వరకు దక్షిణ కొరియా అధ్యక్షుడిగా ఉన్న రో మూ హ్యూన్ అవినీతి ఆరోపణల నేపథ్యంలో 2009లో కొండపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. సంపన్న షూ తయారీదారు కంపెనీ నుంచి లంచం తీసుకున్నారనే అభియోగాలు విచారణలో ఉండగానే జీవితాన్ని అంతం చేసుకున్నారు.

15 ఏళ్ల జైలు శిక్ష

2008 నుంచి 2013 దాకా అధ్యక్షునిగా ఉన్న లీ మ్యూంగ్ బాక్‌కు అవినీతి కేసులో జైలు శిక్ష పడింది. పన్ను ఎగవేత కేసులో దోషిగా తేలిన సామ్‌సంగ్ సంస్థ చైర్మన్ నుంచి లంచాలు తీసుకున్నట్టు రుజువైంది. దాంతో 2018లో ఆయనకు 15 ఏళ్ల జైలు శిక్ష పడింది. కానీ 2022 డిసెంబర్‌లో ప్రస్తుత అధ్యక్షుడు యూన్ ఆయనకు క్షమాభిక్ష ప్రసాదించారు!

అధ్యక్షురాలికి అభిశంసన, జైలు

దక్షిణ కొరియా తొలి అధ్యక్షురాలు పార్క్ గ్యూన్ హై 2016లో అభిశంసన ఎదుర్కొన్నారు. తరవాత జైలు శిక్ష అనుభవించారు. ఆమె మాజీ నియంత పార్క్ చుంగ్ హీ కుమార్తె. 2013 నుంచి పదవిలో ఉన్నారు. సామ్‌సంగ్ వంటి సంస్థల నుంచి భారీగా లంచాలు తీసుకున్నట్టు ఆరోపణలు ఎదుర్కొన్నారు. రహస్య పత్రాలను లీకేజీ, తనను విమర్శించే కళాకారులను బ్లాక్‌లిస్టులో పెట్టడం, వ్యతిరేకించిన అధికారులను తొలగించడం వంటి ఆరోపణలూ ఉన్నాయి. దాంతో 2017లో పార్క్ అభిశంసనకు గురయ్యారు. అభియోగాలు నిర్ధారణవడంతో 2021లో 20 ఏళ్ల జైలు శిక్ష, భారీ జరిమానా పడ్డాయి. కానీ అధ్యక్షుడు మూన్ జే ఇన్ ఆమెకు క్షమాభిక్ష పెట్టారు. ఆ సమయంలో సియోల్ ప్రాసిక్యూటర్‌గా ఉన్నది ప్రస్తుత అధ్యక్షుడు యూన్ కావడం విశేషం. పార్క్ తొలగింపు, జైలు శిక్ష విధింపులో ఆయనదే కీలక పాత్ర.

– సాక్షి, నేషనల్ డెస్క్

రూమ్మేట్‌తో కిచెన్‌లో గొడవ... కెనడాలో భారత విద్యార్థి మృతి

ఒంటారియో: వంటగదిలో రూమ్‌మేట్‌తో ఘర్షణ నిండు ప్రాణాన్ని బలిగొంది. గురాసిస్ సింగ్ అనే 22 ఏళ్ల భారతీయ విద్యార్థి కత్తితో పోటుకు గురై దుర్మరణం పాలయ్యాడు. పంజాబ్‌కు చెందిన అతడు కెనడాలో ఒంటారియోలోని లాంబ్టన్ కాలేజీలో చదువుతున్నాడు. పరస్పరం గొడవ పడటంతో గురాసిస్‌ను నిందితుడు క్రాస్లీ హంటర్ (36) కత్తితో పొడిచేశాడు. 2024 డిసెంబర్ 1 తెల్లవారు జామున క్వీన్స్ స్ట్రీట్‌లోని నివాసంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. హంటర్‌పై హత్యా నేరం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఘటన వెనక జాతి విద్వేష ఉద్దేశాలేవీ వెల్లడవలేదని చెప్పారు. విద్యార్థి మరణంపై లాంబ్టన్ కాలేజ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతదేహాన్ని స్వదేశానికి పంపే విషయంలో గురాసిస్ కుటుంబంతో కలిసి పని చేస్తున్నట్టు తెలిపింది.

అన్ని పంటలకు కనీస మద్దతు ధర

రాజ్యసభలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వెల్లడి

న్యూఢిల్లీ: అన్ని పంటలకు తమ ప్రభుత్వం కనీస మద్దతు ధర(ఎంఎస్పీ) కల్పించబోతోందని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ చెప్పారు. ఆయన శుక్రవారం రాజ్యసభలో కనీస మద్దతు ధరపై సభ్యులు అడిగిన అనుబంధ ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఎంఎస్పీతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఇది మోదీ గ్యారంటీ అని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఉన్నప్పుడు రైతులను ఏనాడూ ఆదుకోలేదని, ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయలేదని ఆక్షేపించారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులను నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు రక్తకన్నీరు కారుస్తోందని విమర్శించారు. ఉత్పత్తి వ్యయంపై 50 శాతం కలిపి పంటల కనీస మద్దతు ధర నిర్ణయిస్తామని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని తేల్చిచెప్పారు. తమ దృష్టిలో అన్నదాతకు సేవ చేయడం అంటే భగవంతుడికి పూజ చేయడమేనని శివరాజ్‌సింగ్ చౌహాన్ వ్యాఖ్యానించారు. రైతుల ఆదాయం పెంచి, వారు రుణాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి లేకుండా చేయడమే లక్ష్యమని వివరించారు.

యూపీ రహదారులు రక్తసిక్తం

మూడు ప్రమాదాల్లో 20 మంది మృతి.. 39 మందికి గాయాలు

పిలిభిత్/చిత్రకూట్/కన్నౌజ్: ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్, చిత్రకూట్, కన్నౌ జిల్లాల్లో శుక్రవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో 20 మంది మృతి చెందగా మరో 39 మంది గాయపడ్డారు. పిలిభిత్‌లోని నియోరా పోలీస్ స్టేషన్ పరిధిలో పిలిభిత్–తనక్‌పూర్ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, ముగ్గురు తీవ్రంగా, మరో ఇద్దరు స్వల్పంగా క్షతగాత్రులయ్యారు. ముందున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో అదుపు తప్పిన కారు రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టి, పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. ప్రమాద తీవ్రతకు నేలకొరిగిన చెట్టులో ఇరుక్కున్న కారును, అందులోని వారిని బుల్‌డోజర్ సాయంతో బయటకు తీసేందుకు గంటన్నర సమయం పట్టిందని ఎస్పీ అవినాశ్ కుమార్ పాండే చెప్పారు. పిలిభిత్‌లోని చందోయ్ గ్రామంలో ఓ వేడుకకు హాజరై వస్తున్న బాధితులందరూ ఉత్తరాఖండ్‌లోని ఖటిమా జిల్లా జమౌర్ గ్రామానికి చెందిన వారని తెలిపారు. అలాగే, చిత్రకూట్ జిల్లా రాయ్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఆరుగురు చనిపోగా, మరో ఐదుగురు గాయపడ్డారు. ప్రయాగ్‌రాజ్ నుంచి వస్తున్న బొలెరో వాహనం రాయ్‌పురా నుంచి వస్తున్న ట్రక్కును ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుందని ఎస్పీ అరుణ్ కుమార్ సింగ్ తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లా గుల్‌గంజ్‌కు చెందిన వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో తమ కుటుంబసభ్యుడి అంతిమ సంస్కారాలు పూర్తి చేసుకుని వస్తుండగా డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో దుర్ఘటన చోటుచేసుకుందని చెప్పారు. మరో ఘటన..లక్నో నుంచి ఢిల్లీ వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు కన్నౌజ్ జిల్లాలో ఆగ్రా–లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపైని మొక్కలకు నీళ్లు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో బస్సులోని 8 మంది ప్రయాణికులు చనిపోగా 19 మంది గాయపడ్డారు.

వందేళ్లకు కల నిజమైంది

ఏడు ఖండాలూ చుట్టేసిన బామ్మ



‘బాబుమొషాయ్! జిందగీ బడీ హోనీ చాహియే, లంబీ నహీ’ ఆనంద్ సినిమాలో ఫేమస్ డైలాగిది. ఎంతకాలం బతికామన్నది కాదు, ఎన్ని జ్ఞాపకాలు మిగుల్చుకునేలా జీవితాన్ని ఆస్వాదించామన్నదే ముఖ్యమని సారాంశం. 102 ఏళ్ల ఈ బామ్మ ఎక్కువ కాలం బతకడమే గాక తనకు నచ్చినట్టుగా జీవిస్తూ అరుదైన జ్ఞాపకాలను ఎంచక్కా పోగేసుకుంటోంది. ‘ఏజ్ ఈజ్ జస్ట్ నంబర్’ అంటూ ఏడు ఖండాలను చూడాలన్న తన కలను నిజం చేసుకున్నారు. ఆ సాహస మహిళ అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన డొరోతీ స్మిత్. ఇటీవలే ఆస్ట్రేలియా వెళ్లడం ద్వారా తన ట్రావెల్ బకెట్ లిస్టులో చివరి కోరి కనూ తీర్చేసుకున్నారు.

కాలిఫోర్నియాలో రెడ్‌వుడ్స్ రిటైర్మెంట్ విలేజ్‌లో ఉంటున్న స్మిత్‌కు ప్రపంచమంతా తిరగాలన్నది చిరకాల కల. ఆ క్రమంలో ఆరు ఖండాలూ తిరిగినా ఆస్ట్రేలియా మాత్రం అలా పెండింగ్‌లోనే ఉండిపోయింది. ఓ కథ కోసం స్మిత్ వద్దకు వెళ్లిన అమ్మర్ కిండిల్, స్టఫాన్ టేలర్ అనే యూట్యూబర్లకు ఈ విషయం తెలిసింది. ఆమె కలను ఎలాగైనా పూర్తి చేయాలనుకున్నారు. డెస్టినేషన్ ఎస్ఎస్‌డబ్ల్యూ అనే ట్రావెల్ సంస్థ, క్వాంటాస్ విమానయాన సంస్థలతో కలిసి స్మిత్ ఆస్ట్రేలియా పర్యటన కోసం తమ వంతు సాయం అందించారు. ఇంకేముంది! స్మిత్ ఎంచక్కా తన కూతురు అడ్రియన్‌తో కలిసి ఇటీవలే ఆస్ట్రేలియా సందర్శించారు. క్వాంటాస్ విమానంలో దర్జాగా బిజినెస్ క్లాస్‌లో ప్రయాణించడం విశేషం! అంతేకాదు, టేకాఫ్‌కు ముందు పైలట్లు, సిబ్బంది ఆమెను సన్మానించారు కూడా. ఆస్ట్రేలియాలో సిడ్నీ హార్బర్ క్రూయిజ్‌ను ఆస్వాదించారు. వైల్డ్ లైఫ్ జూను సందర్శించారు. ఒపేరా హౌస్, బొండీ బీచ్ వంటి ఐకానిక్ ప్రదేశాలన్నీ కలియదిరిగారు. ‘‘వయసైపోయింది, ఇప్పుడేం చేస్తాం లెమ్మని ఎప్పుడూ అనుకోకండి. ప్రయత్నిస్తే అద్భుతాలు చేయగలరు, చూడగలరు. కదలకుండా కూర్చుంటే తుప్పు పట్టిపోతారు. అదే తిరిగితే అలసిపోతారు. నేను అలా అలసిపోవాలనే నిర్ణయించుకున్నాను’’ అని సీనియర్ సిటిజన్లకు హితవు కూడా చెప్పారు స్మిత్. అంతేకాదు, ‘‘ఆస్ట్రేలియా అద్భుతంగా ఉంది. అక్కడి ప్రజలు ఆకర్షణీయంగా ఉన్నారు. ఆహారం, వాతావరణం అన్నీ బాగున్నాయి’’ అంటూ కితాబిచ్చారు కూడా.

– సాక్షి, నేషనల్ డెస్క్

సంబిత్ పాత్రపై కాంగ్రెస్ హక్కుల తీర్మానం

- రాహుల్‌ను ‘ద్రోహి’అంటూ దూషించడంపై చర్చకు డిమాండ్
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు నోటీసిచ్చిన కాంగ్రెస్ ఎంపీ హిబి ఈడెన్

న్యూఢిల్లీ: ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ద్రోహి అంటూ తీవ్రంగా దూషించిన బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రపై కాంగ్రెస్ హక్కుల తీర్మానం నోటిసిచ్చింది. పరువు నష్టం కలిగించే, అన్‌పార్లమెంటరీ పదాలను వాడటం ద్వారా రాజ్యాంగ నిబంధనలను సైతం సంబిత్ పాత్ర ఉల్లంఘించారని ఎర్నాకులం కాంగ్రెస్ ఎంపీ హిబి ఈడెన్ తన లేఖలోపేర్కొన్నారు. ‘ప్రతిపక్ష నాయకుడి పదవి రాజ్యాంగ బద్ధమైనది, అటువంటి పదవికి పార్లమెంటరీ గౌరవం అవసరముంది. అయితే, సంబిత్ పాత్ర పూర్తిగా పరువు నష్టం కలిగించే, అన్‌పార్లమెంటరీ పదాలను ఉపయోగించడం ద్వారా రాజ్యాంగాన్ని ధిక్కరించారు. మీ దృష్టికి తీసుకువచ్చేందుకు దీనిపై హక్కుల తీర్మానం తేవాలనుకుంటున్నాను. తగు చర్యలను తక్షణమే తీసుకోవాలి’అని కోరారు. గురువారం బీజేపీ ఎంపీలు కె.లక్ష్మణ్, సంబిత్ పాత్ర మీడియాతో మాట్లాడుతూ ఫ్రాన్సుకు చెందిన ‘మీడియాపార్ట్’లో ప్రచురితమైన కథనాన్ని ఉదహరిస్తూ రాహుల్‌పై పలు ఆరోపణలు చేశారు. బిలియనీర్ జార్జి సొరోస్, అమెరికాకు చెందిన కొన్ని సంస్థలు, ఆర్గనైజ్డ్ క్రైం అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు అనే దర్యాప్తు ఏజెన్సీ, రాహుల్ గాంధీ కలిసి కుమ్మక్కై దేశాన్ని అస్థిర పాల్జేసేందుకు, ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి రగిల్చేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. రాహుల్‌ను మించిన ద్రోహి మరొకరు లేరనేందుకు ఎలాంటి సందేహం లేదని పాత్ర ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

నా సోదరుడికి దేశమే అత్యున్నతం: ప్రియాంక

బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ద్రోహి అంటూ దూషించడంపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా స్పందించారు. తన సోదరుడిని చూసి గర్విస్తున్నానని, ఆయనకు దేశమే అత్యున్నతమని, అంతకుమించి మరేదీ లేదని స్పష్టం చేశారు. మాజీ ప్రధానులను ద్రోహులంటూ దూషించిన వారి నుంచి ఇలాంటి ఆరోపణలు రావడం కొత్తేమీ కాదన్నారు. ‘దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని 13 ఏళ్లపాటు కారాగారంలో గడిపిన జవహర్‌లాల్ నెహ్రూను, పాకిస్తాన్‌ను రెండు ముక్కలు చేసిన ఇందిరాగాంధీని, దేశం కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీని కూడా వీరే ద్రోహులంటూ నిందించారని మీడియాతో ఆమె పేర్కొన్నారు.


లోక్‌సభలో సీట్ల కేటాయింపులో వివక్ష

కేంద్ర ప్రభుత్వంపై విపక్షాల అసంతృప్తి

న్యూఢిల్లీ: లోక్‌సభలో సీట్ల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. సీట్ల ఆరేంజ్‌మెంట్ విషయంలో నిబంధనలు పాటించలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న ఫార్ములా ప్రకారం.. ప్రతి 28 మంది ఎంపీలకుగాను ముందు వరుసలో ఒక సీటు కేటాయించాలి. అంటే 28 మంది ఎంపీలున్న పార్టీకి ముందు వరుసలో ఒక స్థానం లభిస్తుంది. 56 మంది ఎంపీలుంటే రెండు స్థానాలు దక్కుతాయి. ఎన్డీయే ప్రభుత్వం ఈ ఫార్ములాను పక్కనపెట్టి, తమకు అన్యాయం చేస్తోందని కాంగ్రెస్, సమాజ్‌వాదీ తదితర పార్టీలు విమర్శిస్తున్నాయి. శీతాకాల సమావేశాల ముందు లోక్‌సభ సీట్ల కేటాయింపులో మార్పులు చేశారు. టీఎంసీ మినహా విపక్ష ఇండియా కూటమికి మొత్తం 7 సీట్లు ముందు వరుసలో కేటాయించారు. ఇందులో ఒక సీటు ప్రతిపక్ష నేతకు, కాంగ్రెస్‌కు మూడు, సమాజ్‌వాదీ పార్టీకి రెండు, డీఎంకేకు ఒక సీట్లు దక్కాల్సి ఉంది. అయితే, సమాజ్‌వాదీ పార్టీకి ఒక స్థానమే ఇచ్చారు. ఆ పార్టీ ఎంపీ అవదేశ్ ప్రసాద్‌ను రెండో వరుసకు పంపించారు. ఈ విషయాన్ని స్పీకర్ ఓం బిర్లాకు దృష్టి తీసుకెళ్లామని ఎంపీ డింపుల్ యాదవ్ చెప్పారు. వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీకి లోక్‌సభలో నాలుగో వరుసలో స్థానం దక్కింది. రాహుల్ గాంధీకి 498వ నెంబర్ సీటు కేటాయించారు.

వచ్చే ఏడాది సునీతా విలియమ్స్ స్పేస్‌వాక్!

వాషింగ్టన్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉన్న భారత–అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ వచ్చే ఏడాది స్పేస్‌వాక్ చేయబోతున్నారు. ఇందుకోసం సన్నాహాలు ప్రారంభించారు. ఐఎస్ఎస్ నుంచి బయటకు వచ్చి కాసేపు అంతరిక్షంలో విహరించడమే స్పేస్‌వాక్. సునీతా విలియమ్స్ మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్‌తో కలిసి ఈ ఏడాది జూన్‌లో బోయింగ్ సంస్థకు చెందిన స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. వారం తర్వాత వెనక్కి రావాల్సి ఉండగా, సాంకేతిక సమస్యలతో సాధ్యపడలేదు.



వీల్‌చైర్‌లో వ్యక్తి.. బంగీ జంప్‌లో రికార్డు!

రిషికేశ్: వీల్‌చైర్‌కే పరిమితమైనే ఓ వ్యక్తి ఏకంగా 117 మీటర్ల ఎత్తు బంగీ జంప్ చేశారు. దేశంలో ఇంతకుముందెవ్వరూ ఇంత ఎత్తైన బంగీ జంప్ చేయలేదు. రికార్డు సృష్టించిన ఈ ఫీట్ ఇటీవల ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌లో చోటుచేసుకుంది. సంబంధిత వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. అభయ్ డోగ్రా అనే వ్యక్తి పక్షవాతానికి గురై వీల్‌చైర్‌కే పరిమితమయ్యారు. అయితే, బంగీ జంప్‌లో రికార్డు సృష్టించాలన్నది ఆయన కల. ఇందుకోసం ఆయన పక్కాగా ఏర్పాట్లు చేసుకున్నారు. క్రేన్ నుంచి కిందికి దూకే సమయంలో అభయ్‌తోపాటు ఆయన వీల్‌చైర్ సరిగ్గా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు సహాయకులు. ఇంకేముంది? అందరూ ఊపిరి బిగపట్టి చూస్తుండగా 117 మీటర్ల ఎత్తు నుంచి ఆ ఫీట్‌కు అభయ్ సిద్ధమయ్యారు. సహాయకులు వీల్‌చైర్ సహా ఆయన్ను అంతు ఎత్తు నుంచి వదిలేసినా గాల్లో తేలుతూ అభయ్ ఉల్లాసంగా కనిపించారు. అనుకున్నది సాధించినందుకు ఆనందంతో ఉప్పొంగిపోయారు. అయితే, ఈ సాహస కృత్యంపై సామాజిక మాధ్యమాల్లో మిశ్రమ స్పందన కనిపించింది. ఏవో కొన్ని వ్యూస్ కోసం ఇంతటి రిస్క్ తీసుకోవాల్సిన అవసరముందా అని కొందరు ప్రశ్నించగా, దయచేసి ఇలాంటి ఫీట్లను ప్రమోట్ చేయకండని మరొకరు పేర్కొన్నారు. అయితే, అవకాశమొస్తే ఇలాంటివి మరికొన్ని చేయాలనుకుంటున్నానని అభయ్ అంటున్నారు.

రైతుల డిమాండ్లను అంగీకరించాలి: రాహుల్

న్యూఢిల్లీ: ఢిల్లీ వైపు వస్తున్న రైతులను అడ్డుకునేందుకు శంభు వద్ద పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించడాన్ని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఖండించారు. మద్దతు ధరకు చట్టబద్ధత సహా రైతుల డిమాండ్లన్నిటినీ వెంటనే అంగీకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దేశంలో గంటకో రైతు బలవన్మరణానికి పాల్పడుతున్నారంటే, వారి సమస్యలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని రాహుల్ గాంధీ ‘ఎక్స్’లో పేర్కొన్నారు.

అవకాశం వస్తే ఇండియా కూటమికి నేతృత్వం: మమత

కోల్‌కతా: విపక్ష ఇండియా కూటమి పనితీరుపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పరోక్షంగా అసంతృప్తిని వ్యక్తం చేశారు. అవకాశం వస్తే తాను ఇండియా కూటమికి నేతృత్వం వహిస్తానని తెలిపారు. బెంగాల్ సీఎంగా, విపక్ష కూటమి నాయకురాలిగా రెండు పాత్రలకు న్యాయం చేయగలనని అన్నారు. ‘ఇండియా కూటమిని నేనే స్థాపించా. దాన్ని నడిపించాల్సిన బాధ్యత నాయకత్వ స్థానంలో ఉన్నవారిపై ఉంటుంది. వారలా చేయలేకపోతే నేనేం చేయగలను? ప్రతీ ఒక్కరిని కలుపుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉంది’ అని మమత అన్నారు. బెంగాలీ న్యూస్ ఛానల్ న్యూస్ 18 బంగ్లాకు మమత ఇంటర్వ్యూ ఇచ్చారు.

గాల్లో బాలిక ప్రాణాలు



150 అడుగుల ఎత్తులో 30 సెకన్లు వేలాడింది

- జెయింట్ వీల్ నుంచి పట్టు తప్పిన వైనం
- బార్‌ను పట్టుకుని ప్రాణాలు దక్కించుకుంది

లఖింపూర్‌ఖేరీ (యూపీ): ఆ 14 ఏళ్ల బాలిక జాతరకు వెళ్లింది. సరదాగా జెయింట్ వీల్ ఎక్కింది. అది కాస్తా పూర్తిగా పైకి వెళ్లాక 150 అడుగుల ఎత్తులో ఉండగా బాలిక ఉన్నట్టుండి అదుపు కోల్పోయింది. తన కేబిన్ నుంచి విసురుగా బయటికొచ్చింది. అయినా వీల్ ఆడకుండా తిరుగుతూనే ఉంది. దాంతో కిందనుంచి చూస్తున్న వాళ్లంతా హాహాకారాలు చేశారు. అంతటి విపత్కర పరిస్థితిలోనూ పాప చురుగ్గా స్పందించింది. క్యాబిన్ కిందివైపున్న మెటల్‌బార్‌ను గట్టిగా పట్టుకుంది. దాన్ని కరుచుకుని కదలకుండా ఉండిపోయింది. ఆపరేటర్లు హుటాహుటిన జెయింట్ వీల్‌ను ఆపేశారు. అది నెమ్మదిగా తిరుగుతుండగా బాలికను కిందకు వచ్చింది. వెంటనే తనను అందుకుని దించి కాపాడారు. 30 సెకన్లకు పైగా బాలిక మెటల్‌బార్‌ను పట్టుకుని గాల్లోనే వేలాడింది. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ సమీపంలో జరిగిన ఈ ఘటన తాలూకు వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. భద్రతా ప్రమాణాలు పాటించలేదంటూ అధికారులు జెయింట్ వీల్‌ను సీల్ చేశారు.

సొంత పార్టీ చీఫ్ అరెస్టుకు యూన్ ఆదేశం

దక్షిణ కొరియా అధ్యక్షుడి అభిశంసనపై నేడు ఓటింగ్!

సియోల్: అభిశంసన ముప్పు ఎదుర్కొంటున్న దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ నష్టనివారణ చర్యలు ప్రారంభించారు. మంగళవారం రాత్రి మార్షల్ లా విధించినట్లు ప్రకటించిన సొంత పార్టీ అధినేత హన్ డాంగ్–హూన్‌ను అరెస్టు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ నాయకుడు లీ జే–యూంగ్‌ను సైతం అరెస్టు చేయాలని పేర్కొన్నారు. మార్షల్ లా విధించి, వీధుల్లో సైన్యాన్ని మోహరించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు యూన్ సుక్ యోల్‌పై పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాయి. దీనిపై శనివారం ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. మూడింట రెండొంతుల మంది ఎంపీలు తీర్మానానికి అనుకూలంగా ఓటు వేస్తే అధ్యక్ష పదవి నుంచి యూన్ సుక్ యోల్ దిగిపోక తప్పదు. 300 సీట్లున్న పార్లమెంట్‌లో ప్రస్తుతం ప్రతిపక్షాలకు మెజార్టీ ఉంది. తీర్మానం నెగ్గాలంటే అధికార పార్టీకి చెందిన ఎంపీల్లో కనీసం ఎనిమిది మంది దానికి అనుకూలంగా ఓటువేయాలి. అది సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

సాక్షి ప్లస్
శనివారం। 7-12-2024

ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి గ్రంథ రచయిత ఖండవల్లి

ఖండవల్లి లక్ష్మీ రంజనం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పనిచేసిన సమయంలో తెలుగు భాషకు, తెలుగు ప్రజలకు విశేష సేవలందించారు. ఆయన ఆచార్య పదవిని చేపట్టాక ఎంఏలో సంస్కృతం లేదా ద్రావిడ భాషల్లో ఏదో ఒకటి తప్పక ఎంచుకునేలా ఏర్పాటు చేశారు. తెలుగును ద్వితీయ భాష చేయడం కోసం అకడమిక్ కౌన్సిల్‌తో పోరాడి గెలుపొందారు. విద్యార్థుల్లో తెలుగంటే మన మాతృభాష అనే భావన కలిగేలా చేశారు. విద్యార్థులతో అనేక మంది కవులపై చర్చాగోష్ఠులు నిర్వహించి, వారిలో పరిశోధనాభిరుచి పెంపొందించడానికి ప్రయత్నించారు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర

తెలంగాణ వైతాళికులు

ఖండవల్లి లక్ష్మీ రంజనం

మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పరిపాలనా కాలంలో తెలుగు సాహిత్యానికి, చరిత్రకు ఖండవల్లి లక్ష్మీ రంజనం విశేష సేవ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా పనిచేసిన ఆయన విద్యార్థుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. కర్తవ్య నిర్వహణలో అనునిత్యం అప్రమత్తంగా ఉండేవారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు భాషకు ప్రముఖ స్థానం లభించడం వెనుక ఆయన విశేష కృషి దాగి ఉంది. ఖండవల్లి లక్ష్మీ రంజనం 1908లో తూర్పు గోదావరి జిల్లా కొత్తపేట తాలూకాలోని బెల్లంపూడిలో జన్మించారు. బెల్లంపూడి సమీపంలోని ఊడుమూడులో ప్రాథమిక విద్య, అమలాపురంలో రెండో ఫారంను అభ్యసించారు. ఆయన తండ్రయిన సూర్యనారాయణ శాస్త్రి వరంగల్ మట్టెవాడలోని త్రిలింగాంధ్రాయుర్వేద కళాశాలలో సంస్కృత పండితుడిగా పని చేసేవారు. దీంతో లక్ష్మీ రంజనం కూడా వరంగల్ వచ్చి హన్మకొండ హైస్కూల్‌లో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. 1924లో నిజాం కళాశాలలో బీఏ సంస్కృతం చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. తర్వాత సిటీ కాలేజీలో ఇంగ్లిష్ టీచర్‌గా కొంత కాలం పనిచేశారు. 1936లో ఎంఏ(తెలుగు-సంస్కృతం)లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు లెక్చరర్‌గా చేరారు. రాయప్రోలు సుబ్బారావు పదవీ విరమణ చేశాక ఆచార్య (ప్రొఫెసర్) పీఠాన్ని అధిష్ఠించారు.

ఖండవల్లికి విద్యార్థి దశ నుంచే ఆదిరాజు వీరభద్రరావు లాంటి పరిశోధకులతో, గోలకొండ పత్రికా సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి లాంటి ప్రజా సాహిత్య సేవకులతో, లోకనంది నారాయణ లాంటి సాహిత్య పోషకులతో పరిచయం ఏర్పడింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రెక్టార్ కిషన్ చంద్ లక్ష్మీ రంజనానికి సహాయ సహకారాలు అందజేశారు. కొమర్రాజు లక్ష్మణరాయ గ్రంథాలు ఖండవల్లిని విశేషంగా ప్రభావితం చేశాయి. ఖండవల్లి 1936 నుంచే సాహిత్యసేవ ప్రారంభించారు. 'తెలుగుదుక్కి' శీర్షికతో వ్యాసాలు ప్రచురించారు. త్రివేణి లాంటి ఆంగ్ల పత్రికల్లో ఆధునిక కవిత్వం గురించి అనేక వ్యాసాలు రాశారు.

హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం కార్యదర్శిగా రెండేళ్లపాటు పనిచేశారు. పుస్తకాల సేకరణ, చందాల కోసం తెలంగాణ అంతటా పర్యటించారు. వర్ధంతులు, జయంతులు ఎన్నో జరిపారు. ఆంధ్ర సారస్వత పరిషత్ సభ్యులుగా పనిచేసి దాని విస్తరణకు విశేష కృషి చేశారు. 'నిజాం రాష్ట్ర గ్రంథాలయ సంఘం' కార్యదర్శిగా కూడా పనిచేశారు. కొమర్రాజు వదిలి పెట్టిన 'విజ్ఞాన సర్వస్వం' పూర్తి చేయాలనే ఉద్దేశంతో కొందరు మిత్రులతో కలిసి గ్రంథావలోకనం, విషయ సేకరణ ప్రారంభించారు. 1940ల్లో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో విద్యుద్దీపాలు లేనందున ఆముదం దీపాల వెలుతురులోనే తన కృషిని కొనసాగించారు. 1944 నాటికి 'విజ్ఞాన సర్వస్వం' పూర్తి చేయాలని భావించారు. ఇందుకోసం 'మహారాష్ట్ర జ్ఞాన కోశ్'ని ఆధారంగా తీసుకున్నారు. నాలుగైదు సంపుటాల విషయ సేకరణ చేశారు.

ముద్రణకు సిద్ధమైన ఆ సంపుటాలు చోరీకి గురికావడం వల్ల విజ్ఞాన సర్వస్వాన్ని ముద్రించడం సాధ్యపడలేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సంస్కృతి గురించి పాఠాలు బోధించారు. దానికోసం చేసిన అధ్యయన ఫలితంగానే ఆంధ్రుల చరిత్ర -సంస్కృతి, ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం లాంటి గొప్ప గ్రంథాలను రచించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 'విజ్ఞాన సర్వస్వం' ప్రచురణ కోసం ప్రభుత్వం ద్వారా తిరిగి ప్రయత్నించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ వ్యవస్థాపకులు బిరుదు వెంకట శేషయ్య, లోకనంది నారాయణ అంతకు ముందే ప్రయత్నించి విఫలమయ్యారు. మిత్రులు, అభిమానులు సహాయం చేస్తారనే నమ్మకంతో 1953లో బేతన భట్ల విశ్వనాథంతో కలిసి సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశ సమితి సంఘాన్ని స్థాపించారు. దీనికి మిమిడి పూడి వెంకట రంగయ్య చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సంఘం ద్వారా సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశం నాలుగు సంపుటాలను ప్రచురించారు.

ఖండవల్లి ఆంధ్ర రచయితల సంఘానికి అధ్యక్షులుగా పనిచేసి దాని తరఫున సిద్దేశ్వర చరిత్ర, ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధం, సంస్కృతంలో అహోబిల పండితీయం (ఆంధ్ర వ్యాఖ్యా సహితం) ప్రచురించారు. ఓరియంటల్ కాలేజీని స్థాపించి 1958లో బీఓఎల్, డీఓఎల్ లాంటి ప్రాచ్యపట్టాలను విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశారు. స్వామి వివేకానంద కమిటీ హైస్కూల్‌కు కార్యదర్శిగా పనిచేసి దాని భవనాన్ని నిర్మించారు. ఖండవల్లి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పనిచేసిన సమయంలో తెలుగు భాషకు, తెలుగు ప్రజలకు విశేష సేవలందించారు. ఆయన ఆచార్య పదవిని చేపట్టాక ఎంఏలో సంస్కృతం లేదా ద్రావిడ భాషల్లో ఏదో ఒకటి తప్పకుండా ఎంచుకునేలా ఏర్పాటు చేశారు. తెలుగును ద్వితీయ భాష చేయడం కోసం అకడమిక్ కౌన్సిల్‌తో పోరాడి విజయం సాధించారు. పీహెచ్‌డీని ప్రవేశపెట్టారు. విద్యార్థుల్లో తెలుగంటే మన మాతృభాష అనే భావన కలిగేలా చేశారు. విద్యార్థులతో అనేక మంది కవులపై చర్చాగోష్ఠులు నిర్వహించి, పరిశోధనాభిరుచి పెంపొందించేందుకు కృషి చేశారు. మహాభారతం, నాటకాలు, కవులపై సదస్సులు నిర్వహించి వాటిని గ్రంథ రూపంలో తెచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తరఫున ఆంధ్ర మహాభారతాన్ని పునర్ముద్రించారు. తెలంగాణ మాండలికాల అధ్యయనానికి పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆంధ్రదేశ చారిత్రక భూగోళం (ది హిస్టారికల్ జాగ్రఫీ ఆఫ్ ఆంధ్ర) రచనకు ప్రయత్నం చేశారు.

ఇల్లిందల సరస్వతీ దేవి

ఇల్లిందల సరస్వతీ దేవి తల్లిదండ్రులు కామరాజు వెంకట లక్ష్మమ్మ, వెంకటప్పయ్య. ఈమె తండ్రి వెంకటప్పయ్య 1928లో నందిగామ తహసీల్దార్‌గా పని చేశారు. అదే సంవత్సరంలో ఇల్లిందల సీతారామరావుతో పన్నెండేళ్ల వయస్సులో సరస్వతీ దేవికి వివాహం చేశారు. అప్పుడు ఆమె రెండో ఫారం చదువుతున్నారు. ఆమె హైదరాబాద్‌లోని స్టాన్లీ గర్ల్స్ హైస్కూల్‌లో మెట్రిక్యులేషన్ వరకు చదివారు. చిన్న వయస్సులోనే తల్లి కావడంతో పై చదువులు చదవలేకపోయారు. తీరిక వేళల్లో ట్రూ స్టోరీ మేగజీన్ లాంటి కథల పత్రికలను చదివి, జిజ్ఞాసతో వాటిని అధ్యయనం చేశారు. ఆమె భర్త సీతారామరావు ఎం.సి. చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విజ్ఞానశాస్త్ర ఉపన్యాసకులుగా పని చేసేవారు. ఆయన తన భార్యను ఎంతో ప్రోత్సహించారు. సరస్వతీ దేవి తన విజ్ఞానాన్ని మహిళలు, ప్రజల సేవకు వినియోగించింది.

ఆంధ్రయువతీ మండలి స్థాపన

ఆ రోజుల్లో తెలంగాణలో మహిళల పరిస్థితి దయనీయంగా ఉండేది. ముస్లింలు చాలా ముందంజలో ఉండేవారు. కానీ హిందువుల్లోని మధ్య తరగతి మహిళలు ఎంతో వెనుకబడి ఉండేవారు. ఉన్నత తరగతి స్త్రీల సంగతి చెప్పనక్కర్లేదు. సర్వసతీ దేవి విద్యార్థి దశ నుంచే 'ఆంధ్రమహిళా సభ' కార్యకలాపాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. మధ్యతరగతికి చెందిన హిందూ స్త్రీల కోసం, ముఖ్యంగా తెలుగువారి ప్రగతి కోసం ప్రత్యేకంగా ఒక సంస్థను నెలకొల్పాలని ఆమె భావించారు. యల్లాప్రగడ సీతాకుమారితో కలిసి 1934లో 'ఆంధ్రయువతీ మండలి'ని హైదరాబాద్‌లో స్థాపించారు. దీనికి రంగమ్మ ఓబుల్‌రెడ్డి అధ్యక్షురాలిగా వ్యవహరించారు. ఆంధ్రయువతీ మండలిని స్థాపించాక అందులో సభ్యులను చేర్చడం కష్టమైంది. నాటి కష్టాలను సరస్వతీ దేవి తన మాటల్లో ఇలా చెప్పారు. 'సభ్యులను చేర్చుకోవడానికి బయల్దేరే వాళ్లం. ఉన్నత కుటుంబాలకు చెందిన స్త్రీలు బయటకు వచ్చేవారు కాదు. సంస్థానాల రాణులు, జాగీర్దారిణీలు మాతో ముఖాముఖిగా మాట్లాడేవారు కాదు. పరదా వెనుక లీలగా కనిపిస్తూ చెలికత్తెల ద్వారా లేదా ఆయాలతో కబురు పంపేవారు. సభ్యత్వ జాబితాలో తమ పేర్లను బిరుదులతో సహా రాయాలని పదే పదే చెప్పేవారు. యువతీ మండలికి సురవరం ప్రతాపరెడ్డి అసతోమా సద్గమయ అనే నినాదాన్ని సూచించారు. నియమావళిని బూర్గుల రామకృష్ణారావు సిద్ధం చేశారు.' ఆంధ్రయువతీ మండలి కోసం సరస్వతీ దేవి పన్నెండేళ్ల పాటు శ్రమించారు. యువతీ మండలిలో కార్యదర్శి, ఉపాధ్యక్ష పదవులను నిర్వహించారు. బూర్గుల రామకృష్ణారావు భార్య అనంత లక్ష్మీదేవి అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో 'ఆంధ్రయువతీ మండలి' కోసం బర్కత్‌పురాలో పెద్ద భవంతిని నిర్మించారు. ఇల్లిందల సరస్వతీ మండలిలో శాశ్వత సభ్యురాలు. ఈమె మండలి అభివృద్ధితోపాటు, భారత సంఘ సంక్షేమాల్లో సభ్యురాలిగా, బందిఖానాలు, ఆసుపత్రుల పర్యవేక్షకురాలిగా, శిశు సంక్షేమ సంఘ సభ్యురాలిగా ఎన్నో నూతన పథకాలను సూచించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ నిర్వాహక సభ్యురాలిగా, శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ నిర్వాహక సభ్యురాలిగా కొంత కాలం పాటు పనిచేశారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ హైదరాబాద్ శాఖకు నిర్వాహక సభ్యురాలిగా, ఉపాధ్యక్షులుగా కేంద్ర గ్రంథాలయ, శిశు శాఖ సభ్యురాలిగా ఆమె విశేష కృషి చేశారు.

సరస్వతీ దేవి రచనలు

ఆమె రచించిన మొదటి కథ, మొదటి వ్యాసం 1933లో 'గోలకొండ' పత్రికలో ప్రచురితమయ్యాయి. మహిళా, శిశు జనోద్ధరణ లక్ష్యంగా హైదరాబాద్‌లోని రేడియో కేంద్రానికి వ్యాసాలు, నాటికలు, కథలు రాశారు. జీవన సామరస్యం, నారీ జగత్తు, వెలుగు బాటలు, పండుగ బహుమతి, అక్కరకు వచ్చిన చుట్టం, ముత్యాల మనసు, పండుగ బహుమతి, జాతిరత్నాలు, బాలవీరులు మొదలైనవి ఆమె రచనలు. సరస్వతీ దేవి తల్లి వెంకట లక్ష్మమ్మ బ్రహ్మ సమాజ నాయకులైన దేశిరాజు పెదబాపయ్య సోదరి. కాబట్టి సరస్వతీ దేవికి చిన్నతనం నుంచే సంస్కరణ భావాలు అలవడ్డాయి. కానీ ఆమె ఇద్దరు పిల్లలు మరణించడంతో సనాతన సంప్రదాయాల పట్ల ఆసక్తి చూపారు. 1958లో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఏర్పాటైనప్పుడు ఆమె చేసిన సంఘ సేవకు గుర్తుగా మండలిలో సభ్యత్వం లభించింది. సరస్వతీ దేవి తన రచనల్లో వర్తమాన సమస్యలను ప్రధానంగా చర్చించేవారు. 'నీలో చాలా శక్తి దాగి ఉంది. దాన్ని ఉపయోగించి ప్రకాశించడా నికి ప్రయత్నించు. మగవారిపై కోపం వద్దు, దేన్నీ యాచించవద్దు. సంపాదించుకోవాలి' అనే సూచన లు ఆమె రచనల్లో కన్పిస్తాయి. సరస్వతీ దేవి దాదా పు మూడు దశాబ్దాల పాటు రచనలు చేశారు.

మాదిరి ప్రశ్నలు

1. ఖండవల్లి లక్ష్మీ రంజనం ఎప్పుడు జన్మించారు?
   1) 1908 2) 1925
   3) 1910 4) 1945
2. నిజాం రాష్ట్ర గ్రంథాలయ సంఘం కార్యదర్శిగా పనిచేసిందెవరు?
   1) సురవరం ప్రతాపరెడ్డి
   2) ఆదిరాజు వీరభద్రరావు
   3) కొమర్రాజు లక్ష్మణరావు
   4) ఖండవల్లి లక్ష్మీ రంజనం
3. ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి, ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం గ్రంథాలు ఎవరు రచించారు?
   1) కొమర్రాజు లక్ష్మణరావు
   2) ఆదిరాజు వీరభద్రరావు
   3) ఖండవల్లి లక్ష్మీ రంజనం
   4) సురవరం ప్రతాపరెడ్డి
4. సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం కోశాన్ని ఎవరు రచించారు?
   1) ఖండవల్లి లక్ష్మీ రంజనం
   2) సురవరం ప్రతాపరెడ్డి
   3) కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
   4) విశ్వనాథ సత్యనారాయణ
5. హైదరాబాద్‌లో ఆంధ్రయువతీ మండలిని ఏ సంవత్సరంలో స్థాపించారు?
   1) 1942 2) 1934
   3) 1936 4) 1952
6. జాతిరత్నాలు, నారీ జగత్తు, జీవన సామరస్యం లాంటి రచనలు చేసింది ఎవరు?
   1) అనంత లక్ష్మీదేవి
   2) ఇల్లిందల సరస్వతీ దేవి
   3) ఎల్లాప్రగడ సీతాకుమారి
   4) సరోజినీ నాయుడు
7. ఆంధ్రయువతీ మండలి తొలి అధ్యక్షురాలిగా పనిచేసింది ఎవరు?
   1) ఎల్లాప్రగడ సీతాకుమారి
   2) ఇల్లిందల సరస్వతీ దేవి
   3) దుర్గాబాయి దేశ్‌ముఖ్
   4) రంగమ్మ ఓబులరెడ్డి
8. 'తెలుగుదుక్కి' శీర్షికతో వ్యాసాలు ప్రచురించింది ఎవరు?
   1) ఖండవల్లి లక్ష్మీ రంజనం
   2) ఇల్లిందల సరస్వతీ దేవి
   3) కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
   4) విశ్వనాథ సత్యనారాయణ

సమాధానాలు

1) 1; 2) 4; 3) 3; 4) 1;
5) 2; 6) 2; 7) 4; 8) 1.

శీతల ప్రాంతాల్లో ఉపయోగించే ఉష్ణమాపకం?

పోటీ పరీక్షల ప్రత్యేకం
భౌతిక శాస్త్రం

ఉష్ణం

ఉష్ణం ఒక శక్తి స్వరూపం. ఇది ఎల్లప్పుడూ అధిక ఉష్ణోగ్రత ఉన్న వస్తువు నుంచి అల్ప ఉష్ణోగ్రత ఉన్న వస్తువు వైపు ప్రయాణిస్తుంది.

ప్రమాణాలు: ఎర్గ్, జౌల్, కెలోరీ

- ఒక వస్తువు ఉష్ణాన్ని అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'కెలోరీమెట్రీ' అంటారు.
- వస్తువు నుంచి వెలువడే ఉష్ణరాశిని కొలవడానికి బాంబ్ కెలోరీ మీటర్‌ను వాడతారు.

ఉష్ణ ప్రసారం

అధిక ఉష్ణోగ్రత ఉన్న వస్తువు నుంచి అల్ప ఉష్ణోగ్రత ఉన్న వస్తువులోకి ఉష్ణం ప్రయాణించడాన్ని ఉష్ణ ప్రసారం అంటారు. ఇది మూడు పద్ధతుల్లో జరుగుతుంది.

- ఉష్ణ వహనం
- ఉష్ణ సంవహనం
- ఉష్ణ వికిరణం

ఉష్ణ వహనం:
ఒక పదార్థం లేదా వస్తువులోని కణాలు లేదా అణువులు ఎలాంటి స్థానాంతర చలనం చెందకుండా ఉష్ణప్రసారం జరగడాన్ని ఉష్ణ వహనం అంటారు.

ఉదాహరణ: అన్ని ఘన పదార్థాలు, ద్రవస్థితిలో ఉన్న పాదరసం.

ధర్మాలు:
- ఈ ప్రక్రియలో ఉష్ణ ప్రసారం ఆలస్యంగా జరుగుతుంది.
- ఉష్ణ ప్రసారం జరుగుతున్నప్పుడు కణాలకు ఎలాంటి స్థానభ్రంశం ఉండదు.
- ఈ పద్ధతిలో ఉష్ణప్రసారం జరుగుతున్నప్పుడు యానకం ఉష్ణోగ్రత పెరుగుతుంది.

ఉష్ణ సంవహనం:
ఒక వస్తువు లేదా పదార్థంలోని అణువులు లేదా కణాల స్థానాంతర చలనం వల్ల ఉష్ణప్రసారం జరిగే పద్ధతిని ఉష్ణ సంవహనం అంటారు.

ఉదాహరణ: అన్ని ద్రవ పదార్థాలు (పాదరసం మినహా), వాయు పదార్థాలు.

ధర్మాలు:
- ఈ ప్రక్రియలో కూడా ఉష్ణ ప్రసారం ఆలస్యంగా జరుగుతుంది.
- ఈ పద్ధతిలో కణాలు స్థానాంతరం చెందుతాయి.
- యానకం ఉష్ణోగ్రత పెరుగుతుంది.

అనువర్తనాలు:
- ఉష్ణ సంవహనం సూత్రం ఆధారంగా పొగ గొట్టాలు, పరిశ్రమల్లో చిమ్నీలు, వెంటిలేటర్లు మొదలైనవి పనిచేస్తాయి.
- భూ పవనాలు, సముద్ర పవనాలు అనేవి కూడా ఉష్ణ సంవహన ధర్మం ఆధారంగా ఏర్పడతాయి. పూర్వకాలంలో తెరచాపలను ఉపయోగించి సముద్ర పవనాల సహాయంతో సరుకులను రవాణా చేసి వ్యాపారం నిర్వహించేవారు. కాబట్టి ఈ సముద్ర పవనాలను వ్యాపార పవనాలు అంటారు.

ఉష్ణ వికిరణం:
యానకంతో నిమిత్తం లేకుండా ఉష్ణ ప్రసారం జరిగే పద్ధతిని ఉష్ణ వికిరణం అంటారు.

ఉదాహరణలు:
- సూర్యుడి నుంచి బయలుదేరిన కాంతి కిరణాలు శూన్యం ద్వారా ప్రసరిస్తూ భూవాతావరణ పొరల్లోకి ప్రవేశించి భూమికి చేరతాయి.
- ఈ విశ్వంలో నక్షత్రాల మధ్య ఉష్ణప్రసారం వికిరణ పద్ధతిలో జరుగుతుంది.
- మండుతున్న జ్వాలకు కొంత దూరంలో ఉన్న వ్యక్తి ఉష్ణశక్తిని వికిరణ రూపంలో పొందుతాడు.

ధర్మాలు:
- ఇది చాలా వేగంగా జరిగే ప్రక్రియ.
- ఈ పద్ధతిలో యానకం ఉష్ణోగ్రత స్థిరంగా ఉంటుంది.


గమనిక: ఉష్ణవహనం, సంవహన ప్రక్రియల్లో ఉష్ణ ప్రసారం చాలా మెల్లగా జరుగుతుంది. కానీ వికిరణ పద్ధతిలో కాంతి వేగానికి($3\times10^8\ ms^{-1}$) సమానమైన వేగంతో ఉష్ణ ప్రసారం జరుగుతుంది.

అనువర్తనాలు:
- ఒక పాత్రలోని వేడి ద్రవాన్ని స్టీలు చెంచాతో తిప్పినప్పుడు ఆ చెంచా వేడెక్కుతుంది. దీనికి కారణం ఉష్ణ వహన ప్రక్రియ.
- ఒక రాగి పాత్ర(ఉష్ణవాహక పదార్థం)లో వేడి ద్రవాన్ని నింపి చెక్క బల్ల(ఉష్ణబంధకం)పై ఉంచినప్పుడు ఆ ద్రవం ఉష్ణాన్ని పరిసరాల్లోని గాలికి కోల్పోయి చల్లబడుతుంది. అంటే ఉష్ణ సంవహన పద్ధతి ద్వారా వేడి ద్రవం తన ఉష్ణాన్ని కోల్పోయి చల్లారుతుంది.
- ఒకవేళ ఈ వేడి పాత్రను ఇనుప బల్లపై ఉంచినప్పుడు ఉష్ణ వహనం(ఇనుప బల్ల), ఉష్ణ సంవహనం(గాలి) పద్ధతుల ద్వారా ద్రవం చల్లారుతుంది.
- భూగోళం.. ఉష్ణ వహనం, ఉష్ణసంవహనం, ఉష్ణవికిరణం పద్ధతుల్లో వేడెక్కుతుంది.

థర్మాస్ ఫ్లాస్క్(శూన్యనాళిక ఫ్లాస్క్)

థర్మాస్‌ఫ్లాస్క్‌ను సర్ జేమ్స్ డివర్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. దీనిలో వేర్వేరు వ్యాసాలున్న రెండు గాజు నాళాలను ఒకదానిలో మరొకదాన్ని అమరుస్తారు. ఈ గాజు నాళాల అవతలి వైపు సిల్వర్ బ్రోమైడ్ అనే రసాయన పదార్థంతో పూత పూస్తారు. ఈ రెండు నాళాల మధ్యలో శూన్యం ఉండేట్లు చేసి వీటిని ఉష్ణబంధక పదార్థమైన ప్లాస్టిక్ డబ్బాలో అమర్చుతారు.

థర్మాస్‌ఫ్లాస్క్‌లో నింపిన వేడి ద్రవం ఉష్ణ వహనం, సంవహనం, ఉష్ణ వికిరణం అనే మూడు పద్ధతుల్లో కూడా ఉష్ణాన్ని కోల్పోదు. అందువల్ల కొంత సేపటి వరకు ద్రవం వేడిగా ఉంటుంది. అనంతరం ద్రవం ఉష్ణశక్తి యాంత్రిక శక్తిగా మారి క్రమంగా చల్లబడుతుంది.



గమనిక: వస్తువు ఉష్ణాన్ని కోల్పోవడం లేదా గ్రహించడం అనేది దాని స్వభావం, ఉపరితల వైశాల్యంపై ఆధారపడి ఉంటుంది.

- బావిలోని నీటి ఉపరితల వైశాల్యం కంటే చెరువులోని నీటి ఉపరితల వైశాల్యం ఎక్కువ. అందువల్ల చెరువు గ్రహించే, కోల్పోయే ఉష్ణరాశి ఎక్కువ.
- చలి ప్రదేశంలో ఉన్న జంతువులు శరీరాన్ని ముడుచుకోవడం ద్వారా తమలోని ఉష్ణాన్ని కోల్పోకుండా కాపాడుకుంటాయి.

పదార్థాలు - రకాలు

ఉష్ణాన్ని తమ ద్వారా ప్రసారం చేసే ధర్మం ఆధారంగా పదార్థాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి..

ఉష్ణ వాహకాలు: ఈ పదార్థాల ద్వారా ఉష్ణ ప్రసారం జరుగుతుంది.

ఉదాహరణ: లోహాల్లో అత్యుత్తమ ఉష్ణవాహక పదార్థం వెండి. తర్వాత రాగి, అల్యూమినియం, ఇనుము, పాదరసం, ఉక్కు మొదలైనవి ఉత్తమ ఉష్ణ వాహకాలు.

ఉష్ణ బంధకాలు: ఈ పదార్థాల ద్వారా ఉష్ణ ప్రసారం జరగదు.

ఉదాహరణ: అత్యుత్తమ ఉష్ణబంధక పదార్థం వజ్రం. తర్వాత ప్లాస్టిక్ వస్తువులు, రబ్బరు, చెక్కదిమ్మె, దూది, దుస్తులు, కాగితం, థర్మోకోల్ మొదలైనవి ఉత్తమ ఉష్ణ బంధకాలు.

- వంటపాత్రల తయారీకి ఉష్ణ వాహక పదార్థాలను వాడతారు. వాటి పిడుల తయారీకి మాత్రం ఉష్ణ బంధక పదార్థాలను వినియోగిస్తారు.
- నీరు, గాలి అధమ ఉష్ణ వాహకాలు.
- మంచు, మానవ శరీరం మంచి విద్యుత్ వాహకాలు. కానీ ఉష్ణం దృష్ట్యా బంధక ధర్మాన్ని ప్రదర్శిస్తాయి.

ఉష్ణోగ్రత

ఒక వస్తువు ఉష్ణ తీవ్రత(చల్లదనం లేదా వెచ్చదనం)ను ఉష్ణోగ్రత అంటారు.

ప్రమాణాలు:
- సెల్సియస్ లేదా సెంటీగ్రేడ్ (°C)
- ఫారన్‌హీట్ (F)
- కెల్విన్- K(అంతర్జాతీయ ప్రమాణం)
- రేమర్
- రాంకైన్
- ప్రస్తుతం రేమర్, రాంకైన్ ప్రమాణాలను ఉపయోగించడం లేదు.
- సెంటీగ్రేడ్, ఫారన్‌హీట్, కెల్విన్ ప్రమాణాల మధ్య సంబంధం.

$$\frac{C-0}{100}=\frac{F-32}{180}=\frac{K-273}{100}$$

ఉష్ణ మాపకాలను స్తూపాకారంలో నిర్మించడం వల్ల వాటి సున్నితత్వం పెరిగి కచ్చితమైన రీడింగ్‌లను సూచిస్తాయి.

- సెల్సియస్‌లు, ఫారన్‌హీట్‌లు ఒకదానితో ఒకటి ఏకీభవించే రీడింగ్ – 40.

C = F = x అనుకుంటే

$$\frac{C-0}{100}=\frac{F-32}{180}$$

$$\frac{x}{100}=\frac{x-32}{180}$$

$10x-320=18x$
$8x=-320$
$x=-40$

సెల్సియస్, కెల్విన్‌ల మధ్య సంబంధం:

$$\frac{C-0}{100}=\frac{K-273}{100}$$

C= K –273

$$\boxed{K=(C+273)\ Kelvins}$$

i) మంచు ఉష్ణోగ్రతను కెల్విన్‌లలో తెలిపినప్పుడు..
= (°C+ 273)
= 0°C+273= 273K

ii) నీటి ఆవిరి ఉష్ణోగ్రత 100°C, చంద్రుడిపై పగటి సగటు ఉష్ణోగ్రత 100°C అనుకుంటే అవి కెల్విన్‌లలో..
= 100°C+ 273= 373 K

iii) నీటి అసంగత వ్యాకోచ ఉష్ణోగ్రత 4°C అయితే కెల్విన్‌లలో..
= °C+273
= 4°C+ 273
= 277 Kelvins

iv) ఆరోగ్యవంతుడైన మానవుడి శరీర ఉష్ణోగ్రత 37°C అయితే కెల్విన్‌లలో..
= °C+273
= 37°C+ 273
= 310 Kelvins

v) పాల పాశ్చరైజేషన్ ఉష్ణోగ్రత 67°C. ఈ విలువ కెల్విన్‌లలో..
K= °C+273
K= 67°C+ 273
K= 340 Kelvins

vi) గది ఉష్ణోగ్రత(25°C) వద్ద ఒక పాత్రలో బంధించి ఉన్న వాయువులు –273°Cకు చల్లార్చినప్పుడు ద్రవాలుగా మారి పీడనం శూన్యమవుతుంది.
–273°C కెల్విన్‌లలో..
K= °C+273
K= –273 + 273
K= 0 Kelvin (పరమశూన్య ఉష్ణోగ్రత)

ఉష్ణమాపకాలు- రకాలు

ఒక వస్తువు ఉష్ణోగ్రతను కొలవడానికి ఉష్ణ మాపకాన్ని ఉపయోగిస్తారు. దీన్ని 16వ శతాబ్దంలో గెలీలియో కనుగొన్నాడు.

ఘన పదార్థ ఉష్ణ మాపకాలు

ఘన పదార్థాలను వేడిచేసినప్పుడు అవి వ్యాకోచిస్తాయి. ఈ సూత్రం ఆధారంగా ఈ ఉష్ణ మాపకాలు పనిచేస్తాయి. అయితే భిన్నమైన ఘన పదార్థాల ఉష్ణ వ్యాకోచాలు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి ఇలాంటి ఉష్ణ మాపకాలను ఉపయోగించి వస్తువుల ఉష్ణోగ్రతలను కచ్చితంగా కొలవడం సాధ్యం కాదు. అందువల్ల ఇలాంటి మాపకాల్ని ప్రస్తుతం ఉపయోగించడం లేదు.

ద్రవ పదార్థ ఉష్ణ మాపకాలు

ద్రవ పదార్థాలను వేడి చేసినప్పుడు వాటి ఘన పరిమాణాలు వ్యాకోచిస్తాయి. ఈ సూత్రం ఆధారంగా ద్రవ పదార్థ ఉష్ణమాపకాలు పనిచేస్తాయి. వీటిలో పాదరసం, ఆల్కహాల్ లేదా నీటిని ఉపయోగిస్తారు.

- శీతల ప్రాంతాల్లో వస్తువుల ఉష్ణోగ్రతలను కొలవడానికి ఉపయోగించే ఉష్ణమాపకాన్ని క్రయోమీటర్ (Cryometer) అంటారు. సాధారణంగా వీటిలో ఆల్కహాల్ ఉష్ణమాపకాలను ఉపయోగిస్తారు.
- నీటి విశిష్టోష్ణం ఎక్కువ ఉండి, ఆలస్యంగా వేడెక్కి, ఆలస్యంగా చల్లబడే గుణాన్ని కలిగి ఉండటం వల్ల వాహనాల రేడియేటర్లలో కూలెంట్ (శీతలీకరణి)గా నీటిని ఉపయోగిస్తారు. ద్రవ పదార్థ ఉష్ణమాపకాల్లో నీటికి బదులుగా పాదరసాన్ని ఉపయోగించడానికి కారణాలు..

పాదరసం	నీరు
పాదరసం సంకోచ, వ్యాకోచాలు పరస్పరం సమానంగా ఉంటాయి.	నీటి సంకోచ, వ్యాకోచాలు సమానంగా ఉండవు.
పాదరసం.. మాపకాల గోడలకు టుకోదు.	నీటి అణువులు మాపకాల గోడలకు అంటుకుంటాయి.
స్వభావరీత్యా పాదరసం వెండిలా మెరుస్తుంది. అందువల్ల రీడింగ్‌లను కచ్చితంగా గుర్తించవచ్చు.	నీటికి రంగు ఉండదు. కాబట్టి రీడింగ్‌లను కచ్చితంగా కొలవడం సాధ్యం కాదు.
అన్ని ద్రవపదార్థాలతో పోల్చినప్పుడు పాదరసం విశిష్టోష్ణం కనిష్ఠం. కాబట్టి ఇది త్వరగా వేడెక్కి త్వరగా చల్లబడుతుంది.	నీటి విశిష్టోష్ణం అన్ని ద్రవపదార్థాల కంటే ఎక్కువ. అందువల్ల ఆలస్యంగా వేడెక్కి, ఆలస్యంగా చల్లారుతుంది.

పట్టణీకరణ-పరిణామాలు



స్వాతంత్ర్యానంతరం భారత్ ప్రధానంగా పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక వెనుకబాటుతనం లాంటి సమస్యలను ఎదుర్కొంది. ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికి అప్పటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ క్రమంలో మిశ్రమ ఆర్థిక వ్యవస్థను అవలంబించే భారత్‌లో ప్రైవేటు రంగం అభివృద్ధి చెందింది. దీని ఫలితంగా దేశంలో పట్టణీకరణ వేగవంతమైంది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

1901 జనాభా లెక్కల ప్రకారం భారత్ మొత్తం జనాభాలో పట్టణ జనాభా 11.4 శాతంగా ఉంది. ఇది 2001 నాటికి 28.53 శాతానికి, 2011 నాటికి 31.6 శాతానికి పెరిగింది. స్వాతంత్ర్యానంతరం దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగ వాటా క్రమంగా తగ్గగా పారిశ్రామిక, సేవా రంగాల వాటా క్రమేణా పెరుగుతూ వెళ్లింది. 1941 తర్వాత ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై లాంటి నగరాల్లో వృద్ధి అధికమైంది. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. తద్వారా భారత్‌లో ఆర్థికవృద్ధి అధికమవడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరిగాయి. పబ్లిక్ రంగంలో వృద్ధి కారణంగా పట్టణ ప్రాంతాల్లో ప్రజా రవాణా, రోడ్లు, నీటిసరఫరా, విద్యుత్ లాంటి అవస్థాపన సౌకర్యాలు మెరుగయ్యాయి.

ప్రపంచబ్యాంకు - పట్టణీకరణ

ఆర్థికవృద్ధి ప్రక్రియలో పట్టణీకరణ భాగమని ప్రపంచబ్యాంకు పేర్కొంది. భారత ఆర్థికవ్యవస్థలో పట్టణ ప్రాంతాల భాగస్వామ్యం విస్మరించలేనిది. భారత్ ఆర్థిక ఉత్పత్తిలో నగరాల వాటాను 2/3గా ప్రపంచబ్యాంకు పేర్కొంది. పెరుగుతున్న జనాభాకు ఆశ్రయం కల్పించడం, నవకల్పనలు, సాంకేతిక పరిజ్ఞానం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించటం లాంటి అంశాల్లో భారత్‌లోని నగరాల పాత్రను ప్రపంచ బ్యాంకు ప్రశంసించింది. వచ్చే రెండు దశాబ్దాల కాలంలో పట్టణ జనాభా 377 మిలియన్ల (2011లో) నుంచి 590 మిలియన్లకు చేరుకోగలదని అంచనా వేస్తున్నారు. ఆర్థిక అవసరాల కారణంగా భారత్‌లోని గ్రామీణ జనాభా పట్టణ ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. దీంతో భారత్‌లోని పట్టణాలు, నగరాలు వేగంగా విస్తరిస్తున్నాయని ప్రపంచబ్యాంకు పేర్కొంది. 2050 నాటికి భారత్‌తో పాటు చైనా, ఇండోనేసియా, నైజీరియా, అమెరికాలో పట్టణ జనాభా వృద్ధి అధికంగా ఉంటుందని ప్రపంచ బ్యాంకు పేర్కొంది.

ప్రపంచ పట్టణ జనాభా

ఒక అంచనా ప్రకారం 2011-50 మధ్యకాలంలో ప్రపంచ పట్టణ జనాభా 3.6 బిలియన్ల నుంచి 6.3 బిలియన్లకు పెరగనుంది. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో జనాభా పెరుగుదల అధికంగా ఉంది. 2020 నాటికి ఆసియాలో సగం జనాభా, 2035 మధ్యనాటికి ఆఫ్రికాలో సగం జనాభా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ అంచనాల ప్రకారం 2011-30 మధ్యకాలంలో ప్రపంచ పట్టణ జనాభాలో 1.4 బిలియన్ల పెరుగుదల ఉండనుంది. ఈ మొత్తంలో చైనా వాటా 279 మిలియన్లు కాగా భారత్ వాటా 218 మిలియన్లుగా ఉంది. ప్రపంచ పట్టణ జనాభా పెరుగుదలలో భారత్ వాటా 15.5 శాతానికి పైగా ఉంటుందని ఐక్యరాజ్య సమితి 2012లో తెలిపింది.

పట్టణ జనాభా పెరుగుదలకు ముఖ్య కారణాలు

1. పట్టణ ప్రాంత జనాభాలో సహజ పెరుగుదల
2. గ్రామీణ ప్రాంతాలను పట్టణ ప్రాంతాలుగా తిరిగి వర్గీకరించడం
3. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు నికర వలసలు

ఉపాధి రహిత వృద్ధి

భారత్‌లో స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు అధికంగా నమోదవుతోంది. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాలు ఉపాధి రహిత వృద్ధిని చవిచూశాయి. గత దశాబ్దకాలంలో స్థూల దేశీయోత్పత్తి సగటు వార్షిక వృద్ధి 5 శాతానికి పైగా నమోదైంది. అదే సమయంలో ఉపాధివృద్ధిలో పెరుగుదల స్వల్పంగా ఉంది. 2004-05 నుంచి 2009-10 మధ్య కాలంలో వ్యవసాయరంగంలో 23.3 మిలియన్లు, తయారీ రంగంలో 4.02 మిలియన్ల మంది ఉపాధిని కోల్పోయారు. ఇతర రంగాల్లో కొత్తగా 1.74 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. 1999-2000, 2009-2010 గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో (గ్రామీణ మహిళలు మినహా) నిరుద్యోగిత రేటులో స్వల్ప తగ్గుదల నమోదైంది. అల్ప ఉద్యోగిత రేటు పట్టణ ప్రాంతాలతో పోల్చినప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంది. భారత్‌లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుద్యోగిత రేటు శ్రామిక మార్కెట్ స్థితి, ఉపాధి అవకాశాలను కచ్చితంగా స్పష్టపరచడం లేదు. 2011లో ఎన్ఎస్ఎస్‌వో నిర్వహించిన సర్వే ప్రకారం పురుషులకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం, పట్టణ ప్రాంతాల్లో 4.9 శాతం, మహిళలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 7 శాతం, పట్టణ ప్రాంతాల్లో 4.5 శాతం మంది అదనపు పని కోసం ఆసక్తి ప్రదర్శించారు. ఈ సర్వేలో శ్రామికుల్లో అనేక మంది ప్రస్తుతం చేస్తున్న పని ద్వారా తగినంత ప్రతిఫలం లభించడం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు పెరిగాయి. 2005-06లో భారత ప్రభుత్వం ప్రారంభించిన జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ రెన్యువల్ మిషన్ కింద కేంద్రీకృత ప్రణాళికలో భాగంగా మూడంచెల వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీంతో గ్రామీణ పట్టణ సంబంధాలు మెరుగయ్యాయి.

పట్టణ జనాభా

భారత్‌లోని మొత్తం పట్టణ జనాభాలో 2011 లెక్కల ప్రకారం మహారాష్ట్రకు 13.5 శాతం, ఉత్తరప్రదేశ్‌కు 11.8 శాతం, తమిళనాడుకు 9.3 శాతం వాటా ఉంది. 2011లో పట్టణ ప్రాంతాల్లో 377 మిలియన్ల మంది నివసించగా, ఒక మిలియన్ జనాభాకు పైగా ఉన్న నగరాల్లో 43 శాతం మంది నివసిస్తున్నారు. 2001లో మిలియన్ జనాభా ఉన్న నగరాల సంఖ్య 35 ఉండగా, 2011 నాటికి 53కు పెరిగాయి. ఉత్తరప్రదేశ్, కేరళల్లో చెరో 7 నగరాలు, మహారాష్ట్రలో ఆరు నగరాలు ఉన్నాయి. 53 పట్టణ పరిధి కలిగిన ప్రాంతాల్లో మూడు అతిపెద్ద మెగాసిటీలు (పది మిలియన్లకు పైగా జనాభా ఉన్న ప్రాంతాలు)గా గ్రేటర్ ముంబై (18.4 మిలియన్లు), ఢిల్లీ (16.3 మిలియన్లు), కోల్‌కతా (14.1 మిలియన్లు)లు నిలిచాయి. జనాభా పరంగా చెన్నై 8.7 మిలియన్లు, బెంగళూరు 8.5 మిలియన్లు కలిగి ఉన్నాయి. పది మిలియన్ జనాభాపైగా ఉన్న నగరాల్లో జనాభివృద్ధి, 2001-2011 మధ్యకాలంలో తగ్గింది. గ్రేటర్ ముంబై పట్టణ పరిధి జనాభా వృద్ధి 1991-2001 మధ్య 30.47 శాతం కాగా, 2001-2011 మధ్య 12.05 శాతంగా నమోదైంది. ఇదే కాలానికి సంబంధించి ఢిల్లీ పట్టణ పరిధి జనాభివృద్ధి 52.24 శాతం నుంచి 26.69 శాతానికి తగ్గింది. కోల్‌కతాలో 19.60 శాతం నుంచి 6.87 శాతానికి తగ్గింది.

పట్టణీకరణ ప్రయోజనాలు

- ఆర్థికవ్యవస్థలో వృద్ధిరేటు పెరుగుదల.
- వాణిజ్య కార్యకలాపాల్లో వృద్ధి.
- సాంఘిక, సాంస్కృతిక సమన్వయం (ఇంటిగ్రేషన్).
- సమర్థమైన సేవల అందుబాటు.
- వనరుల అభిలషణీయ వినియోగం.

పట్టణీకరణ పెరగడానికి కారణాలు

- పట్టణీకరణ భారతీయ సమాజంలో సాధారణ లక్షణంగా కనిపిస్తుంది. పరిశ్రమల సంఖ్యలో వృద్ధి కారణంగా నగరాల సంఖ్య పెరిగింది. పారిశ్రామికీకరణ ఫలితంగా ప్రజలు ఉపాధి కోసం పారిశ్రామిక ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు. ఫలితంగా పట్టణాలు, నగరాల సంఖ్య పెరుగుతోంది. పారిశ్రామికీకరణ ఉపాధి అవకాశాలను విస్తృతపరిచింది. దీంతో పట్టణ జనాభా పెరుగుతూ వెళ్తోంది.
- సామాజిక అంశాలైన విద్య, ఆరోగ్య సౌకర్యాల అందుబాటు, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాల లభ్యత కారణంగా గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణ ప్రాంతాలకు తరలివెళ్తున్నారు.
- గ్రామీణ ప్రజలు జీవనోపాధి కోసం వ్యవసాయ రంగంపైనే ఆధారపడాలి. భారత వ్యవసాయ రంగం రుతుపవనాలపై ఆధారపడి ఉంది. కరవు పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో వలసలు పెరిగాయి.
- సాంకేతిక పరిజ్ఞానం అందుబాటుతో పాటు మెరుగైన అవస్థాపనా సౌకర్యాల అందుబాటు కారణంగా సౌకర్యవంతమైన జీవనం సాగించవచ్చనే అభిప్రాయంతో గ్రామీణ ప్రజలు పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారు.
- ఒకవైపు పట్టణాలు, నగరాల సంఖ్య పెరుగుతుంటే, మరోవైపు గ్రామీణ సమాజం పట్టణ సంస్కృతిని అలవర్చుకుంటోంది. పట్టణ ప్రజల వాణిజ్య సంస్కృతిని అవలంబించడం గ్రామీణ సమాజంలో కనిపిస్తోంది. విద్యా వ్యాప్తి కారణంగా అక్షరాస్యత రేటు పెరిగి, గ్రామీణ ప్రజల్లో ఆధునికత పెరిగింది.
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం.
- మహిళల్లో ఆలోచనా పరిజ్ఞానం పెరగడం.
- ఆధునిక రవాణా, సమాచార సౌకర్యాల పెరుగుదల.
- రాజకీయాల్లో క్రియాశీలకంగా పాల్గొనడం.
- బ్యాంకులు, అనేక విత్త సంస్థలు అందుబాటులో ఉండటం.
- గ్రామీణ వినియోగదారుల్లో అవగాహన పెరగడం.
- అధునాతన వస్తు ఉత్పత్తులకు డిమాండ్.
- భారతదేశంలో ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడంలో భాగంగా పట్టణీకరణ లక్ష్యాన్ని పదకొండో ప్రణాళికలో ఎంచుకోవడం.
- సంస్కరణల అమలు కాలంలో ప్రైవేట్‌రంగ ప్రాధాన్యం పెరగడంతో పాటు ప్రైవేట్ రంగ పెట్టుబడులు అధికంగా పట్టణ ప్రాంతాల్లో కేంద్రీకృతమవడం.
- దేశవిభజన సమయంలో ప్రజల వలస.
- సహజంగా పట్టణ జనాభా పెరగటానికి మరణరేటు తగ్గుదలతోపాటు జననాల రేటు ఎక్కువగా ఉండటం కారణమైంది.

పట్టణీకరణ ప్రభావం

- ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, పర్యావరణ అంశాలు పట్టణీకరణపై ప్రభావం చూపుతాయి. సామాజికంగా, సాంస్కృతికంగా మీడియా పట్టణీకరణను ప్రోత్సహిస్తోంది.
- పెద్ద నగరాల్లో చెత్త పెద్ద సమస్యగా నిలిచింది. వాయు, నీటి, ధ్వని కాలుష్యం లాంటి సమస్యలు పట్టణ ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం కలుగజేస్తాయి.
- మురికివాడలు పెరగడంతోపాటు పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం పెరిగి ప్రజల జీవన ప్రమాణం కుంటుపడుతుంది.
- అధిక పట్టణీకరణ కారణంగా నేరాల రేటు పెరుగుతోంది. నేరాల రేటు పెరుగదలకు పేదరిక నిర్మూలనలో ప్రభుత్వ వైఫల్యం కారణమవుతోంది.

Which file is responsible to start MS-Word?

MS - WORD

1. Which is not a font style?
1) Bold 2) Superscript
3) Italic 4) Regular
5) None of above
2. What is gutter margin?
1) Margin that is added to right margin when printing
2) Margin that is added to the left margin when printing
3) Margin that is added to the outside of the page when printing
4) Margin that is added to the binding side of page when printing
5) None
3. Landscape is?
1) A font style 2) Paper Size
3) Page Layout
4) Page Orientation
5) None
4. Typeface option will come under which menu?
1) Edit 2) View 3) Format
4) Tools 5) None of above
5. Background color on a document is not visible in?
1) Web layout view
2) Print Preview
3) Reading View
4) Print Layout view 5) None
6. What is a portion of a document in which you set certain page formatting options?
1) Page Setup 2) Section
3) Page 4) Document
5) None of above
7. Which of the following is not available on the Ruler of MS Word screen?
1) Tab stop box 2) Left Indent
3) Right Indent 4) Center Indent
5) None of above
8. Gutter position can be set in following positions
1) Left & Right 2) Left & Top
3) Left & Bottom
4) Left Only 5) None of above
9. What is the Short cut key for line break?
1) CTRL + Enter
2) Alt + Enter 3) Shift + Enter
4) Space + Enter
5) None of above
10. By pressing F12, which of following will happen?
1) Save As dialog box will open
2) Save dialog box will open
3) Open dialog box will open
4) Close dialog box will open
5) None of above
11. Which key will open an Open dialogue box?
1) F12 2) Alt + F12
3) Ctrl + F12 4) Shift + F12
5) None of above
12. How will MS Word will respond in repeated word ?
1) A Green wavy line under the repeated word
2) A Red wavy line under the repeated word
3) A Blue wavy line under the repeated word
4) A pink wavy lines under the repeated word
5) None of above
13. What is the use of "All Caps" feature in MS - Word?
1) It changes all selected text into Capital Letter
2) It adds captions for selected Image
3) It shows all the image captions
4) It changes some text into Capital Letter
5) None of above
14. Which file is responsible to start MS Word?
1) Winword.exe 2) Win.exe
3) Word.exe 4) Wordwin.exe
5) None of above
15. To keep track of different editions of a document which feature we will use?
1) Editions 2) versions
3) Tracks 4) Traces
5) None of above
16. Which is not a type of margin?
1) Top 2) Left 3) Right
4) Center5) None of above
17. What will be the use of Ctrl + J?
1) Insert Image
2) Insert Hyperlink
3) Align Justify
4) Search file 5) None of above
18. What shortcut will we use to align center?
1) Ctrl + A 2) Ctrl + E
3) Ctrl + D 4) Ctrl + B
5) None of above
19. Which shortcut will we use to make text Italic?
1) Ctrl + U 2) Ctrl + T
3) Ctrl + I 4) Ctrl + P



5) None of above
20. How to use Format Painter multiple times?
1) By Click on Lock Format Painter Icon
2) Format Painter cannot be use multiple times
3) By Double Click on the Format Painter Icon
4) By Double Click on the Format Painter Icon
5) None of above
21. What is place to the left of horizontal scroll bar?
1) Indicators 2) Split buttons
3) Tab stop buttons
4) View buttons
5) None of above
22. Where can you find the horizontal split bar on MS-Word screen?
1) On the top of vertical scroll bar
2) On the bottom of vertical scroll bar
3) On the left of horizontal scroll bar
4) On the right of horizontal scroll bar Comment on this question
5) None of above
23. Tabs stop position cannot be the following alignment?
1) Decimal Alignment
2) Center Alignment
3) Bar Alignment
4) Justify Alignment
5) None of above
24. What is the use of bookmarks?
1) To correct the spellings.
2) To jump to a specific location in the document
3) To ignore spelling mistakes
4) To save alignments as it is
5) None of above
25. Which feature is used to replace straight quotes with smart

Bank Exams

Computer Awareness

quotes as you type?
1) Auto Correct as you type
2) Auto Change as you type
3) Auto Ignore as you type
4) Auto Format as you type
5) None of above
26. Ctrl + D is short cut used for?
1) Open Dialogue Box
2) Font Dialogue Box
3) Save as Dialogue Box
4) Save Dialogue Box
5) None of above
27. Ctrl + G is shortcut for?
1) Open Find and Replace Dialog box with activating Goto Tab
2) Open Find and Replace Dialog box with activating Find Tab
3) Open Find and Replace Dialog box with activating Replace Tab
4) Open Goto Dialog box
5) None of above Comment on this question
28. Ctrl + H is short cut for?
1) Open Insert Dialog box activating Insert Hyper Link Tab
2) Open Find and Replace Dialog box with activating Go to Tab
3) Open Find and Replace Dialog box with activating Find Tab
4) Open Find and Replace Dialog box with activating Replace Tab
5) None of above
29. What can be searched by find?
1) Format 2) Characters
3) Symbol 4) All of above
5) None of above
30. On which page the header or the footer is printed by default?
1) On first page
2) on last page
3) on alternate page
4) Every page5) None of above
31. Which of these toolbars allows changing of Fonts and their sizes?
1) Standard 2) Formatting
3) Options 4) Review
5) None of above
32. To spell check which function key you will press?
1) F5 2) F6 3) F7
4) F8 5) None of above
33. How to insert a sound file in word document?
1) From insert -> sound menu option
2) From insert -> object menu option
3) From insert -> subject menu option
4) From insert -> file menu option
5) None of above
34. How many maximum number of columns can be inserted in the word document?
1) 45 2) 50 3) 55
4) 65 5) None of above
35. What is smallest and largest available font on formatting toolbar?
1) Smallest 8 and Largest 70
2) Smallest 5 and Largest 72
3) Smallest 8 and Largest 72
4) Smallest 5 and Largest 70
5) None of above
36. Why drop cap is used in document?
1) To get all first character capital
2) To get all first character small
3) To begin a paragraph with a large dropped initial capital letter
4) To begin a paragraph with a large dropped initial small letter
5) None of above
37. What is Macro?
1) Small add-on programs that are installed afterwards if you need them
2) Type of high level programming language
3) Type of low level programming language
4) Small programs created in MS-Word to automate repetitive tasks by using VBA
5) None of above
38. Which among following can be a vertical separation between columns?
1) Margin 2) Header
3) Orientation 4) Gutter
5) None of above
39. To change the typeface of a document, we will choose following menu option:
1) Edit 2) View 3) Tools
4) Format 5) None of above
40. To auto fit the width of column:
1) Double click the left border of column
2) Double click the right border of column
3) Double click the column header
4) None of above
5) All the above
41. What is the default font size of a new Word document based on Normal template?
1) 8pt 2)10pt 3) 12pt
4)14pt 5) None of above
42. Which of following line spacing is invalid?
1) Single 2) Double
3) Triple 4) Multiple
5) None of above
43. Format painter tool can be found in?
1) Options toolbar
2) Standard toolbar
3) Formatting toolbar
4) Drawing toolbar 5) None
44. Which among following is correct extension of word files?
1) xls 2) doc 3) ppt
4) dcw 5) None of above
45. You can jump to the next column by?
1) Press Alt + Down-arrow
2) Clicking with your mouse on the next column
3) Both of above
4) None of above
5) Press Alt + 5 arrow

Key

1) 2; 2) 4; 3) 4; 4) 3; 5) 2;
6) 2; 7) 4; 8) 2; 9) 3; 10) 1;
11) 3; 12) 2; 13) 1; 14) 1; 15) 2;
16) 4; 17) 3; 18) 2; 19) 3; 20) 3;
21) 4; 22) 1; 23) 4; 24) 2; 25) 4;
26) 2; 27) 1; 28) 4 ;29) 4; 30) 4;
31) 2; 32) 3; 33) 2; 34) 1; 35) 3;
36) 3; 37) 4; 38) 1; 39) 4; 40) 2;
41) 3; 42) 3; 43) 2; 44) 2; 45) 3.